



# బోల్షెవిక్

సంచిక : 2 | సి.పి.ఐ.(మావోయిస్టు) ఏ.ఓ.బి. సమాచార పత్రిక | జులై - డిసెంబర్ 2013

**లోపలి పేజీలో**


| | | |
|---|---|---|
| **అమరులకు నివాళి** | | |
| **వ్యాసం** | | |
| మన్యం బాక్సైట్ పోరాటం | ........ | 4 |
| డాటా మైనింగ్ | ........ | 8 |
| కరెంటు ఖాతాలోటు (క్యాడ్) | ........ | 12 |
| పార్టీలో క్రమశిక్షణ | ........ | 14 |
| **నివేదిక** | | |
| మైనింగ్‌ను వ్యతిరేకిస్తున్న మాలి పర్వత ప్రాంత ప్రజలు | ........ | 19 |
| గంజాయి సాగు పరిష్కారాలు | ........ | 23 |
| **పత్రికా ప్రకటన** | | |
| గంటి ప్రసాదం హత్యను ఖండిస్తూ (ఎ.ఒ.బి) | ........ | 25 |
| సమైక్యాంధ్రను వ్యతిరేకిస్తూ | ........ | 26 |
| **కరపత్రం** | | |
| లొంగుబాట్ల పై | ........ | 28 |
| ఆపరేషన్ గ్రీన్‌హంట్ పై | ........ | 30 |
| **అమరుల చరిత్ర** | ........ | 32 |
| **పోరాట వార్తలు** | ........ | 46 |

# మీ త్యాగాల వెలుగులో ప్రజాయుద్ధ మార్గం ప్రకాశవంతమైంది. లక్ష్యం చేరేదాక మీరు చూపిన మార్గాన్ని వదలం.

భారత దేశంలో ప్రస్తుతం నెలకొని వున్న అర్ధ భూస్వామ్య, అర్ధవలస సమాజాన్ని కూకటివేళ్ళతో పెళ్ళగించి నూతన ప్రజాస్వామిక వ్యవస్థనూ, ఈ క్రమంలో సోషలిజాన్ని, అంతిమంగా కమ్యూనిజాన్ని స్థాపించే లక్ష్యంతో సి.పి.ఐ మావోయిస్టు పార్టీ నేతృత్వంలో ప్రజలు వీరోచితంగా ఉద్యమిస్తున్నారు. ఈ ఉద్యమాన్ని అణచి వేసి తమ అధికారాన్ని సుస్థిరం చేసుకొనేందుకూ, దోపిడీ పీడనలను కొనసాగించేందుకు ఈ దేశ దోపిడీ పాలక వర్గాలైన దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వర్గాలు, వారి యజమానులైన సామ్రాజ్యవాదులు తమ రాజ్యాంగ యంత్రం ద్వారా పార్టీపైన, పి.ఎల్.జి.ఎ.పైన, ప్రజలపైన తీవ్రమైన సాయుధ అణిచివేతను కొనసాగిస్తున్నారు. ఈ అణచివేత 2009 సెంప్టెంబర్ నుండి గ్రీన్‌హంట్ బహుముఖ, సైనిక దాడి రూపంలో మరింత తీవ్రతరం అయింది. ఈ దాడి అత్యంత పాశవికంగా, క్రూరంగా, మోసపూరితంగా కొనసాగుతున్నది. విరుద్ధ ప్రయోజనాలకోసం జరుగుతున్న ఈ యుద్ధంలో ప్రజల రాజ్యాధికారాన్ని నెలకొల్పే లక్ష్యంతో దోపిడి వర్గాల రాజ్యంతో వీరోచితంగా పోరాడుతూ అనేక మంది ప్రజలు, ఉత్తమ పుత్రులు, పుత్రికలు తమ అమూల్యమైన ప్రాణాలను తృణప్రాయంగా అర్పిస్తున్నారు. చరిత్ర పురోగమనానికి తమ వంతు కర్తవ్యంగా వీరోచితమైన త్యాగాలను చేస్తూ గొప్ప విప్లవ సాంప్రదాయాలను నెలకొల్పుతున్నారు. 2013 జులై నుండి డిసెంబర్ వరకు దేశవ్యాప్తంగా పదుల సంఖ్యలోనే పార్టీ, పి.ఎల్.జి.ఎ, ప్రజాసంఘాల సభ్యులు, నాయకత్వంతో పాటు సాధారణ ప్రజలు నేలకొరిగారు. ఎ.ఒ.బిలో 23 మంది కామ్రేడ్స్‌తో పాటు, ఇద్దరు సాధారణ ప్రజలు నేలకొరిగారు. వీరిలో కా॥ మహిత (ఎస్.జడ్.సి.ఎమ్), కా॥ గంటి ప్రసాదం (ఎస్.జడ్.సి.ఎమ్)ల వంటి ఉన్నత స్థాయి పార్టీ కామ్రేడ్స్ ఉన్నారు. పొడియాలో అమరులైన వారంతా మిలీషియా, ప్రజాసంఘాలకు చెందిన వారే. ఇంకా కా॥ మాధవ్, కా॥ రాంబత్తి, కా॥ ఊరాల్, కా॥ సుశీల వంటి ఉత్తమ పి.ఎల్.జి.ఎ కామ్రేడ్స్ ఉన్నారు. మన ఈ కామ్రేడ్స్ అమరత్వం పార్టీకి, ఉద్యమానికి ఎనలేని నష్టాన్ని కల్గించింది. వారి కుటుంబాలకు, శ్రేయోభిలాషులకు తీవ్రమైన దు:ఖాన్ని నింపింది. ఈ పరిస్థితులలో అమరుల కుటుంబాల, శ్రేయోభిలాషుల దు:ఖంలో పాల్పంచుకుంటూ, వారికి ఎస్.జడ్.సి ప్రగాఢ సంతాపాన్ని తెలియ జేస్తున్నది. అలాగే అమరుల ఆశయాలను సఫలీకృతం చేస్తామని ప్రతిజ్ఞ చేస్తూ, వారికి తలవంచి వినమ్రంగా శ్రద్ధాంజలి ఘటిస్తున్నది.

మన అమరుల త్యాగాలు మన వెంటనే వున్నాయి. వారి త్యాగాలతో మన మార్గం ప్రకాశవంతమైంది. మన పురోగమనంలో వారిస్తున్న ఉత్తేజం మనకు నూతన శక్తినీ, చైతన్యాన్ని అందిస్తున్నది. వారు అందుకే సదా చిరస్మరణీయులు.

వ్యాసం

# భారత పాలక వర్గాల వ్యవసాయ విప్లవ వ్యతిరేక వ్యూహంలో భాగమే మన్యంలో బాక్సైట్ గనులు
# పాలక వర్గాల కుట్రలను చిత్తుచేస్తూ పురోగమిస్తున్న మన్యం ఆదివాసీ రైతాంగం

67 ఏళ్ళ 'స్వాతంత్ర్య భారతావని'లో బడా భూస్వామ్య, దళారీ నిరంకుశ బూర్జువాలు అక్రమార్జితంతో ఊహకందని ఆస్తుల్ని కూడబెట్టుకుంటే పీడిత ప్రజానీకం మాత్రం తినడానికి తిండిలేక, త్రాగడానికి నీరులేక, కట్టుకోవడానికి బట్టలు లేక, వుండడానికి కనీసం గూడు (ఇల్లు)లేక కఠిన, దుర్భర జీవితాన్ని గడుపుతున్నారు. ఈ వాస్తవాన్ని విశాఖ జిల్లా పరిస్థితులు నిలువుటద్దం పడుతున్నాయి. నేడు విశాఖ మన్యం ఆదివాసీల బ్రతుకుల్లో బాక్సైట్ గనులు విషం చిమ్ముతున్నాయి. వారు పుట్టి పెరిగిన నేలనుండి దూరంచేయడానికి, వాళ్ళ బ్రతుకుల్లో టన్నులకొద్ది మట్టి కొట్టి వాళ్ళ భూముల్లోని సంపదను దేశ, విదేశీ బహుళజాతి కంపెనీలకు కట్టబెట్టడమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పరమావధిగా మారిపోయింది.

దేశంలో అనేక ఆదివాసీ ప్రాంతాలు సహజవనరులకు నిలయమైనట్లే, విశాఖ మన్యం కూడా ప్రకృతి సహజ వనరులకు పుట్టినిల్లే. అపారమైన ఖనిజ సంపద, అల్యూమినియం బాక్సైట్, సున్నపురాయి, గ్రానైట్స్, లేటరైట్, కాల్‌సైట్, మైకా, రంగురాళ్ళు (వజ్రపురాళ్ళు), ఇసుక మొదలగు రకరకాల ఖనిజ సంపద ఇక్కడ నిక్షిప్తమై ఉంది. వీటిలో అత్యంత విలువైన ఖనిజం బాక్సైటే. ఏజెన్సీలో అనంతగిరి, అరకు, చింతపల్లి, జీకె వీధి మండలాల పరిధిలోను, తూర్పుగోదావరి జిల్లా వై.రామవరం, మారేడుమిల్లి మండలాల పరిధిలో సుమారు 800ల చదరపు కి॥మీ విస్తీర్ణంలో 570 బిలియన్ టన్నుల బాక్సైట్ ఖనిజం నిక్షిప్తమై ఉంది.

ఈ బాక్సైట్ ముడిసరుకును రిఫైనరి కర్మాగారంలో శుద్ధిచేసి అల్యూమినియం తయారుచేస్తారు. ప్రధానంగా ఈ అల్యూమినియాన్ని తేలికపాటి యుద్ధ విమానాల తయారీకి, ఆయుధాలకోసం, విద్యుత్ తీగలకోసం వినియోగిస్తున్నారు.

ముఖ్యంగా సామ్రాజ్యవాదం తీవ్రమైన ఆర్థిక, ద్రవ్య సంక్షోభంలో కూరుకుపోయిన నేటి పరిస్థితుల్లో దానినుండి బయటపడడానికి సామ్రాజ్యవాదులు, వారి తైనాతీలైన భారత పాలక వర్గాలు యల్.పి.జి. విధానాలను అమలుచేస్తూ దేశ పీడిత ప్రజలను మరింత దోపిడీ పీడనలకు గురిచేస్తున్నారు. దీంట్లో భాగంగానే మన దేశ పాలక వర్గాలు సామ్రాజ్యవాదంతో కుమ్మక్కై, అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ప్రయోజనాలకోసం, తమ సొంత లాభాలకోసం సంస్కరణలను తీవ్రతరం చేస్తున్నారు. ఈ సంస్కరణలు మన రాష్ట్రంలో చంద్రబాబు హయాంలోనే ప్రారంభమైనాయి. ఈ సంస్కరణలలో భాగంగా కోట్లాది కాసుల వర్షం కురిపించే ఈ ఖనిజాన్ని తవ్వుకుపోయేందుకు బహుళజాతి సంస్థలు దేశంలో రక్తాన్ని పారిస్తున్నాయి. 1998లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు చెందిన బహుళజాతి కంపెనీతో బాక్సైట్ గనుల వెలికితీతకు ఎమ్.ఓ.యు (మెమోరాండం ఆఫ్ అండర్ స్టాండింగ్) లను కుదుర్చుకున్నది.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తలపెట్టిన బాక్సైట్ మైనింగ్ తవ్వకాల మూలంగా ఏజెన్సీలోని అనంతగిరి, అరకు, చింతపల్లి, జి.కె.వీధి మండలాల పరిధిలోని 247 గ్రామాలలోని 50,000 మంది ప్రజలు నిర్వాసితులౌతారు. 800 చదరపు కి॥మీ విస్తీర్ణంలో వున్న అడవి, భూమి నాశనం అవుతుంది. మైనింగ్ కార్యకలాపాలు మొదలైతే దాదాపు లక్షన్నర ఎకరాల్లో విస్తరించిన కాఫీ, టేకు, 65 రకాల కలపేతర వుత్పత్తులు, ఔషధ గుణాలున్న పిప్పల్లు, కరక్కాయ, తాడికాయ, సీకాయ, కుంకుళ్ళు, అపరాలు వంటి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. ప్రపంచంలో అరుదుగా కనిపించే 'బ్లెవిట్' గుడ్లగూబ (అరకు ప్రాంతం దీనికి నిలయం) వంటి అరుదైన పక్షి జాతులు అంతరించిపోయే ప్రమాదం ఉంది.

బాక్సైట్ గనుల తవ్వకాల వలన ఏర్పడే పర్యావరణ దుష్ప్రభావం అంతా ఇంతా కాదు. బాక్సైట్ గనుల దుష్ట పరిణామానికి తక్షణం బలైపోతున్నది మన్యం మూలవాసులే. భవిష్యత్ కాలంలో ఈ ప్రాంతంలో జంతుజాలం, మనిషి, పురుగు పుట్రా, చెట్టుచేమ ఏది మనుగడ సాగించలేని పరిస్థితి ఏర్పడుతుంది. ఎందుకంటే బాక్సైట్ గని పని విధానంలో 100 నుండి 200 మీ. లోతు భూమి పొరలను తలక్రిందులుగా చేయటం వల్ల ప్రాణికోటి నివాసయోగ్యమైన, సారవంతమైన భూమిపై వున్న పొర నాశనమైపోతుంది. సహజ సిద్ధమైన సెలయేర్లు, వాగులు, వంకలు, నదులు తమ దిశను మార్చుకుంటాయి. ఈ ప్రాంతంలో నిలువ ఉన్న బాక్సైట్ ఖనిజానికి నీటిని పట్టి వుంచే గుణం వుంటుంది. అందువల్ల భూసారం పరిరక్షించబడుతుంది. కాగా వర్షా కాలంలో పడిన వర్షపు నీటిని పుష్కలంగా పీల్చుకున్న ఖనిజం ఏడాది పొడవునా నీటిని విడుదల చేస్తుంది. ఈ నీరు ఏరులుగా పారి కళింగసీమలోని 19 నదులుగా ప్రవహిస్తున్నాయి. వాటిమీద 27 సాగు, తాగు నీటి ప్రాజెక్టులు నిర్మించి వున్నాయి. ఈ ప్రాజెక్టుల వల్లనే విశాఖ, తూర్పుగోదావరి జిల్లాలలోని 50.000 ఎకరాలకు సాగునీరు, 77 గ్రామాలకు తాగునీరు అందుతున్నది. అంటే ఎంతమంది ప్రజలు నష్టపోతారో అర్థం చేసుకోవచ్చు.

సహజ సిద్ధంగా ఏర్పడిన కొండలు, గుట్టలు నాశనమైపోయి, బాక్సైట్ గనుల్లో తవ్వితీసిన బండలు, మట్టిదిబ్బలు ఏర్పడతాయి. నీటి పారుదల లేక వ్యవసాయం కుంటుపడుతుంది. అలాగే బాక్సైట్ కింద పెద్దఎత్తున అడవులు విధ్వంసం చేయటంవల్ల అరుదైన వృక్ష జాతులు, అడవి జంతువుల వునికికి ప్రమాదం ఏర్పడుతుంది. ఒక చోట బాక్సైట్ గని వుంటే దానిచుట్టూ 25 కి॥మీ పరిధిలో భూగర్భ జలాలు ఇంకిపోతాయి. ఫలితంగా మానవ నివాస యోగ్యం కాని మరుభూమిగా మారిపోతుంది.

ఆదివాసీల బ్రతుకుల్లో ఇంత విధ్యంసం సృష్టించే బాక్సైట్ గనుల ఉత్పత్తుల వల్ల ఆదివాసీలు బాగుపడ్డది ఏమిలేదు. సామ్రాజ్యవాదమంటేనే విధ్వంసం, ప్రజాజీవనాన్ని కబళించడం, ప్రజాసంక్షేమాన్ని వారి అభివృద్ధిని పూర్వపక్షం చేయడం. భారత పాలకులు సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలు అమలుచేసే క్రమంలో ప్రజల జీవనం విధ్వంసం అవుతున్నది. ప్రజలను నిర్వాసితులను చేయడం ద్వారా పరాయీకరణకు గురవుతున్నారు. ఆవాసాలు, పంటపొలాలు, ప్రాచీన కళాఖండాలు, సంస్కృతి ఒక్కటేమిటి సమస్తం ప్రజలు కోల్పోతారు. బాక్సైట్ గనుల తవ్వకాల వలన నష్టపోయే ఆదివాసీలు ఇందుకు మినహాయింపు కాదు. ఇది

ప్రకృతి ప్రళయమో, సహజ విధ్వంసమో కానేకాదు. ఇది సాక్షాత్తు సామ్రాజ్యవాద శక్తుల కృత్రిమ విధ్వంసం. ఈ విధ్వంసంలో ప్రజల జీవనం దాని ఆధారిత అంశాలు పాలకులకు పట్టవు. నిజానికి ఆదివాసీ ప్రాంతాల్లో ఖనిజ తవ్వకాలు చేపట్టాలంటే 'పెసా చట్టం' (పంచాయితీ ఎక్స్‌టెన్షన్ టూ షెడ్యూల్డ్ ఏరియా యాక్ట్) ప్రకారం ఆ ప్రాంతంలోని గ్రామసభ అనుమతులు పొందాలి. రాజ్యాంగంలోని 5వ షెడ్యూల్డ్ ప్రకారం గిరిజన సలహామండలి (టి.ఎ.సి) ఆమోదం తీసుకోవాలి. అంతేకాదు 1998లో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం ఆదివాసీ సహకార సంఘాలు, ప్రభుత్వ రంగ సంస్థలు మాత్రమే ఖనిజాల తవ్వకాలు చేపట్టాలి. కాని చంద్రబాబు ప్రభుత్వం బాక్సైట్ ఖనిజాన్ని వెలికితీసేందుకు ఈ చట్టాలన్నింటిని తుంగలోతొక్కి 1/70 చట్టాన్ని సవరించేందుకు పూనుకుంది.

ఈ పరిస్థితిలో బాక్సైట్ ఖనిజం వెలికితీతకు వ్యతిరేకంగా మన్యం ఆదివాసీ ప్రజానీకం నుండి పెద్ద ఎత్తున వ్యతిరేకత వ్యక్తమైంది. ఈ పరిస్థితుల్లో బాక్సైట్ వ్యతిరేక పోరాటానికి నేతృత్వం పార్టీ చేపట్టింది. పార్టీ, ప్రజాసంఘాల కార్యకర్తలు గ్రామ గ్రామాన బాక్సైట్ వ్యతిరేక పోరాట కమిటీలను నిర్మించి, ప్రజలను సంఘటితం చేసారు. గ్రామస్థాయి నుండి, ఏరియాస్థాయి వరకు బాక్సైట్ వ్యతిరేక పోరాటాన్ని సమన్వయించి నడపడానికి గ్రామ / పాకెట్ / ఏరియా స్థాయిల్లో సమన్వయ కమిటీలు నిర్మించి పని చేయించారు. యువతీ, యువకులతో "బాక్సైట్‌ను వ్యతిరేకిద్దాం – అడవిని కాపాడుకుందాం" అనే నినాదంతో "గ్రామ రక్షక దళాల" తరహాలో నిర్మాణాలు చేపట్టి నడిపించారు.

మన ఉద్యమ ప్రాంతాల్లో ప్రజలు చేపట్టిన బాక్సైట్ వ్యతిరేక పోరాటానికి మద్దతుగా, విశాల ప్రజా బాహుళ్యాన్ని సమీకరించే పనిలో భాగంగా కలిసి వచ్చే శక్తులను కలుపుకొని ఒక ఐక్యకార్యాచరణ కమిటీని నిర్మించడం జరిగింది. ఆ కమిటీ ఆధ్వర్యంలో ఉద్యమ ప్రాంతానికి బయటవున్న ప్రాంతాల్లో, ప్రభావిత ప్రాంతాల్లో అనేక ప్రజాందోళన కార్యక్రమాలు నిర్వహించింది. ముఖ్యంగా 1/70 చట్ట సవరణ నిర్ణయానికి వ్యతిరేకంగానూ, బాక్సైట్ తవ్వకాల ఒప్పందాలను రద్దు చేయాలనే డిమాండ్లతో ఉద్యమించారు. ఆ విధంగా ఉద్యమ ప్రాంతంలో జరుగుతున్న ప్రజా ఉద్యమానికీ, బయట ఐక్యవేదిక ఆద్వర్యంలో జరుగుతున్న ప్రజాందోళనకు మధ్య సమన్వయం సాధించేందుకు కృషి జరిగింది. ఈ మొత్తం కాలంలో ప్రజలు సాధారణ ఆందోళన, నిరసన కార్యమ్రాల నుండి మొదలుకొని సాంప్రదాయ ఆయుధాలు ధరించి ఊరేగింపులు, రాస్తారోకోలు, రహదారి దిగ్బంధనం, దిష్టి బొమ్మల దహనం వంటి పలు రూపాల్లో పోరాటాలు నిర్వహించారు. అయితే తెలుగుదేశం ప్రభుత్వం ఒక వైపున 1/70 చట్ట సవరణకు పూనుకొని మరోవైపు తీవ్రమైన నిర్బంధాన్ని అమలుచేసింది. పెరుగుతున్న ఈ నిర్బంధాన్ని ప్రజలు సంఘటితంగా ఎదుర్కొనేందుకు సిద్ధపడ్డారు. ఈ క్రమంలోనే బాక్సైట్ వ్యతిరేక పోరాటాన్ని అణచివేయాలని కంకణం కట్టుకున్న తెలుగుదేశం పార్టీ ప్రచార కార్యదర్శి వెంకటరాజుని ఖతం చేయటం జరిగింది. కొంతమంది తెలుగుదేశం నాయకుల ఆస్థులు ధ్వంసం చేయటం జరిగింది. ఆ తదుపరి జరిగిన సాధారణ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఘోర పరాజయం చవిచూడటం, బాక్సైట్ గనుల ప్రాజెక్టుకు తాత్కాలికంగా తెరపడటం వంటి పరిణామాలు చోటు చేసుకున్నాయి.

బాక్సైట్ గనుల వ్యతిరేక పోరాటం మూలంగా ఏర్పడిన అనుకూలతలను ఉపయోగించుకొని పోరాటంలో కదిలిన ప్రజలను వివిధ ప్రజాసంఘాల్లో, పార్టీ నిర్మాణాల్లో మిలీషియాలో సంఘటితం చేయటం జరిగింది. అనేకమంది యువతీ, యువకులు పి.ఎల్.జి.ఎ లో భర్తీ అయ్యారు. దీంతో 1998 నాటికి స్తబ్దతకు గురైన ఈస్టుడివిజన్ ఉద్యమం దానినుండి బయటపడి పురోగమించడానికి దోహదపడింది.

అయితే 2002 నుండి చంద్రబాబు ప్రభుత్వం చేపట్టిన తీవ్ర ఫాసిస్టు నిర్భంధకాండలో పార్టీ, ప్రజాసంఘాలు, మిలీషియా నిర్మాణాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. గణనీయమైన సంఖ్యలోనే ప్రజాసంఘాల కార్యకర్తలు, మిలీషియా సభ్యులు శతృవు ముందు లొంగిపోయారు. అయినప్పటికీ ప్రజలు మాత్రం విప్లవోద్యమం మాత్రమే తమ భవిష్యత్తును తీర్చిదిద్దుతుందని బలంగా విశ్వసిస్తూ వచ్చారు. ఈ క్రమంలోనే 2004 లో రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు వచ్చాయి. ఈ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు రాజశేఖర రెడ్డి చంద్రబాబు అనుసరించిన ప్రపంచ బ్యాంకు అభివృద్ధి నమూనాను తీవ్రంగా వ్యతిరేకించడమే కాకుండా, విప్లవోద్యమంపై అమలుచేసిన దమనకాండను సైతం ఖండించాడు. అంతకుముందు అసెంబ్లీలో చంద్రబాబు చేపట్టిన బాక్సైట్ గనులకు వ్యతిరేకంగా మాట్లాడాడు. ఈ నేపథ్యంలోనే 2004 లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ గెలిచి రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాడు. కాని నయవంచనలో ఆరితేరిన రాజశేఖర రెడ్డి అధికారంలోకి రాగానే బాక్సైట్ గనుల ఒప్పందాన్ని పునరుద్ధరించాడు. అరకు ప్రాంతంలో 2446 హెక్టార్లలోని 24 కోట్ల టన్నుల బాక్సైట్‌ను జిందాల్ కంపెనీకి అప్పగిస్తూ ఒక ఒప్పందం చేసుకున్నాడు. అదేవిధంగా చింతపల్లి ప్రాంతంలో 22 కోట్ల టన్నుల బాక్సైట్‌ను అన్‌రాక్ కంపెనీకి అప్పగిస్తూ మరో ఒప్పందం చేసుకొన్నాడు. ఇవి కాకుండా జి.కె వీధి ప్రాంతంలో వున్న బాక్సైట్, తూర్పుగోదావరి జిల్లా వై.రామవరం ప్రాంతంలో వున్న బాక్సైట్‌ను ప్రభుత్వరంగ సంస్థ అయిన నాల్కో (జాతీయ అల్యూమినియం కంపెనీ) కు కేటాయించాడు.

ఇంతే కాకుండా వై.ఎస్.ఆర్ ప్రభుత్వం బాక్సైట్ ముడి పదార్థాన్ని శుద్ధి చేయడానికిగాను, రిఫైనరీలు నిర్మించడానికి, విజయనగరం జిల్లా ఎస్.కోట వద్ద జిందాల్ కంపెనీకి, విశాఖ జిల్లా మాకవరపాలెంలో అన్‌రాక్ కంపెనీకి అనుమతులు ఇచ్చింది. దీనికిగాను ఇరు ప్రాంతాల సన్న, చిన్నకారు రైతుల నుండి విలువైన పంటభూములు లాక్కున్నది. భూసేకరణ సందర్భంగా తప్పనిసరిగా నిర్వహించాల్సిన పబ్లిక్ హియరింగ్ (ప్రజాభిప్రాయ సేకరణ) లను ప్రజలు బహిష్కరించారు. అట్లా వ్యతిరేకించిన రెండు ప్రాంతాల్లో (ఎస్.కోట, మాకవరపాలెం) ప్రభుత్వం సాయుధ బలగాలను దించి, సన్న, చిన్నకారు రైతులను అక్రమ అరెస్టులతో భయభ్రాంతులకు గురిచేసారు. మొక్కుబడిగా పబ్లిక్ హియరింగ్ కార్యకలాపాలను కొనసాగించారు. పబ్లిక్ హియరింగ్‌లో ప్రజలు తమ వ్యతిరేకత నమోదు చేసినప్పటికి వాటికి ఏ విలువ ఇవ్వలేదు. మాకవరపాలెం విషయంలో అన్‌రాక్ యాజమాన్యం అనేక కుట్రలు పన్నుతున్నది. నయాన, భయాన కొందర్ని లొంగదీసుకొని వారికి డబ్బులిచ్చి లోబర్చుకొని దొంగ సంతకాలతో తమ పనులు సాగించు కుంటున్నారు. ఇక ఎస్.కోట వద్ద రిఫైనరీ నిర్మాణానికి వ్యతిరేకంగా

రైతాంగం దృఢంగా పోరాడటం వలన తాత్కాలికంగా నిర్మాణ పనులకు బ్రేకు పడింది. మాకవరపాలెంలో భూములు కోల్పోయిన రైతాంగానికి ఒక పునరావాస కాలనీని అన్‌రాక్ కంపెనీ ఏర్పాటు చేసింది. కాని అక్కడ రైతాంగం ఎవరూ ఉండటంలేదు. ఎందుకంటే మొక్కుబడిగా నిర్మించిన పునరావాస కాలనీలో మనుషులు నివసించడానికి అనుకూలమైన వసతులు ఏవీ కల్పించలేదు. మంచి నీరు, కరెంటు, బడులు లేవు. వైద్య సదుపాయం అంతకన్నా లేదు. అన్నిటికంటే ముఖ్యమైనదైన ప్రత్యామ్నాయ ఉపాధి ఏదీ వారికి కల్పించకపోవటం వలన చాలా మంది వలస పోతున్నారు.

అయితే బాక్సైట్ గనులకు ఇప్పటివరకు పూర్తిస్థాయి అనుమతులు రాలేదు. ఒప్పందాలు జరిగిన ప్రాంతాలు దాదాపు ఆదివాసీ ప్రాంతాలే కావడంతో ప్రైవేట్ కంపెనీల ఆధ్వర్యంలో బాక్సైట్ వెలికి తీయడాన్ని ఆదివాసీ రక్షణ చట్టాలు అందుకు అనుమతించడంలేదు. దీనికోసం గతంలో చంద్రబాబు ప్రభుత్వం 1/70 చట్టాన్ని సవరించడానికి పూనుకుని ప్రజావ్యతిరేకత పెల్లుబుకటంతో విరమించుకున్నారు. ఈ అంశాన్ని దృష్టిలో పెట్టుకొనే వై.ఎస్.రాజశేఖర రెడ్డి రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థ అయిన ఆంధ్రప్రదేశ్ ఖనిజాభివృద్ధి సంస్థ (ఎ.పి.ఎమ్.డి.సి) ని రంగంలో దింపి, దీని ద్వారా బాక్సైట్ ముడిపదార్థాన్ని వెలికితీసి జిందాల్, అన్‌రాక్ కంపెనీలకు అందించేలా చర్యలు తీసుకున్నారు. ఈ క్రమంలో ఆదివాసుల రక్షణకై చేసిన చట్టాలు యదేచ్ఛగా ఉల్లంఘించటం జరుగుతున్నది. అలాగే 2006 లో అమలులోకి వచ్చిన అటవీ హక్కుల చట్టం కూడా అమలు చేయడంలేదు. దీనిని బట్టి చట్టాలెన్ని వున్నా, హక్కులెన్ని వున్నా, ఉద్యమాలు లేకుండా ఆచరణ శూన్యం అనేది స్పష్టమవుతున్నది.

ఈ క్రమంలోనే బాక్సైట్ వ్యతిరేక పోరాటం మళ్ళీ ఎజెండాలోకి వచ్చింది. 'బాక్సైట్ గనుల ప్రాజెక్టు వద్దే వద్దు – అడవే మాకు కావల'నే ప్రధాన డిమాండ్‌తో ఆదివాసీ ప్రజానీకం, ఇతర ప్రజాస్వామిక శక్తులు, సంస్థలు బాక్సైట్ వెలికితీతకు వ్యతిరేకంగా ఉద్యమించారు. ఈ క్రమంలో బాక్సైట్ మట్టి నమూనాల కోసమని, సర్వేల కోసమంటూ, ప్రజాభిప్రాయసేకరణ కోసమంటూ పోలీసుల అండతో వచ్చిన అధికారులను, అన్‌రాక్ కంపెనీ ఏజెంట్లను నాలుగు, ఐదు దఫాలుగా స్థానిక ప్రజలు అడ్డుకున్నారు. రెండు సందర్భాలలో బాక్సైట్ ప్రభావిత ప్రాంతాల ప్రజలు, మట్టి నమూనాలు సేకరించడానికి వచ్చిన ఎ.పి.ఎమ్.డి.సి కి చెందిన అధికారులను నిర్బంధించారు. వారి వాహనాలను ధ్వంసం చేసారు. మరొక సందర్భంలో దేహశుద్ధి చేసి వదిలిపెట్టారు. అయినప్పటికి ప్రభుత్వం తామనుకున్న పద్ధతిలోనే ముందుకు సాగుతున్నది. పర్యావరణ అనుమతుల విషయమై ప్రభుత్వం నియమించిన కమిటీ, హెలీకాప్టర్‌లో ఏరియల్ సర్వేనిర్వహించడాన్ని కూడా ప్రజలు పెద్దఎత్తున అడ్డుకున్నారు. దీనికోసం బాక్సైట్ గనులున్న గోపురం కొండ శిఖరంపై విల్లంబులు సారించివున్న ఆదివాసీలను హెలీకాప్టర్ నుండి పరిశీలించిన నిపుణుల కమిటీ వెనక్కి మళ్ళిపోయింది. అయినా మన 'పాలకులకు' ఇవేవి చెవికి ఎక్కడంలేదు. ప్రజలనుండి వస్తున్న అన్నిరకాల వ్యతిరేకతలనూ క్రూరంగా అణచివేస్తూ వేగంగా బాక్సైట్ ఒప్పందాలు అమలుచేసేందుకు పూనుకుంటున్నారు. దీంట్లో బాగంగా ఈస్టు డివిజన్‌లో దశాబ్దం పైగా కొనసాగుతున్న బాక్సైట్ మైనింగ్ వ్యతిరేక పోరాటంపై రాజ్య నిర్బంధం మళ్ళీ తీవ్రమైంది. ఇప్పటి వరకు ప్రభుత్వ సాయుధ బలగాల దమనకాండలో 10 మంది ఆదివాసీలు అశువులు బాసారు. 20 మంది వరకు ఆదివాసీ మహిళలు అత్యాచారాలకు గురికాబడ్డారు. సాయుధ బలగాలతో జరిగిన ఘర్షణలో పదుల సంఖ్యలో గాయపడ్డారు. వందలాది మంది ఆదివాసీలపై అక్రమ కేసులు బనాయించి జైళ్ళలో నిర్బంధిస్తున్నారు. గనుల ఏర్పాటు వ్యతిరేకిస్తున్న ప్రజలపై ప్రభుత్వ సాయుధ బలగాలు అమలు చేస్తున్న ఫాసిస్టు దమనకాండ మూలంగా విశాఖ మన్యం అశాంతికి గురైంది. ముఖ్యంగా ఈస్టు డివిజన్‌లో కాఫీ, బాక్సైట్ పోరాటాలు విప్లవోద్యమానికి ఊపిరిగా నిలుస్తున్నాయని భావిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఆ పోరాటాలను అణచివేసేందుకు ఒక వైపున సంస్కరణల పేరుతో ప్రజలను మభ్యపెట్టడం, అదే సమయంలో అనేక రెట్లు అదనపు పోలీసు, అర్ధసైనిక బలగాలను దించి పాశవిక నిర్బంధాన్ని తీవ్రతరం చేస్తున్నది.

బాక్సైట్ మైనింగ్ వ్యతిరేక ప్రజా ఉద్యమాన్ని దెబ్బతీయడంలో భాగంగా, ప్రజల్లో చీలికలు తీసుకువచ్చి అంతిమంగా ఉద్యమాన్ని నీరుగార్చడానికి అనేక కుట్రలు పన్నుతున్నది. ఇందులో స్థానిక యువతను బాక్సైట్ పునరావాసం పేరుతో ఎ.పి.ఎమ్.డి.సి మరియు అన్‌రాక్ కంపెనీ యాజమాన్యం రిక్రూట్ చేసుకుని గనుల తవ్వకంలో, ఇతర అనుబంధ పనుల్లో శిక్షణనిస్తున్నాయి. మరికొంత మందికి సంస్థల్లో ఉద్యోగాలు వస్తాయనీ, పునరావాసం కింద మెరుగైన వసతులతో కూడిన ఆవాసాలు నిర్మించి ఇస్తామనీ, సంస్థ తమ లాభాలలో 0.5 శాతం వాటాను భూములు కోల్పోయిన వారికి అందిస్తుందని చెబుతూ ప్రజలను పోరాటాల నుండి పక్కదారి పట్టించేందుకు కుటిల పన్నాగాలు పన్నుతున్నారు. వీరి అశలకు లోబడిన కొద్ది మందిని ఏజెంట్లుగా మార్చుకొని ఉద్యమ సమాచారాన్ని అన్‌రాక్ కంపెనీ యాజమాన్యానికి చేరవేసేందుకు ఏర్పాటు చేసుకున్నారు. ఇందుకు చింతపల్లి మండల కేంద్రంలో ఒక లైజన్ పోస్టు కూడా ఏర్పాటు చేసారు. ప్రజల ప్రయోజనాలను ఫణంగా పెట్టి, కంపెనీ ప్రయోజనాలను ఈడేర్చే పనిలోవున్న ఈ ఏజెంట్లను ప్రజలు గుర్తించి, ప్రజా కోర్టులో పెట్టి వారి ప్రజా వ్యతిరేక పనులను బహిర్గత పర్చినారు. ప్రజాభీష్టానికి లోబడి వుండాలని షరతులు పెట్టి విడిచి పెట్టారు. మరికొంత మంది మొండిఘటాలు స్వగ్రామాలను విడిచి పెట్టి అన్‌రాక్ కంపెనీ యాజమాన్యం వద్దకే పోయి స్థిరపడ్డారు. ప్రభుత్వం మాత్రం ప్రజావెల్లువ పెరిగినప్పుడు వెనుకకు తగ్గినట్లుగానే తగ్గి, తిరిగి పరిస్థితులు అనుకూలించినపుడు చాపకింద నీరులాగా మైనింగ్ పనులను కొనసాగిస్తున్నది. ఈ విషయంలో ఇక్కడ బూర్జువా, రివిజనిస్టు రాజకీయ పార్టీలు అవకాశవాదంతో వ్యవహరిస్తున్నాయి. ఓటు బ్యాంక్ తగ్గుతున్నపుడు పోరాటమంటున్నాయి. ఓటు బ్యాంక్ పెరిగినపుడు మైనింగ్ యాజమాన్యంతో అంటకాగి, పరోక్షంగా బాక్సైట్ మైనింగ్‌కి అనుకూలంగా వ్యవహరిస్తున్నాయి. ఇదే సందర్భంలో కేంద్ర గిరిజన సంక్షేమమంత్రి కిశోర్ చంద్రదేవ్, గ్రామీణ అభివృద్ధి శాఖామంత్రి పసుపులేటి బాలరాజులు రానున్న ఎన్నికలను దృష్టిలోవుంచుకొని బాక్సైట్ మైనింగ్ రాజ్యాంగానికి వ్యతిరేకమని, బాక్సైట్ ఒప్పందాలు రద్దుచేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసారు. దీనికి సమాధానంగా రాష్ట్ర ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డి రాజ్యాంగ పరిధిలోనే బాక్సైట్ గనుల తవ్వకం జరుగుతుందని సమాధానం ఇచ్చాడు. మరోవైపు అప్పటిదాక బాక్సైట్ గనుల ఏర్పాటుకు అనుకూలంగా వ్యవహరించిన

మంత్రి గెమ్మల బాలారాజు ఏకంగా బాక్సైట్ గనుల అనుమతిని రద్దుచేయాలంటూ గిరిజన సలహామండలి ద్వారా తీర్మానం చేయించి గవర్నర్‌కు పంపాడు. ఈ మోసపూరిత ప్రకటనలు, చర్చలు పెరుగుతున్న మిలిటెంటు ఉద్యమాన్ని దెబ్బతీసేందుకు, రానున్న ఎన్నికలలో లబ్ధి పొందేందుకు మాత్రమే జరుగుతున్నాయి. ప్రజలు మాత్రం ఈ ప్రకటనల, చర్చల వెనుక ఉన్న మోసాన్ని సరిగానే అర్థం చేసుకుంటున్నారు.

ఈ నేపథ్యంలోనే 2013 జూలై మాసంలో రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలను ప్రజలు సంపూర్ణంగా బహిష్కరించారు. ఈ సందర్భంగా జల్-జంగల్-జమీన్ లపై ఆదివాసీలదే అధికారమని, బాక్సైట్ మైనింగ్ ఒప్పందాలు తక్షణం రద్దుచేయాలని నినదించారు. ఈ బహిష్కరణలో బాక్సైట్ మైనింగ్ ప్రభావిత ప్రాంతాల్లోని జర్రెల, వంచుల, మొండిగెడ్డ, బలపం, తమ్మెంగుల, కుడిమిసార, గాలికొండ, గుమ్మిరేవుల, ఇంజేరి, లోతుగెడ్డ పంచాయితీల ప్రజలు క్రియాశీల భూమిక పోషించారు. అంతేకాకుండా రాబోయే సాధారణ ఎన్నికల బహిష్కరణకు సైతం వెనుకాడబోమని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. తీవ్ర ఆర్థికసంక్షోభం, రాజకీయ అస్థిరత, కల్లోలం, అసంతృప్తి వల్ల ప్రజాపోరాటాలు, ప్రతిఘటన పెరుగుతున్నాయనడానికి ఎన్నికల బహిష్కరణే చక్కటి ఉదాహరణ. తర తరాల నుండి అనుభవిస్తూ వస్తున్న తమ భూమిని విడిచిపెడితే పీడిత ప్రజలకు తమకంటూ ఏ ఆధారము లేకుండా పోతుంది. ఈ నిర్వాసిత సమస్య ప్రజల జీవన్మరణ సమస్యగా, భూమి సమస్యకు ఇదిఒక ప్రతిరూపంగా, నూతన ప్రజాస్వామిక విప్లవానికి ఇరుసుగా వున్న వ్యవసాయక విప్లవంలో ఒక అంతర్భాగంగా మారింది. రైతాంగం, ఆదివాసీల భూమి, అడవి పైన హక్కులను గుంజుకోవడం కోసం పన్నే కుట్రలను, కుహకాలను వ్యవసాయక విప్లవ వ్యతిరేక వ్యూహాత్మక దాడిగా గుర్తించి ప్రజలను చైతన్య పరచాలి. ప్రజలను వివిధ ఐక్య సంఘటనా వేదికలలో సంఘటిత పరిచి మరింత క్రియాశీలకంగా కదిలించాలి. తద్వారా ప్రజా యుద్ధాన్ని పురోగమింపచేయాలి. ఇందులో నూతన శక్తులను సంపాదించుకొని పార్టీని, పి.ఎల్.జి.ఎ.ను బలోపేతం చేయాలి.

❍

**(11వ పేజి తరువాయి...)**

పెరిగిన టెక్నాలజి అంతా సామ్రాజ్యవాదుల ప్రయోజ నాలని కాపాడేవిగా ఉంటాయి. కనుక ఎత్తుగడల పరంగా శతృవు చాలా బలవంతుడనే విషయం గుర్తించాలి. వీటి వల్ల మనకి ఏమీకాదు అనుకోవడం 'గుడ్డి ఎద్దు వెళ్ళి చేనులో పడినట్టు' వుంటుంది. సరైన అవగాహన, సూక్ష్మ పరిశీలన లేకుంటే వాటిని మనం ఉపయోగించుకొనలేము. వాటి నుంచి ఎదురయ్యే ప్రమాదాలను నివారించడానికి సరైన విధానాలను రూపొదించలేము. తత్ఫలితంగా మనమే నష్టపోతాం.

ఇదంతా టెక్నాలజి కి ఒక పక్క మాత్రమే. ఒక చిన్న వైరస్ మొత్తం కంప్యూటర్ వ్యవస్థనే ధ్వంసం చేస్తుంది. 100 కంప్యూటర్స్ చేయలేని పని ఒక మానవ మెదడు చేస్తుంది. కాబట్టి వాటి కళ్ళు కప్పి పని చేయడం పెద్ద పనేమీ కాదు. మనకు వాటి పట్ల సరైన అవగాహన కలిగి ఉండి కొన్ని జాగ్రత్తలు పాటించినట్లైతే ఎదురయ్యే ప్రమాదాలను నివారించవచ్చు.

**తీసుకోవాల్సిన జాగ్రత్తలు.**

- దాడి ప్రారంభం అయ్యే వరకు రేడియో సెట్స్‌ని సాధ్యమైనంత తక్కువగా ఉపయోగించాలి. మాన్‌పవర్ అన్నిటి కంటే గొప్పది గనుక రన్నర్స్‌కు ఎక్కువ ప్రాధాన్యతనివ్వాలి.
- రేడియోలలో (వాకీ సెట్లలలో) మాట్లాడినా వాడి స్కానింగ్‌కి దొరకకుండా, మన లొకేషన్‌ని పసిగట్టేందుకు వీలు లేకుండా ఉండేందుకు 3-5 సెకన్ల కంటె ఎక్కువ మాట్లాడకూడదు.
- ప్రయాణాలలో కూడా రేడియో వాడకం తగ్గించి హ్యాండ్ సిగ్నల్స్, సౌండ్ సిగ్నల్స్, పాస్ ఆన్ సిస్టం లాంటి పద్ధతుల్ని అభివృద్ధి పరుచుకోవాలి, అలవర్చుకోవాలి.
- మాట్లాడేటప్పుడు ఖచ్చితంగా కోడ్స్ ఉపయోగించడం నేర్చుకోవాలి. మనకు మాత్రమే తెలిసి ఉండే కోడ్ భాషను రూపొందించుకుంటే స్కానింగ్ చేసినా వాడికి అర్థం కాదు.
- సెల్ ఫోన్స్ వాడకం సాధ్యమైనంత వరకు తగ్గించాలి. మాట్లాడిన వెంటనే స్విచ్ ఆఫ్ చేసి, సిమ్, బ్యాటరీ తీసి ఆ ప్రదేశం నుంచి దూరంగా వెళ్ళాలి.
- ఇంటర్ నెట్‌ని ఉపయోగించినపుడు ఒకే సర్వర్‌ని, ఒకే నెట్‌వర్క్‌ని ఎక్కువగా వినియోగించకూడదు.
- పట్టణాలలో సి.సి.టి.వి లు ఎక్కడెక్కడ ఉన్నాయో ముందుగానే తెలుసుకోవాలి.
- అటవీ ప్రాంతంలో UAV, నిఘా ఉపగ్రహాలకి అర్థం కాకుండా ఉండేందుకు కేమోఫ్లేజ్, కన్‌సీల్‌మెంట్ పద్ధతుల్ని అనుసరించాలి.
- శాటిలైట్ పరిభ్రమణ స్థానాలని తెలుసుకోగలిగితే దానికి తగ్గట్టుగా మన ప్రయాణాలను ప్లాన్ చేసుకోవచ్చు. వీటన్నింటిని పాటించాలంటే ముందు క్రమశిక్షణ ఉండాలి. కాబట్టి దాన్ని అలవరుచుకోవాలి.

ఎంత చేసినా టెక్నాలజీని మనం ఉపయోగించుకోవడంలో అనేక పరిమితులు ఉంటాయి. కాని దాన్ని శతృవు వుపయోగించుకోకుండా ఉండేందుకు ధ్వంస కార్యక్రమాలు చేపట్టాలి. శతృవుకి చెందిన కమ్యూనికేషన్ వ్యవస్థని పేల్చివేయడం, రిసీవింగ్ స్టేషన్స్‌ని ధ్వంసం చేయడం అన్నిటికన్నా ఉత్తమంగా ఉంటుంది. వీటిని ప్రజల భాగస్వామ్యంతో పెద్ద ఎత్తున నిర్వహించాలి.

అసలు టెక్నాలజీని అభివృద్ధి పరిచిందే మానవుడు, ఆ మానవుడే లేకుంటే ఏ టెక్నాలజి అయినా వ్యర్థమే అవుతుంది. డ్రోన్‌లనైనా, శాటిలైట్‌లనైనా నియంత్రించేది మానవుడే. వాటిని నియంత్రించే ఉద్యోగి సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా మారితే ఆ డ్రోన్స్ తో వారి భవనాలనే కూల్చి వేయవచ్చు. కమ్యూనికేషన్ వ్యవస్థను ట్యాప్ చేస్తున్న సంస్థలో విప్లవ సానుభూతి పరులు ఉంటే వాడి పథకాలని మనమే పసిగట్టవచ్చు. అసలు N.S.A లోనే విప్లవకారులు చొరబడితె! తాము తీసుకున్న గోతిలో తామే పడ్డట్టుగా, వాళ్ళు తయారుచేసిన టెక్నాలజీని ఉపయోగించి ప్రజలు వారినే నాశనంచేస్తారు. ఇప్పటికీ ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్‌లు వాళ్ళ పాలిట బొందలగడ్డలుగా మారాయి. అక్కడి ప్రజలు మానవ చైతన్యానికి మించిన టెక్నాలజి మరేదీ లేదని నిరూపిస్తున్నారు. యుద్ధ జయాపజయాలను నిర్ణయించేది ప్రజల చైతన్యమే తప్ప టెక్నాలజి, ఆయుధాలు కావు.

అంతిమ విజయం ప్రజలదే !

❍

వ్యాసం

# డాటా మైనింగ్

## అమెరికా ఇంటెలిజెన్స్ కార్యక్రమాలు

మానవ సమాజం పెట్టుబడిదారి సమాజంగా మారిన తర్వాత సైన్స్, టెక్నాలజీలు చాలా వేగంగా అభివృద్ధి చెందుతూ వచ్చాయి. అయితే వర్గ సమాజంలో వర్గాలకి అతీతంగా ఏదీ వుండదు. గనుక అభివృద్ధి చెందిన సైన్స్, టెక్నాలజీలు (ప్రజలకి కొంత ఉపయోగం ఉన్నప్పటికి) అధికారంలో ఉన్న దోపిడీ వర్గ ప్రయోజనాలనే నెరవేరుస్తాయి.

ప్రపంచ పీడిత ప్రజల నెం:1 శతృవు అమెరికా సామ్రాజ్యవాదం ఎంత బలమైనదో దాని గూఢాచార కార్యక్రమాల గురించి తెలుసుకుంటె అర్థమవుతుంది. ఏ మాత్రం ఏమరపాటుగా వ్యవహరించినా ప్రమాదాల్లో పడతాం.

ఇటీవల అమెరికా గూఢాచార కార్యక్రమాలు (స్పైయింగ్ ప్రోగ్రాం) గురించి బయటపడిన రహస్యపత్రాలు ప్రపంచమంతా ఒక్కసారి ఉలిక్కి పడేలా చేసాయి. అమెరికా ఎంత భారీస్థాయిలో మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడుతుందో బయటపడింది.

అమెరికన్ జాతీయ భద్రతాసంస్థ (నేషనల్ సెక్యూరిటి ఏజెన్సీ) లో పనిచేస్తున్న ఒక కాంట్రాక్ట్ ఉద్యోగి (సిస్టం ఎడ్మినిస్టేటర్) 'స్నోడెన్' అమెరికా స్పైయింగ్ ప్రోగ్రామ్స్ గురించిన రహస్య పత్రాలని బయట పెట్టాడు. అమెరికా తన గూఢాచార కార్యక్రమాలకి పెట్టిన పేరు 'PRISM'. దీని మరో పేరే us 984 xn.1950 ల్లోనే బీజరూపంలో మొదలైన ఈ కార్యక్రమాలు బుష్ పరిపాలనలోనే వ్యవస్థీకృతమైనాయి. 9/11 దాడుల (డబ్ల్యూ. టి. సి మీద జరిగిన) తర్వాత "ఉగ్రవాదంపై యుద్ధం" పేరుతో మరింత తీవ్రతరమైనాయి. ఒబామా అధికారంలోకి వచ్చిన తర్వాత 'సమాచారసేకరణ' (డాటా మైనింగ్) ఉధృతరూపం దాల్చింది. యు.ఎస్ తన ఇంటెలిజెన్స్ సంస్థలైన ఎన్.ఎస్.ఎ, సి.ఐ.ఎ లాంటి వాటి ద్వారా తన సొంత దేశస్థులమీదనేగాక ప్రపంచంలో ఉన్న ప్రతీ ఒక్కరిమీద, వాళ్ళ వ్యక్తిగత జీవితాల మీద నిఘాని పెట్టింది. ఒకప్పుడు 'రవి అస్తమించని బ్రిటీష్ సామ్రాజ్యాన్ని' బ్రిటన్ స్థాపించింది. ఇప్పుడు ప్రపంచంలో ప్రతి ఒక్కరి కదలికలు తన కనుసన్నల్లోనే జరగాలనుకుంటున్నది అమెరికా. అందుకే స్నొడెన్ అరెస్ట్ అయినప్పుడు "నేను చేసే ప్రతిపని, మాట్లాడే ప్రతీ మాట రికార్డ్ అయ్యే ఈ ప్రపంచంలో జీవించడం నాకిష్టంలేదు" అని అన్నాడు.

ఇందు కోసం అమెరికా మొత్తం ఐ.టి (ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ), టెలికమ్యూనికేషన్స్ రంగాల్ని తన గుప్పెట్లో పెట్టుకుంది. యు.ఎస్ బ్రాడ్ బ్యాండ్ ఎండ్ టెలీకమ్యునికేషన్స్ సంస్థ తన సిస్టం నుంచి వెళ్ళే ప్రతీ ఒక్క ఫోన్ కాల్‌కి సంబంధించిన డాటాని ఎన్.ఎస్.ఎ కి అందిస్తుంది. ప్రపంచంలో కోట్లాది మంది ప్రజల ద్వారా వుపయోగించబడుతున్న 9 అతిపెద్ద ఇంటర్‌నెట్ కంపెనీలు (ఆపిల్, అల్, ఫేస్‌బుక్, గూగుల్, మైక్రోసాఫ్ట్, పాల్‌టాల్క్, స్కైప్, యాహు, యూట్యూబ్) వాటి సర్వర్స్ నుంచి వెళ్లే ప్రతి ఒక్క సమమాచారాన్ని ఎన్.ఎస్.ఎ సిస్టమ్స్ కి పంపిస్తున్నాయి. ప్రజల వ్యక్తిగత జీవితాలని ఇంతగా ప్రభావితం చేస్తున్న ఈ గూఢాచార కార్యక్రమాల్ని అమెరికా లక్షల కోట్ల ప్రజాధనాన్ని వెచ్చించి నిర్వహిస్తున్నది. C.I.A, N.S.A సంస్థలు వీటిని నిర్దేశిస్తున్నాయి. వీటి కార్యక్రమాల్ని తెలుసుకునేముందు N.S.A గురించి కూడా కొంత తెలుసుకోవాలి.

1952లో విదేశాల్లోని ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్స్‌ని ఇంటర్‌సెప్ట్ చేసి (ఇంటర్‌సెప్ట్ అంటే విద్యుత్, రేడియో, తరంగాలని పట్టుకుని వాటిని డీకోడ్ చేయడం)(ఇంటర్‌సెప్ట్ అంటే విద్యుత్, రేడియో, తరంగాలని పట్టుకుని వాటిని డీకోడ్ చేయడం) వాటిని విశ్లేషించేందుకు N.S.A ని స్థాపించారు. అది మెల్లగా రేడియో ప్రసారాలను రికార్డు చేయడం మొదలు పెట్టింది. తర్వాత అది ఉపగ్రహాలను, వివిధ రకాల టెక్నాలజీనీ ఉపయోగించి టెలిఫోన్స్‌ను ట్యాప్ చేయడం, టెలిగ్రాఫ్ కమ్యూనికేషన్స్‌ని హాక్ (hack) చేయడం వంటి పనులతో చురుకైన గూఢాచార సంస్థగా రూపాంతరం చెందింది. ఇంటర్‌నెట్ శకం మొదలైన తర్వాత U.S.A ఈమెయిల్స్‌ని, వివిధ రకాల డిజిటల్ సమాచారాన్ని సేకరించడం మొదలు పెట్టింది. సేకరణ అనేది దాని టాస్క్‌లో సగం మాత్రమే. (ఒక్క రోజులో 1.7 బిలియన్ పీసుల సమాచారం) మిగతా టాస్క్ అంతా సేకరించిన క్లిష్టమైన సమాచారాన్ని విశ్లేషించడంగా ఉంటుంది. ఇందుకోసం ప్రపంచంలోనే అత్యున్నత గణితశాస్త్ర నిపుణులు N.S.A లో పనిచేస్తున్నారు. N.S.A 'ఎక్‌లాన్' అనే భూగోళమంత నెట్‌వర్క్ సిస్టం పథకాన్ని రచించింది. 5 ఖండాలు, 7 సముద్రాల పరిధిలో 2000 ఫీల్డ్ స్టేషన్స్‌ని నిర్మించింది. 1950-60ల మధ్య కమ్యూనిస్టు బూచిని చూపి సోవియట్ యూనియన్ మీద, మూడవ ప్రపంచ దేశాల మీద నిఘాని పెట్టింది. తమ దేశ పౌరులకి ఈ కార్యక్రమాలవల్ల ఎటువంటి ఇబ్బంది ఉండదని నమ్మబలికింది. అయితే 1970లో 'క్రిస్టోఫర్‌పైల్' అనే U.S. ఆర్మీ ఇన్‌స్ట్రక్టర్ "తమ ఉద్యోగులు, పౌరులమీద నిఘాని కొనసాగిస్తున్నారు" అని ప్రకటించాడు. అప్పట్లో అది చాలా పెద్ద చర్చగా మారి వ్యక్తిగత స్వేచ్ఛ రక్షణకై కొన్ని చట్టాలని రూపొందించారు. మళ్లీ వారే తమ కార్యక్రమాలు కొనసాగించడానికి ఎఫ్.ఐ.ఎస్.ఎ (ఫారిన్ ఇంటెలిజెన్స్ సర్వెలెన్స్ యాక్ట్) ని రూపొందించి, ఎఫ్.ఐ.ఎస్.ఎ కోర్టుల ద్వారా రహస్య అనుమతులు పొంది నిఘా కార్యక్రమాల్ని తీవ్రతరం చేశారు. 9/11 తర్వాత మరింత దూకుడుగా వ్యవహరించింది. అనేక గూఢచార సంస్థలని సమన్వయించే వ్యవస్థగా మారింది. దీనికి పి.ఎస్.పి (ప్రెసిడెంట్స్ సర్వెలెన్స్ ప్రోగ్రాం) అని పేరు పెట్టింది. ఈ కార్యక్రమాల మీద అమెరికాలోని సాధారణ ప్రజలేకాక, అధికార వర్గాల్లో కూడా వ్యతిరేకత వ్యక్తమయ్యింది. ఈ విధమైన టార్గెటెడ్ నిఘాని (దేశాల వారీగా, మతాలవారీగా) కొనసాగించడం వల్ల అమెరికాలోని ముస్లిం ప్రజలు చాలా ఇబ్బందులకి గురవుతున్నారు. ఈ భాగోతాన్ని బయట పెట్టిన స్నోడెన్ ఇప్పుడు ప్రమాదంలో ఉన్నాడు.

అసలు N.S.A మొత్తం ప్రపంచాన్ని ఎలా హాక్ చేయగలుగుతుంది?. 2 బిలియన్‌ల సిబ్బందిని కలిగి ఉన్న N.S.A భూమ్మీద ఉన్న ఒక్కో వ్యక్తికి సంబంధించిన సమాచారాన్ని ఒక్క మిలియన్ DVDS లో స్టోర్ చేయగలిగే సామర్థ్యాన్ని కలిగి ఉంది. ఇలా N.S.A ఈమెయిల్స్, టెక్స్ట్ మెసెజ్, ఫోన్ కాల్స్, వీడియోస్ లాంటి అనేక కమ్యునికేషన్స్ నుంచి గంటకి 2 పెటా బైట్స్ (1 పెటా బైట్ అంటే ఒక మిలియన్ గిగా బైట్) సమాచారాన్ని

సేకరిస్తుంది. (డిజిటల్ సమాచారాన్ని బైట్స్‌లో కొలుస్తారు. సాధారణంగా మనకి M.B.లు, G.B ల వరకు తెలిసి ఉంటుంది.)

'గార్డియన్' అనే పత్రిక ఈ హద్దులు లేని సమాచార సేకరణ గురించి (bound less informent) ఒక రిపోర్ట్‌ని ప్రచురించింది. అందులో 2013 లో ఒక్క మార్చి నెలలోనే N.S.A ప్రపంచ వ్యాప్తంగా 97 బిలియన్ పీస్‌ల సమాచారాన్ని సేకరించినట్లు తెలిపారు. 2009 లండన్‌లో జరిగిన G20 దేశాల శిఖరాగ్ర సదస్సులకి హాజరైన వివిధ దేశాధినేతల కంప్యూటర్స్ ని కూడా శాటిలైట్ సిగ్నల్స్‌ని ట్యాప్ చేయడం ద్వారా హాక్ (హాకింగ్ అంటే కంప్యూటర్స్‌లో ఉండే రహస్య సమాచారాన్ని వాటి యజమానులకి తెలియకుండా దొంగిలించడం, తమ కంప్యూటర్స్ నుంచి సమాచారం వేరే సిస్టమ్స్ కి వెళ్ళినట్లు కూడా అర్థంకాదు) చేశారు. అంతే కాకుండా అనేక U.S టెలికామ్ కంపెనీలు వాటి యొక్క కోటాను కోట్ల వినియోగదారుల మెటా డాటాని (మెటా డాటా అంటే ఫోన్ కాల్స్‌కి సంబంధించిన టైమ్, లొకేషన్ తో పాటు ఎవరు ఎవరితో అనే నిర్ధిష్టమైన సమాచారం) N.S.A కి అందిస్తున్నాయి.

రెండవ ప్రపంచయుద్ధం తర్వాత గ్లోబల్ టెలికమ్యూనికేషన్స్ నెట్‌వర్క్ మీద నిఘాకొరకు U.S తన మిత్ర దేశాలతో కలిసి ఎక్‌లాన్ (ECHELON) అనే కార్యక్రమాన్ని చేపట్టింది. 2001లో యూరోపియన్ యూనియన్ (EU) ఈ ప్రోగ్రాంని పరిశోధించి ఒక రిపోర్ట్ కూడా తయారు చేసింది. ఆ ప్రోగ్రాం యొక్క ముఖ్య లక్ష్యం EU పరిధిలోని U.K, మరియు U.S లతో పోటీ పడుతున్న దేశాల గురించిన సున్నితమైన వాణిజ్య (కమర్షియల్) సమాచారాన్ని అందించడంగా ఉండేది. కాని దాని పని ఇప్పుడు వైర్ ట్యాపింగ్, శాటిలైట్ కమ్యూనికేషన్స్‌ని మానిటర్ చేయడంతో ఆగకుండా ఇంకా అనేక పద్ధతుల్ని ఎంచుకుంటున్నది. అందులో మొదటిది గ్లోబల్ ఫైబర్ ఆప్టిక్ నెట్‌వర్క్ అంటే ఇది పొరలుగా ఉండే నెట్‌వర్క్ సిస్టం. ప్రపంచ వ్యాప్తంగా జరిగే సమాచార పంపిణీ (కమ్యూనికేషన్స్) అంతా ముఖ్యంగా U.S సర్వర్స్ నుంచే జరుగుతాయి. ఈ నెట్‌వర్క్‌ని U.S చాలా సులభంగా ట్యాప్ చేయగలుగుతుంది. ఉదాహరణకి AT&T అనే సంస్థ ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తన నెట్‌వర్క్ పరిధిలోని ప్రతీసమాచారాన్ని తన కంప్యూటర్స్ నుంచి N.S.A సిస్టమ్స్ లోకి డైవర్ట్ అయ్యేలా ఒక ఆటో మెటిక్ మెకానిజంని ఏర్పాటు చేసింది.

ఇక రెండవ విధానం ఇంటర్‌నెట్ ప్రధాన మార్గాలైన అంతర్జాతీయ జలమార్గాలని ట్యాప్ చేయడం. అందులో 3 ప్రధాన మార్గాలైన దక్షిణ అమెరికా తీరాలు, ఉత్తర ఆఫ్రికా, హిందూ మహా సముద్రాల్ని ట్యాప్ చేయడం.

మూడవ విధానం గ్లోబల్ ఇంటర్‌నెట్ సర్వర్స్ ని ట్యాప్ చేయడం. కాని ఆ కంపెనీలు తాము U.S చట్టాలకి లోబడే సమాచారాన్ని N.S.A కి పంపిస్తున్నాం అని అంటున్నాయి. ఏరాజ్యాంగమైనా, చట్టాలైన పాలకవర్గాల ప్రయోజనాలకి హానికరంగా ఉండవు అనేది ఈ విధంగా అర్థంచేసుకోవచ్చు. U.S రాజ్యాంగంలోని 4వ అధికరణం, పౌరుల యొక్క వ్యక్తిగత స్వేచ్ఛని కాపాడాలని చెబుతుంది. కాని దీన్ని ఉల్లంఘించేందుకు కూడా చట్టాలని తయారు చేశారు. ఎన్.ఎస్.ఎల్ (నేషనల్ సెక్యూరిటి లెటర్స్) ని 1978లో రూపొందించారు. దీని ద్వారా అవసరమైన వారి యొక్క వ్యక్తిగత సమాచారాన్ని వారి అనుమతి లేకుండా తీసుకునే వీలుంటుంది.

ఇంటర్‌నెట్ అనేది కేవలం కమ్యునికేషన్స్ యొక్క వెన్నెముక మాత్రమేకాదు, గ్లోబల్ విజ్ఞానానికి ఇది ముఖ్యమైన మార్గం. కాని ఈ ఇంటర్‌నెట్ వ్యవస్థ యొక్క ప్రధాన అంగమైన ఐ.సి.ఎ.ఎన్.ఎన్ (ఇంటర్‌నెట్ కార్పొరేషన్ ఫర్ ఎసైన్డ్ నేమ్స్ అండ్ నెంబర్స్)–యు.ఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్ ఇచ్చే లైసెన్స్ క్రింద పని చేస్తుంది. ఈ విధానాన్ని రద్దు చేయాలని అనేక దేశాలు 2012 దుబాయిలో అంతర్జాతీయ టెలికమ్యూనికేషన్స్ పై జరిగిన ప్రపంచ మహాసభలలో (WCIT 2012) మాట్లాడాయి. అయితే సామ్రాజ్యవాద దేశాలు దీన్ని తీవ్రంగా వ్యతిరేకించి, ఇది ఇంటర్‌నెట్ స్వేచ్ఛకి ఆటంకం అని U.S దాని తొత్తు దేశాలు సభల నుంచి వెళ్ళిపోయి ప్రపంచ ఇంటర్‌నెట్‌నే హాక్ చేయడం తమ జన్మహక్కు అని ప్రకటించుకున్నాయి.

The PRISM programme. సమాచారాన్ని పంపిణీ చేసే సంస్థలు సమాచార రూపాలు.

మైక్రోసాఫ్ట్ (హాట్ మెయిల్ e+c) – ఈమెయిల్స్, చాట్, వీడియో, వాయిస్
గూగుల్ – వీడియోస్
యాహు! – స్టోర్డ్ డాటా
ఫేస్‌బుక్ – వైప్
పాల్‌టాల్క్ – ఫైల్ ట్రాన్స్‌ఫర్స్
యూట్యూబ్ – వీడియో కాన్ఫరెన్సెనింగ్
స్కైప్ – నోటిఫికేషన్స్ ఆఫ్ టార్గెట్ యాక్టివిటి – లాగింగ్...etc
ఓల్ – ఆన్ లైవ్ సోషల్ నెట్‌వర్కింగ్ డిటైల్స్
ఆపిల్ – స్పెషల్ రిక్వెస్ట్స్

పైన చూపించిన దాంట్లో ఒక్కో సంస్థ ఒక్కో రకమైన సమాచారాన్ని అందిస్తుంది. ఉదాహరణకు గూగుల్, వీడియోలని పంపిస్తే హాట్ మెయిల్, జి మెయిల్ లాంటివి ఈమెయిల్స్‌ని, చాటింగ్‌ని, వాయిస్ రికార్డ్స్‌ని పంపిస్తాయి.

ఈ PRISM ప్రోగ్రాంని బ్రిటన్ తనకి అనుగుణంగా ఇంకా ఆధునీకరించింది. బ్రిటన్ టెక్ ఇంటెలిజెన్స్ సెంటర్ అయిన జి.సి.హెచ్.క్యూ (గవర్నమెంట్ కమ్యూనికేషన్స్ హెడ్‌క్వార్టర్స్) 2012 వ సంవత్సరంలోనే వివిధ రకాల కమ్యునికేషన్స్ నుంచి సేకరించిన సమాచారం మీద ఆధారపడి 197 ఇంటెలిజెన్స్ రిపోర్ట్స్‌ని తయారు చేసింది. అంతే కాకుండా బ్రిటన్ ఇంటెలిజెన్స్ సంస్థలు, అమెరికా సంస్థలతో సన్నిహిత సబంధాలు నెరుపుతూ మొత్తం ప్రపంచాన్ని తమ గుప్పెట్లో ఉంచుకోవడానికి చూస్తున్నది. బ్రిటన్ ప్రధాన మంత్రి డేవిడ్ కామరూన్ తమ కార్యక్రమాలకి సాధికారత సంపాదించడానికి కల్లబొల్లి కథలు వినిపిస్తున్నాడు. ఒకానొక సమయంలో ఇంటర్‌నెట్ ప్రోగ్రాంల మీద రన్నింగ్ కామెంటరీ ఇవ్వలేనని తన అసహనాన్ని ప్రకటించాడు. వీటి వల్ల ఎన్నో ప్రమాదాలని నివారించ గలిగామని, మనం ప్రశాంతంగా జీవించగలుగుతామని ప్రజల మద్దతు కూడగట్టడానికి ప్రయత్నిస్తున్నాడు. పాశ్చాత్య దేశాల్లో పాలకులు పనికట్టుకుని జాతిదురహంకారాన్ని పెంచి పోషిస్తున్నారు. ముఖ్యంగా శ్వేత జాతీయులు ప్రపంచంలో అందరికంటె ఉన్నతమైన వారనే భావనను పెంచి ఆసియావాసుల మీద ద్వేషాన్ని పెంచేందుకు ప్రయత్నిస్తున్నారు. మరీ ముఖ్యంగా మొత్తం ఇస్లాం కమ్యూనిటీనే ఒక ఉగ్రవాద జాతిగా భావిస్తున్నారు. పాలకులు దాన్ని మరింత

బలపరుస్తూ ముస్లిం జాతి మనుగడనే ప్రమాదంలో పడవేస్తున్నారు.

అమెరికన్ సామ్రాజ్యవాదులు ప్రపంచ ఆధిపత్యం కోసం ఇంటెలిజెన్స్ సంస్థలని మరింత విస్తరింపచేస్తున్నారు. వాటికి విచ్చలవిడి అధికారాలను, బడ్జెట్‌ని కేటాయించి మరింత శక్తివంతంగా తయారు చేస్తున్నారు. ప్రతి రంగాన్నీ, ప్రతి వ్యవస్థని ఈ సంస్థలు తమ ఆధీనంలోకి తెచ్చుకుంటున్నాయి. అన్ని వనరులను ఉపయోగించి ప్రపంచ వ్యాప్తంగా తమ పట్టుని బిగిస్తున్నాయి. మొత్తం రాజ్యాన్ని, రాజ్య యంత్రాగాన్ని ఇంటెలిజెన్స్ సంస్థలు అజమాయిషీ చేయడం వల్ల అవి ఎంత బలమైనవో అర్థం చేసుకోవచ్చు.

కోల్డ్‌వార్ ముగిసిన తర్వాత నుంచే వీటి విస్తరణ మరింత పెరిగింది. u.s మిలటరీ యూనిట్స్ లో సైబర్ యూనిట్స్‌ని ఏర్పాటు చేసి ప్రత్యర్థి దేశాల యొక్క కంప్యూటర్స్‌ని వాటి ద్వారా నియంత్రించబడుతున్న అనేక వ్యవస్థలను ధ్వంసం చేస్తున్నారు. N.S.A అధిపతి జెన్.కీత్. అలెగ్జండర్ స్వయంగా ఒక ప్రకటనలో 199 మిలియన్ డాలర్ల వార్షిక బడ్జెట్‌లో N.S.A ఆధీనంలో 13 అఫెన్సివ్ సైబర్ టీమ్స్‌ని ఏర్పాటు చేసినట్లు తెలిపాడు. వీరు ముందస్తు సైబర్ దాడులు నిర్వహిస్తారు. అంటే కంప్యూటర్స్‌ని నాశనం చేసే వైరస్‌లని డిజైన్ చేసి వాటిని ఉపయోగించి ప్రత్యర్థుల వ్యవస్థని ధ్వంసంచేస్తారు. దీనికి ఉదాహరణ, ఇరాన్‌లోని "నతాంజ్ న్యూక్లియర్ రియాక్టర్" ని నియంత్రించే కంప్యూటర్ వ్యవస్థని ధ్వంసం చేయడం కోసం అమెరికా ఇజ్రాయిల్ తో కలిసి "స్టక్స్‌నెట్" అనే వైరస్‌ని ఉపయోగించింది. అంతే కాకుండా ఇరాన్ అధికారులు ఉపయోగించే కంప్యూటర్‌ని వాటిలోని సమాచారాన్ని దొంగిలించడం కోసం "ఫ్లేమ్" అనే వైరస్ ని డిజైన్ చేశారు. ఈ సంస్థలు కావాలనుకుంటే అమెరికా అధ్యక్షుని కంప్యూటర్‌ని కూడా ట్యాప్ చేయగలుగుతాయి.

అమెరికా యుద్ధ నేరాలు, గూఢాచార కార్యక్రమాలు బయటపడడం ఇది మొదటిసారి కాదు. 1971లోనే CIA ఏజెంట్ డానియల్ ఎల్స్‌బర్గ్, పెంటగాన్‌కి చెందిన రహస్య పత్రాలని బయట పెట్టాడు. వాటికన్న ముఖ్యమైన సమాచారాన్ని ఇప్పుడు స్నోడెన్ బయటపెట్టాడు. వికిలీక్స్ సంస్థ కొద్ది సంవత్సరాల క్రితం సంచలనాన్నే సృష్టించింది. కాని వాళ్ళందరూ ఇప్పుడు అమెరికా టార్గెట్ లిస్ట్ లో చేరారు. వికిలీక్స్ వ్యవస్థాపకుడు జూలియన్ అశాంజె సంవత్సర కాలంగా బ్రిటన్‌లోని ఈక్విడార్ దౌత్యకార్యాలయంలో తలదాచుకుంటున్నాడు. మ్యానింగ్ అనే వ్యక్తి అత్యంత పాశవికంగా చిత్రహింసలకి గురైనాడు. కాని ఈ పరంపర మాత్రం కొనసాగుతూనే ఉంది. ఇదంతా అమెరికాకి చాలా తలనొప్పిగా మారడంతో పాలకులు మరింత కౄరమైన చట్టాలను రూపొందిస్తున్నారు.

## ఇంటర్‌నెట్ కంపెనీల పాత్ర

21వ శతాబ్దంలో ఇంటర్‌నెట్ మొదలైన తర్వాత కమ్యూనికేషన్స్‌ని ఇంటర్‌నెట్ శాసిస్తున్నది. అమెరికాకి ఈ ఇంటర్‌నెట్ కంపెనీలు వ్యూహాత్మక సహాయాన్ని అందిస్తున్నాయి. వాటిల్లో గూగుల్ ఎంతో నమ్మకమైన సంస్థగా ఉంది. ఎందుకంటే ప్రపంచ మార్కెట్‌ని అదుపులో ఉంచుకోవడానికీ, తమకనుగుణంగా మలచుకోవడానికీ బడా కార్పొరేట్ సంస్థలకి, ఈ సంస్థ ఎంతో నమ్మకంగా పనిచేస్తున్నది. ప్రపంచ వ్యాప్తంగా పెట్టుబడిదారి రాజ్యాలను శాసిస్తున్న గుత్త పెట్టుబడిదారులు మొత్తం తమ రాజకీయ, వాణిజ్య ప్రయోజనాలని కాపాడుకునేందుకు ఈ సంస్థలను ఉపయోగించుకుంటున్నారు. అందుకోసం ఇంటెలిజెన్స్ అధికారులుగా పని చేసిన అధికారులను ఇటువంటి సంస్థల్లో మేనేజర్స్ గా కీలక విభాగాల అధిపతులుగా నియమిస్తున్నారు.

## వైర్ ట్యాప్స్

అమెరికా లాంటి సామ్రాజ్యవాద దేశాలు కనిపెట్టిన ఈ వైర్‌ట్యాప్స్ ఇంచుమించు అన్ని దేశాల ప్రభుత్వాలు అనుసరిస్తున్నాయి. 1967లో u.s సుప్రీమ్‌కోర్టు ఈ వైర్ ట్యాప్స్‌కి అనుమతి ఉండాలని నిర్ణయించింది. అందుకు అనుగుణంగా వైర్ ట్యాప్ చట్టాన్ని 1968లో తీసుకువచ్చింది. అయితే ఇది వియత్నాం యుద్ధ సమయంలో అమెరికా ఇంటెలిజెన్స్ కార్యక్రమాలను నియంత్రించే విధంగా తయారయ్యింది. దీంతో పాలక వర్గాలు FISA చట్టాన్ని రూపొందించారు. ఈ FISA కోర్టు లన్ని U.S ఇంటర్‌నెట్ కంపెనీలని తమ నెట్‌వర్క్ నుంచి జరుగుతున్న వాయిస్ అండ్ డాటా ట్రాఫిక్ ని N.S.A కి పంపాలని ఆదేశించింది. ప్రస్తుతం స్నోడెన్ బయట పెట్టిన రహస్యపత్రాల్లో 9 కంపెనీలు ముఖ్యంగా PRISM లో పాలుపంచుకుంటున్నట్లు ఉన్నది. కాబట్టి వీటిని వుపయోగించేవారు చాలా జాగ్రత్తగా ఉండాలి. మీ, ప్రతి ఆలోచనని అమెరికా స్క్రీన్ చేస్తున్నదనే విషయం మరిచిపోకూడదు.

## 5 వ స్థానంలో భారత్

అమెరికన్ N.S.A డాటా మైనింగ్ లిస్ట్‌లో భారత్ 5 వ స్థానంలో ఉంది. వరుసగా ఇరాన్, పాకిస్థాన్, జోర్డాన్, ఈజిప్ట్ తర్వాత అమెరికా ఎక్కువగా భారత్‌ను మానిటర్ చేస్తుంది. గమనించాల్సిన విషయం ఏమిటంటే చైనా భారత్ కన్నా తక్కువగా నిఘాకి గురవుతున్నది. 120 కోట్లకి పైగా జనాభా కలిగిన మన దేశంలో కోట్లాది మంది మొబైల్ మరియు ఇంటర్‌నెట్ సేవలని వుపయోగిస్తున్నారు. ప్రభుత్వం కూడా తమ రహస్య పత్రాలు కంప్యూటర్స్‌లో పదిలంగా ఉన్నాయని భావిస్తున్నది. కాని ప్రతీ మొబైల్, మెసేజ్, డాక్యుమెంట్ N.S.A చదువుతున్నది. ఈ నెట్‌వర్క్‌ని ఉపయోగించే వారెవరైనా తమకు ప్రైవసీ ఉన్నట్లు భావించకూడదు. ఇంత జరుగుతున్నప్పటికీ పౌరుల వ్యక్తిగత స్వేచ్ఛా హక్కుని కాపాడేందుకు ఎటువంటి ప్రత్యేక చట్టం లేదు. అనేక అవసరాల ప్రాతిపదికన జరుగుతున్న ఈ సమాచార సేకరణ కోసం తీసుకువచ్చిన చట్టాల మీద నివేదికని రూపొందించడం కోసం ఢిల్లీ హైకోర్ట్ మాజీ ప్రధాన న్యాయమూర్తి అజిత్ ప్రకాష్ షా నేతృత్వంలో 12 మంది సభ్యులతో ఒక ప్లానింగ్ కమిషన్‌ను ఏర్పాటు చేశారు. వారు ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల చేత చేపడుతున్న సమాచార సేకరణకు (డాటా కలెక్షన్) సంబంధించి 9 సూత్రాలని రూపొందించారు. అయితే ప్రజల హక్కుల పట్ల ఏమాత్రం గౌరవంలేని ప్రభుత్వాలు ప్రజల స్వేచ్ఛా హక్కుని కూడా యదేచ్ఛగా హరించివేస్తూనే ఉన్నాయి.

## నిరసనల వెల్లువ

అమెరికా నిర్వహిస్తున్న PRISM మరియు బౌండ్‌లెస్ ఇన్‌ఫర్‌మేషన్ మీద ప్రపంచ వ్యాప్తంగా నిరసనల వెల్లువ ఎగసిపడింది. అనేక హక్కుల సంఘాలు, దేశాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. అమెరికా లిస్ట్‌లో భారత్ 5వ స్థానంలో ఉన్నదని తెలియగానే భద్రతాధికారులు తమ నిరసనని వ్యక్తం చేశారు. జాతీయ భద్రతా సలహాదారు శివశంకర్ మీనన్ అమెరికాని

సంజాయిషీ అడిగాడు. కాని భారత గూఢాచార సంస్థలకి, అమెరికా గూఢాచార సంస్థలకి మధ్య చాలా సన్నిహిత సంబంధాలు ఉన్నాయన్న సంగతి మరిచిపోకూడదు. అమెరికా టార్గెట్స్‌లో జర్మనీ చాలా ముఖ్యమైన స్థానంలో ఉంది. ఈ సందర్భంగా ఒబామా జర్మనీ పర్యటనకి వెళ్ళినప్పుడు జర్మనీ రాజధాని బెర్లిన్‌లో నిరసన ప్రదర్శనలు వెల్లువెత్తాయి. 'యస్ వుయ్ స్కాన్' అనే నినాదం మారుమ్రోగింది. అయితే ఒబామా మాత్రం తమ పనులను సమర్థించుకునేందుకు, 'యూరప్ ఖండంలో సుమారుగా 50 వరకు ఉగ్రవాద దాడులని నివారించేందుకు ఇవి ఎంతో ఉపయోగపడ్డాయని' చెప్పుకొచ్చాడు. అందుకు ఉదాహరణగా 2009 న్యూయార్క్ సబ్‌వే సిస్టం మీద దాడిని విఫలం చేయడంగాని, 2008లో డేవిడ్ హెడ్లీని అరెస్ట్ చేయడంకాని U.K, U.S డాటా మైనింగ్ వల్లనే సాధ్యపడ్డాయని చెప్పుకుంటున్నారు.

ఎన్ని చెప్పినప్పటికీ ఇవన్నీ మనిషి వ్యక్తిగత స్వేచ్ఛకి, జీవించే హక్కుకి ప్రమాదకరమని వీటిని వెంటనే నిలిపివేయాలంటూ నిరసనలు వస్తూనే ఉన్నాయి. అంతే కాకుండా వీటికి ప్రత్యామ్నాయ ఇంటర్‌నెట్ వ్యవస్థని రూపొందించడంలో సాఫ్ట్‌వేర్ నిపుణులు నిమగ్నమై ఉన్నారు. న్యూయార్క్ యూనివర్సిటీకి చెందిన నలుగురు స్టూడెంట్స్ కేంద్రీకరించబడిన నెట్‌వర్క్ సిస్టంకి ప్రత్యామ్నాయంగా వికేంద్రీకరించబడిన సోషల్ నెట్‌వర్క్ సిస్టంని "డయాస్పోర" అనే పేరుతో రూపొందించారు.

**భారత్‌లో ఇంటెలిజెన్స్ వ్యవస్థ**

దక్షిణ ఆసియాలో పెద్దన్న పాత్ర పోషిస్తున్న భారత్ అత్యంత శక్తివంతమైన ఇంటెలిజెన్స్ వ్యవస్థను కలిగి ఉంది. అటు అమెరికా ఇంటెలిజెన్స్ సంస్థలతో సన్నిహిత సంబంధాలు నెరుపుతూ తన గూఢాచార వ్యవస్థను పటిష్టపరుచుకుంటున్నది. వేల కోట్ల ప్రజా ధనాన్ని ఉపయోగించి టెక్ ఇంటెలిజెన్స్ వ్యవస్థని అభివృద్ధి చేసుకుంటున్నది. అందుకోసం ఇస్రో (భారత అంతరిక్ష పరిశోధన సంస్థ) నేతృత్వంలో అనేక నిఘా ఉపగ్రహాలని ప్రయోగించింది. ఐ.టి రంగాన్ని ప్రోత్సహిస్తూ సైబర్ టెక్నాలజీని పటిష్టవంతం చేస్తున్నది. ఇదంతా భారత పాలకవర్గాలు ప్రజల కోసం పోరాడుతున్న విప్లవోద్యమాన్ని, తమ విస్తరణ కాంక్షకు అడ్డుగా వున్న జాతివిముక్తి పోరాటాలను, అంతేకాకుండా వెల్లువెత్తుతున్న ప్రజా ఉద్యమాలని అణిచివేయడానికి ఉపయోగిస్తున్నాయి. వీటికి సహకరిస్తున్న విస్తృత ప్రజారాసుల మీద నియంత్రణ కోసం అనేక కుట్రపూరిత పథకాలను ప్రజా సంక్షేమం పేరిట ప్రవేశపెడుతున్నారు.

దేశంలో అనేక ముఖ్య పట్టణాలలో ఇప్పుడు సర్వైలెన్స్ కెమెరాలను అమర్చి నిరంతరం స్క్రీనింగ్ చేస్తున్నారు. (హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్‌లో 6 స్క్రీన్స్ ఉన్నాయి. ఒక్కొక్కదానికి 20 యాంగిల్స్‌ని కవర్‌చేసే మానిటరింగ్ స్టేషన్ ఉంది) అంతే కాకుండా అలారం వ్యవస్థ, ఆటోమేటిక్ ఫైండింగ్ సిస్టం లాంటి అనేక వ్యవస్థలని ఏర్పాటు చేసారు. కేంద్ర పథకాల క్రింద ప్రవేశపెడుతున్న ఆధార్ కార్డ్స్ ద్వారా మరింత నియంత్రణను ఏర్పరుస్తున్నారు. ఐ.సి.టి (ఇన్‌ఫర్‌మేషన్, కమ్యూనికేషన్, టెక్నాలజి) ద్వారా అమలు చేయబడుతున్న యు.ఐ.డి (యూనిక్యు ఐడెంటిఫికేషన్ నెంబర్), ఎన్.ఐ.జి (నేషనల్ ఇంటెలిజెన్స్ గ్రిడ్), సి.సి.టి.ఎన్.ఎస్ (క్రైం అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్కింగ్ సిస్టం) ఆర్.ఎస్.బి.వై (రాష్ట్రీయ్ స్వాస్థ్ బీమా యోజన) DNA ప్రొఫైలింగ్, బ్రెయిన్ మాపింగ్, సి.ఎమ్.ఎస్ (సెంట్రల్ మానిటరింగ్ సిస్టం), టి.సి.ఐ.ఎస్ (టెలిఫోన్ కాల్ ఇంటర్ సెప్షన్ సిస్టం) లాంటి వాటి కార్యక్రమాల ద్వారా ప్రజలకు సంబంధించిన వ్యక్తిగత సమాచారాన్నంతా సేకరిస్తున్నారు. ఈ డాటాని N.S.A కూడా మానిటర్ చేస్తున్నది. మొబైల్ నెట్‌వర్క్స్ ని, ఇంటర్‌నెట్ కమ్యూనికేషన్స్‌ని ట్యాపింగ్ చేయడం కోసం జాతీయ స్థాయిలో సైబర్ ఇంటెలిజెన్స్ యూనిట్స్‌ని ఏర్పరిచారు. ఇటీవల సి.బి.ఐ డాటా బ్యాంక్ (సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్‌వెస్టిగేషన్) హాక్ అవ్వడంతో దేశీయ స్థాయిలో ప్రత్యేక ఇంటర్‌నెట్ వ్యవస్థని రూపొందిస్తున్నారు. అంతే కాకుండా ఐ.ఆర్.ఎన్.ఎస్.ఎస్ (ఇండియన్ రీజినల్ నావిగేషనల్ శాటిలైట్ సిస్టం) ని ఏర్పాటు చేసి ప్రత్యేకమైన శాటిలైట్ వ్యవస్థని అభివృద్ధి చేస్తున్నారు. ఈ విధంగా టెక్నాలజీని ప్రజల ప్రయోజనాల కోసంగాక ప్రజలపై నియంత్రణ కొరకు ఉపయోగించబడుతున్నది.

**విప్లవోద్యమానికి ఎదురయ్యే సమస్యలు.**

సామ్రాజ్యవాదులు, వాటి తైనాతీలు చేపడుతున్న టి.ఐ.పి.ఎస్ (టెక్నికల్ ఇంటెలిజెన్స్ ప్రోగ్రామ్స్) వల్ల విప్లవోద్యమానికి కూడా అనేక పరిమితులు ఏర్పడుతున్నాయి. ప్రధానంగా శతృవు తమ వ్యూహాత్మక బలహీనతలవల్ల సమాచారం కోసం టెక్నాలజి మీదనే ఆధారపడుతున్నాడు. టెక్నాలజి పట్ల ప్రాథమిక అవగాహన మనం కలిగి ఉన్నట్లైతే వాటి నుంచి ఎదురయ్యే సమస్యలకి పరిష్కారాలు కూడా కనుక్కోవచ్చు. ముందు సమస్యల గురించి, ప్రమాదాల గురించి తెలుసుకోవాల్సి ఉంది.

యుద్ధ రంగంలో మనం అనేక ప్రాంతాల్లో (పట్టణాలు, అడవులు) కార్య కలాపాలు కొనసాగిస్తాం. పెరుగుతున్న బలగాల మధ్య సమన్వయం కోసం అనేక కమ్యూనికేషన్ పరికారాలను మనం ఉపయోగిస్తున్నాం. అయితే ఇవన్నీ కూడా ఆర్.ఎ.ఎస్ (రేడియో యాక్టివ్ సిగ్నల్స్) ద్వారా పనిచేస్తాయి. కాబట్టి వాటిని పసిగట్టడం శతృవుకి పెద్ద పనేమి కాదు. మొబైల్స్, ఇంటర్‌నెట్ ద్వారా మనం చేసే సమన్వయాన్ని శతృవు స్కాన్ చేసి మన ప్రాంతాన్ని గుర్తించవచ్చు. సిగ్నల్ ఇంటెలిజెన్స్ ద్వారా మన కమ్యూనికేషన్స్‌ను శతృవు ముందుగానే పసిగట్టే అవకాశం ఉంది.

UAV, నిఘా ఉపగ్రహాలతో అటవీ ప్రాంతంలో మన కదలికలని తెలుసుకోవడం, పెద్ద ఫార్మేషన్స్‌ని గుర్తించడం లేదా ఒక నిర్దిష్ట పాకెట్‌లో బలగాలను మోహరించి చుట్టి వేత దాడులను నిర్వహించడం చేయవచ్చు.

పట్టణ ప్రాంతాల్లో ఉన్నప్పుడు ప్రధానంగా మనకి గుర్తింపు సమస్య వస్తుంది. కేంద్ర పభుత్వం తీసుకువచ్చిన ఆధార్ కార్డ్స్ విధానంతో గుర్తింపు పత్రాల్ని తయారు చేసుకోవడం కొంత కష్టతరంగా మారింది. మరో పక్క అనేక ప్రాంతాల్లో సి.సి టి.వి లు ఏర్పాటు చేసి స్కానింగ్ చేయడం వల్ల మనం ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా, నిర్లక్ష్యంగా ఉన్నా దొరికి పోయే ప్రమాదం ఉంటుంది. సి.సి.టి.ఎన్.ఎస్ ద్వారా మనకి సంబంధించిన ఏచిన్న ఆధారం వాడిదగ్గర ఉన్నా పట్టుబడే అవకాశం ఉంటుంది. ఆ విధంగా పట్టణాలల్లో ఉన్నప్పుడు మొబైల్స్ అధికంగా వినియోగిస్తే తెలియకుండానే వాడి ఉచ్చులో పడిపోవచ్చు. సమాచారం కోసం ఒకే నెట్‌వర్క్ నుంచి ఇంటర్‌నెట్‌ని వినియోగిస్తే కూడా ప్రమాదం ఉంటుంది.

**(తరువాయి భాగం 7వ పేజీలో)**

వ్యాసం

# 1991 నాటి స్థితికి చేరుతున్న కరెంటు ఖాతా లోటు (క్యాడ్)

ముందుగా కరెంటు ఖాతా లోటు అంటే ఏమిటో తెలుసుకుందాం. ఏ దేశమైనా, తాను ఎగుమతి చేసే వస్తువులు, సేవల విలువ తాను దిగుమతి చేసుకునే వస్తువుల, సేవల విలువ కన్నా తక్కువగా వున్నప్పుడు కరెంటు ఖాతా లోటు ఏర్పడుతుంది. అయితే ఇక్కడ మనం మరో విషయాన్ని కూడ తెలుసుకోవాలి. ప్రస్తుతం మన దేశంతో పాటు ప్రపంచంలోని అధిక దేశాలు వాణిజ్య లావాదేవీలలో అమెరికా డాలర్‌నే మారకపు కరెన్సీగా వుపయోగిస్తున్నాయి. వెనుకబడిన దేశాల కరెన్సీలకు అంతర్జాతీయ మార్కెట్‌లో ఆమోదం వుండదు. మన దేశ కరెన్సీ (రూపాయి)కి కూడ అంతర్జాతీయ మార్కెట్‌లో చెల్లుబాటు వుండదు. కనుక మన దేశ ప్రభుత్వంగానీ, సంస్థలుగానీ, వ్యక్తులుగాని విదేశాలతో నిర్వహించే వాణిజ్య, వివిధ రకాల లావాదేవీలకు డాలర్లు తప్పనిసరిగా అవసరమవుతాయి. ఈ డాలర్లు మన దేశంలోకి వివిధ రూపాలలో వస్తాయి. ముఖ్యంగా విదేశీ సంస్థాగత పెట్టుబడులు (ఎఫ్.ఐ.ఐ), విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్.డి.ఐ), విదేశీ వాణిజ్య రుణాలు (ఈ.సి.బి) వంటి రూపాలలో డాలర్లు మన దేశంలోకి వస్తున్నప్పటికీ వీటిని మన సొంత నిధుల కింద జమ కట్టలేము. అయితే వీటిని మన ప్రభుత్వం వివిధ లావాదేవీలకు వుపయోగిస్తూ, మనకు విదేశీ మారక ద్రవ్య నిధులకు (డాలర్లు) కొరత లేదనీ బుకాయిస్తూ వుంటుంది. వాస్తవంగా వస్తువులు, సేవల విషయంలో దిగుమతుల కన్నా ఎగుమతులు ఎక్కువగా వున్నప్పుడు మనకు విదేశీ మారక ద్రవ్యం (డాలర్లు) కొరత వుండదు. ఈ స్థితినే కరెంటు ఖాతా మిగులులో వుందని చెప్తాము. ఈ మిగులుకు విదేశాలలో వుండే ప్రవాస భారతీయులు తమ కుటుంబాలకు పంపే డాలర్లు (రెమిటెన్స్) కూడ, జమ అవుతాయి. కనుక ఈ నిధులనే మనం నికరమైన విదేశీ మారక ద్రవ్య నిధులుగా పరిగణించాలి. ప్రస్తుతం ఈ నిధుల విషయంలో మన దేశం చాల లోటును ఎదుర్కొంటున్నది. అంటే మన దేశం వస్తువులు, సేవల విషయంలో ప్రధానంగా దిగుమతులపైనే ఆధారపడ్తూ కరెంటు ఎకౌంట్ లోటును ఎదుర్కొంటున్నదన్నమాట; అయితే ఈ లోటు స్థూల దేశీయ ఉత్పత్తి (జి.డి.పి)లో 3 శాతానికి మించకూడదు. కానీ మన దేశ కరెంటు ఖాతా లోటు జి.డి.పిలో 6 శాతానికి చేరింది. నేడు దేశం ఎదుర్కొంటున్న ఇతర ఆర్థిక బలహీనతలతో పాటు ఈ కరెంటు ఖాతా లోటు కూడ కలిసి, మన దేశం ఎదుర్కొంటున్న తీవ్రమైన ద్రవ్య, ఆర్థిక సంక్షోభాన్ని ప్రతిబింబిస్తున్నాయి. ఇక కరెంటు ఖాతా లోటు పెరగటానికి గల కారణాలనూ, ఈ లోటు పెరిగితే జరగబోయే దుష్పరిణామాలను ఇప్పుడు తెలుసుకుందాం.

నేడు భారత దేశం ఆర్థిక రంగంలో కరెంటు ఖాతా లోటుతో పాటు ద్రవ్య లోటు పెరుగుదల, వృద్ధి రేటు తగ్గుదల, ద్రవ్యోల్బణం రెండు అంకెలను చేరటం, రూపాయి మారకపు విలువ వేగంగా పడిపోవటం వంటి తీవ్రమైన బలహీనతలను ఎదుర్కొంటున్నది. ఈ బలహీనతలన్నీ పైన చెప్పుకొన్నట్లు భారత దేశపు ద్రవ్య, ఆర్థిక రంగాలలోని తీవ్రమైన సంక్షోభాన్ని తెలియ చేస్తున్నాయి. 2008లో అమెరికాలో గృహ రుణాల సంక్షోభం రూపంలో సామ్రాజ్యవాద ద్రవ్య, ఆర్థిక సంక్షోభం బద్దలైనప్పుడు మన్‌మోహన్ సింగ్ 'మన దేశ ఆర్థిక పునాదులు (ఫండమెంటల్స్) బలమైనవని ప్రకటిస్తూ, మన దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రపంచ ద్రవ్య, ఆర్థిక సంక్షోభపు ప్రభావమేమి వుండదని 'మేకపోతు గాంభీర్యాన్ని' ప్రదర్శించాడు. కానీ నేడు భారత దేశంలో ద్రవ్య, ఆర్థిక సంక్షోభాలు సుడులు తిరుగుతుంటే, ఈ పరిస్థితికి ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మంద గమనమే కారణమని తప్పుకోచూస్తున్నాడు.

వాస్తవంగా భారత ఆర్థిక వ్యవస్థ ఏనాడు లాభాలలో నడిచింది లేదు. ఎందుకంటే మనది స్వతంత్ర ఆర్థిక వ్యవస్థ కాదు. 1947 ఆగస్టు 15న స్వతంత్రం వచ్చిందని చెప్తున్నప్పటికీ, ప్రజలకిక్కడ స్వతంత్రం రాలేదు. ఆనాడు అనివార్యంగా భారత దేశాన్ని వదిలి వెళ్ళిన బ్రిటీష్ సామ్రాజ్యవాదులు దేశంలో తమకు విధేయులైన దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వర్గాల చేతిలో అధికారం పెట్టి తమ దోపిడీ, పరోక్ష పాలన కొనసాగేలా ఏర్పాట్లు చేసుకొన్నారు. ఆ తరువాత అనేక సామ్రాజ్యవాద దేశాల పరోక్ష పాలన, ఆజమాయిషి, దోపిడీలు పెరిగాయి. అయితే భారత దేశ ముఖ చిత్రం పైకి చూడటానికి మాత్రం లౌకిక, ప్రజాస్వామ్య, సామ్యవాద, సర్వస్వతంత్ర, గణరాజ్యం వంటి ముసుగులు ధరించి వుంటుంది. కానీ సారంలో బూటకమైనదైన, లాంచనప్రాయమైన స్వాతంత్ర్యం అనే సైనుబోర్డు కింద సామ్రాజ్యవాద శక్తులే వాస్తవానికి భారత ఆర్థిక వ్యవస్థనూ, రాజకీయాలనూ, సంస్కృతిని నియంత్రిస్తూ భారత పాలక వర్గాల కీలక విధానాలను నిర్ణయిస్తున్నారు. అందుకే భారత సామాజిక వ్యవస్థ నయావలస రూపంలో సామ్రాజ్యవాదుల పరోక్ష పాలన, ఆజమాయిషి, దోపిడిల కింద వున్న అర్థ వలస, అర్థ భూస్వామ్య సమాజంగా వున్నది. ఈ వాస్తవ స్థితిని దృష్టిలో పెట్టుకొన్నప్పుడు కరెంటు ఎకౌంటు ఖాతానే కాకుండా అన్ని విషయాలలోనూ భారత ఆర్థిక వ్యవస్థ సామ్రాజ్యవాద రథ చక్రాలకు బందించబడి కునారిల్లడమే జరుగుతున్నది. అంటే భారత దేశ ప్రజల శ్రమ శక్తినీ, సహజవనరులనూ, సామ్రాజ్యవాదులు వారి తాబేదారులైన నిరంకుశ దళారీ బూర్జువా, భూస్వామ్య వర్గాలు బొక్కుతుంటే, ప్రజలు మాత్రం ఆర్థిక వ్యవస్థ తాలూకు లోటు భారాన్ని మరింత మరింతగా మోస్తూ అడుగంటిపోతున్నారు.

ఇక నిర్దిష్టంగా కరెంటు ఎకౌంటు ఖాతా విషయాన్ని చూద్దాము. ప్రస్తుతం మన వద్ద 27,800 కోట్ల డాలర్ల విదేశీ మారక నిల్వలు (డాలర్లు) వున్నాయని చెప్తున్నారు. ఇవి 6 మాసాల దిగుమతులకు సరిపోతాయంటున్నారు. ఇందులో కూడ కరెన్సీ రూపంలో అందుబాటులో వున్నది 25,100 కోట్ల డాలర్లు మాత్రమే. మిగిలిన వాటిలో 2,100 కోట్ల డాలర్లు బంగారం రూపంలోనూ 4,500 కోట్ల డాలర్లు ఎస్.డి.ఆర్ రూపంలోనూ వున్నాయి. ఇవి లిక్విడిటి (వ్యవస్థలో నగదు సరఫరాకి)కి అవకాశం లేని నిల్వలు. ఇక మన వద్ద వున్న 25,100 కోట్ల డాలర్లలో 13,774 కోట్ల డాలర్లు ఎఫ్.ఐ.ఐ (విదేశీ సంస్థాగత పెట్టుబడులు) నిధులు. వీటిపై ప్రభుత్వానికి ఎటువంటి నియంత్రణ వుండదు. వీటిని ఎప్పుడంటే అప్పుడు బహుళ జాతి సంస్థలు వుపసంహరించుకోవచ్చు. వీటినే

హాట్‌మని అంటారు. ఈ మధ్య 1,050 కోట్ల డాలర్లు వువనంహారించినందుకే రూపాయి విలువ బిళ్ళబీటున పడిపోయింది. కనుక ఈ అస్థిర నిధులను కూడ పక్కన బెడితే నికరంగా మన వద్ద వున్న విదేశీ మారక ద్రవ్యం 11,400 కోట్ల డాలర్లు. ఇవి రెండు నుండి 3 నెలల నిల్వలకు సరిపోతాయి. ఇందులో కూడ స్వల్పకాల రుణాలకూ, వడ్డీలకు తీసివేస్తే వినియోగానికి మిగిలేది మళ్ళా 3 వందల కోట్ల డాలర్లకు మించదు. అంటే 91 నాటి చెల్లింపులు సంక్షోభానికి దేశం చేరుతున్నదన్నమాట. 1991లో మన దేశం తీవ్రమైన చెల్లింపుల సంక్షోభాన్ని ఎదుర్కొంది. అంటే మన దేశ వాణిజ్యంలో తీవ్రమైన లోటు ఏర్పడి, విదేశీ మారక ద్రవ్యం అడుగంటి, స్వల్పకాలిక రుణాలను సైతం తీర్చలేని దుస్థితికి నెట్టబడింది. ఇటువంటి పరిస్థితి ఏర్పడినప్పుడు అంతర్జాతీయ రేటింగు సంస్థలు (మూడీస్, స్టాండర్డ్ & పూర్ వంటి....) మన దేశం పరపతి కోల్పోయిందని ప్రకటిస్తాయి. అప్పుడు మనకు ప్రపంచంలో అప్పు ఇచ్చేవారే వుండరు. కానీ 1991లో భారత ప్రభుత్వం తన వద్దవున్న బంగారాన్ని ఐ.ఎమ్.ఎఫ్ బ్యాంకులో తాకట్టు పెట్టి వేల కోట్లు డాలర్లు అప్పుగా తెచ్చుకొని, ఆనాటికి ఏర్పడ్డ తక్షణ ప్రమాదం నుండి గట్టెక్కింది. కానీ ఐ.ఎమ్.ఎఫ్, ప్రపంచ బ్యాంకులు ఆనాడు పెట్టిన విషమ షరతులకు భారత ప్రభుత్వం కట్టుబడి, భారత ఆర్థిక వ్యవస్థను మరింతగా సామ్రాజ్యవాద విషపు కోరల్లోకి ఇరికించింది. పైన చెప్పినట్లుగా నేడు మనం 1991 నాటి చెల్లింపులు సంక్షోభానికి చేరుతున్నామనేది వాస్తవం. ఇదే విషయంపై ఆర్థికవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తుంటే "రోమ్‌నగరం తగలబడి పోతుంటే నింపాదిగా ఫిడేలు వాయిస్తూ కూర్చున్న నీరో చక్రవర్తిలా" మన ప్రధాని మన్‌మోహన్ సింగ్ అటువంటి పరిస్థితి ఏమిలేదని బుకాయిస్తున్నాడు. పైగా 1991లో 15 రోజులకు సరిపడేంత (300 కోట్ల డాలర్లు) విదేశీ మారక ద్రవ్యం వుంటే, నేడు 6 నెలలకు సరిపడేంత విదేశీమారక ద్రవ్యం వుందని జబ్బలు చరుస్తున్నాడు. వాస్తవంగా 6 నెలలకు సరిపడేంత విదేశీ మారక ద్రవ్యం మన దగ్గర వున్నదా? వుంటే దాని బండారమేమిటీ అనే విషయాన్ని మనం పైన చూసాము. ఇప్పటికే అంతర్జాతీయ రేటింగు సంస్థ స్టాండర్డ్ & అండ్ పూర్ మన ఆర్థిక వ్యవస్థను 'బిబిబి' మైనస్‌గా ప్రకటించింది. అంటే రేటింగు ప్రతికూలంగా వుందని తెలియచేసింది. అంతేకాకుండా జంక్ (పనికిమాలిన చెత్త) స్థాయికి దిగజారే ప్రమాదం సమీప భవిష్యత్తులోనే వుందని హెచ్చరించింది. అంటే భారత దేశ ఆర్థిక వ్యవస్థ మరింతగా పరపతి కోల్పోతున్నట్లు ఈ రేటింగులు తెలియ చేస్తున్నాయి.

అయితే మనం ఇక్కడ దృష్టిలో పెట్టుకోవలసిన విషయమేమిటంటే మనది పరాధీన (సామ్రాజ్యవాదులపై ఆధారపడిన) ఆర్థిక వ్యవస్థ కనుక, అది నిరంతరం లూటి చేయబడుతూ, నష్టాలు, లోటులతోనే నడుస్తూ వుంటుంది. ఈ నష్టాలు, లోటుల భారాన్నంతా ప్రజలు భరిస్తూ వుంటారు. దేశంలో నయా వుదారీకరణ విధానాలు (1991 తరువాత) ప్రవేశించిన తరువాత ఈ క్రమం మరింత వేగవంతమైంది. దోపిడీ వర్గాలు మరింత ధనికులవుతుంటే పీడిత ప్రజలు మరింత దరిద్రంలోకి నెట్టబడుతున్నారు. ఈ మధ్యనే నోబుల్ బహుమతి గ్రహీత అమర్త్యసేన్, 200 దేశాల మానవాభివృద్ధి సూచికలో భారత్ కింది నుంచి మూడో దేశంగా వుందని ప్రకటించాడు. ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగంలో కొనసాగుతున్న పలు సంక్షోభాలన్నీ దేశంలో విప్లవ పరిస్థితిని తీవ్రతరం చేస్తున్నాయి. ఈ అనుకూల పరిస్థితిని వినియోగించుకొని ప్రజలను నూతన ప్రజాస్వామిక విప్లవ రాజకీయాలతో సంఘటితపరుస్తూ, ప్రజా యుద్ధంలోకి సమీకరించడమే నేడు మన ముందున్న ప్రధాన కర్తవ్యం.

## భారత దేశ ఆర్థిక స్థితిగతులకు సంబంధించి. సమాచారం

**రూపాయి** **ఆగస్టు 2013**

**విదేశీ కరెన్సీలతో మారకం విలువ**

| | | |
|---|---|---|
| 1. బ్రిటీష్ పౌండ్ | - | 100.52 |
| 2. యూరో | - | 84.66 |
| 3. స్విస్ ఫ్రాంక్ | - | 69.07 |
| 4. అమెరికా డాలర్ | - | 63.25 |
| 5. ఆస్ట్రేలియా డాలర్ | - | 57.34 |
| 6. న్యూజిలాండ్ డాలర్ | - | 50.46 |
| 7. సింగపూర్ డాలర్ | - | 49.66 |

**జి.డి.పి పెరుగుదల**

| సంవత్సరం | | | | శాతం |
|---|---|---|---|---|
| 2006 | - | 2007 | - | 9.6 |
| 2007 | - | 2008 | - | 9.3 |
| 2008 | - | 2009 | - | 6.7 |
| 2009 | - | 2010 | - | 8.4 |
| 2010 | - | 2011 | - | 8.4 |
| 2011 | - | 2012 | - | 6.5 |
| 2012 | - | 2013 | - | 5.5 |

❍

**(18వ పేజి తరువాయి)**

అవసరమైనంతగా అర్థం చేసుకోవడానికీ, అది మరింత సంతృప్తికరంగా చెయ్యడానికీ మరిన్ని చర్చలు చెయ్యాలి. ఇప్పుడు పార్టీ, ప్రజలూ మనకు ఈ కర్తవ్యం ఇచ్చారు కనుక, మనం ఈ బాధ్యతను వీడరాదు. అలా చేస్తే మనమే పార్టీ నిర్మాణాన్నీ క్రమశిక్షణనూ వుల్లంఘించిన వాళ్లమవుతాం. అవసరమూ, సాధ్యమూ అయిన చోట మనం క్రమశిక్షణా తనిఖీ సంస్థలను క్రమేపీ విస్తరిస్తాం. మరింత మంది సిబ్బందిని నియమించుకుంటాం. తాత్కాలిక ఇబ్బందుల దృష్ట్యా తమ కృషిని సడలించడం కాకుండా, క్రమశిక్షణ తనిఖీలో వున్న అందరు కామ్రేడ్స్ ధైర్యంగా, చెక్కుచెదరకుండా పురోగమించాలనీ, తమ మార్గంలో ఎటువంటి ఇబ్బందులు ఎదురయినా అధిగమించి, చక్కగా పనిచేస్తారనీ ఆశిస్తాను. తద్వారా వాళ్లు పార్టీ, ప్రజలూ వారికి అందించిన గొప్ప కర్తవ్యాన్ని నెరవేర్చగలుగుతారు.

❍

సిద్ధాంత వ్యాసం

# పార్టీలో క్రమశిక్షణ తనిఖీని పటిష్టం చేయండి.

కామ్రేడ్స్, **1950 మే 6** **- ఘూటే**

'కేంద్ర, ఇతర స్థాయిలలో పార్టీలో క్రమశిక్షణను తనిఖీ చేయ్యడానికి కమీషన్లు ఏర్పాటు చెయ్యడంపై నిర్ణయం గురించి కేంద్రకమిటి గత నవంబరులో ప్రకటించిన నాటి నుంచి అటువంటి సంస్థలను వివిధ ప్రాంతాలలోనూ వివిధ సైనిక యూనిట్లలోనూ ఏర్పాటు చేసాం. అవి పని చేయనారంభించాయి. కేంద్ర పార్టీలో, ప్రభుత్వంలో, సైన్యంలో, ప్రజా సంఘాలూ వాటి కింది యూనిట్లలో కూడా పార్టీ క్రమశిక్షణను తనిఖీ చేయడానికి కమీషన్లు ఏర్పర్చాం. అవి కూడా తమ కార్యక్రమాలు ప్రారంభించాయి. వాటి పనిని మెరుగుపర్చడం కోసం, ఇవాళ ఈ అన్ని కమీషన్ల సంయుక్త సమావేశం నిర్వహిస్తున్నాం. ఈ సందర్భంగా కొన్ని విషయాలను చర్చించాలనుకుంటున్నాను.

### 1) క్రమశిక్షణ, క్రమశిక్షణ తనిఖీల ప్రాధాన్యత గురించి:

మన పార్టీకి 28 సంవత్సరాల చరిత్ర వున్నది. పార్టీలో ఉక్కు క్రమశిక్షణ పాటించడం అవసరమని మన అనుభవం స్పష్టం చేసింది. ఈ 28 సంవత్సరాల కాలంలో మనం కామ్రేడ్ మావో మార్గదర్శకత్వంలో కొన్ని తీవ్ర తప్పులు సరిదిద్దుకున్నామని ప్రతి ఒక్కరికీ తెలుసు. దీని ఫలితంగా వివిధ రకాల కష్టాలను అధిగమించి, పార్టీకి చెందిన సరైన పంథాను, తీర్మాణాలను సజావుగా అమలు చేశాం. చైనా విప్లవం పొందిన చరిత్రాత్మక విజయాన్ని ఇప్పుడు కళ్ళారా చూస్తున్నాం. పార్టీ క్రమశిక్షణ, దానికి ఖచ్చితమైన అమలూ లేకపోతే మన పార్టీ ఒక ఇసుక దిబ్బలా వుండి వుండేది. లక్షలాది ప్రజలను పోరాటంలోకి కదిలించగలిగేవాళ్ళం కాదు. లెనిన్ ఇలా అన్నాడు: 'బూర్జువా వర్గం మీద విజయం సాధించడానికి సంపూర్ణ కేంద్రీకరణ, ఖచ్చితమైన శ్రామిక వర్గ క్రమశిక్షణ వుండడం ఒక మౌళిక షరతు'. కా.మావో ఇలా అన్నాడు 'పంథాను అమలు చేయడానికి క్రమశిక్షణ హామీ ఇస్తుంది'. ఇది దీర్ఘకాలిక విప్లవ పోరాటం నుండి చేసిన తిరుగులేని నిర్ధారణలు. పార్టీ లోపల మొత్తం మీద చూసుకున్నప్పుడు పార్టీ పంథా, విధానాలు మొదలైన ప్రధాన అంశాలు గురించి ఎవ్వరికీ ఎటువంటి సందేహాలు లేవు. ఎందుకంటే ఇప్పుడు మనకు కా.మావో వున్నాడు. కేంద్ర కమిటి సరైన నాయకత్వం వున్నది. పార్టీ పంథానూ, విధానాలను సజావుగా అమలు చేయడం ఎలా, తెలిసో తెలియకో వీటికి భిన్నంగా చేసే చర్యలు, ధోరణులను ముందుగానే సరిదిద్దడం ఎలా అన్నది మన ముందున్న ప్రశ్న. కాబట్టి పార్టీ కేంద్రీకరణ, ఐక్యత ప్రయోజనాల రీత్యా ఉక్కు క్రమశిక్షణను అమలు చేసి, పార్టీలో క్రమశిక్షణ స్పృహను బలోపేతం చేయడం అవసరం.

నిర్ణయాత్మక విజయం సాధించడంలో చైనా ప్రజలకు నాయకత్వం వహించినందుకు ప్రజల ప్రజాస్వామిక నియంతృత్వ రాజ్యాన్ని ఏర్పాటు చేసినందుకు అటువంటి రాజ్యాధికారాన్ని అమలు చేయడంలో నాయకత్వం వహించే పార్టీ అయినందుకు పార్టీయేతర ప్రజలు పార్టీని ఎంతో గౌరవిస్తారు. పార్టీకి, పార్టీయేతర ప్రజలకు మధ్య సహకారానికి అవకాశం పెరుగుతున్నది. మరిన్ని అంశాలు ఇందులో వచ్చి చేరుతున్నాయి. దీని ద్వారా మన పార్టీ చెప్పేది, చేసేది దేశ వ్యాప్తంగా ప్రజల మీద గొప్ప ప్రభావం వేస్తుంది. మన పార్టీ సభ్యుల్లో ఒక గ్రూపు కానీ, కొద్ది మంది కానీ తమ మాటలలోనూ, చేతలలోనూ తప్పుగా వ్యవహరిస్తే పార్టీలో పోరాట సామర్థ్యాన్ని బలహీనపరుస్తుంది. ప్రజలలో దాని ప్రతిష్టను తగ్గిస్తుంది. అందుకని ఇప్పుడు పార్టీలో ఉక్కు క్రమశిక్షణను పాటించడం, క్రమశిక్షణా స్పృహను పటిష్టం చేయడం ప్రత్యేకించి ముఖ్యం.

క్రమశిక్షణను తనిఖీ చేసే బాధ్యతలలో వున్న వాళ్ళు పార్టీ నిర్మాణాలలో, పార్టీ సభ్యులలో, పార్టీ పంథా, విధానాలు, రాజ్యాంగం, క్రమశిక్షణ, నిర్ణయాలకు వ్యతిరేకంగా నిరంకుశత్వం వంటి చర్యలు గానీ, ధోరణులు గానీ వున్నాయేమో గమనించాలి. అలాగే రాజ్య చట్టాలు, డిక్రీలకు వ్యతిరేకంగానూ పార్టీ నుంచీ విడివడి ప్రజల ప్రయోజనాలను ప్రమాదంలోకి నెట్టే పనులు జరుగుతున్నాయేమో కూడా చూసుకోవాలి. ఈ చెడు విషయాలను నివారించడానికి జరగకుండా చూడడానికి మనం చేయగలిగినదంతా చేయాలి. ఇలా చేస్తే పార్టీ పంథా, విధానాలు, నిర్ణయాలను అమలు చేయడంలో పార్టీ కమిటీలకు ఒక సమర్థవంతమైన సహాయకుల పాత్ర వహించగలుగుతాం. అందుకని సంబంధిత కామ్రేడ్లందరూ క్రమశిక్షణ తనిఖీలో వున్న ప్రాధాన్యతను అర్థం చేసుకుని పార్టీ తమకు అప్పజెప్పిన మహత్తర కర్తవ్యాన్ని నెరవేర్చడానికి కృషి చేయాలి.

### 2) పార్టీ క్యాడరు పార్టీవిధానాలు, క్రమశిక్షణలను ఉల్లంఘించడం గురించి:

ఏడవ కేంద్ర కమిటీ రెండవ ప్లీనరీ సమావేశం నాటి నుంచీ, పార్టీ విప్లవ లక్ష్యం వేగంగా, విస్తృతంగా అభివృద్ధి చెందింది. గడిచిన సంవత్సర కాలంలో మనం నిర్ణయాత్మక విజయం పొందాం. టిబెట్, తైవాన్ మినహా దేశమంతటినీ విముక్తి చేశాము. పార్టీ సభ్యత్వం 30 లక్షలు నుంచీ 45 లక్షలకు పైగా పెరిగింది. సాధారణంగా మాట్లాడాలంటే, మన పార్టీ క్యాడర్ కష్టపడి పని చేస్తారు. కేంద్ర కమిటీ సరైన విధానాల గైడెన్సులో వారు ఎంతో సాధించారు. ప్రస్తుత మన విజయాలకు ఇది ఒక్కటే సరైన వివరణ. కానీ, అటువంటి విధానాలు ఇతర కర్తవ్యాలు అమలు చేయడంలో మన పార్టీ క్యాడర్‌లో చాలా మంది పార్టీ విధానాలను, క్రమశిక్షణలను వుల్లంఘించారు. ఇది మన పార్టీలోనూ, ప్రజలలోనూ అసంతృప్తి రేపింది. దీనికి స్వస్తి పలకకపోతే, మనం ప్రజల నుంచీ తీవ్రంగా దూరమౌతాం. పార్టీ విధానాలను, క్రమశిక్షణను భంగం చేసిన తీరు ఇంకా ఈ విధంగా వుంది.

మొట్ట మొదటిది, తీవ్రమైన ఒత్తిడి చేయడం, అధికారతత్వం, ఫలితంగా ప్రజల నుంచీ దూరం కావడం. ధాన్యం, ఇతర పన్నులు వసూలు చెయ్యడం, ప్రభుత్వ బాండులు కొనేటట్లు చేయడం, అద్దె తగ్గించడం, వ్యవసాయ సంస్కరణలను అమలు చేయడం మొదలైన విషయాలలో కొద్ది మంది పార్టీ క్యాడరు ముఖ్యంగా కింది స్థాయి వాళ్ళు ప్రజలను నిర్బంధించడం, కొట్టడం,

అరెస్టు చెయ్యడం లేదా అలా చెయ్యమని దుష్ట శక్తులను ప్రోత్సహించడం చేశారు. అనుకున్న కర్తవ్యాలను పూర్తి చెయ్యడం అన్నదే వాళ్ళు ఆలోచించారు గానీ, వారి చర్యల పరిణామాల గురించి ఆలోచించలేదు. ఇది ఒక సాధారణ విషయంగా మారింది. విప్లవ యుద్ధాన్ని చివరికంటా కొనసాగించడం కోసం ధరలను ఆర్థికాన్ని స్థిరీకరించడానికి రాజ్యం ఇప్పటికే ప్రజల మీద ధాన్యమూ ఇతర పన్నులు, ప్రభుత్వ బాండులకు చందాల రూపంలో భారీ బరువు మోపిందని ఈ కామ్రేడ్లు అర్థం చేసుకోవడం లేదు. మనం గట్టిగా ప్రచారం నిర్వహించి ఈ విషయాలను ప్రజలకు వివరించాలి. మన పని సజావుగా చేసుకొని మన కర్తవ్యాలను నెరవేర్చడానికి మంచి పని పద్ధతులను రూపొందించుకోవాలి. లేకపోతే ప్రజలు ఫిర్యాదు చేస్తారు. మనల్ని వ్యతిరేకిస్తారు కూడా. ప్రజలతో సన్నిహిత సంబంధాలలో వుండాలనీ, వారి మీద ఆధారపడాలనీ, ప్రజలకు విషయాలను స్పష్టంగా వివరించాలనీ, సమస్యలు పరిష్కరించడంలో వారిని సంప్రదించాలనీ మన పార్టీ పదే పదే కోరుతున్నా విషయాన్ని సంబంధిత కామ్రేడ్స్ గుర్తించడం లేదు. వినమ్రంగా తెలివిగా వుండమనీ, అహంకారం, తొందరపాటుతనం రాకుండా చూడటం అవసరమని కా.మావో మనకి పదే పదే సలహా ఇచ్చాడు. పార్టీయేతర ప్రజలతో ఐక్యం కావాలనీ, సహకరించాలనీ, ప్రజలకు అతీతంగా కాకుండా ప్రజలతో మమేకం కమ్మనీ చెప్పాడు. అయితే నేను ప్రస్తావించిన కామ్రేడ్స్ తమను తాము గొప్పగా భావిస్తారు. అతి సులభమైన పని పద్ధతులకు ఒత్తిడి చేసే పద్ధతికి అధికార తత్వానికి అలవాటు పడ్డారు. పార్టీ ఆదేశాలను వీరు పట్టించుకోరు. వాటిని జాగ్రత్తగా అధ్యయనం చేయరు. తాము సరిగానే చేస్తున్నామని భావిస్తూ, చిత్తం వచ్చినట్టు చేస్తారు. పార్టీ విధానాలనూ, క్రమశిక్షణనూ పదే పదే వుల్లంఘించడం వల్ల పార్టీకి తీవ్ర రాజకీయ నష్టం కలగజేస్తుందనే విషయం ఇది తెలియజేస్తుంది.

ఇక పెరుగుతున్న నిరంకుశ పని విధానం రెండో అంశం. పార్టీ క్యాడర్లో కొందరు రాజ్య వ్యవహారాలకూ, ప్రజల సంక్షేమానికి శ్రద్ధ పెట్టరు. ప్రపంచాన్ని తెలుసుకోవడం, మార్చడం పార్టీ సభ్యుల నిరంతర, ముఖ్య కర్తవ్యమని వాళ్ళు అర్థం చేసుకోరు. ఈ కామ్రేడ్స్ చురుకుగా పని చేయరు. ఏదోలా గడిపేస్తారు. దీని ఫలితంగా వాళ్ళు పార్టీ సభ్యులుగా మంచి లక్షణాలను క్రమేపీ కోల్పోయారు. ప్రకృతి వినాశనాల వల్ల దెబ్బతిన్న ప్రాంతాలలో వుత్పత్తి పెంచేందుకు సహాయం చెయ్యడం అన్న వుదాహరణ తీసుకోండి. అనేక మంది పార్టీ క్యాడర్ ఈ సమస్యను నిర్లక్ష్యం చేసారు. దీని ప్రభావం లక్షలాది ప్రజల సంక్షేమం మీద వుంది. పై స్థాయి వాళ్ళకి వాస్తవ పరిస్థితులను నివేదించడంలోనూ సంబంధిత పనిని నిర్వహించడంలోనూ తీవ్ర లోపాలు వున్నాయి. ఇది ప్రజలలో వేదననూ పార్టీకి, రాజ్యానికి నష్టాలనూ పెంచుతుంది. ఈ సమస్యల పట్ల మన పాత క్యాడరు ముందుగానే శ్రద్ధ పెట్టి వుంటే మరింత ఖచ్చితమైన నివేదికలు ఇచ్చి, మరిన్ని ఆచరణాత్మక ఏర్పాట్లు చేసి వుంటే మనం వుత్పత్తిని పెంపొందించి, పునరావాస పనిని మరింత బాగా చేసి వుండే వాళ్ళం. తద్వారా ప్రజల వేదనని, నష్టాన్ని తగ్గించడమో ఒక మేరకు నివారించడమో చేయగలిగి వుండేవాళ్ళం. ఇటువంటి నిరంకుశత్వం పట్ల మనమెంతో శ్రద్ధ వహించాలి.

అలాగే మన పార్టీ క్యాడరు కొందరు విప్లవ కృషి పట్లా రాజ్య సంపదలు పట్ల నిర్లక్ష్యంగా బాధ్యతరహితంగా వుంటారు. దీని వల్ల తీవ్ర పరిణామాలు వుంటాయి. వుదాహరణకు రైల్వేలలో, గనులలో వరుసగా ప్రమాదాలు జరిగాయి. మరణాలు సంభవించాయి. ఫ్యాక్టరీ పరికరాలు, వస్తువులు శిథిలమయ్యాయి. లేదా నాశనం అయ్యాయి. అనేక గిడ్డంగులు ధ్వంసమయ్యాయి. అందులో వస్తువులు కొన్ని శిథిలమయ్యాయి, కొన్ని పాడయిపోయాయి. ఇటువంటి సందర్భాలలో జరిగిన నష్టాలు దిగ్భ్రమ కలిగించే విధంగా వున్నాయి. ఇక వృధా వల్ల జరిగిన నష్టాలను కూడా లెక్కగడితే మన నష్టాలు ఇంకా మరెన్ని వుంటాయో ఎవరైనా వూహించవచ్చు. మన పార్టీ ప్రస్తుతం ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బంది రీత్యా, పార్టీ క్యాడర్ కొందరు ఇటువంటి నిరంకుశ పని విధానాన్ని కలిగి వుండడమూ, విప్లవ కృషి పట్లా రాజ్య సంపద పట్లా నిర్లక్ష్య, బాధ్యాతారహిత వైఖరి తీసుకోవడాన్ని, పార్టీ పట్లా రాజ్యం పట్లా ప్రజల పట్లా నేరంగా పరిగణించాలి. ఈ కామ్రేడ్స్ తమ తప్పులను నిజాయితీగా సరిదిద్దుకోకపోతే, పార్టీ, రాజ్యం, ప్రజలు వాళ్ళను క్షమించరు. ఈ కామ్రేడ్స్ తమ తప్పుడు ఆలోచననూ, చర్యలనూ, పని విధానాన్నీ సరిదిద్దుకోవడానికి గట్టిగా సహాయం చేయాలంటే, వారిలో పార్టీ నిర్మాణ స్పృహను, క్రమశిక్షణ స్పృహను పెంపొందించడంతో పాటు, వారి సైద్ధాంతిక బోధనను నిరంతరం పటిష్టం చేయాలి. క్రమబద్ధ విమర్శ, స్వయం విమర్శ చేపట్టాలి. ఇలా చేయడం ద్వారానే ప్రజలను మరింతగా సమీకరించగలుగుతాం. తద్వారా పార్టీ క్యాడరు తమ రాజకీయ చైతన్యాన్ని పెంచుకొని, తమలో నిరంకుశత్వాన్ని, ప్రజల మీద ప్రదర్శించే అధికారతత్వాన్ని అధిగమించేట్టు చేయగలుగుతాం.

మూడో అంశం, మన పార్టీ క్యాడర్లలో ప్రస్ఫుటంగా కనిపించే వెనుకబడిన ఆలోచనలు, వీరు తమను తాము అనుభవజ్ఞులుగా భావించుకుని, ప్రజలకు తమ 'ప్రతిభావంతమైన సేవలు' అందించినందుకు తమకు సత్కారం చెయ్యాలని అడుగుతారు. ప్రజలకు రాజ్యాధికారం కట్టబెట్టామనీ ప్రతిభావంతులమనీ పార్టీ, ప్రజలూ తమకు వున్నత స్థానాలు ఇవ్వాలనీ తమను ప్రత్యేకంగా చూడాలనీ డిమాండ్ చేస్తారు. పార్టీయేతర వ్యక్తులనూ, సాధారణ ప్రజలనూ తక్కువగా చూస్తారు. పార్టీ నిర్మాణాన్నీ, క్రమశిక్షణనూ, ప్రభుత్వాన్నీ, రాజ్య చట్టాలనూ ధిక్కరిస్తారు. ఈ కామ్రేడ్ల వెనుకబడిన ఆలోచనలు, చర్యలు పార్టీ సభ్యులుగా తమ లక్షణాలు కోల్పోతున్నారని తెలియజేస్తుంది.

చైనా విప్లవం మౌలిక విజయం సాధించిన మాట నిజమే. 'చైనాలో ప్రతీఘాతక పాలనను కూల్చివేసినది ఎవరు? ఈ విజయం ఎవరిదని చెప్పాలి మనం?' కామ్రేడ్స్, మీరు ఈ విషయం అడిగితే యావత్తు పార్టీ సభ్యత్వం, ప్రజలూ కలిసి ఈ ప్రతీఘాతకులను కూలదోసారని అంటాను. ఈ విజయం ముందుగా ప్రజల వల్లనూ మన పార్టీకి సంబంధించినంత వరకూ కామ్రేడ్ మావో వల్లనూ లభించిందంటాను. ప్రతీఘాతకులకు వ్యతిరేకంగా, ముప్పై సంవత్సరాలకు పైగా జరిగిన తీవ్ర పోరాటంలో లెక్కలేనంత మంది అమరులు తమ ప్రాణాలు అర్పించారు. వారి వీరత్వం, త్యాగం లేకుండా మన ప్రస్తుత విజయం వచ్చేదే కాదు. అలాగే, కామ్రేడ్ మావో సరైన నాయకత్వం, కామ్రేడ్ మావో ఆలోచనా విధానపు గైడెన్సులో మన లోపాలనూ, పొరపాట్లనూ నిరంతరం సరిదిద్దుకుని వుండకపోతే, వేగవంతమైన విస్తరణ, పార్టీ, ప్రజల విప్లవ ఆశయపు తుది విజయం సాధ్యమయ్యేది కాదు. ఏ కామ్రేడూ కూడా తాను

చేసిన కృషి చాలా అసాధారణమైనదనీ, పార్టీ, ప్రజలూ తనకు వున్నత స్థానం కల్పించి, ప్రత్యేకంగా చూడాలనీ అనడం సరైంది కాదు. కమ్యూనిస్టులమైన మనం సమాజాన్నీ, ప్రపంచాన్నీ మార్చాలన్న కర్తవ్యానికి లోబడి వున్నాం. మీరు చాలా మంచిగా పని చేసినా గొప్పగా దోహదం చేసినా అది మీరు చెయ్యవలసిన దానికంటే ఎక్కువైతే కాదు. దాని గురించి అంతగా గర్వ పడవలసినది ఏముంది? కమ్యూనిస్టులమయిన మనం విశాలంగా ఆలోచించాలి. ఇతరుల నుంచీ కాకుండా మన నుంచే ఖచ్చితమైన కృషి జరిగేటట్టు చూడాలి. విజయాలు ప్రధానంగా ప్రజల వల్లనే వచ్చాయని భావించాలి. ఏ తప్పులకయినా మనమే బాధ్యత వహించగలగాలి. పాత నానుడి అన్నట్టు, 'మనం ఘనతనంతా ఇతరులకు ఇవ్వాలి. తప్పంతా మన మీద వేసుకోవాలి. గతంలో మనం ఇలాగే ప్రవర్తించాం. ఇప్పుడు కూడా ఇలాగే వుందాం. తమకు చెందని ఘనతను ఆశిస్తున్న ఈ కామ్రేడ్స్ తమ స్థానం కోసమూ, భౌతిక ప్రయోజానాల గురించీ బాధపడకుండా, తమ శక్తిని విప్లవ కృషి మీద కేంద్రీకరిస్తారనీ మరింత వినయంగా, నిజాయితీగా వుండడం నేర్చుకుంటారనీ ఆశిస్తాను. లేకపోతే పార్టీ, ప్రజలు మిమ్మల్ని విడిచిపెడతారు. మీరు విప్లవ శక్తుల కంటే వెనుకబడిపోతారు. ఇతర కామ్రేడ్స్‌తో సమానంగా పురోగమించలేరు.

పార్టీయేతర వ్యక్తులనూ, ఇతరులనూ తక్కువ చూపు చూడడం మరొక తీవ్రమైన, వెనకబడిన ఆలోచనా విధానం. ఈ కామ్రేడ్స్ పార్టీయేతర వ్యక్తులకు విశాల ప్రజలలో ఎంతటి ప్రభావం వుండగలదో అర్థం చేసుకోలేరు. చరిత్ర నిర్మాణంలో ప్రజలు... ప్రజలు మాత్రమే వీరులన్న విషయం అర్థం చేసుకోరు. కొద్ది మంది కృషితోనే రాజ్యాధికారం లభించదు. ప్రజల నుంచీ వేరుపడ్డ వ్యక్తులు తమంతట తామే ప్రతీఘాతక పాలనను కూల్చలేరు. మీరు వున్నతులనీ, ప్రజల కృషి లేకుండా ప్రతీఘాతుక పాలనను కూలదోసే అసాధారణ సామర్థ్యం వున్న వాళ్లమనీ భావిస్తే ఒకసారి ప్రయత్నించి ఏం జరుగుతుందో చూడండి. ప్రజలు మిమ్మల్ని నిరాకరిస్తారు. అందుకనే, మనం పార్టీయేతర వ్యక్తులతో ఐక్యం కావడానికి చెయ్యగలిగినంతా చెయ్యాలి. ప్రజలతో సన్నిహిత సంబంధంలో వుంటూ, వారి మీద ఆధారపడుతూ, వారిలో విశ్వాసం వుంచాలి. అలా అయితేనే మనం మన పని నెరవేర్చగలం, మన దేశాన్ని మంచిగా నిర్మించగలం. మరే ఇతర పద్ధతీ మనల్ని ముందుకు వెళ్లనివ్వదు. పైగా మనం పొరపాట్లు చేసి పార్టీకీ, రాజ్యానికి మరిన్ని తీవ్ర నష్టాలను తెచ్చినవాళ్లమవుతాం.

పార్టీ నిర్మాణాన్నీ క్రమశిక్షణనూ గానీ, ప్రభుత్వాన్నీ చట్టాన్నీ గానీ ద్వేషించడం తప్పు. మీరు చెప్పవలసినది ఏమన్నా వుంటే అది పార్టీ నిర్మాణంతో చెప్పండి. మీ ప్రతిపాదనలు సరైనవయితే వాటిని ఆమోదిస్తుంది. కొందరు కామ్రేడ్స్ పార్టీ నిర్మాణం మీద నమ్మకం వుంచరు. 'ఫలానా వాళ్లు మంచిగా లేరు', 'ఫలానా విషయంతో నాకు ఏమీ సంబంధం లేదు' అంటూంటారు. వాళ్ల దృష్టిలో వ్యక్తికీ పార్టీ నిర్మాణానికీ తేడా లేదు. కొంత మంది క్రమశిక్షణగా వుండవలసిన ప్రాధాన్యతను అర్థం చేసుకోరు. అది పార్టీ సాధారణ సభ్యులు పాటించవలసినదనీ, తాము ఇందుకు మినహాయింపు అనీ అనుకుంటారు. ప్రభుత్వాన్నీ, చట్టాన్నీ తక్కువగా చూస్తారు. వాళ్లు ప్రభుత్వాన్ని గుర్తించరు. తమ వ్యవహారాలలో జోక్యం చేసుకోరాదనీ, తాము అనుభవజ్ఞులైన పార్టీ సభ్యులనీ భావిస్తారు. రాజ్య చట్టాలు సాధారణ ప్రజలకే తప్ప తమకు వర్తించవనుకుంటారు. ఇటువంటి భావాలన్నీ దోపిడీ వర్గాల ఆలోచనలూ, ప్రవర్తనలకు వ్యక్తీకరణలు, కమ్యూనిస్టులమైన మనకు ఇది సిగ్గుచేటు. పార్టీలో మంచి సభ్యులుగా వుండాలంటే, నిర్మాణానికి లోబడి వుండాలి. క్రమశిక్షణ పాటించాలి. ప్రభుత్వాన్ని గౌరవించాలి. ప్రేమించాలి. రాజ్య చట్టాలకు, డిక్రీలకూ లోబడి వుండాలి.

ఒక్క మాటలో చెప్పాలంటే, తమ్ము తాము అనుభవజ్ఞులుగా భావించుకునే కామ్రేడ్స్‌ను పదే పదే హెచ్చరించడం, వాళ్లు తప్పుడు మార్గం నుంచీ వెనక్కి రావడానికి సహాయం చెయ్యడం కోసమే. తద్వారా వాళ్లు విప్లవం నుంచీ విడివడకుండా, మనతో కలిసి మరింత ఆదర్శవంతమైన, వున్నత స్థాయి సమాజం దిశగా పురోగమించగలుగుతారు.

నాలుగో అంశం, పెరిగిన లంచగొండితనం, బీజింగ్ మునిసిపల్ పార్టీ కమిటీ నుంచీ అందిన ఒక నివేదిక ప్రకారం గడిచిన సంవత్సర కాలంలో 182 మంది పార్టీ క్యాడర్ పార్టీ విధానాలనూ, రాజ్య చట్టాలనూ వుల్లంఘించారు. 1948 జనవరి, 1949 జనవరి మధ్య కాలంలో షాండాంగ్ ప్రాంతం జినాన్ నగరంలో, 58 మంది పార్టీ క్యాడర్‌ను పార్టీ క్రమశిక్షణ వుల్లఘించినందుకు శిక్షించారు. వీరిలో మూడు వంతుల మంది మితవాద పెడధోరణి తప్పులకూ, సుఖాలు కోరుకోవడానికీ లంచగొండితనాలకూ పాల్పడ్డారు. ఈ రెండు నగరాలలోనూ జరిగిన దానిని పరిశీలిస్తే, మనకు ఒక విషయం అర్థమవుతుంది. పెద్ద నగరాలలోకి ప్రవేశించే సరికి మన పార్టీ సభ్యులు అనేక మంది సుఖమయ జీవితం కోరుకున్నారు. ఇది లంచగొండితనానికి దారి తీసింది. మన నిఘా చాలా ఎక్కువగా వుండాలని ఇది తెలియజేస్తున్నది. ఈ ధోరణిని ఆపడం కోసమూ లంచగొండి శక్తులను శిక్షించడానికీ నిబంధనలు రూపొందించమని ప్రభుత్వానికి ప్రతిపాదిద్దాం. నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డ వాళ్లు తప్పించుకోకుండా తగిన శిక్ష పడేలా చూడడం మన లక్ష్యం.

పార్టీ క్యాడర్ విధానాలను, క్రమశిక్షణనూ వుల్లంఘించడానికి సంబంధించిన ముఖ్యమైన పరిస్థితి ఇదే.

ఇప్పుడు విధానాలనూ క్రమశిక్షణనూ వుల్లంఘించడం ఎందుకు ఎక్కువగా జరుగుతున్నాయి? ఎందుకని ఇవాళ ఈ సమస్య ప్రత్యేకించి తీవ్రమయ్యింది? దీనికి వస్తుగత కారణాలూ వున్నాయి. స్వీయాత్మక కారణాలూ వున్నాయి.

వస్తుగతంగా చూసుకుంటే, విప్లవ విజయంతో మనలో రాజకీయ దృష్టి తగ్గడమూ, సైద్ధాంతిక నిర్లక్ష్యమూ, సంతృప్తిపడడమూ వంటి అనేక చెడ్డ విషయాలు వుద్భవించే ప్రమాదం వున్నది. అంతేకాకుండా, మనం సహకరించే వర్గాలూ, విముక్తి నాటి నుంచి తమ పనులలో వున్న పాత సిబ్బందీ, పట్టణ జీవితంలో వున్న అనేక రకాల మోజులూ మొదలైన పరిసరాల ప్రభావాన్ని కూడా దృష్టిలోకి తీసుకోవాలి. సామ్రాజ్యవాదం, భూస్వామ్యం, నిరంకుశ పెట్టుబడిదారీ విధానం అనే శక్తివంతమైన శత్రువులను చాలా వరకు కూలదోసాం. లేదా త్వరలో కూలదోస్తాం. ఇది మన మంచికే. వారి పాత దిగజారిన భావజాలాలు, జీవన విధానాలు, అలవాట్లను కఠిన, దీర్ఘకాలిక, నిశ్చయాత్మక పోరాటం ద్వారానే క్రమేపీ మాత్రమే నిర్మూలించగలం. వేళ్లూనుకున్న ఈ చెడు అలవాట్లు వివిధ మార్గాల ద్వారా ఇంకా చాలా కాలం పాటు తమ ప్రభావాన్ని మన మీద

కొనసాగిస్తాయి. మనల్ని కబళించి అవినీతిమయం చేస్తాయి. విజయం తరువాత ఏర్పడే వస్తుగత వాతావరణం ఇదే. దాని ప్రభావం నుంచి మనం బయటపడకపోతే, అది మనకు ఆటంకంగా మారుతుంది. వుదాహరణకు కొందరు కామ్రేడ్స్ నగరంలో పని చేస్తున్నారు కనుక పట్టణ జీవితంలో వుండే మోజులకు అలవాటు పడ్డారు. తిండి, బట్టలు, నివాసం, రవాణాలలో సుఖం కోరుకుంటున్నారు. తమ ఇళ్లు చాలా చిన్నగానూ, పేదగానూ వున్నాయని కొందరు ఆరోపిస్తున్నారు. మనం కొండలలో పని చేసేటపుడు అక్కడ వందలాది మంది నివసించేవారు. ఇరుకుగా వుందని ఎవ్వరూ అనుకోలేదు. ఇప్పుడు వాళ్లు బీజింగ్ వంటి ప్రధాన నగరాలలో నివసిస్తున్నారు. అక్కడ నివసించే స్థలం లేదని ఆరోపిస్తున్నారు. ఇది చిన్న విషయంగా కనిపిస్తున్నప్పటికీ తీవ్ర సైద్ధాంతిక సమస్యకు ప్రతిబింబం. దీని మీద మనం గట్టి శ్రద్ధ పెట్టాలి. లేకపోతే, ఈ కామ్రేడ్స్ లంచగొండులుగా మారతారు.

కొందరు పార్టీ క్యాడర్ల ప్రస్తుత అవినీతికి, తీవ్రంగా విధానాలని, క్రమశిక్షణనూ వుల్లంఘించడానికీ వస్తుగత కారణాలకు తోడుగా, కొన్ని స్వీయాత్మక కారణాలు కూడా వున్నాయి. పార్టీ అంతర్గత బోధనలో, అంతర్గత రాజకీయ జీవితంలో, పని విధానంలో, ముఖ్యంగా పార్టీ క్రమశిక్షణను అమలు చేయడంలో అనేక తీవ్ర లోపాలు వున్నాయని నేను భావిస్తున్నాను. నిర్దిష్టంగా చెప్పాలంటే, నేను భావించేవి ఇవీ – పార్టీ అంతర్గత బోధన క్రమబద్ధంగానూ, చిత్తశుద్ధితోనూ, అత్యంత వాస్తవికంగానూ నిర్వహించలేదు. పార్టీ అంతర్గత రాజకీయ జీవితం క్రమబద్ధంగానూ, వుండవలసినంత సంతృప్తికరంగానూ లేదు. ముఖ్యంగా, వివిధ ప్రభుత్వ శాఖలలో, కింది స్థాయి నిర్మాణాలలో ఇది కనిపిస్తుంది. కొన్ని యూనిట్లు పార్టీ అంతర్గత పని విధానాన్ని అవసరమైనంత ఖచ్చితంగా అమలు చెయ్యవు. ముందుగా ఆదేశాల కోసం అడిగి ఆ తరువాత సమయానికి నివేదికలు సమర్పించడం అన్న విధానాన్ని చైతన్యపూర్వకంగా అమలు చెయ్యడంలో వైఫల్యం వుంది. కొన్ని యూనిట్లలో అసలు ఎటువంటి విధానాన్నీ అమలు చెయ్యడం లేదు. వీటికి మించి పార్టీ క్రమశిక్షణను ఖచ్చితమైన పద్ధతిలో అమలు చెయ్యరు. దీంతో పార్టీ క్యాడర్ పార్టీ క్రమశిక్షణనూ, చట్టాలనూ వుల్లంఘించడం అన్నది సాధారణ విషయంగా మారింది. పార్టీ, ప్రజల ఆశయాన్ని మరో అడుగు ముందుకు తీసుకువెళ్లాలంటే మనం ఈ లోపాలను అధిగమించాలి.

### 3. పార్టీ విధానాలూ క్రమశిక్షణలను వుల్లంఘించే పార్టీ క్యాడర్ పొరపాటును ఎలా సరిదిద్దాలన్న దాని గురించి:

పార్టీ క్యాడర్ కొందరు పార్టీ విధానాలూ, క్రమశిక్షణ వుల్లంఘననూ సరిదిద్దడానికి కేంద్ర కమిటీ చర్యలు తీసుకుంది. పార్టీని సంఘటితం చెయ్యాలని ప్రతిపాదించి, దానికి సంబంధించి ఆదేశం కూడా జారీ చేసింది. సంబంధిత పార్టీ క్యాడర్ తమ పని విధానంలో వత్తిడి చేయడం, అధికారతత్వం. ప్రజల నుంచి దూరం కావడం, సుఖం కోరుకోవడం, దిగజారిన ఆలోచనలూ చర్యలకు పాల్పడడం మొదలైన వాటిని వదులుకోవడానికి సహాయం చెయ్యడమే పార్టీ కన్సాలిడేషన్ ప్రయోజనం. పార్టీ కన్సాలిడేషన్‌కు సంబంధించి కేంద్ర కమిటీ ఇటీవల ఇచ్చిన ఆదేశం స్ఫూర్తితో అన్ని స్థాయిల పార్టీ కమిటీలూ పార్టీ క్యాడర్‌కు శిక్షణ నివ్వడం, తమను తాము మెరుగుపరుచుకునేందుకు సహాయం చెయ్యడం అవసరం. దీనికి కఠినమైన, దీర్ఘకాలిక బోధన అవసరం. ఈ కాలంలో మనం పార్టీ క్యాడర్ పనిని పర్యవేక్షించాలి. వాళ్ల అనుభవాన్ని విశ్లేషించడానికి తోడ్పడాలి. అలా చేస్తే విధానాల పట్ల తమ అవగాహనను వాళ్లు నిరంతరం పెంపొందించుకోగలుగుతారు. సైద్ధాంతిక స్థాయిని పెంచుకోగలుగుతారు. తమ లోపాలను అధిగమించి, తప్పులను సరిదిద్దుకోగలుగుతారు. ఇందుకోసం మనం గడిచిన దిద్దుబాటు వుద్యమాలలో, వ్యవసాయ సంస్కరణ కాలంలో పార్టీ కన్సాలిడేషన్ వుద్యమాలలో మన అనుభవం నుంచీ నేర్చుకోవాలి. మన గత దిద్దుబాటు వుద్యమాలు ముఖ్యంగా బోధన ద్వారా నిర్వహించాం. ప్రజల ఆలోచనను మలచడం దీని ముఖ్య లక్ష్యం. 'భవిష్యత్తులో తప్పులు నివారించుకోవడానికి గత తప్పులు నుంచి నేర్చుకోండి. రోగిని కాపడడానికి రోగానికి చికిత్స చేయండి' అన్న కామ్రేడ్ మావో గైడెన్సులో జరిగిన ఈ వుద్యమాలు పార్టీ క్యాడర్ల, ముఖ్యంగా పెటీ బూర్జువా మేధావుల ఆలోచనను మార్చడంలో చెప్పుకోతగ్గ ఫలితాలు సాధించాయి. ఈ వుద్యమాలు ఎన్నడూ ఎరగనంత విజయాలు సాధించాయి. వాటి ప్రభావం గొప్పగా వుంది. అయితే వాటిలో సాధారణ లోపం ఏంటంటే అనేక ప్రాంతాల పార్టీ నిర్మాణాలను సైద్ధాంతికంగా మలచడంలో ఏకపక్ష అవగాహనను కలిగి వుండడం. దీని ఫలితంగా క్రమశిక్షణను పాటించవలసినంతగా పాటించడం లేదు. కొందరు కామ్రేడ్స్ తామింకా తమ ఆలోచనను సరిదిద్దుకోవలసి వున్నదంటూనే పార్టీ నిర్మాణాల నిర్ణయాలను, పార్టీ క్రమశిక్షణనూ వుల్లంఘించడాన్ని సమర్థించుకోవాలని నిరంతరం ప్రయత్నిస్తున్నారు. ఇది గుర్తు పెట్టుకోవలసిన పాఠం. వ్యవసాయ సంస్కరణ కాలంలో పార్టీ కన్సాలిడేషన్‌లో కూడా చెప్పుకోతగ్గ ఫలితాలు సాధించాం. నిర్దిష్టంగా పార్టీలో కొందరు క్యాడర్ మీద ఒత్తిడి చేసే పద్ధతి, అధికారతత్వం వున్నదని తీవ్రంగా విమర్శలు వచ్చాయి. గ్రామీణ ప్రాంతాలలో పార్టీ నిర్మాణాలు ప్రక్షాళనమై, సంఘటితమయ్యాయి. పార్టీ సభ్యులకూ, క్యాడర్‌కూ, ప్రజలకూ మంచి బోధన అందింది. కన్సాలిడేషన్ క్రమంలో, కొన్ని ప్రాంతాలలో మరీ సులభ పద్ధతిలో సమస్యలు పరిష్కరించాలని చూసారు. క్రమశిక్షణా చర్యలకు అనవసర ప్రాధాన్యత ఇచ్చారు. దాంతో అనేక మంది పార్టీ క్యాడర్‌కు శిక్షపడింది. కొందరి తప్పులు తీవ్రంగా లేకపోయినా, అవసరమైన దానికంటే ఎక్కువ శిక్షలను అనుభవించారు. ఇది మనం నేర్చుకోవలసిన మరొక పాఠం. మరోసారి చెప్పవలసి వస్తే వ్యవసాయ సంస్కరణలో గత దిద్దుబాటు వుద్యమాలూ, పార్టీ కాన్సాలిడేషన్ క్యాంపెయిన్‌ల విజయవంతమైన అనుభవాల నుంచీ మనం నేర్చుకోవాలి. లోపాలనూ, పొరపాట్లనూ సరిదిద్దుకోవాలి. సైద్ధాంతిక బోధన ప్రాథమికం చేసుకుని, క్రమశిక్షణా ఆంక్షలను రెండో అంశంగా చూడాలి. పార్టీ ముందుగా చెబుతున్నా వినకుండా, విధానాలనూ, క్రమశిక్షణనూ వుల్లంఘించే పార్టీ క్యాడర్‌కూ, క్రమశిక్షణా రాహిత్యానికి పాల్పడిన తరువాత తమ పద్ధతులు మార్చుకోవడానికి అంగీకరించని వారికీ వ్యతిరేకంగా అవసరమైన క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలి.

కేంద్ర పార్టీ, ప్రభుత్వం, సైన్యం, ప్రజా సంఘాలలో ఇప్పుడు వివరించిన ఒత్తిడి చేసే పద్ధతి, అధికారతత్వం, ప్రజల నుంచి దూరం కావడం వంటి తీవ్రమైన ఘటనలు కొన్ని జరిగిన మాట నిజమే. కానీ అక్కడ విధాన, క్రమశిక్షణా వుల్లంఘనలు లేవనగలమా? లేదు. అలా అనలేం. నిరంకుశత్వం, వుదారవాదం

పార్టీయేతర ప్రజలతో ఐక్యం కావడానికీ, సహకరించడానికీ ఒప్పుకోకపోవడం. విప్లవ కృషి, రాజ్య సంపదల పట్ల బాధ్యతా రాహిత్యం ఇంకా కొనసాగుతూనే వున్నాయి. సీనియారిటీ, హోదా కోసం పాకులాడడం, సుఖం కోరుకోవడం మొదలైన వాటిలో వ్యక్తివాదం వ్యక్తమవుతుంది. అందుకనే పార్టీ కన్సాలిడేషన్ గురించి కేంద్ర కమిటీ ఆదేశాలు ప్రకారం తమ పార్టీ క్యాడర్‌లో అనారోగ్యకరమైన ఆలోచనలు, చెడు పని విధానాలు, పార్టీ విధానాలనూ, క్రమశిక్షణనూ వుల్లంఘించడం వున్నాయేమో జాగ్రత్తగా పరిశీలించాలి. పైన చెప్పిన ప్రతికూల విషయాలనన్నింటినీ గుర్తించిన వెంటనే అధిగమించాలి. ఇది చాలా కఠినమైన కర్తవ్యం. ఇక్కడ వున్న కామ్రేడ్స్ అందరూ దీనిని నిజాయితీగా, గొప్ప బాధ్యతా స్పృహతో చేపట్టాలి. దానిని నెరవేర్చడానికి తమ పార్టీ కమిటీలకు సాధ్యమైనంత సహాయం అందించాలి.

ఈ కర్తవ్యాన్ని నెరవేర్చడానికి మనం అవలంబించవలసిన పద్ధతులు ఏమిటి? నా అభిప్రాయం ప్రకారం మనం ప్రధానంగా మూడు రకాల పద్ధతులు అవలంభించాలి. మొదటిది, పై నుంచీ కింద వరకూ నాయకత్వం క్రమశిక్షణను నిరంతరం తనిఖీ చెయ్యాలి. దీంతో పాటుగా, పార్టీ లోపలా, బయటా విస్తారమైన ప్రజాస్వామ్యాన్నీ, విమర్శ, స్వయం విమర్శనూ జోడించాలి. ఈ రెండు రకాల పద్ధతులలో కృషి చేయడం ద్వారా తప్పుడు ఆలోచనలనూ, చర్యలనూ ఎండగట్టగలుగుతాం. తప్పులు చేసిన కామ్రేడ్స్‌కు అవసరమైన సహాయం అందుతుంది. రెండో అంశం, అంతర్గత పార్టీ బోధనను క్రమశిక్షణ అమలుతో జోడించడం. ప్రాథమికమైనదైన పార్టీ అంతర్గత బోధన పార్టీ క్యాడర్ అందరికీ రాజకీయ, సైద్ధాంతిక స్థాయిని నిరంతరం పెంపొందించే లక్ష్యంతో జరపాలి. వారు తప్పులను నివారించేందుకు, సరిదిద్దుకునేందుకు సహాయపడాలి. అదే సమయంలో, తమ పద్ధతులను మార్చుకోవడానికి అంగీకరించని కామ్రేడ్స్‌పై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలి. బోధన ప్రాథమికంగా వుండాలి. క్రమశిక్షణ దీనికి సహాయకారిగా వుండాలి. ఇందులో మనం స్పష్టంగా వుండాలి. పార్టీ క్యాడర్‌ను చిత్తం వచ్చినట్టుగా శిక్షించరాదు. మూడో అంశం, తప్పులను గుర్తించిన వెంటనే పరిష్కరించాలి. సకాలంలో అనుభవాలను విశ్లేషించాలి. యావత్తు పార్టీకీ ప్రజలకు బోధపరచడానికి పార్టీ ద్వారా, ఇతర వార్తా పత్రికల ద్వారా, పత్రికల ద్వారా బహిర్గతం చెయ్యాలి. ఈ మూడో పద్ధతి చాలా ముఖ్యమైంది. తప్పులు సరిదిద్దడం, సమస్యలు పరిష్కరించడం సకాలంలో చెయ్యాలి. వాటిని పేరనివ్వకూడదు. ఇలా చెయ్యకపోతే, తమ రాజకీయ జీవితానికి ప్రమాదం తెచ్చిపెట్టేంత తీవ్రమైన పొరపాట్లు చేస్తారు. అటువంటి సందర్భాలతో వ్యవహరించేటపుడు మన అనుభవాన్ని ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలి. పార్టీ ప్రచురణలోనో, వార్తా పత్రికలు, దినపత్రికలలోనో వాటిని ప్రచురించాలి. యావత్తు పార్టీ, ప్రజల అవగాహన పెంపొందించడానికి ఇది ఎంతగానో వుపయోగపడుతుంది. అలాగే తప్పులు చేస్తున్న పార్టీ క్యాడర్‌కు కూడా బాగా తోడ్పడుతుంది. కొందరు తమ తప్పులు బహిర్గతం అయ్యే వరకూ కనీసంగా కూడా వాటిని పట్టించుకోరు. కాబట్టి తమ పద్ధతులు మార్చుకోవడం కష్టమవుతుంది. వాళ్ల తప్పులు పత్రికలలో అచ్చయిన తరువాత, అందరికీ వాటి గురించి తెలుస్తుంది. ఇక వాటిని కప్పిపుచ్చుకోలేరు. అయితే నేర్చుకోగలిగే విషయాలను మాత్రమే ప్రచురించాలి. దాన్ని అతి చెయ్యకూడదు. ఇలా చేస్తే, మనం పార్టీ క్యాడర్ భావాలను గాయపరిచిన వాళ్లమవుతాం. అవసరమైనది కాక దానికి విరుద్ధమైనది జరుగుతుంది.

మన పని రీత్యా క్రమశిక్షణా తనిఖీలో వున్న కామ్రేడ్‌ను ఇలా చెయ్యమని అడుగుతాం. మొదటగా, వాళ్లు కర్తవ్యానికి వున్న ప్రాధాన్యతను అర్థం చేసుకోవాలి. కేంద్ర కమిటీ రూపొందించిన విధంగా క్రమశిక్షణా తనిఖీ కమిషన్లు యధావిధిగా తమ డ్యూటీలు, పనులు, అధికారాల ప్రకారం పని చేస్తూ వుండాలి. క్రమశిక్షణా తనిఖీకి కేంద్ర కమీషన్ నిర్దేశించిన వివరమైన పని నిబంధనలు, నిర్దిష్ట పరిస్థితుల వెలుగులో ప్రతీ యూనిట్టూ పని చెయ్యాలి. రెండో అంశం ఏమంటే, క్రమశిక్షణా తనిఖీ పని చేస్తున్న కామ్రేడ్స్ నిజాయితీగా సూటిగా వుండాలి. ప్రజా స్ఫూర్తితో చట్టానికి కట్టుబడి క్రమశిక్షణ పాటించడంలో నమూనాగా పార్టీ నిర్మాణానికి లోబడి, ప్రజలతో ఐక్యంగా వుండాలి. ఇలా చెయ్యకపోతే, వాళ్లు చెప్పేదానికి విలువ వుండదు. తమ పని చెయ్యడం కష్టమవుతుంది. మూడో అంశం, తప్పొప్పుల మధ్య తేడా చూడగలగాలి. ఈ సూత్రాలను అంటిపెట్టుకుని వుండాలి. దీని అర్థం ఏమంటే విధానాలూ క్రమశిక్షణలకు నిజంగా భంగం జరిగిందా, జరిగితే నిర్దిష్టంగా ఏమేం విధానాలు, క్రమశిక్షణా పద్ధతులలో జరిగింది, ఆ సమస్య స్వభావం ఏమిటీ, దాని తీవ్రత ఎంత మొదలైనవి సరిగ్గా అంచనా వెయ్యాలి. సూత్రాలకు కట్టుబడి వుండడమంటే, ఇతరులు బాధపడతారని జంకకపోవడం, వుదారవాద తప్పు చెయ్యకపోవడం. విధానాలూ, క్రమశిక్షణను ఉల్లంఘించే చర్యలన్నింటినీ ఎండగట్టాలి. అవి ఏ సంస్థలూ, వ్యక్తులూ చేసినవైనా వాటిని సరిదిద్దడానికి చర్యలు తీసుకోవాలి. ఇతరులు బాధపడతారని జంకకపోవడం అంటే వాళ్ల మీద దురుసుగా ఆరోపణలు చెయ్యవచ్చుననీ అజాగ్రత్తగా వ్యవహరించమనీ కాదు. అన్ని ఘటనల పట్లా ఆరంభం నుంచీ చివరి వరకూ సమంజసంగా, ఎంతో జాగ్రత్తతో వ్యవహరించాలి. 'భవిష్యత్తు తప్పులను నివారించడానికి పాత వాటి నుంచీ నేర్చుకోండి. రోగిని కాపాడడానికి రోగానికి చికిత్స చెయ్యండి' అన్న కామ్రేడ్ మావో సూత్రాన్ని క్రమశిక్షణను తనిఖీ చేసే కామ్రేడ్స్ దృష్టిలో వుంచుకోవాలి. శిక్షను అతిగా నొక్కి చెప్పడాన్ని వ్యతిరేకించాలి. రాజకీయ దృష్టిని కలిగి వుండాలి. ఇతరుల్లో తప్పులు వెతకడం, చిన్న విషయాలను పట్టుకుని వేలాడడం కాకుండా, విధానాలూ సూత్రాలపై అత్యంత శ్రద్ధ వహించాలి. నాలుగో అంశం, కమిటీలు, సాధారణ శాఖలు, పార్టీ శాఖ నాయకత్వంలో వున్న వాళ్లూ పార్టీ కార్యకర్తల మీద ఆధారపడుతూ ప్రజా మద్ధతును పొందుతూ మరింత సమర్థవంతంగా పని చెయ్యాలి.

క్రమశిక్షణను తనిఖీ చెయ్యడం మనకు కొత్త కనుక, అందులో మనకు ఇబ్బందులు ఎదురయ్యే మాట నిజమే. మనకు అనుభవం లేదు కనుక, పని చేస్తూనే నేర్చుకోవాలి. మన మార్గం మనమే వెదుక్కోవాలి. అంతేకాక నిర్మాణపరంగానూ, సిబ్బందిపరంగానూ మనం వెనుకబడి వున్నాం. తమ యధావిధి పని భారంతో పాటుగా, చాలా మంది కామ్రేడ్స్ క్రమశిక్షణ తనిఖీ పనిని పార్ట్ టైంగా చేస్తున్నారు. కొన్ని నాయకత్వ సంస్థలు ఆ పని పట్ల తగినంత శ్రద్ధ వహించలేదు. దీనంతటి వల్లనూ, మన కృషిని

**(తరువాయి భాగం 13 వ పేజిలో)**

నివేదిక

# మైనింగ్‌ను వ్యతిరేకిస్తున్న మాలిపర్వత ప్రాంత ప్రజలు

కోరాపుట్ జిల్లాలోని సిమిలిగూడ బ్లాక్‌కు 8 కి.మీ దూరంలో మాలిపర్వతం ఉంది. ఇది ప్రకృతి వనరులు, ఖనిజసంపద, పచ్చని చెట్లతో నిండిన దట్టమైన అడవితో కూడి వుంది. దీనిలో 50 రకాలకు పైగా పక్షులు, పులులు, ఎలుగుబంట్లు, అడవి పందులు, ముళ్లపందులు, కొండ గొర్రెలు వంటి అనేక జంతువులతో, క్రిమి కీటకాలతో జీవవైవిధ్యానికి నిలయంగా ఉంది. ఈ ప్రాంతంలో విభిన్న తెగల, కులాలకు చెందిన ప్రజలు జీవిస్తున్నారు. ఈ మాలిపర్వతంలో బాక్సైట్, అల్యూమినా ఉండటంతో దేశ, విదేశీ బహుళజాతి సంస్థల కన్ను దీనిపై పడింది. దాంతో అక్కడి ప్రశాంత వాతావరణం కనుమరుగై ప్రజల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. ఈ నేపథ్యంలో అక్కడ ప్రజల జీవన స్థితిగతులను, కంపెనీ తీసుకువచ్చిన విధ్వంసాన్ని పరిశీలిద్దాం.

మాలికి ఆనుకుని ఉన్న నాలుగు పంచాయితీలకు చెందిన 44 గ్రామాలలో సుమారు 19,278 మంది నివశిస్తున్నారు. అక్కడి వివరాలు :

**మాలిలో 4 పంచాయితీలు వున్నాయి.** 1.సొరిసపొదర్ 2.కుడి 3.దొలైగూడ 4.పక్‌జోలా

**సొరిసపొదర్ పంచాయితీలోని గ్రామాలు:** 1.డెక్కాపార 2. మటియాగూడ 3. మెంజాగూడ 4. సొరిసపొదర్ 5. కర్లాపొదర్ 6. కొటగాం 7. ఘొనాగూడ 8. కొజిరికోట 9. దుంబిరిగూడ 10. జాముకోట 11. జొడికొంద

**కుడి పంచాయితీ:** 1. మాలిగూడ 2. కొంకడాంబ 3. పురియాకుడి 4. బిండాగూడ 5. పొరజకుడి

**దొలైగూడ పంచాయితీ:** 1. ముగునగూడ 2. తెంతులిగూడ 3. బంగురుగూడ 4. డొలియాంబొ 5. మాలిడొలియాంబొ 6. కొంటాగూడ 7. ఎకటగూడ 8. జాలియగూడ 9. కుత్తుగాం 10. బిలెయిగూడ 11. దొలైగూడ 12. ఆర్.కె మాలిగూడ 13. రాణికొనా 14. కడామ్‌గూడ 15. కొక్కిరిగూడ

**పక్‌జోలా పంచాయితీ:** 1. పక్‌జోలా 2. రాజన్నగూడ 3. ఆలిగాం 4. కుంబిగూడ 5. పాగుగూడ 6. సువాపుట్ 7. లుంగురీ 8. బెహరాగూడ

ఈ ప్రాంతంలో కువ్వి, పొరజ, గదబ, దొర, మాలి, రొణా, డొంబొ, కుమ్మరి, కమ్మరి, రెల్లి, దురియా, గాసి, సుండి, కొరణొ, వంటి తెగల, కులాల ప్రజలు నివశిస్తున్నారు.

ఈ ప్రాంతంలోని అధిక శాతం (85%) ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తుండగా 10 శాతం మంది కూలి పనులు, 2 శాతం మంది వ్యాపారం, 3 శాతం మంది వలసలపై ఆధారపడి జీవిస్తున్నారు. మొత్తం ప్రాంతంలో 41 మంది మాత్రమే ఉద్యోగాలు (క్రింది స్థాయి) చేస్తున్నారు.

పర్వత పాదభాగం నుండి ప్రవహిస్తున్న సెలయేర్ల నీటిని పైపులైనుల ద్వారా మళ్ళించుకుని వివిధ రకాల పంటలు, కూరగాయలు పండిస్తున్నారు. ధాన్యం, చోళ్ళు, సామలు, కందులు, బొబ్బర్లు, మినుములు, పెసలు, రాజ్‌మా, బరాణీ, కొమ్ముశనగ, వేరుశనగ, ఒలిసి, మెంతులు, ఆవాలు, దనియాలు, బీన్స్, చిక్కుడు, క్యారెట్, బంగాళదుంపలు, క్యాబేజి, టమోట, వంకాయలు, బెండకాయలు, బీట్‌రూట్, అల్లం, పచ్చిమిర్చి వంటివి పండిస్తున్నారు. ఒక వారానికి సుమారుగా యాభై టన్నులకు పైగా కూరగాయలు ఇక్కడి నుండి ఉత్పత్తి అవుతున్నాయి. వీటిని కుందిలి, సిమిలిగూడ, దామన్‌జోడి, పుక్కలి లోని సంతలలో అమ్ముకుంటారు. తర్వాత వాటిని అక్కడినుండి ఒడిశా, ఆంధ్రా, ఛత్తీస్‌గడ్, మధ్యప్రదేశ్ లలోని మైదాన ప్రాంతాలకు, ముఖ్యపట్టణాలకు ఎగుమతి చేస్తారు.

అంతే కాకుండా అడవిని నరికి పోడువ్యవసాయం కూడా చేస్తున్నారు. అటవీ ఆధారిత ఉత్పత్తులైన కర్రలు, ఆకులు, దుంపలు, చీపుర్లు, పండ్లజాతులు అనేక రకాలైన వనమూలికలు, ఔషధాలను నిత్యావసర వస్తువులుగాను మార్కెట్లో అమ్మడం ద్వారాను తమ అవసరాలను తీర్చుకుంటున్నారు.

వ్యవసాయ ఉత్పత్తులకు, కూరగాయలకు మార్కెట్ ధరను ప్రభుత్వం నిర్ణయించకపోవడంతో దళారుల, వ్యాపారుల మోసాలకు రైతులు గురవుతున్నారు. రవాణా, మార్కెట్ సదుపాయాలు అంతంత మాత్రమే. కూరగాయలు నిలువ చేసేందుకు కోల్డ్‌స్టోరేజీలు లేకపోవడంతో కూరగాయల రేట్లు పడిపోయినా, అమ్ముడు కాకపోయినా రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. మార్కెట్లలో వసూలు చేసే ఆసీలు (విక్రయ రుసుము) ఒక బస్తాకు 5.రూ - 10.రూ బలవంతంగా వసూలు చేస్తున్నారు. రైతులకు అవసరమైన విశ్రాంతి గృహాలు, త్రాగునీరు, పారిశుధ్యశాలలులేవు.

మాలి పర్వతంపై ఆదిమకాలం నుండి సాంప్రదాయబద్ధంగా పూజలు జరుపుకుంటున్న అనేక స్థలాలు వున్నాయి. అందులో పర్వబాడి, పక్కులిపొర్, పట్‌దేబత, పత్రిపకన్, నిశానిముండ, హట్టుపార ముఖ్యమైనవి. ఈ పూజా స్థలాలలో వ్యవసాయ, అటవీ ఆధారిత పండుగలను సంవత్సరం పొడవునా జరుపుకుంటారు. జనవరి - పౌష్‌పర్బొ; ఫిబ్రవరి - డాలరొపూజ, బిరనతొనొ; మార్చ్ - చైత్రొపర్బొ, బల్లిపర్బొ; ఏప్రిల్ - డొంగొరొపూజ; జూలై - బొందపనొ పర్బొ, డాలొగొడాని; ఆగష్టు - సెప్టెంబర్ - నువాకాయి; అక్టోబర్ - దసరా; నవంబర్ - దిఆలి (దీపావళి); డిసెంబర్ - జన్మొ పర్బొ (క్రిస్టమస్) మొత్తం పండుగలన్నింటిలోను ఆట, పాట, వాయిద్యాలతో పిల్లల నుండి మొదలకుని వృద్ధుల వరకు పాల్గొంటారు. సినిమా, టీ.వి సంస్కృతి ప్రవేశించినప్పటికీ ఆదివాసీ సంస్కృతి, ఆచార వ్యవహారాలు కొనసాగుతున్నాయి.

దేశంలోనే ఒడిశా వెనుకబడ్డ రాష్ట్రం కాగా అందులో కోరాపుట్ జిల్లా మరింత వెనుకబడ్డది. అపారమైన ప్రకృతి సంపద, ఖనిజ సంపద, మానవ వనరులు వున్నప్పటికి ప్రభుత్వాల నిర్లక్ష్యంవల్ల ఈ ప్రాంత ప్రజలు అభివృద్ధికి నోచుకోక అర్థాకలితో అలమటిస్తున్నారు. అత్యంత వెనుకబడిన, పూరాతన వ్యవసాయ పద్ధతులు, ఉత్పత్తి అయినవాటికి సరసమైన ధరలు లభించక పోవడంవల్ల యువత రోడ్లు, భవనాలు వంటి కూలి పనులకు సుదూర ప్రాంతాలకు వలసపోతున్నారు. మౌలిక సదుపాయాల కల్పనను ప్రభుత్వం విస్మరించడంతో విద్య, వైద్యం అరకొరగానే ఉన్నాయి. ఇన్ని సమస్యలు పట్టిపీడిస్తున్నప్పటికి అనాదిగా,

వారసత్వంగా సంక్రమించిన అడవి, భూమిపై ఆధారపడుతూ జీవిస్తున్న ప్రజలను మైనింగ్ పేరుతో ఆ ప్రాంతం నుండి కట్టుబట్టలతో తరిమి వేసి వారిని బిచ్చగాళ్లుగా మార్చడానికి ఒడిశాలోని అధికార పార్టీ అయిన బి.జె.డి ప్రభుత్వం కంకణం కట్టుకున్నది. ఇప్పటి వరకు ఏ బాక్సైట్ నీటి ఆధారంగా తమకు తోచిన పద్ధతులలో పంటలు పండించుకుంటూ, ఉత్పత్తులు అమ్ముకుంటూ ప్రజలు బతుకుతున్నారో అదే బాక్సైట్ నేడు వారి పట్ల శాపమైంది.

బాక్సైట్ వెలికితీతకు 2003లో బహుళజాతి సంస్థ అయిన హిండాల్కో కంపెనీకు నవీన్ పట్నాయక్ ప్రభుత్వం అనుమతి మంజూరుచేసింది. దానితో హిండాల్కో కంపెనీ, ఒ.ఎమ్.సి (ఒడిశా మైనింగ్ కార్పొరేషన్) కు నడుమ 15 సం॥ పాటు 1700ల ఎకరాల్లో తవ్వకాలకు ఒప్పందం కుదిరింది.

31-5-2003న హిండాల్కో కంపెనీ తరపున ప్రజాభిప్రాయ సేకరణ జరిగింది. ఈ సభకు అప్పటి ఎమ్మెల్యే అయిన జయరాం పాంగి (బి.జె.డి), కలెక్టర్ శుభాశర్మ, జడ్.పి చైర్మన్ చంద్రమాసంత హాజరయ్యారు. ఈ సభకు హాజరైన ప్రజలలో 90% పైగా మైనింగ్‌ను వ్యతిరేకించారు. అదే సభకు "అరుణ్ పట్నాయక్" అనే దళారి కొద్దిమంది గూండాలతో కలిసి "హిండాల్కో కంపెనీకి స్వాగతం" అనే బ్యానర్‌తో హజరయ్యాడు. ఈ క్రమంలో కంపెనీ మైనింగ్‌ను వ్యతిరేకిస్తున్న ప్రజలంతా మాలిపర్వతాన్ని రక్షించుకొనేందుకు "మాలిపర్వత సురక్షా సమితి" అనే సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఎమ్మెల్యే జయరాం పాంగి నేతృత్వంలో అరుణ్ పట్నాయక్ లాంటి దళారులపై ఆధారపడి 3-4 గ్రామాల ప్రజలను కంపెనీకు అనుకూలంగా మార్చారు. దాంతో జయరాం పాంగి, దళారులు, కంపెనీ ఉద్యోగులు, కొంకడాంబొ, తెంతులిగూడ, ముగునగూడ గ్రామస్తులందరు కలిసి సిమిలిగూడలోని ఒక లాడ్జిలో గ్రామ సభను జరిపి మైనింగ్‌కు అనుమతిస్తున్నట్లు సంతకాలు చేసారు. ఈ విషయాన్ని తెలుసుకున్న ప్రజలు, "మాలిపర్వత సురక్షా సమితి" సంఘం కలసి జరుగుతున్న మోసాన్ని ఫాక్స్ మెసేజ్‌ల ద్వారా కలెక్టరుకు తెలియజేసారు. తర్వాత స్వయంగా కలెక్టర్‌ను కలిసి విషయం వివరించడంతో ఏడుగురు ప్రతినిధులతో కూడిన బృందం మాలిపర్వత ప్రాంతంలో పర్యటించి ప్రజల అభిప్రాయాలను తెలుసుకోవాలని, ఆపై జడ్.పి సమావేశంలో నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించడం జరిగింది. జడ్.పి సమావేశం రోజున మాలిపర్వత ప్రాంతానికి నాలుగు వాహనాలలో పోలీసులు వచ్చారు. "మీరు ఎందుకు వచ్చారు?" అని ప్రజలు పోలీసులను ప్రశ్నించగా అందుకు బదులుగా వారు "జడ్.పి బృందం ఇక్కడికి వస్తున్నందువల్ల రక్షణకై వచ్చామని" తెలియ జేసారు. జడ్.పి బృందం కొరకు ప్రజలందరు ఎదురుచూస్తుండగా జడ్.పి సభ్యులు కోరాపుట్‌లో సమావేశం జరిపారు. ఈ విషయాన్ని తెలుసుకున్న ప్రజలు కోరాపుట్ వెళ్ళేందుకు ప్రయత్నించగా పోలీసులు వీరిని అడ్డుకున్నారు. దానితో అక్కడ జరిగిన జడ్.పి సమావేశంలో గ్రామసభ నుండి అనుమతి లభించినట్లు ఒప్పంద పత్రాలపై రాసుకున్నారు.

మైనింగ్ ప్రారంభానికి ముందు అప్పటి ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్న ఆనంద్ కిరసాని, ప్రీతంపాడి లను కొనివేసి ఉద్యమాన్ని బలహీనపర్చారు. తర్వాత కంపెనీ మైనింగ్ ప్రారంభించి 50 మీ॥ పరిధిలో మట్టిని తవ్వి పోసింది. తవ్విన మట్టిని తరలించడంకోసం రాజస్థాన్‌కు చెందిన "రాసలీల ఎంటర్‌ప్రైజస్" అనే ట్రాన్స్‌పోర్టు సంస్థ (హనుమాన్ కంపెనీ) కాంట్రాక్టు పొందింది. దీని ఓనర్ "రుంట" (రాజస్థాన్), జి.ఎమ్ శర్మ (బీహార్), డైరెక్టర్ - నాగుదొర (జయపూర్ - కాంగ్రెస్). ఈ ట్రాన్స్‌పోర్టు కంపెనీ వాహనాలద్వారా మట్టిని తరలించి ఎన్.హెచ్-26 రోడ్డుకు దగ్గరగా వున్న డొలియాంబొ-తెంతులిగూడ గ్రామాల మధ్య కుప్పపోసారు. అక్కడి నుండి దుంబిరిపుట్ దగ్గరవున్న రైల్వేలైను నుండి కోరాపుట్‌కు, అక్కడి నుండి యు.పి లోని హిండాల్కో కంపెనీకు తరలిస్తున్నారు. ఇప్పటి వరకు 5 గూడ్స్ రైలుల మట్టిని (75,600ల టన్నులు) తరలించుకు పోయారు. ఇంకా 1,75,000 టన్నుల మట్టి (10 గూడ్స్ రైళ్లకు పైబడి) అక్కడే వుంది. అంతర్జాతీయ మార్కెట్ ధరల సూచిక ప్రకారం బాక్సైట్ 1టన్ను - 6,000 రూ (ఈ లెక్కచొప్పున 45 కోట్ల 36 లక్షల రూ విలువ చేసే సంపదను తరలించుకుపోయారు). 1 టన్ను బాక్సైట్‌కు కేవలం 27 రూ చొప్పున కంపెనీ గవర్నమెంటుకు రాయల్టి చెల్లిస్తున్నది.

వెలికి తీసిన బాక్సైట్ మట్టికి, ఎన్.హెచ్ - 26 సమీపంగా వున్న 4 గ్రామాలలోని కొద్దిమందికి కంపెనీ ఉద్యోగాలు, డబ్బు ఆశచూపి దళారులుగా మార్చుకుని వారి ద్వారా ఆ గ్రామాల ప్రజలను (2007 నాటికి) కంపెనీకి సహకరించేలా చేయగలిగారు. మొత్తం ప్రాంతంలో ఈ గ్రామాలలోనే దళారులు అధికంగా వున్నారు. వారు కంపెనీ నుండి పొందుతున్న జీతాలు, ఇతర సదుపాయాలు ఈ విధంగా వున్నాయి. సిరోమాకొరా - 20,000; లిమాకొరా, రొబి, నారయణ-15,000 (చొప్పున); జగన్నాథ్ - 12,000; అనీల్ -10,000 (ఇటువంటి వారు 30 మంది వరకు ఉన్నారు.) వీటితో పాటు పిల్లలకు కాన్వెంట్ చదువులు, వైద్యం, పండగల, పెళ్ళిల్ల, చావులకు సంబందించిన ఖర్చులు, మాంసం, మద్యం, వాహనాలను కంపెనీ సమకూరుస్తున్నది. ఈ కొద్ది మందిని ఉదాహరణగా చూపిస్తూ తవ్విపోసిన మట్టి తరలిస్తే, కంపెనీ మైనింగ్‌కు సహకరిస్తే ఉద్యోగాలు, సదుపాయాలు దొరుకుతాయని ఆ గ్రామాల ప్రజలను మభ్యపెడుతున్నారు. మట్టిని ట్రక్కులలో నింపి తరలించే పనికి రోజుకు వంద రూపాయల చొప్పున కూలి ఇస్తున్నారు. నిజానికి బయట పనులకు (ఉదా: రోడ్లు, భవనాల) రోజుకు 250 రూ॥ లతో పాటు ఉచిత భోజనం లభిస్తున్నది. అయితే ఈ పనిచేయడంవల్ల భవిష్యత్తులో కంపెనీలో పర్మినెంట్ ఉద్యోగాలు దొరుకుతాయని, పనిచేయక పోయిన పర్వాలేదని, కేవలం హాజరైతే చాలని చెప్పి తీసుకెళ్తున్నారు. అయితే వాస్తవ పరిస్థితి ఇందుకు భిన్నంగా వుంది. 4 గ్రామాలలో ఇంటికి ఒకరికి చొప్పున 275 మందికి ఉపాధి కల్పిస్తానని హామీ ఇచ్చిన కంపెనీ 105 మందిని మాత్రమే పనిలో (మట్టిని మోసే) పెట్టుకుంది. మిగతావారిని మట్టిని తరలించేటప్పుడు అడ్డుకుంటున్న ప్రజల, సంఘ కార్యకర్తలపై దాడులకు గూండాలుగా, కంపెనీకి అనుకూలంగా ఉద్యమాలు నడిపేందుకు (రోజుకు 100రూ, మద్యం, మాంసం ఇచ్చి) వుపయోగించుకుంటున్నది.

కంపెనీ మైనింగ్‌కు వ్యతిరేకంగా ప్రజలు "మాలిపర్వత సురక్షా సమితి" ఆధ్వర్యంలో శాంతియుత ప్రదర్శనలు, ధర్నాలు, ర్యాలీలు, సభల ద్వారా తమ నిరసనను తెలియ జేస్తున్నారు. కంపెనీ దళారుల, గూండాల సహాయంతో చేసేదాడులు, మట్టిని తరలించే ప్రయత్నాలను మిలిటెంట్‌గా, సంఘటితంగా ఎదుర్కొంటున్నారు.

ఈ క్రమంలో జరిగిన కొన్ని సంఘటనలు చూద్దాం.

19-8-2008 న హనుమాన్ కంపెనీకి చెందిన డైరెక్టర్ సంఘనాయకత్వాన్ని సిమిలిగూడలోని లాడ్జీకి పిలిచి లక్షల డబ్బును ఎరచూపారు. నాయకత్వం తిరస్కరించడంతో ఆ మరుసటి రోజున అంటే 20వ తేదిన కొంకడాంబ, డొలియాంబొ, తెంతులిగూడ గ్రామానికి చెందినవారు, దళారులు, సిమిలిగూడ, ఇతరమైదాన ప్రాంతాలకు చెందిన 200 మంది గూండాలు కలిసి కంపెనీను బలంగా వ్యతిరేకిస్తున్న గ్రామాలపై దాడిచేసారు. ఈ దాడిలో 34 మందికి తీవ్రగాయాలయ్యాయి. మార్కెట్ అవసరాలకు, ఇతర పనులపై బయటకు వెళ్ళినవారు ఫోనుద్వారా సమాచారం తెలుసుకుని పోలీసులతో వస్తే ఆపోలీసులు ఎదురుగానే మరల దాడిచేసారు. ఈ దాడిలో పోలీసులకు కూడా గాయలైనాయి. ఈ ఘర్షణలు జరుగుతున్న రోజులలో రోడ్డును బందు చేసి కూరగాయలు మార్కెట్‌కు పోనివ్వకుండా అడ్డుకుని రైతులను ఆర్థికంగా నష్టపరిచారు. ఈ దాడిలో పాల్గొన్నవారికి డబ్బులతో పాటు 10 డబ్బాల సార, 2 ఆవులను కంపెనీ ఇచ్చింది.

తరువాత క్రమంలో దళారి అయిన ఆనంద్ కిరసానిని ప్రజలు, పి.ఎల్.జి.ఎ హత్య చేయడంతో కొంత కాలం కంపెనీ ప్రయత్నాలు వెనక్కు తగ్గి మరల పుంజుకున్నాయి. 18-1-2013 మట్టిని తరలిస్తుండగా ప్రజలు అడ్డుకోవడంతో ఘర్షణలు చెలరేగాయి. ఈ ఆందోళనలో కంపెనీకి చెందిన వాహనాలు ధ్వంసం చేసారు. దీంతో 20 మందిపై కేసులు నమోదయ్యాయి.

తిరిగి జూలై 2013 లో కంపెనీ ప్రయత్నాలను అడ్డుకున్న ప్రజలపై దళారులు, కొంకడాంబ, ముగునగూడ, గ్రామాలవారు దాడిచేసారు. అంతే కాకుండా తిరిగి ప్రజలపై అబద్ధపు కేసులు పెట్టారు. దీంతో కోపోద్రిక్తులైన ప్రజలు 1,500 మంది పోలీసు స్టేషన్‌కు బయలుదేరారు. దారిలో కంపెనీకి చెందిన 3 వాహనాలను పూర్తిగా ధ్వంసంచేసి రెండింటిని అడ్డుకున్నారు. పోలీసుల ఎదురుగానే ఈ దాడి జరిగింది. పోలీసులు సంఘ నాయకత్వంతో పాటు 20 మంది కార్యకర్తలపై కేసులు పెట్టారు. నాయకత్వాన్ని అరెస్టు చేస్తామని స్టేషన్ ఐ.ఐ.సి బెదిరించగా అలా చేస్తే మొత్తం గ్రామాలలోని ప్రజలంతా పిల్లాపాపలతో, పశువులతో సహ వచ్చి స్టేషన్‌ను ముట్టడిస్తామని చెప్పడంతో భయపడి తాత్కాలికంగా వెనక్కితగ్గారు.

మరల 9-1-14 న కంపెనీ మట్టిని తరలిస్తున్న వాహనాలను అడ్డుకునేందుకు "మాలిపర్వత సురక్షా సమితి" ఆధ్వర్యంలో ప్రజలు ధర్నా చేసి అక్కడే బైఠాయించారు. దానితో వాహనాలు ఎక్కడివక్కడే నిలిచిపోయాయి. శాంతియుతంగా తమ నిరసనను తెలియచేస్తున్న ప్రజలపై, కార్యకర్తలపై ఆ రాత్రి రెండు వాహనాలలో సుమారు 30 మంది వరకు కంపెనీ గూండాలు వచ్చి దాడిచేసారు. ఈ దాడిలో అనేక మంది ప్రజలకు గాయాలయ్యాయి. దాంతో ప్రజల ఆగ్రహం కట్టలు తెంచుకోవడంతో గూండాలపై ఎదురుదాడికి దిగి ఆ వాహనాలను ధ్వంసం చేసారు. దాంతో గూండాలు వాహనాలను వదిలి కాలికి బుద్ధిచెప్పారు. అంతటితో ఆగకుండా 10 వ తేది ఉదయం ట్రాన్స్‌పోర్టు కంపెనీ ఆఫీసుకు పోయి అక్కడవున్న టిప్పర్లను, జె.సి.బి మిషన్లను, కమాండర్లను, బైక్‌లను మొత్తంగా 30 వాహనాలను, ఫర్నిచర్, కంప్యూటర్లను, సి. సి. కెమరాలను ధ్వంసం చేసారు. ఆ తర్వాత గూండాలకు చెందిన కొంకడాంబ గ్రామంపైకి పోయి దాడి చేయడంతో ఆ గ్రామంలోని దళారులు, గూండాలు, ప్రజలు ఊరు వదిలిపోయి పోలీసుల శరణుజొచ్చారు. మొదట నుండి ఈ సంఘటనలో ప్రేక్షకపాత్ర వహించిన పోలీసులు ప్రజలను కంట్రోలు చేయడానికి ఆ ప్రాంతంలో నిరవధిక కర్ఫ్యూ (144 సెక్షన్)ను విధించారు.

ఈ ఘర్షణలవల్ల ఆ ప్రాంతంలో ఎల్లప్పుడూ ఒక ఉద్రిక్తవాతావరణం నెలకొని ఉంటున్నది. ప్రజలు మార్కెట్, చదువు, కూలిపనులకు, ఇతర అవసరాలకు ఈ దళారీల గ్రామాలను దాటుకొని బయటకు వెళ్ళాల్సి వుండటంతో అనుక్షణం ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని జీవిస్తున్నారు. చీకటి పడితే ఒక్కరు, ఇద్దరుగా రాలేని పరిస్థితి. మొత్తం దాడులన్నీ పోలీసుల ఎదురుగానే జరిగినప్పటికీ బాధితులపైనే కేసులు మోపి అరెస్టులు చేస్తున్నారు. సాధారణ కార్యకర్తలపై 11 కేసులు పైగా వున్నాయి. నాయకత్వంపై ఇంకా అధికంగానే వున్నాయి. వాటికి తోడు వాహనాలతో గుద్దించి చంపుతామని, బాంబులు వేస్తామని, మహిళలపై అత్యాచారాలు చేస్తామని, సుపారీ కిల్లర్లతో కిడ్నాప్, హత్యలు చేసేందుకు ఒప్పందాలు, మావోయిస్టులతో సంబంధాలు ఉన్నాయని నిరూపించేందుకు నకిలీ ఉత్తరాల సృష్టి, మావోయిస్టుల పేరుతో తప్పుడు కేసుల్లో ఇరికిస్తామని, బూటకపు ఎన్‌కౌంటర్లలో చంపివేస్తామనే బెదిరింపులు నిత్యకృత్యం.

మైనింగ్ ప్రారంభంలో ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్న ఆనంద్ కిరసాని, ప్రీతంపాడిలను కొనివేసిన విధంగానే మరికొంత మందిని దళారులుగా మార్చివేయడంలోను, నాలుగు గ్రామాలను తనకు అనుకూలంగా మార్చుకోవడంలోను కంపెనీ సఫలం అయ్యిందనే చెప్పవచ్చు. ముఖ్య నాయకులకు లక్షలలో, కంపెనీ వ్యతిరేక గ్రామాలలో ఒక్కొక్క, గ్రామానికి 5 లక్షల చొప్పున ఇస్తామని చెబుతూ లొంగదీసుకోడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ ప్రక్రియలో కంపెనీ జి.ఎమ్ శర్మది ఒక ముఖ్య పాత్రకాగా బూర్జువా రాజకీయ పార్టీల నాయకులు తమ వంతు పాత్ర పోషిస్తున్నారు. బి.జె.డి కు చెందిన ఎమ్.పి జయరాం పాంగి బహిరంగంగానే కంపెనీ పట్ల తన స్వామి భక్తిని ప్రదర్శిస్తూ ఉద్యమ నాయకత్వాన్ని కొనివేసేందుకు నిరంతరం ప్రయత్నాలు చేస్తూ బుజ్జగింపులు, బెదిరింపులకు పాల్పడుతున్నాడు. ఇతనితో పాటు ఆ పార్టీకి చెందిన అనేక మంది చోటామోటా నాయకులు కూడా ఇవే పద్ధతులు అవలంభిస్తున్నారు. అలాగే కాంగ్రెస్‌కు చెందిన శిశిరొ గొమాంగొ (ఒడిశా మాజీ ముఖ్యమంత్రి గిరిధర్ గొమాంగొ కొడుకు), పూర్బాకిల్లో వంటి వారు ప్రజలకు డబ్బు ఆశచూపడం, వత్తిడిచేయడం, బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఈ రాజకీయ పార్టీలకు చెందిన వారంతా ప్రజలకు అసత్యాలను (మావోయిస్టు పార్టీ కూడా మైనింగ్‌కు అనుకూలమని, కోట్ల రూపాయలు పార్టీకి కంపెనీ చెల్లించిందని) చెబుతూ తమ పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారు. మైనింగ్‌ను వ్యతిరేకిస్తూ ప్రజలు చేస్తున్న ఉద్యమ కార్యకలాపాలకు దూరంగా ఉంటున్నారు. ప్రజలు వారిపై నమ్మకాన్ని, భరోసాని ఏనాడో వదులుకున్నారు. ఈ ప్రాంతంలో స్ప్రెడ్, సహారా,ఒ.టి.ఎల్.పి. సోబా, ఏకతా...వంటి అనేక సంస్థలు పనిచేస్తున్నాయి. మెజారిటి సంస్థలు కంపెనీకు, ప్రభుత్వానికి అనుకూలంగా పనిచేస్తున్నాయి. స్ప్రెడ్ అనే సంస్థ మాత్రం అప్పుడప్పుడు కంపెనీ వ్యతిరేక కార్యక్రమాల్లో పాలుపంచుకుంటున్నది. ప్రఫుల్ల సామంతరాయ్, గోపిగుంట,

సుత్తిహంతాల్ వంటి మేధావులు ఈ ఉద్యమానికి మద్దతుగా పనిచేస్తున్నారు.

కంపెనీ ప్రవేశంవల్ల ప్రజల మధ్య ఐక్యతకు, పర్యావరణానికి తీవ్ర ముప్పు వాటిల్లుతున్నది. మాలిపర్వత గర్భంనుండి 41 సెలయేర్లు ఏడాదిపొడవునా ప్రవహిస్తున్నాయి. వీటిలో అధికశాతం "కొలాబ్" నదిలో కలుస్తున్నాయి. అందులో ప్రధానమైనవి - 1. నువాపుట్ నుండి ప్రారంభమై మణ్య-కెరండిగాడి ను దాటి కొలాబ్‌లో కలుస్తున్నది. 2. పక్‌జోలా - ఆలిగాం - సిమిలిగూడను దాటి సున్నబెడా డ్యాంలో కలుస్తున్నది. ఈ నీటిని జన్నిగూడ వద్ద వున్న మిక్స్‌డ్‌ఫాం, వ్యవసాయ విజ్ఞాన కేంద్రం, డైరీఫాం, కోబ్రాక్యాంపు (రాజ్‌పుట్) లకు తరలిస్తున్నారు. మిగులు నీరు కొలాబ్ నదిలో కలుస్తున్నది. కొలాబ్ నీటిని హల్, నాల్కొ, ఎన్.ఎ.డి, కోరాపుట్, జయపూర్ టౌన్లకు అందిస్తున్నారు. అంతే కాకుండా కొలాబ్ నదికి దిగువనవున్న మల్కన్‌గిరి, నవరంగపూర్ నుండి మొదలుకుని ఛత్తీస్‌ఘడ్‌లోని జగదల్‌పూర్, చాందినీగేట్ వరకు ప్రజలు ఈ నీటిపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్నారు. కొలాబ్ నదినుండి ఉత్పత్తి అవుతున్న కరెంటును ఒడిశా-ఆంధ్రా రాష్ట్రాలు వుపయోగించుకుంటున్నాయి. ప్రస్తుతం మట్టిని తవ్విన ప్రాంతంలో ఉన్న ఒక సెలయేరు ఎండిపోయింది. మట్టిని తరలిస్తున్నప్పుడు పడిన దుమ్ము కారణంగా పక్‌జోలా, ఆలిగాంలలోని 5 ఎకరాల సాగుభూమి వ్యవసాయానికి పనికి రాకుండా పోయింది.

మైనింగ్ జరిగితే సెలయేర్లు, అడవి, పశువులు మేసే పచ్చికబీళ్ళు, ఆదివాసీ సంస్కృతి కనుమరుగై పోతాయి. ఆ ప్రాంతం నివాస యోగ్యానికి పనికిరాకుండా పోతుంది. అందుకనే అక్కడి ప్రజలు మైనింగ్‌ను నిలుపుదల చేయాలని, కంపెనీతో ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాన్ని (ఎమ్.ఒ.యు) రద్దుచేయాలని, కంపెనీ పూర్తిగా వైదొలగాలని ఉద్యమిస్తున్నారు. అయితే ఈ ప్రాంత ప్రజలపై, ఉద్యమ నాయకత్వంపై వివిధ బూర్జువా రాజకీయ పార్టీల, ఎన్.జి.ఒ సంస్థల ప్రభావం వుంది. దీని కారణంగా నాయకత్వం మిలిటెంట్ పోరాటాలకు సిద్ధపడకపోవడం, కొద్దిమంది అమ్ముడు పోవడం, స్పాంటేనియస్‌గా ఉద్యమం కొనసాగడం, మహిళల భాగస్వామ్యం చాలా తక్కువగా ఉండటం వంటి బలహీనతలు కొనసాగుతున్నాయి.

జీవనాధారమైన మాలిని రక్షించుకునేందుకు సంఘాన్ని ఏర్పాటు చేసుకుని కంపెనీ దళారులను, గూండాలను సంఘటితంగా, మిలిటెంటుగా ఎదుర్కొంటూ "మాలిపర్వతంపై హక్కు మాదేనంటూ'' నినదిస్తున్నారు. బూర్జువా రాజకీయ పార్టీల నిజస్వరూపాన్ని గుర్తిస్తూ ఎన్నికల బహిష్కరణకు ముందుకొస్తున్నారు. అయితే భూస్వామ్య, దళారీ నిరంకుశ బూర్జువా, సామ్రాజ్యవాదుల ఆధిపత్యాన్ని కూలదోసి నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయవలసిన ఆవశ్యకతను గుర్తించి ప్రజాయుద్ధంలో భాగంకావడంతో పాటు పార్టీ, ఆర్.పి.సి, మిలీషియాను నిర్మించుకోవాలి. వీటితో పాటు విస్థాపన సమస్యను ఎదుర్కొంటున్న ఈ ప్రాంతంలోని దేవమాలి, సేరుబంద, గాలిగబడేరు, పొట్టంగిపర్వతం (ఈ ప్రాంతాలలో నాల్కొ కంపెనీ సర్వేను పూర్తిచేసింది.), ఇతర ప్రాంతాలలోని నిర్వాసిత, ఇతర ఉద్యమాలతో కలసి విశాల ప్రజా ఐక్యసంఘటనను నిర్మించాల్సి వుంటుంది. మైనింగ్‌వల్ల జరగబోయే నష్టాన్ని ప్రచారం చేస్తూ ఈ ప్రాంతానికి వెలుపల ఉన్న మైదాన, పట్టణ ప్రాంతాలలోని వివిధ సెక్షన్ల ప్రజల మద్దతును కూడగట్టాలి. ఇవన్నీ చేయడం ద్వారా మాత్రమే "మాలిపర్వతాన్ని" రక్షించుకోగలుగుతారు.

❍

**(33వ పేజి తరువాయి)**

ఈ పత్రికల్లో కొన్ని రచనలు చేసింది. క్రాంతి పత్రికకు విద్యారంగం మీద ఒక వ్యాసం రాసింది.విశాఖలో 'వాకపల్లి' ఘటనపై ప్రచురించిన పుస్తకంలో పాలక వర్గ దోపిడీ విధానాలను వ్యతిరేకిస్తూ ప్రధాన వ్యాసం రాసింది. కా.మహిత సిద్ధాంత అధ్యాయనలపైనే కాకుండా నిర్ధిష్ట అధ్యయనంపై కూడా దృష్టి పెట్టింది. డి.కెలో ప్రజలపై విప్లవోద్యమ ప్రభావం, వుద్యమం ఎదుర్కొంటున్న సమస్యలు, ఇత్యాది విషయాలపై నిర్దిష్ట అధ్యయనం చేపట్టి, విశ్లేషణ జరిపి విలువైన అభిప్రాయాలు, సూచనలు పార్టీకి అందించింది. తాను అమరత్వం చెందే నాటికి 'ఆవనారు' ఆర్.పి.సిపై లోతైన పరిశోధన జరిపి, విప్లవోద్యమ పురోగమనానికి కొన్ని సూచనలు చేసింది.

మహితకి చిన్నప్పటి నుంచి కూడా మైగ్రేన్ తలనొప్పి వుండేది. ఎసిడిటి సమస్య వుండేది. సీరియస్ తలనొప్పి, గ్యాస్ట్రిక్ ఎసిడిటితో పాటు మలేరియా జ్వరం వరుసగా వచ్చేది. జ్వరంతోనే క్లాసులకి తయారయ్యేది. ఎంత అనారోగ్యం వున్నా, తన పనులు ఏవీ ఆపేది కాదు. తన అనారోగ్యంతో పనులు ఆగకూడదు అని కోరుకునేది.

**మన నేస్తం:**

మహిత అందరితో కలిసిపోయేది. అందరి నుండి ప్రేమాప్యాయతలు కోరుకునేది. కామ్రేడ్స్ మధ్య ఒక రాజకీయ వాతావరణం, స్వేచ్ఛగా అభిప్రాయాలు, ప్రేమా ఆప్యాయతలు పంచుకునే వాతావరణం వుండాలని ఎప్పుడూ కోరుకునేది. కామ్రేడ్స్ ఎవరైనా అనారోగ్యంగా వుంటే వారికి బాగా సేవలు చేసేది. వాళ్ళ ఆరోగ్యం బాగై మంచిగా అయ్యేంత వరకూ తపనపడేది. మహిళా కామ్రేడ్స్‌కి వాళ్లు ఏమైనా వ్యక్తిగత సమస్యల్లో వున్నప్పుడు ధైర్యం చెప్పి, రాజకీయంగా నిలబడేలా వుత్సాహపరిచేది. మహిళలు అన్ని రంగాల్లో పనిచేయాలని ఎదగాలని బలంగా కోరుకునేది.

32 ఏళ్ళుగా కా.మహిత చేసిన విప్లవ కృషి ఈ దేశ విప్లవోద్యమ పురోగమనంలో నిబిడీకృతమై వుంది. ఆమె ఈ దేశ పీడిత ప్రజల విముక్తి, మరీ ముఖ్యంగా మహిళల విముక్తి, కార్మిక వర్గ సిద్ధాంతమైన మార్క్సిజం-లెనినిజం-మావోయిజం ద్వారానే సాధ్యమని బలంగా విశ్వసించింది. ఈ విశ్వాసాన్ని అధ్యయనం ద్వారా, ఆచరణ ద్వారా మరింతగా బలపరుచుకొంటూ పోయింది. చివరి రోజులలో వుద్యమం ఎదుర్కొంటున్న సమస్యలకు సైద్ధాంతిక పరిష్కారాలు కనుగొనేందుకు తపన పడింది. అయితే వ్యక్తిగత జీవితంలో ఎదురైన కొన్ని సమస్యలను మాత్రం గతితార్కికంగా అర్థం చేసుకోలేక తీవ్రమైన వేదనకు గురైంది. ఆమె జీవితంలో ఇదొక తీవ్రమైన వైరుధ్యం. కానీ ఆమె తన చివరి సందేశంగా పార్టీలోని మహిళా కామ్రేడ్స్‌కు 'సిద్ధాంతాన్ని, పార్టీని వదలకుండా చివరి వరకు పోరాడండి, అని పిలుపునిచ్చింది.

కా.మహిత ప్రజల, పార్టీ శ్రేణుల హృదయాల్లో ఒక మరిచిపోలేని జ్ఞాపకంగా ఎప్పటికీ నిలిచిపోయింది. ❍

నివేదిక

# గంజాయి సాగు - దాని విష ఫలితాలు - పరిష్కారాలు

గంజాయి సాగు ఆంధ్రా ఒరిస్సా సరిహద్దు ప్రాంతంలో మూడు పువ్వులు ఆరుకాయలుగా వర్ధిల్లుతున్నది. ఒకప్పుడు మారు మూల ప్రాంతాల్లో పండించేది ప్రస్తుతం బహిరంగంగానే పండిస్తున్నారు. సాంప్రదాయ పద్ధతి వదిలివేసి ప్లాంటేషన్ పద్ధతిలో గరిష్టంగా అధిక ఉత్పత్తి సాధిస్తున్నారు. గతంలో ఎవరికీ కనపడని ప్రాంతంలో అడవి నరికి, కాల్చి వర్షాధారంగా చేసేవారు. ప్రస్తుతం దూరం నుంచి పైపులు, కాలువలు, ఇంజెనుల ద్వారా ప్లాంటేషన్ పద్ధతిలో పెద్దమొత్తంలో రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందులువాడి ఖరీదైన శీలావతి గంజాయి పండిస్తున్నారు.

గంజాయి మత్తు పదార్ధ పంట, అమానవీయ పంట. అది తాగిన వాళ్ళు గంటలకొద్ది మత్తులో తేలియాడుతుంటారు. శారీరకంగా అనారోగ్యానికి గురవుతారు. మానసికంగా నిష్క్రియా పరులుగా తయారవుతారు. సాదారణ గంజాయి కంటే శీలావతి గంజాయి గాఢత ఎక్కువ. దాని రేటు కూడా ఐదు, ఆరు రెట్లు ఎక్కువ.

ఒడిశాలో షావుకార్లు, తమిళనాడు, కేరళ, హైదారాబాద్, విశాఖ, విజయవాడ వంటి పెద్ద పట్టణాల షావుకార్లు మల్కన్‌గిరి సరిహద్దు ప్రాంతంలో ఉన్న స్థానిక దళారుల ద్వారా గంజాయిని కొనుక్కొని పోతుంటారు. శీలావతి గంజాయి విత్తనాలు కేరళ, తమిళనాడు షావుకార్లు తెచ్చి మొదట వ్యాప్తి చేసారు. గంజాయి పంట పోలీసు ఎక్సైజ్ విభాగాలకు కాసుల పంటగా మారింది. సీలేరు, డొంకరాయి, గూడెం, చింతపల్లి పోలీస్ స్టేషన్ ఉన్నతాధికారులు గంజాయి మామూళ్ళు కోసం బదిలీలు కాకుండా ఉండడానికి వేలాది రూపాయలు ఖర్చు పెడుతున్నారు. శీలావతి గంజాయికి గుంతకు ముప్పై రూపాయల చొప్పున మామూళ్ళు ఇవ్వాలనీ, ఊరుమొత్తం కలసి కొంత ఇవ్వాలనే షరతులతో అనుమతులు ఇస్తున్నారు.

తక్కువ భూమిలో తక్కువ కాలపరిమితిలో ఎక్కువ ఆదాయం పొందటం గంజాయి పంటలో విశిష్టత. మారుమూల ఆదివాసీ ప్రాంతాలలో సామ్రాజ్యవాద విషసంస్కృతి (వస్తు వ్యామోహ సంస్కృతి) చొచ్చుకు వచ్చిన తరువాత గంజాయి సాగు వుధృతి ఎక్కువైంది. గంజాయి పంట వచ్చిన తరువాత ఆదివాసీ సంస్కృతి దెబ్బతిని పోతున్నది. పండుగలకు, పెండ్లిళ్ళకు ఆట, పాటలతో కూడిన సాంప్రదాయక సంస్కృతి పోయి సినిమా డాన్సులు వచ్చాయి. అక్కడక్కడ యువత డెక్కులు పెట్టి రికార్డ్ డాన్సులు వేస్తున్నారు. సమిష్టితత్వం నశించిపోయింది. ఇంతకు ముందు వ్యవసాయ పనులలో పరస్పరం సహకరించుకొనేవారు. వరినాట్లు, కలుపుతీత, పంట కోతలప్పుడు సహకరించుకునే పద్ధతి వుండేది. పనిలోకి వచ్చినవారికి ఒక పూట అన్నం పెట్టేవారు. ప్రస్తుతం గంజాయి సాగులో కూలి ఇస్తున్నారు. సాంప్రదాయక జీలుగుకల్లు తగ్గి బీరు, బ్రాందీలు వచ్చాయి. వ్యభిచారం కోసం పట్టణాలకు పోవటం అలవాటైంది. మొబైల్, మోటారు సైకిళ్ళ, టీవీల వాడకం పెరిగింది. మార్కెట్‌లోకి కొత్తగా వచ్చిన వస్తువులు విడవకుండా కొనడం పెరిగింది. సంతలలో బ్యూటీ పార్లర్‌లు వెలిసాయి. ఆచార వ్యవహారాలకు ఖర్చు పెట్టడం ఎక్కువైంది. మొబైల్స్, బూతు సినిమాలు చూడటం పెరిగి యువతలో హింసా ప్రవృత్తి, విచ్చలవిడితనం పెరిగింది. ఆపదలో ఉన్నప్పుడు ఆదుకొనే మనస్థత్వం ఆదివాసులలో సహజంగా వుంటుంది. రాను రాను అదితగ్గి వ్యక్తివాదం పెరుగుతున్నది.

విశాఖ ఆదివాసీ మండల కేంద్ర షావుకార్లు మారుమూల ఆదివాసీ ప్రాంతంలో పెట్టుబడులు పెట్టి గంజాయి సాగు చేయించి అధిక మొత్తంలో దోపిడి కొనసాగిస్తున్నారు. పెట్టుబడులు తీసివేసి షావుకారుకు ఒక భాగం, చేసినవారు ఒక భాగం తీసుకొంటారు. లేదా ఎరువులు, పురుగు మందులను అధిక వడ్డీకి గంజాయి సాగుదార్లకు ఇస్తారు.మల్కన్‌గిరి జిల్లాలో చిత్రకొండ, సీలేరు షావుకార్లు పప్పులూరు, కటాఫ్ ఏరియాలో పెట్టుబడులు పెట్టి గంజాయి సాగు చేయిస్తున్నారు.

గంజాయి నిషేధ పంట. బహిరంగ మార్కెట్‌లో అమ్ము కోలేరు. నిలువ వుంచుకొని ఇతరములుగా ఉపయోగించుకోలేరు. ఇది ఆహార పంట కాదు. షావుకార్లు కొనక పోతే పెట్టుబడులు రావు. గంజాయి సరుకు అమ్ముడుపోక అప్పులు పాలైనవారున్నారు. గంజాయి పంట వచ్చిన తరువాత ఆదివాసీ ప్రాంతాలలో అనేక మార్పులు వచ్చాయి. సాంప్రదాయ పంటలు ధాన్యం, చోల్లు, సామలు, కందులు, వ్యాపార పంటలు అల్లం, పసుపు, సరుకు (పిప్పళ్ళు), రాజ్‌మాల ఉత్పత్తి తగ్గింది. వాటికి సంతలలో గిట్టుబాటు ధర లభించడం లేదు. వ్యాపారస్థులు సిండికేటు అయి తక్కువ ధరలకు కొంటున్నారు. సంవత్సరాల తరబడి ఒకే భూమిలో ఒకే రకం పంట పండించడం వలన భూసారం లేక ఉత్పత్తులు తగ్గి పండిన వాటికి కూడా సరైన ధర లభించక పోవడం వలన ఏజెన్సీ ప్రాంతవాసులు గంజాయి సాగు వైపు మొగ్గు చూపుతున్నారు.

గంజాయి పంటకు విపరీతంగా రసాయానిక ఎరువులు, క్రిమిసంహారక మందులు వాడుట వలన భూమి సారం కోల్పోవటంతో పాటు వాతావరణ కాలుష్యంకు గురవుతున్నది. ఇతర పంటలు తగ్గటం వలన వదిలివేసిన భూములలో నక్కగడ్డి విపరీతంగా పెరుగుతున్నది. ఆ గడ్డి పశువుల మేతకు, ఇంటి కప్పుకు పనికిరాదు. అదివుంటే ఏ మొక్క బ్రతకదు. గంజాయి మోత కూలీలుగా పోయినవారు అరెస్టయి, షావుకార్లు విడిపించక సంవత్సరాల తరబడి జైళ్ళలో మగ్గుతున్నారు. గంజాయి రవాణాకు ఆదివాసీ స్త్రీలను మోసం చేసిన ఘటనలు కూడా వున్నాయి. కొంత మంది స్త్రీలు మోసాలు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకొని చనిపోయిన వారుకూడా వున్నారు. గంజాయి పంట వలన ఆదివాసీలు బాగుపడ్డది ఏమిలేదు. ముఖ్యంగా పోలీసులు, ఆదివాసీ ప్రాంతాలకు ఆనుకొని వున్న మైదాన ప్రాంత షావుకార్లు లాభపడుతున్నారు.

వాస్తవాలు పై విధంగా వుంటే, విశాఖ పోలీసు అధికారులు మాత్రం 'మావోయిస్టు పార్టీ ఆదివాసీ ప్రాంతంలో గంజాయిని ప్రోత్సహిస్తూ షావుకార్ల నుండి లక్షల రూపాయల నిధులు వసూలు చేస్తున్నదని' దుష్ప్రచారానికి పూనుకొన్నారు. వాస్తవంగా పోలీసు అధికారులు, షావుకార్లు, స్థానిక రాజకీయనాయకులు ఒక దుష్ట

కూటమిగా ఏర్పడి గంజాయి పంటపై కోట్లాది రూపాయలు సంపాదిస్తున్నారు. మరోవైపు గంజాయి సాగు పేరుతో కొంత మంది ఏజంట్లను ఉద్యమ ప్రాంతంలోకి పంపి ఉద్యమ సమాచారాన్ని సేకరిస్తున్నారు. పోలీసులు అనుసరిస్తున్న ఈ కుటిల ఎత్తుగడలను తిప్పికొడ్తూ, గంజాయి మహమ్మారి బారి నుండి ఆదివాసి రైతాంగాన్ని కాపాడేందుకు పార్టీ ఇప్పటికే అనేక రక్షణ చర్యలు చేపట్టింది.

విప్లవ ప్రజాకమిటీలున్న ప్రాంతాలలో ప్రజల చైతన్యంపై ఆధారపడి గంజాయిని నిషేధిస్తున్నది. మొత్తంగా ఉద్యమ ప్రాంతమంతటా గంజాయి పంటను నిరుత్సాహపరుస్తూ ప్రచార కార్యక్రమం తీసుకున్నది. ముఖ్యంగా ప్రజలు పోరాడి సాధించుకున్న భూములలో గంజాయి పంటను పూర్తిగా నిషేధించింది. మైదాన ప్రాంతాలవారు అటవీ ప్రాంతంలో గంజాయి సాగు చేయడాన్ని నిరోధిస్తున్నది. కలిమెల, పప్పులూరు ప్రాంతాలలో ప్రజలను పెద్ద సంఖ్యలో సమీకరించి, గంజాయి పంటను ఒక పరిశ్రమగా నడుపుతున్న మైదాన షావుకార్లపై దాడి చేసి గంజాయి పంటను ధ్వంసం చేసింది. వారి ఆస్తులను స్వాధీనంచేసుకుని ప్రజలకు పంచింది. గంజాయి పంటకు వ్యతిరేకంగా పార్టీ చేస్తున్న కృషి ఫలితంగా, కొన్ని ప్రాంతాలలో రైతాంగం పరిమిత సంఖ్యలో గోతులు తవ్వి గంజాయి సాగు చేయాలని స్వయంగా నియంత్రణా చర్యలు చేపట్టారు.

అయితే ప్రస్తుతం పార్టీ, ప్రజాసంఘాలు చేస్తున్న కృషి ఏమాత్రం సరిపోదు. ముఖ్యంగా ఇప్పుడు 'చేస్తున్న కృషి' ని కొనసాగిస్తూనే ఉద్యమ ప్రాంతమంతటా గంజాయి పంటను నిషేదించాలంటే ప్రజలను ప్రజాయుద్ధ రాజకీయాలతో మరింతగా సంఘటిత పరచాలి. ఈ క్రమంలోనే ప్రజా సాయుధ బలగాలు, విప్లవ ప్రజాకమిటీలు ఏర్పడి ప్రజలు ఉన్నతమైన చైతన్యంతో గంజాయి, మతం, సామ్రాజ్యవాద సంస్కృతి వంటి మెదడును మొద్దు బరిచే మత్తులను తమ జీవితాలనుండి నెట్టివేయగలుగుతారు.

**గంజాయి వ్యతిరేక పోరాటంలో భాగంగా గుమ్మ, కోరుకొండ ఏరియా కమిటీలు రూపొందించిన పోస్టర్.**

**ప్రజలకు మూడు మార్గ దర్శకాలు:**

1.పోరాడి సాధించుకున్న భూములలో గంజాయి సాగు చేయవద్దు
2.బయటి వ్యక్తుల గంజాయి సాగును అనుమతించవద్దు
3.గంజాయి పంటను పూర్తిగా నివారించే దిశగా కృషి చేయండి

**మూడు నష్టాలు:**

1. గంజాయి పంటవల్ల అహార పంటలు తగ్గి మార్కెట్‌లో ఎక్కువ ధరకు ధాన్యం కొనుక్కోవలసి ఉంటుంది.
2. గంజాయి డబ్బు వల్ల మన ఇళ్ళలోకి పనికిమాలిన చెత్త వస్తువులతో పాటు, సామ్రాజ్యవాద విషసంస్కృతి ప్రవేశించి కుటుంబాలతో పాటు, మన సమాజమూ నాశనం అవుతుంది.
3. గంజాయి షావుకార్ల వద్ద లంచాలు మేస్తూ, రైతుల వద్ద గొయ్యికి ముప్పై రూ॥ల చొప్పున వసూలు చేస్తున్న పోలీసులే గంజాయి పండిస్తున్నారన్న ఆరోపణతో మిమ్మల్ని అరెస్టు చేస్తారు.

**మూడు నినాదాలు:**

1.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా గెరిల్లా యుద్ధాన్ని తీవ్రతరం చేస్తూ విప్లవ ప్రజాకమిటీలను నిర్మించండి.
2.గంజాయి సాగును నిలిపివేయండి
3.సేంద్రియ వ్యవసాయ పద్ధతులలో అహార పంటలను పండించండి.

❍

**సెప్టెంబర్ 21 - 2014 కు భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) ఏర్పడి 10 సంవత్సరాలు నిండుతున్న సందర్భంగా, దశాబ్ధి ఉత్సవాలను 10 రోజులు (సెప్టెంబర్ 21 నుండి 30 వరకు) పాటు ఘనంగా జరుపుకుందాం!**

**నినాదాలు:**

1. **పార్టీని బోల్షివీకరించి బలోపేతం చేయాలి!**
2. **కఠిన పరిస్థితులను ఎదుర్కొంటూ అత్యంత ధైర్య సాహసాలతో ముందుకు సాగేలా పార్టీని దృఢతరం చేయాలి!**
3. **శత్రు దాడుల నుండి పార్టీ నాయకత్వాన్ని కాపాడుకోవాలి! రహస్య పని విధానాన్ని అభివృద్ధి చేసుకోవాలి!**
4. **మితవాద అవకాశవాదాన్ని ఓడించాలి! మార్క్సిజాన్ని ఎత్తిపట్టాలి!**
5. **పార్టీని నూతన ప్రాంతాలకు విస్తరింప చేయాలి!**
6. **ప్రజా విముక్తి గెరిల్లా సైన్యంలో పార్టీని శక్తివంతం చేయాలి!**
7. **ప్రజాసంఘాల్లో, విప్లవ ప్రజాకమిటీల్లో పార్టీని బలోపేతం చేయాలి!**
8. **ప్రపంచ కార్మిక వర్గానికి పీడితులకు ఆశజ్యోతిగా పార్టీని నిలపాలి! కార్మిక వర్గ అంతర్జాతీయతను చాటాలి!**

పత్రిక ప్రకటన

# కా॥ గంటి ప్రసాదంను, కాంగ్రెసు ప్రభుత్వ హంతక ఎస్.ఐ.బి పోలీసులు హత్య చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం !

**కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వుద్యమాలపైన, విప్లవోద్యమంపైన కొనసాగిస్తున్న గ్రీను హంట్‌దాడిలో భాగమే ఈ హత్య !**

**కా॥ గంటి ప్రసాదం హత్యకు నిరసనగా జులై 15 నుండి 21 వరకు వివిధ పద్ధతులలో నిరసన వారాన్ని పాటించండి!**

**జులై 21న ఏ.పి, ఏ.ఓ.బిల బంద్‌ను పాటించండి!**

జులై 4 తేదీన నెల్లూరు పట్టణంలో ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ ఎస్.ఐ.బి నరహంతక పోలీసు మూకలు కా॥గంటి ప్రసాదంను అతి దారుణంగా హత్య చేశారు. మరో వైపు ఈ హత్యతో తమకేమీ సంబంధం లేనట్లు 'మాజీ మావోయిస్టు గంటి ప్రసాదంను నెల్లూరు పట్టణంలో గుర్తు తెలియని దుండగులు హత్య చేశారనీ, వారిని త్వరలో పట్టుకుంటామని' ప్రకటించారు. ఆంధ్ర ప్రదేశ్ ఎస్.ఐ.బి పోలీసులు బూటకపు ఎన్‌కౌంటర్ల పేరుతోనూ, గూండా గ్యాంగుల ద్వారానూ, హత్యలు చేసి కట్టు కథలల్లడాన్ని ఒక కళగానే అభ్యసించారు. ఈ సారి కూడా కా॥గంటి ప్రసాదంను హత్య చేసి ప్రజలను పక్కదారి పట్టించేందుకు గుర్తు తెలియని దుండగులు హత్య చేశారని ప్రచారం చేస్తున్నారు. అట్లాగే పోలీసులు చెబుతున్నట్లు ఆయన మాజీ మావోయిస్టు కాదు, నిఖార్సు అయిన నేటి మావోయిస్టు.

ఈ హత్య కేవలం యాదృచ్ఛికమైనది కాదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో ప్రజాస్వామిక ఉద్యమాలకు, ప్రజాస్వామిక వాదులకు ఒక హెచ్చరికగానే జరిగింది. ఒక ప్రణాళిక ప్రకారం, ప్రజాస్వామిక ఉద్యమాలను దెబ్బతీసేందుకూ, ప్రజలలో భయోత్పాతం సృష్టించేందుకు ప్రభుత్వం ఈ హత్య చేసింది. ఎందుకంటే నేడు దేశంలో జరుగుతున్న ప్రజా ఉద్యమాలు, విప్లవోద్యమం ప్రభుత్వాలను తీవ్రంగా గాబరాకు గురి చేస్తున్నాయి. ముఖ్యంగా దండకారణ్యంలో పెరుగుతున్న ప్రజా యుద్ధానికి మద్దతుగా ఆంధ్ర ప్రదేశ్‌లో ప్రజా ఉద్యమం సంఘటితపడుతున్నది. ప్రజలలో పెరుగుతున్న ఈ చైతన్యం తిరిగి ఏ.పిలో విప్లవోద్యమం పునరుద్ధరణకు పునాదులు నిర్మిస్తున్నది. మరో వైపు బహుళజాతి సంస్థలకు, కార్పరేట్ సంస్థలకు, భూస్వాములకు వ్యతిరేకంగా మిలిటెంట్ పోరాటాలు ఊపందుకుంటున్నాయి. ఈ పరిస్థితిని ఎంత మాత్రము సహించలేని దోపిడీ పాలక వర్గ ప్రభుత్వాలు, ఈ హత్య చేసి తమ ఫాసిస్టు నైజాన్ని మరింతగా చాటుకున్నాయి. ప్రభుత్వం ఈ హత్య ద్వారా ఆంధ్ర ప్రదేశ్‌లోని ప్రజాస్వామికవాదుల, మేధావుల గొంతు నొక్కాలని చూస్తున్నది. కా.గంటి ప్రసాదం ఎమ్.ఎల్.ఎమ్.ను తన సైద్ధాంతిక దృక్పథంగా చేసుకొన్నప్పటికీ బహిరంగంగా, చట్టబద్ధంగా తన కార్యకలాపాలు నిర్వహిస్తూ వస్తున్నాడు. మావోయిస్టు భావాలు కలిగి వుండటం, ప్రచారం చేయడం నేరమేమికాదని సుప్రీం కోర్టు తీర్పు చెప్పింది. అయినా ఈ ప్రభుత్వం ఆయనను హత్య చేసింది. అందుకే ఈ ప్రభుత్వ స్వభావాన్ని అర్థం చేసుకోవాలని కోరుతున్నాం. ఇక్కడ కనబడే పార్లమెంటరీ ప్రజాస్వామ్యం, ప్రజాస్వామిక రిపబ్లిక్, సార్వజనీన ఓటింగు అన్నీ ముసుగులే. అసలు స్వరూపం దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వర్గాల నిరంకుశత్వమే. ఈ వర్గాల ప్రయోజనాలకు ఏమాత్రం హాని కలిగినా రాజ్యం తన సాయుధ బలగాల ద్వారా బలప్రయోగాన్ని అమలు చేస్తుంది. న్యాయం, ప్రజాస్వామ్యం, చట్టం, రాజ్యాంగం వుత్త మాటలుగానే మిగులుతాయి. ఇప్పుడు జరిగిన ఈ హత్యను కూడా ఈ నేపథ్యంలోనే చూడాలి. ఈ ప్రభుత్వ ఫాసిస్టు చర్య ఇక్కడతో ఆగదు. ప్రభుత్వ ఫాసిజం, టెర్రరిజం మరింత వికృత రూపం దాల్చి ప్రజా వుద్యమాలపైనా, ప్రజా సంఘ నాయకులపైనా విరుచుకపడబోతున్నది. కనుక రాష్ట్రంలోని ప్రజాస్వామికవాదులు, ప్రజలు ఈ హత్యను నిరసించడంతో పాటు, ఈ దోపిడీ వర్గాల నిరంకుశత్వాన్ని నిర్మూలించేందుకు బలమైన ప్రజాస్వామిక ఉద్యమం నిర్మించేందుకు చురుగ్గా, త్యాగపూరితంగా కదలమని పిలుపునిస్తున్నాం.

కా॥ గంటి ప్రసాదం విప్లవ కుటుంబం నుండి వచ్చాడు. ఆయన తమ్ముడు కా॥గంటి రమేష్ మా పార్టీలో పని చేస్తూ 1998లో కోపరడంగ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్లో అమరుడైనాడు. అమ్మ, అన్నలు అందరూ గొప్ప విప్లవసానుభూతిపరులు. కా॥ప్రసాదం 2005 దాకా రహస్య జీవితం గడుపుతూ ఏ.పి రాష్ట్ర కమిటీ సభ్యుడుగా వివిధ బాధ్యతలను నిర్వహించాడు. 2005లో అరెస్ట్ అయి విడుదలైన తర్వాత, అనారోగ్యం, వయసు పైబడిన రీత్యా బహిరంగంగా వుంటూ వివిధ ప్రజా సంఘాలకు, ప్రజా వుద్యమాలకు సిద్ధాంత, రాజకీయ మార్గదర్శిగా వుంటూ వచ్చాడు. ఆయన మరణం పీడిత ప్రజలకు ఎనలేని నష్టాన్ని కలిగించింది. ఆయన మరణం విప్లవ శ్రేణుల్లోనూ, ప్రజలలోనూ మిక్కిలి దు:ఖాన్ని కలిగించింది. ముఖ్యంగా ఆయన కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలియజేస్తూ వారి దు:ఖంలో పార్టీ పాలుపంచుకుంటుందని తెలియజేస్తున్నాం. ఈ హత్యకు పాల్పడ్డ కిరణ్ కుమార్ రెడ్డి ప్రభుత్వం ప్రజల ఆగ్రహాన్ని చవిచూడాల్సి వుంటుందని తెలియజేస్తున్నాం.

**కార్యక్రమం:**

4/7 న కా॥గంటి ప్రసాదాన్ని ప్రభుత్వ పాసిస్టు ఎస్.ఐ.బి పోలీసు మూకలు హత్య చేయడాన్ని నిరసిస్తూ 15/7 నుండి 21 వరకు నిరసన వారాన్ని పాటించండి. 15 నుండి 21 వరకు ప్రజా నిరసనను తెలిపే పోరాట రూపాలను రోజుకొకటి అమలు చేయండి. ఈ కార్యక్రమాలలో ప్రజలను విస్తృతంగా కదిలించండి. 21న ఏ.పి, ఏ.ఓ.బిలలో బంద్‌ను పాటించండి.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ సెక్షన్ల ప్రజలు, ప్రజాస్వామికవాదులు విస్తృతంగా పాల్గొనాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

**రాజకీయ ప్రతినిధి**
**సి.పి.ఐ (మావోయిస్టు).**
**ఎ.ఒ.బి స్పెషల్ జోనల్ కమిటీ**

**పత్రిక ప్రకటన**

# సీమాంధ్ర ప్రజానీకానికి సి.పి.ఐ (మావోయిస్టు) ఏ.ఓ.బి ఎస్.జడ్.సి విజ్ఞప్తి.

**ప్రియమైన ప్రజలారా,**

**"సమైక్యాంధ్ర ప్రదేశ్' నినాదము భావోద్వేకమైనదే కానీ హేతుబద్ధమైనది కాదు, ప్రజాస్వామికమైనది అంతకన్నాకాదు.**

రెండు మాసాలకు పైగా సీమాంధ్రకు చెందిన పదమూడు జిల్లాలలో ప్రజానీకం "సమైక్యాంధ్ర ప్రదేశ్" నినాదంతో నిర్వహిస్తున్న వుద్యమంలో ప్రజాస్వామిక ఆకాంక్షకన్నా ఆధిపత్య ధోరణి కనిపిస్తున్నది. ఈ ఆధిపత్య ధోరణి గత కొన్ని దశబ్ధాలుగా సీమాంధ్ర, తెలంగాణా శ్రామిక ప్రజల మధ్య కొనసాగుతున్న గొప్ప సుహృద్భావ సంబంధాలు దెబ్బతీస్తున్నది. ఈ రెండు ప్రాంతాల ప్రజలు విప్లవ పార్టీ నాయకత్వంలో దేశంలో నిజమైన ప్రజల ప్రజాస్వామ్యాన్ని నిర్మించే లక్ష్యంతో గత ఆరు దశాబ్ధాలుగా దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వర్గాలకు, సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా పోరాడుతూ బలమైన వర్గసమైక్యతను పెంపొందించుకున్నారు. ఇప్పుడు "సమైక్యాంధ్ర ప్రదేశ్" నినాదము రెండు ప్రాంతాల ప్రజల మధ్య చీలిక తెచ్చి దోపిడి పాలక వర్గాలకు మరింత కాలం అధికారంలో కొనసాగేందుకూ, ప్రజలపై దోపిడి పీడనలను అమలు చేసేందుకు దోహదపడుతుంది. ఈ ప్రమాదాన్ని దృష్టిలో వుంచుకొని ప్రత్యేక తెలంగాణా రాష్ట్ర ఏర్పాటును ఆమోదించవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం.

ఇక ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర డిమాండ్ అక్కడి ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్షగా ఎందుకు మారిందో చరిత్రను అధ్యయనం చేస్తే అర్థంకానీ విషయం కాదు. ఈ విభజనకు కారకులెవరో తెలుసుకోవడం కూడా పెద్ద కష్టం కాదు. 1956లో జరిగిన ఆంధ్రప్రదేశ్ అవతరణ మూడు ప్రాంతాల మధ్య సంపూర్ణ విశ్వాసంతో జరగలేదు. అభివృద్ధి చెందిన కోస్తాంధ్ర పెట్టుబడిదారీ వర్గం ఈ విలీనాన్ని తమ స్వార్థ ప్రయోజనాలకు వుపయోగించుకుంటుందనే అనుమానాలు, శంకలు తెలంగాణా ప్రజలతో పాటు, అక్కడి బూర్జువా పార్టీల నాయకులలో సైతం ఆనాడు వ్యక్తమయ్యాయి. ఆనాడు కోస్తాంధ్ర పెట్టుబడిదారీ వర్గం నుండి కలగబోయే ప్రమాదాన్ని బహుశా ఊహించిన వారెవరూ వుండకపోవచ్చు. అయినా ఆ ప్రమాదాలను నివారించే "పెద్ద మనుషుల ఒప్పందం" వంటి ఉపాయాలను తయారు చేసి భాషా ప్రయుక్త రాష్ట్రాల పేరుతో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాన్ని ఏర్పర్చారు. అందరూ ఊహించినట్లుగానే "పెద్ద మనుషుల రాజకీయ ఒప్పందం" కాగితాలకే పరిమితమైంది. ఈ నేపథ్యంలో 1969లో ప్రత్యేక తెలంగాణా వుద్యమం బద్ధలైంది. ఈ పోరాటంలో రాజ్యహింసకు 300 మందికి పైగా యువత బలైనారు. ఈ పోరాటానికి నాయకత్వం వహించిన తెలంగాణా ఫ్యూడల్ (భూస్వామ్య), బూర్జువా వర్గాల ప్రతినిధి అయిన మర్రి చెన్నా రెడ్డి పరమ నీచంగా ఆనాటి ప్రధాని ఇందిరాగాంధీ పాదాల చెంత మోకరిల్లి ముఖ్యమంత్రి పదవి దక్కగానే వుద్యమానికి ద్రోహం చేశాడు. ఆ తర్వాత ఎన్.టి.ఆర్ హాయంలో రూపొందించిన 610 జి.వో కూడా ఆచరణలో అటకెక్కింది. ఇన్ని ఉల్లంఘనలు, మోసాలతో విసిగి వేసారిన తెలంగాణా ప్రజలలో ప్రత్యేక తెలంగాణా ఆకాంక్ష మాత్రం మరింతగా బలపడుతూ వచ్చింది.

ఈ నేపథ్యంలోనే 1996 నాటికి మలిదశ ప్రత్యేక తెలంగాణా వుద్యమం ప్రారంభమైంది. ఈసారి మా పార్టీ మలిదశ ప్రత్యేక తెలంగాణా వుద్యమంలో కీలక పాత్ర వహిస్తూ వచ్చింది. 1998లో వరంగల్‌లో భారీ బహిరంగ సభ జరిపి, "ప్రజాస్వామిక తెలంగాణా కోసం పోరాడండి' అనే పిలుపునిస్తూ వరంగల్ డిక్లరేషన్‌ను ప్రకటించింది. 1969లో కూడా మా పార్టీ ప్రత్యేక తెలంగాణా వుద్యమాన్ని బలపరిచింది. ఈ రెండు సందర్భాలలోనూ సీమాంధ్ర విప్లవ ప్రజానీకం మా పార్టీ నాయకత్వంలో ప్రత్యేక తెలంగాణా వుద్యమానికి మద్దతు తెలుపుతూ తమ శ్రామిక వర్గ సమైక్యతను ప్రకటించారు. ఈసారి తెలంగాణా ప్రజలు ఐక్య, మిలిటెంట్ పోరాటం చేపట్టి కాంగ్రెస్, టి.డి.పి ఇతర బూర్జువా పార్టీల కుట్రలను ఎదుర్కొంటూ, టి.ఆర్.ఎస్ లాబియింగ్ రాజకీయాలను ఓడిస్తూ ప్రత్యేక తెలంగాణా రాష్ట్రాన్ని సాధించుకున్నారు. ఈ పరిస్థితులలో చరిత్ర క్రమాన్ని గానీ ప్రత్యేక తెలంగాణా రాష్ట్ర డిమాండ్‌కున్న హేతుబద్ధతునుగానీ ఏమాత్రం పట్టించుకోకుండా సమైక్య ఆంధ్ర ప్రదేశ్ నినాదాన్ని ఇవ్వడం స్వీయ మానసికత అవుతుందే తప్ప, విశాల ప్రజానీకపు న్యాయమైన ఆకాంక్షను ఏమాత్రం ప్రతిబింబించదు. పైగా ఆ నినాదం ప్రజల మధ్య చీలికను తెచ్చి దోపిడి వర్గాలకు ప్రయోజనం చేకూర్చుతుంది. కనుక హైదరాబాద్‌తో సహా తెలంగాణా పది జిల్లాలను కలిపి ప్రత్యేక తెలంగాణా రాష్ట్రంగా ఏర్పరిచే ప్రక్రియను వేగవంతం చేసే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తేవాల్సిందిగా తెలంగాణా ప్రజలతో పాటు సీమాంధ్ర ప్రజలకు కూడా విజ్ఞప్తి చేస్తున్నాం.

ఇక వనరుల పంపకం విషయంలో అందరికీ ఆమోదయోగ్యమైన తెలంగాణా, సీమాంధ్రలలోని మేధావులు, ప్రజాస్వామికవాదులతో కమిటీలను ఏర్పరుచుకొని సమస్యలను పరిష్కరించుకోవాలి. ఈ సందర్భంగా మా పార్టీ నుండి ఒక సూచన చేస్తున్నాము. 2004 శాంతి చర్చల కాలంలో ప్రజల అభిప్రాయాలను సేకరించేందుకు 'ప్రజా అసెంబ్లీ' అనే ఒక కొత్త నిర్మాణ రూపము వెలుగులోకి వచ్చింది. ఈసారి కూడా ప్రజల అభిప్రాయాలను తెలుసుకొని సరైన నిర్ణయాలు చేసేందుకు 'ప్రజా అసెంబ్లీ' నిర్మాణ రూపాన్ని ఎంచుకోవచ్చు. ఏదైనా రెండు ప్రాంతాల ప్రజలు తమ వర్గ ఐక్యత దెబ్బతినకుండా ఇచ్చి, పుచ్చుకోవడంలో విశాలంగా ఆలోచించాలి. ఈ మధ్య తెలుగు దేశం పార్టీ, వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీల నేతలు "సమన్యాయం" పేరుతో అవకాశవాద కుట్రలకు సిద్ధపడుతున్నారు. సమన్యాయం పేరుతో ఇప్పటి దాకా తెలంగాణా ప్రజలకు జరిగిన అన్యాయాన్ని మసిపూసి మారేడుకాయ చేయాలనీ చూస్తున్నారు. ముఖ్యంగా ఈ దోపిడీ వర్గాలు ప్రజల ముసుగులో తెలంగాణాలో పోగేసుకున్న తమ అక్రమ ఆర్జితాన్ని రక్షించుకోవాలని చూస్తున్నారు. కనుక తెలంగాణా ప్రజలకు జరిగిన అన్యాయాన్ని

సరిచేసే విధంగా రెండు ప్రాంతాల ప్రజలూ, వారు నియమించుకునే కమిటీలు అప్రమత్తంగా వుంటూ, దోపిడీ పాలక పార్టీల కుట్రలను ఎండగడుతూ ప్రజల మధ్య ఐక్యతను సాధించేలా వనరుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించాలి. ఈ సందర్భంగా నిర్లక్ష్యం చేయబడిన, సౌకర్యాలకు దూరం చేయబడిన ప్రజానీకానికి మేలు జరిగేలా చూడాలి. అందుకు సాపేక్షికంగా వనరులను అనుభవించిన ప్రజా సమూహాలు కొన్ని ఇబ్బందులకు సిద్ధపడుతూ, పంపిణీలో విశాల దృక్పథాన్ని అవలంభించాలి.

అయితే పాలక పార్టీలు వనరులకు సంబందించిన ఒక ముఖ్య విషయాన్ని దాటవేస్తున్నాయి. ఈ పాలక పార్టీలు సీమాంధ్ర, తెలంగాణాలోని అతివిలువైన ప్రకృతి వనరులనూ, ప్రజల సంపదను దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వర్గాలు, సామ్రాజ్యవాదులు కొల్లగొడుతుంటే ఆ ప్రక్రియకు చట్టపరంగా, రాజ్యాంగపరంగా హామీలనూ కల్పిస్తూ, నేడు రెండు ప్రాంతాల మధ్య జరగాల్సిన వనరుల పంపిణీని సంక్లిష్టంగా మారుస్తూ, ప్రజల మధ్య ద్వేషాగ్నిని రగిల్చి తమ ఎన్నికల పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారు. కనుక రెండు ప్రాంతాల ప్రజలు ఈ దోపిడీ పాలక పార్టీల కుట్రలను గమనిస్తూ తమ మధ్య జరగాల్సిన వనరుల పంపిణీ కార్యక్రమాన్ని సామరస్యంగా నిర్వహించుకోవటంతో పాటు సంస్కరణల ముసుగులో ఆయా ప్రాంతాల వనరులను కొల్లగొడుతున్న దోపిడీ పాలక వర్గాలకు వ్యతిరేకంగా మిలిటెంట్ పోరాటాలను సమైక్యంగా, సంఘీభావంతో నిర్వహించాలని పిలుపునిస్తున్నాం. ఇప్పటికే విశాఖ బాక్సైట్, శ్రీకాకుళం జిల్లాలోని సోంపేట, కాకరాపల్లి థర్మల్ ప్రాజెక్టులు, కోస్టల్ కారిడార్, నెల్లూరు థర్మల్ ప్రాజెక్టులు, సింగరేణి ఓపెన్ కాస్టులు, బయ్యారం ఇనుపగనులు, కవ్వాల టైగర్ జోన్, పోలవరం వంటి అనేక ప్రాజెక్టులలో వనరుల దోపిడి జరగడమే కాకుండా లక్షలాది మంది ప్రజలు విస్తాపితులవుతున్నారు. ఈ వనరుల దోపిడీలో పాలక పార్టీలన్నీ దోపిడీ దొంగలే. కనుక రెండు ప్రాంతాలలోని ప్రజలు, ప్రజాస్వామికవాదులూ వనరుల సంరక్షణతో పాటు దేశ సార్వభౌమత్వాన్ని కాపాడుకొనేందుకు నడుం కట్టాలి. ఇందుకు అసలు వనరులను సంరక్షించుకునే కార్యక్రమాన్ని ప్రక్కదారి పట్టించి, కొసరు సమస్యను (రెండు ప్రాంతాల మధ్య వనరుల పంపిణీ) ప్రధానం చేస్తున్న దొపిడీ పాలక పార్టీల కుట్రలను కూడా త్రిప్పి కొట్టాల్సిందిగా ప్రజలకు పిలుపునిస్తున్నాం. ఇకపోతే ప్రత్యేక తెలంగాణా రాష్ట్ర వుద్యమాలలాంటివి దోపిడీ పాలక వర్గాలు తమ స్వార్థ ప్రయోజనం కోసం చేపట్టే వివక్షాపూరిత పద్ధతుల వల్లనే ఉద్భవిస్తాయి. ఆంధ్ర ప్రదేశ్‌లో కూడా కోస్తాంధ్ర పెట్టుబడిదారీ పాలక వర్గం కేంద్రంలో తమకున్న పలుకుబడినీ; రాష్ట్రంలో వున్న అధికారాన్ని వినియోగించుకొని తెలంగాణా ప్రాంత అభివృద్ధిని పట్టించుకోకుండా తమ దోపిడీకి అడ్డాగా మార్చింది. అందుకే ప్రత్యేక తెలంగాణా రాష్ట్ర డిమాండ్ ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్షగా మారి వుద్యమ రూపాన్ని సంతరించుకుంది. సాధారణంగా ఇటువంటి వుద్యమాలకు కార్మికవర్గ పార్టీలతో పాటు దోపిడీ పాలక వర్గ పార్టీలు కూడా నేతృత్వం వహిస్తూ వుంటాయి. ఇటువంటి సందర్భాలలో దోపిడి పాలక వర్గ పార్టీలు తమ సంకుచిత, స్వార్థ ప్రయోజనాల కోసం ఇతర ప్రాంత ప్రజలను లక్ష్యంగా చేసుకోవటం, దూషించటం, ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే అన్ని సమస్యలు పరిష్కారం అవుతాయనీ ప్రజలకు భ్రమలు కల్పించటం చేస్తుంటారు. ఇప్పటి ప్రత్యేక తెలంగాణా వుద్యమంలో కూడా టి.ఆర్.ఎస్ నాయకుడు కె.చంద్రశేఖరావు ఇటువంటి పాత్రను పోషిస్తున్నాడు. అనేక సందర్భాలలో సీమాంధ్ర ప్రజలను కించపరిచే విధంగా బెదిరిస్తూ మాట్లాడాడు. ఇటువంటి చెత్తవాగుడును మా పార్టీ సీరియస్‌గా ఖండిస్తున్నది. ఈ వుద్యమానికి నేతృత్వం వహిస్తున్న మరికొంతమంది, అస్థిత్వవాదాన్ని నెత్తికెక్కించుకొని వర్గ దృక్పథాన్ని గాలికి వదిలి సీమాంధ్ర, తెలంగాణా ప్రాంతాలకు చెందిన ప్రజాస్వామికవాదుల మధ్య పోటీ పెట్టి చూడటం, సీమాంధ్ర ప్రజలను కించపరిచే విధంగా మాట్లాడటం వంటి సంకుచిత ధోరణులు అవలంభిస్తున్నారు. ఈ ధోరణులు పీడిత వర్గాల మధ్య ఐక్యతను దెబ్బతీసి దోపిడీ వర్గాలకు ఉపయోగపడేలా చేస్తాయి. ఇటువంటి ధోరణులు తెలంగాణాలో వుంటున్న సీమాంధ్ర ప్రజలను అభద్రతలోకి నెడతాయి. ఈ తప్పుడు వైఖరిని ఖండిస్తూ, తెలంగాణాలో ఆవాసం ఏర్పర్చుకున్న సీమాంధ్ర ప్రజానీకానికి రక్షణ కల్పించవల్సిందిగా తెలంగాణా ప్రజలకూ, వుద్యమకారులకు విజ్ఞప్తి చేస్తున్నాం. మా పార్టీ నుండి కూడా వారి రక్షణకు బాధ్యత వహిస్తామని హామీ ఇస్తున్నాం.

అట్లాగే ప్రత్యేక తెలంగాణా ఏర్పాటుతో వివక్షపోవడం, నీళ్ళు, వుద్యోగాల వంటి డిమాండ్ల విషయంలో కొంత మేరకు ప్రయోజనం చేకూరడం – వంటి అవకాశాలు వున్నప్పటికీ ప్రజల మౌలిక సమస్యలకు మాత్రం పరిష్కారం దొరకదు. తెలంగాణాలోనైనా, సీమాంధ్రలోనైనా ప్రజలకు అధికారం లభిస్తేనే మౌలిక సమస్యలు పరిష్కారం అవుతాయి.

**ప్రియమైన ప్రజలారా!**

సీమాంధ్ర, తెలంగాణాలలో ప్రజలకు గొప్ప పోరాట వారసత్వమున్నది. గొప్ప పోరాట అనుభవం కూడా వున్నది. అయితే మీ ఆగ్రహాన్ని సరైన దిశలో, సరైన లక్ష్యం కోసం ఎక్కుపెట్టాలి. ఇప్పుడు మీ చుట్టూ మూగుతున్న పాలక పార్టీల నేతలందరూ వేలాదికోట్ల రూపాయిల ప్రజాధనాన్ని స్వాహా చేసినవారే. ప్రజా పోరాటాలను రక్తపుటేరుల్లో ముంచినవారే. ఈ నియంతలు తమ అసలు స్వరూపాన్ని కప్పి పెట్టేందుకు పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని ముసుగుగా వాడుకుంటున్నారు. ఈ సత్యం ఇప్పటికే నిరూపించబడింది. కనుక మీ ఐక్య పోరాటాన్ని దోపిడి పాలక వర్గాలకూ, వారి రాజ్యాంగ యంత్రాంగానికి వ్యతిరేకంగా ఎక్కుపెట్టాలి. ప్రజల ప్రజాస్వామ్యం ఏర్పడే దిశగా దేశంలో మాపార్టీ నాయకత్వంలో జరుగుతున్న ప్రజా యుద్ధంలో భాగస్వాములు కావాలి. ఈ యుద్ధంలో దోపిడీ వర్గాలనూ, వారి రాజ్యాంగ యంత్రాన్ని ధ్వంసం చేసి కార్మికవర్గ నాయకత్వంలో విప్లవకర వర్గాల ప్రభుత్వాన్ని ఏర్పర్చాలి. అప్పుడే నూతన ప్రజాస్వామిక వ్యవస్థ ఏర్పడి అన్ని రకాల దోపిడీ, పీడనలు రద్దు కావటంతో పాటు, ప్రాంతీయ అసమానతలు వంటి సమస్యలను నివారించు కోగలుగుతాము.

**ఆంధ్రా - ఒడిశా సరిహద్దు**

**స్పెషల్ జోనల్ కమిటి,**

**సి.పి.ఐ (మావోయిస్టు).**

కరపత్రం

# లొంగుబాటు బానిసత్వంలోకి నెడుతుంది!
# తిరుగుబాటు విముక్తిని సాధిస్తుంది!!

**ప్రియమైన కామ్రేడ్స్,**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మన చుట్టూ వేలాదిమంది సాయుధ పోలీసులను దింపి అరెస్టులు, అత్యాచారాలు, హత్యలు, బూటకపు ఎన్‌కౌంటర్లు జరుపుతూ పెద్ద ఎత్తున భయోత్పాతాన్ని సృష్టిస్తూ... పార్టీ, పి.ఎల్.జి.ఎ, ప్రజా నిర్మాణాలలోని కార్యకర్తలతో పాటు, సాధారణ ప్రజలను సైతం లొంగిపొమ్మని హెచ్చరికలు జారీ చేస్తున్నాయి. పోలీసులు వివిధ నిర్మాణాలకు చెందిన నాయకుల, కార్యకర్తల పేర్లను సేకరించి లొంగిపొమ్మని హెచ్చరికలు జారీ చేస్తూ పేరుపేరున నోటీసులు పంపుతున్నారు. సంతలకు వెళ్తున్న వాళ్ళను అక్రమంగా అరెస్టులు చేస్తున్నారు. రహస్యంగా వుంటున్న వారి ఇళ్ళపై రాత్రిపూట దాడి చేసి పట్టుకొని అమానుషంగా కాల్చి చంపుతున్నారు. జులై 22న బి.ఎస్.ఎఫ్ పోలీసులు రాత్రిపూట ఏలంపాకల గ్రామంపై దాడిచేసి కామ్రేడ్ బెన్ను (వేణు)ను పట్టుకొని తీవ్రమైన చిత్రహింసలకు గురిచేసి హత్య చేశారు. ఈ హత్య ద్వారా పోలీసులు ప్రజలను మరింత భయోత్పాతానికి గురి చేయాలనుకున్నారు.

ఇంత పెద్ద సాయుధ దాడిని పోలీసులు మనపై ఎందుకు నిర్వహిస్తున్నారో, దాని లక్ష్యమేమిటో, ఈ దాడికి అసలు సూత్రదారులెవరో మనం ముందుగా తెలుసుకోవాలి. అంతే కాకుండా ఈ ప్రభుత్వాలు మనపై తలపెట్టిన ఈ దుర్మార్గమైన ఫాసిస్టు దాడిని నిలువరించి ఎదుర్కోకపోతే మన భవిష్యత్‌తోపాటు, మన పిల్లల భవిష్యత్ కూడా ఎంత ప్రమాదంలో పడుతుందో కూడా తెలుసుకోవాలి.

ముందుగా మనపై ఇంత భయానకమైన దాడి చేస్తున్నదెవరో తెలుసుకుందాము. కేంద్రంలో మన్‌మోహన్ సింగ్, రాష్ట్రంలో నవీన్ పట్నాయక్‌లు నేతృత్వం వహిస్తున్న ప్రభుత్వాలే మనపై ఈ దాడి జరుపుతున్నాయి. ఈ దాడి అన్యాయమైనదీ, స్వార్థపూరితమైనది. కనుక ఈ దాడి నిర్వహిస్తున్న వారు మన ప్రజలందరికీ శత్రువులే. ముందుగా ఈ విషయాన్ని మనం దృష్టిలో పెట్టుకోవాలి. అంటే మన్‌మోహన్ సింగ్, నవీన్ పట్నాయక్‌లు నేతృత్వం వహిస్తున్న ప్రభుత్వాలూ, ఈ ప్రభుత్వాలను నడిపిస్తున్న దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వర్గాలు, వారి పోలీసు యంత్రాంగం ప్రజలకు శత్రువులే. ముఖ్యంగా మన దేశంలోని దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వర్గాలూ, వారి యజమానులైన సామ్రాజ్యవాదులు దేశ సంపద (భూమి, పరిశ్రమలు)లో ప్రధాన భాగాన్ని తమ ఆధీనంలో వుంచుకొని ప్రజలపై దోపిడీ, పీడనలు కొనసాగిస్తున్నారు. ఈ దోపిడీ, పీడనలకు పార్లమెంటరీ ప్రజాస్వామ్య ముసుగును తొడిగి, క్రూరమైన తమ రాజ్యాంగ యంత్రం ద్వారా ప్రజలను పాశవికంగా అణచివేస్తున్నారు. వీరిని సాయుధంగా కూలదోసేదాకా ప్రజలకు బాధలు తప్పవు. ఈ దోపిడీ వర్గాలకు ఏజంట్లుగా వున్న సోనియా, మన్‌మోహన్, చిదంబరం, జైరాం రమేష్, నవీన్ పట్నాయక్‌ల దుర్మార్గ స్వభావాన్ని మన సొంత అనుభవంలో నుండే చూడవచ్చు. వారు మనపై ఇంత పెద్ద దాడి ఎందుకు చేస్తున్నారో, ఆ దాడి లక్ష్యం కూడా ఏమిటో తెలుసుకోవచ్చు.

మన జీవితాలలోకి మావోయిస్టు పార్టీ రాకముందు మన పరిస్థితి ఏమిటో మనందరికీ తెలిసిందే. మావోయిస్టు పార్టీ రాక ముందు మనం "స్వతంత్ర భారత దేశం"లో బానిసలులాగా బ్రతికాము. 1947 ఆగస్టు 15న భారత దేశానికి 'స్వతంత్ర్యం' వచ్చిందనీ చెప్పినప్పటికీ, మావోయిస్టు పార్టీ మన జీవితంలోకి ప్రవేశించిన దాకా మనకు 'స్వతంత్ర భారతదేశం' ఇచ్చిన హక్కులూ, స్వేచ్ఛ ఏమీలేవు. ఈ రాజకీయ పార్టీలు గొప్పగా చెప్తున్న రాజ్యాంగం, చట్టాలు మన జీవితంలోకి కనీసంగా తొంగిచూడలేదు. వాస్తవంలో మాత్రం ఈ దోపిడీ పాలక వర్గాలు మనకు అన్ని బాధలే మిగిల్చారు.

పెద్దపెద్ద డ్యామ్‌లు కట్టి మనకు ఎటువంటి నష్టపరిహారం చెల్లించకుండా మనల్ని భూముల నుండి తరిమారు. బలిమెల డ్యామ్ ద్వారా వచ్చే సాగునీటిని, భూస్వాముల భూములతో పాటు ఇతరుల భూములకు పారించారు. కరెంటు పెట్టుబడిదారులకు అందించారు. మనకు మాత్రం త్రాగడానికి గుక్కెడు నీళ్ళు లేకుండా చేసి, మన జీవితాల్లో అంధకారం మిగిల్చారు. మన వద్ద నుండి వేరు వేరు రూపాలలో పన్నులు వసూలు చేస్తూ మనకు విద్యా, వైద్యం, రహదారులు వంటి కనీస సౌకర్యాలు లేకుండా చేశారు. ఈ బాధలు చాలవన్నట్లు ఫారెస్టు అధికారుల, వుద్యోగుల జులుం మనల్ని నిరంతరం వెంటాడుతూనే వచ్చింది. ఇక స్థానిక తెగ పెద్దల, షావుకార్ల దోపిడీ, ఆధిపత్యాలు మన జీవితంలో నిత్యకృత్యమయ్యాయి. ఇంత నికృష్టమైన జీవితాన్ని గడుపుతూ కూడా మనం ప్రజాస్వామ్యంలో వున్నామని పాలక పార్టీలు చెబితే నమ్మి, 5 సంవత్సరాలకొకసారి జరిగే ఎన్నికలలో ఓటు వేసి మనల్ని దోపిడీ చేసే, మనపై పెత్తనం చేసేవాళ్ళను ఎన్నుకొన్నాము.

ఇటువంటి పరిస్థితులలో మావోయిస్టు పార్టీ మీ జీవితాలలోకి ప్రవేశించింది. బూర్జువా రాజకీయాలను బహిర్గతం చేసి, కార్మిక వర్గ రాజకీయాలను మీకు అందించింది. కార్మిక వర్గ రాజకీయాలతో మిమ్మల్ని సంఘటితపరిచి సంఘాలలోకి, మిలీషియాలోకి, పార్టీలోకి సమీకరించింది. రాజకీయంగా సంఘటితపడిన మీరు ఈ బూర్జువా రాజకీయ పార్టీలకూ, వారి ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పోరాటం ప్రారంభించారు. ఎటువంటి సౌకర్యాలులేక ఒంటరిగా బిక్కు బిక్కుమని బ్రతుకుతున్న మీరు పార్టీ ఇచ్చిన రాజకీయ బలంతో "బిచ్చినాంచల్ కమిటి"ని ఏర్పర్చుకొని మీ హక్కుల కోసం పొలికేక పెట్టారు. మీరు నిటారుగా నిలబడి తలలెత్తి ప్రశ్నించడం ఈ దోపిడి ప్రభుత్వానికి నచ్చలేదు. అప్పటి నుండి సోనియా, మన్‌మోహన్, చిదంబరం, జైరాం రమేష్, నవీన్‌లు, వారి ప్రభుత్వాలు మీపై కక్ష కట్టారు. మీ కన్నీటిని తుడవడానికి అన్నట్లు కొన్ని ఇంజన్ బోట్లు, కొద్దిగా కరెంట్ సౌకర్యం కల్గించారు. కానీ బలిమెల రిజర్వాయర్ వల్ల, ముంపుకు గురౌతున్న భూముల విషయంగానీ, విద్యా, వైద్యం వంటి మౌళిక విషయాలను గానీ ఏమాత్రం పట్టించుకోలేదు. అయితే ప్రజలలో పెరుగుతున్న చైతన్యం మాత్రం వారికి కంటి మీద కునుకు లేకుండా చేసింది. మీరు ప్రజల హక్కుల కోసం పోరాడటమే కాకుండా, వున్నతమైన

రాజకీయ చైతన్యంతో మిమ్మల్ని మీరు పాలించుకునేందుకు బూటకపు ఎన్నికలను బహిష్కరిస్తూ, రైతుకూలీ కమిటీలను ఏర్పర్చుకొని ఆర్.పి.సీల దిశగా నడుం కట్టారు. అంతేకాకుండా మీ వనరులనూ, నూతనంగా ఏర్పడుతున్న అధికార అంగాలను రక్షించుకునేందుకు మిలీషియాను నిర్మించుకున్నారు. ఈ పరిణామాలు పాలక వర్గాలను మరింత కలవరపరిచాయి. తమ కాలి కింది మట్టిలా అణిగిమణిగి వున్న మీరు, మీపై జరుగుతున్న దోపిడీని ప్రశ్నించడంతో పాటు, అధికారాన్ని సవాల్ చేయటం వారిని సహించలేని స్థితికి నెట్టాయి. ఈ స్థితిలో ప్రజల చైతన్యానికి మూలాధారమైన సంఘాన్ని , పి.ఎల్.జి.ఏను, పార్టీని నిర్మూలించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూనుకున్నాయి ఈ పూనికలో భాగంగానే ఒక వైపున సంస్కరణల పేరుతో ప్రజలను మోసం చేసేందుకు కొన్ని సౌకర్యాలు కల్పిస్తూ, మరోవైపు ప్రధానంగా వేలాది మంది సాయుధ బలగాలను మన ప్రాంతంలో దింపి తీవ్రమైన సాయుధ అణిచివేతను కొనసాగిస్తున్నారు. ఈ ద్విముఖదాడి ద్వారా సంఘం, పి.ఎల్.జి.ఏ, పార్టీని సమూలంగా నిర్మూలించి ప్రజలను తిరిగి బానిసత్వంలోకి నెట్టాలని చూస్తున్నారు.

ఈ దాడి నేపథ్యాన్ని దృష్టిలో పెట్టుకొన్నప్పుడు మన ముందు రెండే మార్గాలున్నాయి. ఒకటి ఈ దోపిడి పాలక వర్గాలు కోరుకున్నట్లుగా మనం సంఘం, పి.ఎల్.జి.ఏ, పార్టీని వదిలి వారికి లొంగిపోయి బానిసలుకావడం, రెండో మార్గం - ఈ దోపిడీ ప్రభుత్వాలను, వారి పోలీసు యంత్రాంగాన్ని వీరోచితంగా ఎదుర్కొని మన శ్రామిక వర్గ రాజ్యాన్ని ఏర్పర్చుకోవటం. రెండవ మార్గం అత్యంత కష్టభరితమైనప్పటికీ మీ గొప్ప భవిష్యత్ కోసమూ, మీ పిల్లల భవిష్యత్ కోసం ఈ దోపిడీ ప్రభుత్వాలతో కృతనిశ్చయంతో పోరాడేందుకు సిద్ధపడ్తూ రెండోవ మార్గాన్ని ఎంచుకోవాలి.

**ప్రియమైన కామ్రేడ్స్,**

రెండోవ మార్గం ఎంచుకుంటున్నప్పుడు మీకొక సందేహం రావచ్చు. అపారమైన సాయుధ శక్తి కలిగిన ప్రభుత్వ సాయుధ బలగాలతో మనం పోరాడి గెలవటం సాధ్యమా? అన్న సందేహం తప్పనిసరిగా మీకు వస్తుంది. అయితే మనం ఈ సమస్యను కేవలం ఇప్పుడున్న పరిస్థితి నుండి చూడటమేకాకుండా సిద్ధాంత దృష్టితో అర్థం చేసుకోవాలి. ఎం.ఎల్.ఎం సిద్ధాంతం మనకు 'ప్రజలే చరిత్ర నిర్మాతలు" అని చెప్పింది. అంటే గడిచిన చరిత్రలో అత్యంత బలసంపన్నులైన అభివృద్ధి నిరోధక పాలక వర్గాలనూ, వారి సాయుధ బలగాలను సంఘటితపడిన పురోగామి వర్గాలైన ప్రజలు ఓడిస్తూవచ్చారు. దోపిడి పాలక వర్గాలపైన ప్రజలు అంతిమంగా గెలుస్తారనే నియమమే చరిత్రను నడిపిస్తూ వస్తున్నది. ఈ నియమమే వర్తమాన, భవిష్యత్ కాలాలలో చరిత్రను నడిపిస్తుంది. కనుక మనం ముందు పోరాడాలనే కృతనిశ్చయానికి వస్తే విజయానికి బాట దొరుకుతుంది.

సిద్ధాంతపరంగా ప్రజలు అంతిమ విజయం సాధిస్తారనే వ్యూహాత్మక విషయంపై ఆధారపడ్తూనే మనం ఎటువంటి సడలింపు లేకుండా పోరాడేందుకు కృతనిశ్చయాన్ని కలిగి వుండాలి. అయితే ప్రస్తుతం మనకు, శతృవుకు బలాబలాలలో వున్న తేడాను అర్థం చేసుకొని సరైన ఎత్తుగడలు రూపొందించుకోవాలి. ప్రస్తుత పరిస్థితిలో శతృవు సాయుధ బలగాలు అత్యంత బలసంపన్నమైనవే కాకుండా మన ప్రాంతంలో విప్లవ ప్రతీఘాతుకులను (తెగపెద్దలు, షావుకార్లు, దళారీలు, ఇన్‌ఫార్మర్లు) సంఘటితపర్చుకొని వున్నారు. ఏ అవకాశం వున్నా మనల్ని అత్యంత పాశవికంగా దెబ్బతీసేందుకు సిద్ధంగా వున్నారు. ఈ మధ్య కాలంలో శతృవు కా.మాధవ్, కా.వేణు, పొడియాలో 13 మందిని హత్య చేసి దూకుడుగా వున్నాడు.

పై పరిస్థితిని దృష్టిలో వుంచుకొని ప్రజా యుద్ధం అభివృద్ధి చేసే దిశగా మన రాజకీయ కర్తవ్యాలను పూరించేందుకు సరైన ఎత్తుగడలు రూపొందించుకోవాలి.

1) ముందుగా విప్లవ ప్రతీఘాతుకుల్ని గుర్తించి, వారిని నియంత్రించాలి. ప్రమాదకరమైన స్థాయిలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న వారిని నిర్మూలించాలి.

2) మన ప్రజా సంఘాలను, మిలీషియాను రహస్యంగా నిర్మించాలి.

3) ప్రతీ ఒక్కరు ఏదో ఒక సాంప్రదాయక ఆయుధాన్ని పట్టుకోవాలి.

4) శతృవుకు పట్టుపడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

5) ప్రజలను దోపిడీ వర్గాలకు వ్యతిరేకంగా కార్మికవర్గ రాజకీయాలతో చైతన్యపరచడం అనేది సాధారణ, నిత్య, మౌళిక కర్తవ్యంగా వుండాలి.

6) పోరాటాలలోకి సాధ్యమైనంత ఎక్కువ మంది ప్రజలను సమీకరించాలి.

7) మనకున్న భౌగోళిక పరిస్థితిని వినియోగించుకొని గెరిల్లా ఎత్తుగడల ద్వారా సాయుధ బలగాలకు అనేక ఆటంకాలు కల్పించడం, నష్టపరచడం పట్టుదలతో కొనసాగించాలి.

పై ఎత్తుగడలన్నీ తీవ్రమైన వర్గకసితో ఎటువంటి ఊగిసలాట లేకుండా, గెలుస్తామనే కృతనిశ్చయంతో అమలు చేసినప్పుడు శతృ బలగాలను నిలువరించడం సాధ్యపడుతుంది. పై ఎత్తుగడలకు తోడు, మన వుద్యమ ప్రాంతాన్ని విశాల ప్రాంతానికి విస్తరించాలి. ఇప్పటికే మన జిల్లాలో, రాష్ట్రంలో, దేశంలో అనేక ప్రాంతాలలో మన వుద్యమం శతృవును ఎదుర్కొంటూ పురోగమిస్తున్నది. ముఖ్యంగా దండకారణ్యం, బీహార్-జార్ఖండ్‌లలో లక్షలాది మంది ప్రజలు పార్టీ,ప్రజా సంఘాలు, ఆర్.పి.సిలు, మిలీషియా నిర్మాణాలలో సంఘటితపడ్తూ శతృ సాయుధ బలగాలను దెబ్బతీస్తూ పురోగమిస్తున్నారు. దేశంలో ఇంకా జాతి విముక్తి పోరాటాలు, సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలు ఈ దోపిడి ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పురోగమిస్తున్నాయి. ఈ పోరాటాలన్నీ మన వుమ్మడి శతృవు అయిన దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వర్గాలకూ, సామ్రాజ్యవాదులకూ వ్యతిరేకంగా ఎక్కుపెట్టబడి వున్నాయి. శతృ బలగాలను వికేంద్రీకరింప చేసి మనకు కొంత మేరకు వెసులుబాటు కల్గిస్తున్నాయి. మరోవైపు కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు సామ్రాజ్యవాద అనుకూల, ప్రజా వ్యతిరేక విధానాలు అనుసరించడం వల్ల దేశంలో తీవ్రమైన ద్రవ్య, ఆర్థిక సంక్షోభం నెలకొని ఆకలి, అధిక ధరలు, ఆకలి చావులు, నిరుద్యోగం, సబ్సిడీకోత, అభివృద్ధి రేటు పడిపోవడం, ద్రవ్యలోటు, విదేశీ మారక ద్రవ్యలోటు వంటి పలు సమస్యలతో సతమతమవుతున్న ప్రజలు ఈ బూర్జువా పార్లమెంటరీ వ్యవస్థపై విశ్వాసం కోల్పోవడమే కాకుండా దానికి వ్యతిరేకంగా పెద్దయెత్తున పోరాటాలలోకి దిగుతున్నారు.

**(తరువాయి భాగం 38 వ పేజిలో)**

కరపత్రం

# సామ్రాజ్యవాద ద్రవ్య పెట్టుబడి ప్రయోజనాల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏ.ఓ.బి విప్లవోద్యమంపై తలపెట్టిన గ్రీన్ హంట్ బహుముఖ దాడిని ప్రజా యుద్ధం ద్వారా త్రిప్పికొడదాం! గ్రామ స్థాయి నుండి ప్రజల ప్రజాస్వామిక అధికారాన్ని నిర్మించుదాం!!

సామ్రాజ్యవాదం తీవ్రమైన ఆర్థిక, ద్రవ్య సంక్షోభంలో కూరుకుపోయిన నేటి పరిస్థితుల్లో దాని నుండి బయటపడడానికి సామ్రాజ్యవాదులు, వారి తైనాతీలైన భారత పాలక వర్గాలు ఎల్.పి.జి విధానాలను అమలు చేస్తూ దేశ పీడిత ప్రజలను మరింత దోపిడీ పీడనలకు గురిచేస్తున్నారు. వాటికి వ్యతిరేకంగా పీడిత ప్రజలు, జాతులు తీవ్రంగా పోరాడుతున్నారు. మన దేశ పాలక వర్గాలు సామ్రాజ్యవాదంతో కుమ్మక్కై అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ప్రయోజనాల కోసం, తమ సొంత లాభాల కోసం ఆంధ్ర-ఒడిస్సా సరిహద్దు ప్రాంతంలోని భౌతిక సహజ వనరులను పెద్ద ఎత్తున లూటీ చేయడానికి బహుళజాతి కంపెనీలతో ఎం.ఓ.యులను కుదుర్చుకున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తలపెట్టిన ఈ సామ్రాజ్యవాద అనుకూల విధానాలకు వ్యతిరేకంగా "అడవిపై హక్కు ఆదివాసీలది, పీడిత ప్రజలదేననీ" ఎలుగెత్తి చాటుతూ ప్రజలు పెద్ద యెత్తున వుద్యమిస్తున్నారు. దీంతో దోపిడీ పాలక వర్గాలు తమ ప్రయోజనాలకు అడ్డుగా వున్న మా పార్టీనీ, పి.ఎల్.జి.ఎను తొలగించుకొనేందుకు గ్రీన్ హంట్ బహుముఖ దాడిని ఎక్కుపెట్టాయి. ఈ దాడి అత్యంత పాశవికంగా కొనసాగుతున్నది. ముఖ్యంగా ప్రజా విప్లవానికి నాయకత్వం లేకుండా చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మా పార్టీపైనా, పి.ఎల్.జి.ఎపైన తీవ్రమైన దాడిని కొనసాగిస్తున్నాయి. దీంట్లో భాగంగా ఈస్టు డివిజన్‌లో దశాబ్దం పైగా కొనసాగుతున్న బాక్సైట్ మైనింగ్ వ్యతిరేక పోరాటంపై రాజ్య నిర్బంధం తీవ్రంగా కొనసాగుతున్నది. ఇప్పటి వరకు ప్రభుత్వ సాయుధ బలగాల దమనకాండలో 10 మంది ఆదివాసీలు అశువులు బాసారు. 20 మంది వరకు ఆదివాసీ మహిళలు అత్యాచారాలకు గురికాబడ్డారు. సాయుధ బలగాలతో జరిగిన ఘర్షణల్లో పదుల సంఖ్యలో ఆదివాసీలు గాయపడ్డారు. వందలాది మంది ఆదివాసీలపై అక్రమ కేసులు బనాయించి జైళ్ళల్లో నిర్బంధిస్తున్నారు. గనుల తవ్వకాలను వ్యతిరేకిస్తున్న ప్రజలపై ప్రభుత్వ సాయుధ బలగాలు అమలు చేస్తున్న ఫాసిస్టు దమనకాండ మూలంగా విశాఖ మన్యం అశాంతికి గురయ్యింది.

ఒకవైపు రాష్ట్రాన్ని మావోయిస్టురహితం చేశామని చెప్పుకుంటూనే మరోవైపు పోలీసు బలగాల సంఖ్య పెంచుకుంటూ పోతున్నారు. పోలీసు స్టేషన్ల సంఖ్య, వాటి ఆధునికీకరణ పెరుగుతూనే వుంది. మరోవైపు విప్లవోద్యమాన్ని దెబ్బతీసేందుకు సంస్కరణలను గుప్పిస్తున్నారు. రోజు రోజుకూ తాము తీసుకువస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలు ఎంతోకాలం భరించలేరని పాలకులకు తెలుసు. తరతరాల పోరాట వారసత్వం, విప్లవోద్యమం వెదజల్లుతున్న చైతన్యం మాసిపోదని తెలుసు. నివురు కప్పిన నిప్పులా అది మళ్ళీ రాజుకుంటుందని పాలకుల భయం. వాళ్ళ భయాన్ని నిజం చేస్తూ విశాఖ మన్యంలో అటవీశాఖ ఆధ్వర్యంలో వున్న "కాఫీ తోటల స్వాధీన పోరాటం" బద్ధలై, సుమారు 600 హెక్టార్ల కాఫీ తోటలను ఆదివాసీలు స్వాధీన పర్చుకున్నారు. మిలిటెంట్‌గా జరుగుతున్న ప్రజా పోరాటం మరిన్ని ప్రాంతాల్లో కాఫీ తోటల స్వాధీనానికి ప్రజలను ఉత్తేజ పర్చింది. యింకా మరెన్నో దైనందిన సమస్యలపై ప్రజలు పోరాటానికి నడుం బిగిస్తున్నారు. ముఖ్యంగా మన్యంలో మరో విప్లవ వెల్లువకు భూమికగా వున్న బాక్సైట్ మైనింగ్ వ్యతిరేక పోరాటం, కాఫీ తోటల స్వాధీన పోరాటాలను పాలకులు సహించలేక పోతున్నారు. అందుకనే విశాఖ మన్యాన్ని సాయుధ బలగాలతో నింపేశారు. నిత్యమూ కూంబింగ్‌లతో అడవులను జల్లెడ పడుతున్నారు. బూటకపు ఎన్‌కౌంటర్లకు, హత్యలకు, అత్యాచారాలకు పాల్పడుతూ పెద్ద ఎత్తున భయోత్పాతాన్ని సృష్టిస్తున్నారు. యిందులో భాగంగా 2012 మే 10వ తేదీన లువ్వాసింగి గ్రామ అటవీ ప్రాంతంలో అప్పారావు, తెల్లన్న పడాల్ అనే ఇద్దరు ఆదివాసీలను పట్టుకొని చిత్రహింసలకు గురిచేసి హత్య చేశారు. 2013 జూలై మాసంలో జాయింట్ ఆపరేషన్ పేరుతో ఒడిశా పోలీసులు, బి.ఎస్.ఎఫ్ జవాన్లు, ఆంధ్రా గ్రేహౌండ్స్ బలగాలు విశాఖ మన్యంలోని దిగువ జనభా గ్రామంపై పడి భీభత్సం సృష్టించారు. పోలీసుల దాడిలో ముగ్గురు మహిళలు, ముగ్గురు పురుషులు తీవ్రంగా గాయపడ్డారు. మరికొంత మంది స్వల్పంగా గాయపడ్డారు. వాళ్ళ ఇండ్లల్లోకి చొరబడి డబ్బు. బంగారం దోచుకున్నారు. కూంబింగ్ ఆపరేషన్ల పేరుతో సాయుధ బలగాలు ఆదివాసీ గూడేలపై పడి చేసే అకృత్యాలు అన్నిఇన్ని కావు. ఆదివాసీల నైతిక స్థైర్యాన్ని, విప్లవోద్యమ విజయం పట్ల విశ్వాసాన్ని దెబ్బతీయడమేకాక, మన్యంలో వున్న అపార ఖనిజ సంపదను సామ్రాజ్యవాదులకు ధారాదత్తం చేయాలనే లక్ష్యం ఈ దాడుల వెనక వుంది.

ఒడిశాలో నవీన్ పట్నాయక్ ప్రభుత్వం సామ్రాజ్యవాద అనుకూల విధానాలకు పెద్ద పీట వేస్తున్నది. సామ్రాజ్యవాదుల, దళారీ నిరంకుశ పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం, ఇక్కడి సహజ వనరులను, అటవీ సంపదను, భూములను కట్టబెట్టడానికి పోస్కో, వేదాంత, టాటా వంటి బహుళ జాతి కంపనీలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నారు. బహుళ జాతి సంస్థలకు భూములు, ఖనిజ సంపద, అటవీ సంపదను అప్పజెప్పడానికి వ్యతిరేకంగా ఒడిశా ఆదివాసీ ప్రజానీకం వుద్యమిస్తున్నారు. గత ఏడు సంవత్సరాలుగా పోస్కోకు వ్యతిరేకంగా ఆదివాసీలు వుద్యమిస్తున్నారు. వుద్యమిస్తున్న ఆదివాసీలపై పోస్కో మద్దతుదారుల నుండి వందలాది బాంబు దాడులు జరిగాయి. సుమారు 100 గ్రామాల ప్రజలు పోలీసు కాల్పులకు గురైనారు. ఒడిశాలో భూములు, ఖనిజ సంపద, అటవి సంపదలను, కార్పొరేట్ రంగం ముట్టడిస్తున్న నేపథ్యంలో కళింగనగర్, నియంగిరి, కాశీపూర్, కోరాపుట్ ప్రాంతాలలో అనేక రకాల ప్రాజెక్టులకు వ్యతిరేకంగా ప్రజా పోరాటాలు కొనసాగుతున్నాయి. నారాయణపట్నం భూపోరాటం రాజ్య నిర్బంధం ఎదుర్కొంటూ కొనసాగుతున్నది. కలిమెల రైతాంగం సాగునీరు సమస్యను, కటాఫ్ ఏరియా ప్రజలు 57 ఏళ్ళుగా బలిమెల డ్యాం ముంపు సమస్యను ఎదుర్కొంటున్నారు.

ఐదేళ్ళుగా ముంపు సమస్యతో పాటు తమ మౌళిక సమస్యలు, విద్య, వైద్యం, త్రాగునీరు, సాగునీరు, కరెంటు వంటి సమస్యలు పరిష్కారం కోరుతూ ఆందోళనలు చేపడుతున్నప్పటికీ ప్రభుత్వం పెడచెవినపెడుతున్నది. పైగా ప్రజలు వుద్యమించిన ప్రతీసారి సాయుధ బలగాలను మోహరించి అణిచివేయడానికే పూనుకుంది.

మల్కనగిరి జిల్లా కలెక్టర్ వినీల్ కృష్ణను మా పార్టీ బందీగా పట్టుకొని 8 రకాల డిమాండ్లను ప్రజా రక్షణకై ప్రభుత్వం ముందుంచడం జరిగింది. ప్రభుత్వం వినీల్ కృష్ణ విడుదల కోసం మేము పెట్టిన డిమాండ్లకు తల ఊపిందే తప్ప వాటిని మాత్రం నెరవేర్చలేదు. నిజంగా ఈ డిమాండ్లను నెరవేర్చే వుద్దేశ్యమే నవీన్ ప్రభుత్వానికి లేదు.

స్వాతంత్ర్యం వచ్చి 65 సంవత్సరాలు దాటిపోయినా ఆదివాసీ ప్రాంతాల అభివృద్ధిని పాలక వర్గాలు ఏనాడూ పట్టించుకోలేదు. ముఖ్యంగా సామ్రాజ్యవాదులు వారి తొత్తులైన దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వర్గాలు దేశ సంపదను తమ ఆధీనంలో వుంచుకొని ప్రజలపై మరింత దోపిడీ, పీడనలను కొనసాగిస్తున్నారు. ఈ దోపిడీ, పీడనలకు పార్లమెంటరీ ప్రజాస్వామ్య ముసుగును తొడిగి, క్రూరమైన తమ రాజ్యాంగ యంత్రం ద్వారా ప్రజలను పాశవికంగా అణిచివేస్తున్నారు. సహజ వనరులకు, ఖనిజ నిక్షేపాలకు నిలయమైన ఆదివాసీ ప్రాంతాల నుంచి ఆదివాసీలను వేరు చేస్తే మిగిలేది మావోయిస్టులేననీ, వారిని బలగాలతో తుదముట్టిస్తే టాటా, పోస్కో, వేదాంత, జిందాల్, ఆల్ఖైమా వంటి బహుళజాతి కంపెనీలకు ఖనిజ సంపదలను సులభంగా కట్టబెట్టవచ్చు అనేది నవీన్ పట్నాయక్ ప్రభుత్వ కుట్ర.

దీనిలో భాగంగానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేలాది మంది సాయుధ పోలీసులను దింపి అరెస్టులు, అత్యాచారాలు, హత్యలు, బూటకపు ఎన్‌కౌంటర్లు జరుపుతూ పెద్ద ఎత్తున భయోత్పాతాన్ని సృష్టిస్తున్నారు. పార్టీ, పి.ఎల్.జి.ఎ, ప్రజా నిర్మాణాల్లోని క్యాడర్ల, కార్యకర్తలతో పాటు సాధారణ ప్రజలను సైతం లొంగిపొమ్మని హెచ్చరికలు జారీ చేస్తున్నాయి. సంతలకు వెళ్తున్న వారిని అక్రమంగా అరెస్టులు చేస్తున్నారు. రాత్రి సమయంలో గ్రామాలపై దాడిచేసి పట్టుకొని అమానుషంగా కాల్చి చంపుతున్నారు. జూలై 22న బి.ఎస్.ఎఫ్ పోలీసులు రాత్రిపూట ఏలంపాక గ్రామంపై దాడి చేసి కామ్రేడ్ బెన్ను (వేణు)ను పట్టుకొని తీవ్రమైన చిత్రహింసలకు గురి చేసి హత్య చేశారు. మరోక ఘటనలో కా.మాధవ్‌ను సజీవంగా పట్టుకొని, అరెస్ట్ చేసి జైలులో నిర్బంధించే అవకాశం వున్నప్పటికీ, కాల్చి చంపి ఎన్‌కౌంటర్ కట్టుకథ అల్లారు. ఈ హత్యల ద్వారా ప్రజలను మరింత భయోత్పాతానికి గురి చేయాలనుకున్నారు. పొడియా ఏరియా శీలకట్ట వద్ద విశ్రాంతి తీసుకుంటున్న దళంపై దాడిచేసి, నిరాయుధంగా గాయాలతో వున్న 12 మంది ప్రజా మిలీషియా, ప్రజా సంఘ సభ్యులను పట్టుకొని అతి దారుణంగా, నిర్దాక్షిణ్యంగా హత్య చేసినారు. ఇదే ఘటనలో పెద్ద బేగ్గూడ గ్రామానికి చెందిన గంగిమాడి అనే 10 సంవత్సారాల అమ్మాయిని పట్టుకొన్నారు. 11 గంటల వరకు పోలీసులు తమ వెంట, ప్రజల మధ్యనే తిప్పారు. శవాలను తీసుకుపోయే క్రమంలో శీలకట్ట స్కూల్ భవనం వెనుకకి తీసుకుపోయి, ముక్కుపచ్చలారని ఆ బాలికను బాయ్‌నెట్స్‌తో పొడిచి చంపి మూటకట్టారు. ఇంతటితో ఆగక మహిళలపై అత్యాచారాలకు పూనుకుంటున్నారు.

2011లో విశాఖలో అరెస్ట్ అయిన కా.భవాని కొంత కాలం (2 సంవత్సారాలు) విశాఖ సెంట్రల్ జైలులో వుంటూ ఈ మధ్యనే బెయిల్‌పై విడుదలయ్యింది. ఈ క్రమంలో ఒడిశా పోలీసులు ఆమెపై ఒడిశాలో నమోదైన కేసుల విచారణ నిమిత్తం అరెస్ట్ చేశారు. ఇంటరాగేషన్ చేస్తూ తీవ్ర చిత్రవధకు గురి చేశారు. అటు పిమ్మట ఆమెపై అత్యాచారానికి ఒడిగట్టారు. పోలీసుల అకృత్యాలు సభ్య సమాజానికి తెలియాలనే తెగువతో ఆమె పత్రికా ప్రకటన ఇచ్చింది. ఇదే విధంగా 2011లో గుమ్మా ఏరియా తెంతులిపొదర్‌లో దళంపై బి.ఎస్.ఎఫ్ బలగాలు దాడి చేయగా కా.అంజిత అమరురాలయ్యింది. ఆపై నిర్జీవంగా పడివున్న ఆమెపై అత్యాచారానికి పూనుకుని తమ పశుత్వాన్ని చాటుకున్నారు. అదే విధంగా పొడియా ఏరియా పరిధిలో పార్టీకి సహకరిస్తున్నాడనే నెపంతో సఫీక్‌ని తీవ్ర చిత్రహింసలకు గురిచేయటంతో ఇప్పటికీ హాస్పటల్‌లో కోలుకోలేని స్థితిలో నిస్సహాయుడిగా పడి వున్నాడు. కలిమెల ప్రాంతంలోని గడ్డిబంద జిట్టును పోలీసులు అరెస్టు చేసి చిత్రహింసలు పెట్టడంతో మరణించాడు. ఆయనతోపాటు అరెస్ట్ కాబడ్డ బెజ్జంకివాడ ప్రజా సంఘ నాయకుడు మున్సి చావు బ్రతుకుల్లో వున్నాడు. మోటు ఏరియా పరిధిలోని మెట్టగూడ గ్రామస్తుడు రామ కోవాసి పోలీసుల చిత్రహింసలకు సెప్టెంబర్ 23న జైలులో ప్రాణాలు కోల్పోయాడు. అపార ఖనిజ నిక్షేపాలకు నిలయంగా వున్న ఆంధ్రా-ఒడిశా సరిహద్దు ప్రాంతం నేడు రణక్షేత్రంగా మారింది. ఆపరేషన్ గ్రీన్ హంట్ పేరిట రాజ్యం తలపెట్టిన 'సర్వం విధ్వంసం' కార్యక్రమం ఇక్కడి ప్రజా సమూహాలనూ, పర్యావరణాన్ని నాశనం చేసి కోట్ల రూపాయల విలువ చేసే ప్రకృతి వనరులను దోపిడీ చేయడానికె అనేది అందరూ గమనించాల్సిన విషయం. బయటకు మావోయిస్టుల ఏరివేత లక్ష్యంగా కనిపిస్తున్నా, దాని వెనుక ఆదివాసీ సమూహాల నిర్మూలన, విస్థాపితం చేయడం అనంతరం ఇక్కడి అపార ఖనిజ నిక్షేపాలను వెలికితీయడానికి మార్గం సుగమం చేయడం, వాటిని బహుళజాతి కంపెనీలకు ధారాదత్తం చేయడమే!

**ప్రియమైన ప్రజలారా!**

ఈ అడవి మాదేనని వుద్యమిస్తున్న ఆదివాసీల పోరాటం కేవలం వాళ్ళకు సంబందించినదే కాదు. దేశంలోని వనరులను, సంపదలను బహుళజాతి కంపెనీలకు ధారపోస్తూ దేశ సార్వభౌమత్వాన్నీ, స్వయంప్రతిపత్తినీ, స్వావలంబననూ పర్యావరణాన్ని ప్రమాదంలోకి నెడుతున్న దేశ పాలక వర్గాలకు వ్యతిరేకంగా ఎక్కుపెట్టబడినది కూడానూ. కనుక ఈ పోరాటానికి మద్దతునిస్తూ, ప్రభుత్వం తలపెట్టిన దమనకాండను వ్యతిరేకిస్తూ లక్షలాది ప్రజలు ఒక్క మనిషిగా ఐక్యమై సర్వస్వాన్ని అంకితం చేస్తూ పోరాడాలనీ ప్రజలు ప్రజాస్వామికవాదులకు పిలుపునిస్తున్నాం. అలాగే ప్రభుత్వ సాయుధ బలగాల ఫాసిస్టు దమనకాండకు వ్యతిరేకంగా ఏ.ఓ.బి జోన్ వ్యాపితంగా నవంబర్ 10వ తేది నుండి 19వ తేది వరకు నిరసన దినాలు పాటించండి. 20వ తేదీన జోన్ వ్యాప్త బంద్‌ను విజయవంతం చేయాలనీ, ప్రజలు, ప్రజాస్వామికవాదులు, విద్యార్థి, మేధావులకు సి.పి.ఐ (మావోయిస్టు) విజ్ఞప్తి చేస్తున్నది.

**ఏ.ఓ.బి ఎస్.జడ్.సి,**

**సి.పి.ఐ (మావోయిస్టు).**

అమరుల చరిత్ర

# భారత విప్లవోద్యమ చరిత్రలో నేల రాలిన మరో అరుణతార కా॥మహిత!
# విప్లవ మహిళా ఉద్యమ నేత, మేధావి, ఉపాధ్యాయురాలు కా॥మహిత అమర్ రహే!!

2013 ఏప్రిల్ 29న, మన పార్టీ సీనియర్ మహిళా నేత, సెంట్రల్ రీజినల్ పొలిటికల్ స్కూల్ సభ్యురాలు కా.మహిత ఏ.ఓ.బిలోని మల్కనగిరి డివిజన్‌లో కన్నుమూసింది.

సుదీర్ఘ విప్లవ పయనం:

మహిత అసలు పేరు లక్ష్మి. నల్గొండ జిల్లా కోదాడ మండలం కందిబండ గ్రామంలో పుట్టింది. చిన్నతనంలోనే తల్లి మరణించడంతో, తన అత్తనే 'అమ్మని' పిలుస్తూ పెరిగింది. తన మేనమామ వద్దనే ఇంటర్మీడియట్ వరకూ చదువుతూ ఆర్.ఎస్.యూలో చేరింది. తన చదువుకునే రోజుల్లో నుండే చాలా చురుకుగా, తెలివిగా వుండేది. ప్రజల జీవితాల్ని అప్పటి నుండే చదివింది. అలా తన విప్లవ ప్రయాణం మొదలై, 32 సంవత్సరాలు విప్లవ జీవితం కొనసాగిస్తూ, అనేక ఒడుదుడుకుల్ని ఎదుర్కొంటూ ముందుకు సాగింది.

కా.మహిత రాడికల్ విద్యార్థి సంఘంలో పని చేస్తున్న సమయంలోనే తన తోటి కామ్రేడ్ ఘూటేతో పెళ్ళి అవగాహన ఏర్పడి వివాహం చేసుకుంది. ఆ తదుపరి పార్టీ పిలుపునందుకొని సహచరులిద్దరూ పార్టీకి కీలకంగా అవసరమైన డెన్ బాధ్యతలు చేపట్టారు. ఆ క్రమంలోనే నాయకత్వ కామ్రేడ్స్, ప్రకాష్ మాస్టారు, పులి అంజన్న, శ్యామన్నా అందరికి షెల్టర్ కల్పిస్తూ అనేక విషయాలు వారితో చర్చించేది. పార్టీ అందించిన రాజకీయాలతో, ఆమెలో స్త్రీ, పురుషులు ఇద్దరూ సమానమనే భావనలు బలపడడమే కాకుండా పితృస్వామ్యంపై సునిశితమైన పోరాటాన్ని ప్రారంభించింది. ముఖ్యంగా కుటుంబ జీవితంలో వ్యక్తమయ్యే పితృస్వామిక వ్యక్తీకరణలన్నింటినీ తన సహచరుడితో చర్చించి, వాటిని తొలగించేందుకు తీవ్రంగా కృషి చేసింది. కా.ఘూటేని కూడా ఇంటి పనిలో భాగస్వామి అయ్యేలా చేసింది.

1986లో రామ్‌నగర్ అరెస్టులలో భాగంగా కా.శ్యామన్నతో పాటు కా.లక్ష్మి, ఘూటే ఇద్దరూ అరెస్టు అయ్యారు. కా.ఘూటే శత్రువు వద్ద లొంగిపోయినా తను మాత్రం ఎలాంటి శషభిషలు లేకుండా, శత్రువు చిత్రహింసలు పెట్టినా తలొగ్గలేదు. అలా జైలులో 5 సంవత్సరాలు కొనసాగింది. రాష్ట్రంలో మారిన రాజకీయ పరిస్థితుల కారణంగా ఆమె విడుదలైంది.

1990 మేలో జరిగిన రైతు కూలీ సభల్లో పాల్గొంటూ, అక్కడ ప్రజల కదలిక చూసి ఎంతో ఫుత్సాహం పొందింది. ఈ సమయంలోనే పీస్ బుక్ సెంటర్లో పనిచేసింది. ఆ క్రమంలోనే తనకి బాబు పుట్టాడు. 1990 చివరిలో నిర్బంధం పెరగడంతో తను రహస్య జీవితంలోకి రావల్సి వచ్చింది. అయితే ఘూటే ఇంటి వద్దనే వుండి పని చేద్దామని ఒత్తిడి చేసినప్పటికి, తను చివరి వరకు పార్టీలో కొనసాగాలని కోరుకుంది. అలా ఘూటేని, ఒక సంవత్సరం బాబు (అరణ్య)ను వదిలి పార్టీలోకి వచ్చింది. 1992లో రహస్య జీవితంలోకి వచ్చింది.

1993లో జంట నగరాల్లో కంటోన్మెంట్ ప్రాంతంలో కా.సుధాకర్ (తరువాత అమరుడైనాడు)తో కలిసి ఆర్గనైజర్‌గా పని



చేసింది. గుంటూరులో 1992 చివర నుండి మహిళా వుద్యమ నిర్మాణం కోసం పనిచేసింది. సారా పోరాటం, గృహ హింస, అత్యాచారాలకు వ్యతిరేకంగా అనేక మంది మహిళల్ని పోరాటాల్లోకి కదిలించింది.

రాష్ట్ర కమిటి నేతృత్వంలో 1994లో జరిగిన ప్రత్యేక మహిళా సమావేశానికి హాజరై, మహిళల సమస్యలపై రాజకీయపరమైన విషయాలు చర్చించింది. పార్టీలో మహిళల అభివృద్ధికి కృషి చేసింది. 1994లో మహిళా కో-ఆర్డినేషన్ కమిటి (ఎమ్.సి.సి)లో సభ్యురాలిగా చేరింది. ఆంధ్ర ప్రదేశ్‌లో మహిళా వుద్యమాన్ని నిర్మించడంలో చురుకైన పాత్ర నిర్వహించింది. 1994లో గుంటూరు జిల్లాలో జిల్లా కాన్ఫరెన్స్ జరిగింది. ఈ కాన్ఫరెన్సులో కా.లక్ష్మి చేసిన చర్చలు, నిర్వహించిన పాత్ర జిల్లా క్యాడర్లో గుర్తుండి పోయేలా చేశాయి.

1996లో ఏర్పడిన దక్షిణ కోస్తా జిల్లాల బెల్టు కమిటీలో (ఎస్.సి.బి.సి)లో సభ్యురాలిగా వుంది. ఆ రీజియన్‌లో మహిళా రంగానికి బాధ్యత వహించింది. ఆ సమయంలో దళితుల సమస్యలపై, రైతాంగ సమస్యలపై, చేనేత కార్మికుల సమస్యలపై ప్రజలను కదిలించి పోరాటాలు చేయించింది. ఆ క్రమంలోనే 1997లో మాచర్లలో అరెస్టు అయ్యింది. శత్రువు ఎంత ప్రయత్నించిన పార్టీ రహస్యాలు ఏమీ చెప్పకుండా దృఢంగా నిలబడింది. తనతో పాటు వున్న కమిటీ సభ్యుడు బలహీనపడినప్పటికి, తను లొంగకపోవడం చూసి, "శత్రువు నీవు చాలా మొండిదానివి" అని అన్నప్పుడు, శత్రువును చూసి నవ్వుకునేది. అలా బెయిల్‌పై విడుదలై బయటకి వచ్చింది.

.జైలు నుండి వచ్చిన తర్వాత దాచేపల్లి ఏరియాలో ఎస్.ఏ.సి (శాక్ నిర్మాణం)లో పనిచేస్తూ, అక్కడ సాయుధ వ్యవసాయక విప్లవ

పోరాటంలో ప్రత్యక్షంగా భాగస్వామి అయింది. 1998లో మైదాన ప్రాంత వుద్యమాలను, అటవీ ప్రాంత వుద్యమాలను సమన్వయించింది. వేమవరంలో ఒక మహిళ హత్యకు వ్యతిరేకంగా పెద్ద వుద్యమాన్ని నడిపించింది. గ్రామీణ ప్రాంతంలో విప్లవ మహిళా సంఘాలు ఏర్పాటు చేసింది. ప్రజా సంఘాలలో వున్న పితృస్వామ్య, పెత్తందారీ ధోరణులను, అందులోని నాయకత్వానికి, కార్యకర్తలకు అర్థం చేయిస్తూ, వారిని ఆ ధోరణుల నుండి బయటపడేలా ఓపికగా కృషి చేసింది. ఇద్దరు భార్యల్ని చేసుకోవడాన్ని సీరియస్‌గా వ్యతిరేకించింది. గుంటూరు జిల్లా గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా తిరిగి పని చేసిన లక్ష్మి అక్కడ భాగ్యక్కగా బాగా పరిచయమైంది. వెల్దుర్తి, బొల్లాపల్లి, బెల్లంకొండ, దాచేపల్లి ఏరియాల్లో ప్రజలు బాగా గుర్తు చేస్తారు.

ఛూటే రాజకీయంగా బలహీనపడి, తనని కూడా రాజకీయంగా బలహీనపరిచే ప్రయత్నం చేయడంతో పార్టీ నిర్మాణ పద్ధతుల్లో 1996లో అతనితో విడాకులు తీసుకుంది. ఛూటేతో విడాకులు తీసుకున్న నాలుగేళ్ళ తర్వాత లక్ష్మికి 2001లో సమ్మిరెడ్డితో వివాహం జరిగింది. శ్రీకాకుళం జిల్లాలో కమిటీ సభ్యురాలిగా, కొండబారిడి ఏరియా కమిటీ కార్యదర్శిగా పని చేసింది. శ్రీకాకుళం వుద్యమంలో పాల్గొంటూ సవర, జాతాపు తెగల ప్రజల మధ్య వుంటూ పోరాటాలకి నాయకత్వం వహించింది. గుమ్‌సరిలో జీడితోటల పంపకం, భామినిలో భూపోరాటం, శ్రీరాంపురం ఏరియాలో భూ ఆక్రమణ పోరాటాల సమస్యలలో ప్రజలకి అండగా నిలిచింది. చింతపండు, కందులు, పసుపు, జీడి పిక్కల గిట్టుబాటు రేటు కోసం, తూనికల్లోని మోసాలను అరికట్టడం కోసం కృషి చేసింది. కరువు సమస్యని పరిష్కరించడంలో కరువు వ్యతిరేక పోరాటాల్లో ప్రజల్ని కదిలించి, వాళ్ళ మిలిటెన్సీని పెంచే విధంగా నాయకత్వం అందించింది.

2004 చర్చల సందర్భంగా ప్రజా ప్రదర్శనల్లో చొరబడిన కానిస్టేబుల్ని పట్టుకొని పిస్టల్ సీజ్ చేయడంలో చొరవ చేసింది. కొండబారిడి ఏరియాలో ప్రజలను విప్లవోద్యమం నుండి పక్కదారి పట్టిస్తున్న పాస్టర్స్‌ని పిలిచి మాట్లాడింది. శతృవు వుపయోగిస్తున్న సైలెంట్ వెపన్ మతం అనేదాన్ని ప్రజలకి నొక్కి చెప్పింది.

2004లో ఏ.ఓ.బి జోన్ స్థాయిలో ఏర్పాటు చేసిన మహిళా కో-ఆర్డినేషన్ కమిటీ (ఎమ్.సి.సి)లో భాగమై శ్రీకాకుళం డివిజన్‌లోని మహిళా వుద్యమానికి నాయకత్వం వహించింది. పితృస్వామ్య అణచివేతకి వ్యతిరేకంగా, బలవంతపు పెళ్ళిళ్ళకు వ్యతిరేకంగా ఎన్నో మీటింగ్‌లు నిర్వహించింది. సవర మహిళలలో కేంద్రీకరించి పని చేసింది. మహిళలకు మహిళా పర్‌స్పెక్టివ్ క్లాసులు నిర్వహించింది. ఆదివాసీ తెగలోని పితృస్వామ్య అణచివేత గురించి అధ్యయనం చేసింది. సారా వ్యతిరేక పోరాటంలో పెద్ద ఎత్తున మహిళల్ని కదిలించింది. ఆమె నాయకత్వంలో మహిళలు పెద్ద ఎత్తున కదిలి సారా బట్టీలను ధ్వంసం చేశారు. శ్రీకాకుళం జిల్లాలో మైదాన ప్రాంతంలో వున్న ప్రజా సంఘాలను కూడా గైడ్ చేసింది. క్లాసులు నిర్వహించింది.

2006లో ఏ.ఓ.బి జోన్ ప్లీనంలో ఆల్టర్‌నేట్ ఎస్.జడ్.సి సభ్యురాలిగా ఎన్నికైంది. 2008 అక్టోబర్‌లో ఎస్.జడ్.సి సభ్యురాలిగా కమిటీలోకి తీసుకున్నారు. ఆ తదుపరి పై కమిటి అవసరాలకు మహిత సి.ఆర్.బి సెంటర్‌కు బదిలీ అయింది. అక్కడ కేంద్ర రీజియన్ టీచర్‌గా బాధ్యతలు చేపట్టింది.

**ఉపాధ్యాయురాలిగా:**

కా.మహిత మంచి ఉపాధ్యాయురాలు. మొదట నుండి పుస్తకాలు చదవడం, చర్చించడం అలవాటు చేసుకున్న మహిత క్లాసును చాలా లోతుగా, వివరంగా చెప్పేది. 1996, 1997లో మహిళా పరస్పక్టివ్ క్లాసు గుంటూరు, చిత్తూరు జిల్లాల్లో చెప్పింది. రాజకీయ అర్థ శాస్త్రాన్ని బాగా అధ్యయనం చేసేది. ఆర్థిక సంక్షోభ రాజకీయాలపై తను చేసే చర్చలు నాయకత్వాన్ని ఆశ్చర్యపరిచేవి.

ఉపాధ్యాయురాలిగా కా.మహితకు వున్న సామర్థ్యాన్ని దృష్టిలో వుంచుకొని 2009 ఏప్రిల్‌లో సి.ఆర్.బి స్థాయిలో ఏర్పడిన, రీజనల్ పొలిటికల్ స్కూల్ (రిపోస్), టీచర్ బాధ్యతలను పార్టీ ఆమెకు అప్పచెప్పింది. మహిళా పర్‌స్పెక్టివ్, రాజకీయ అర్థ శాస్త్రం, భారత ఆర్థిక వ్యవస్థ, సి.పి.ఐ (మావోయిస్టు) చరిత్ర క్లాసులను లోతుగా బోధించేది. 2009 ఏప్రిల్ నుండి 2013 ఏప్రిల్‌లో తాను అమరత్వం పొందే వరకు గడిచిన 4 సంవత్సరాల కాలం, ఆమె చేపట్టిన విప్లవ కృషి అతి విలువైనది. ఈ కాలంలో కేంద్ర రీజియన్‌లో పార్టీ చేపట్టిన సిద్ధాంత, రాజకీయ బోధనా కార్యక్రమంలో కా.మహిత పాత్ర అతికీలకమైనది. ఈ కాలంలో దండకారణ్యం, వుత్తర తెలంగాణ, ఆంధ్ర, ఒడిశా సరిహద్దు జోన్‌లలో పార్టీ సభ్యులు మొదలు రాష్ట్ర కమిటి స్థాయి సభ్యుల వరకు జరిగిన క్లాసులలో ఆమె ఉపాధ్యాయురాలుగా పార్టీ శ్రేణుల విశ్వాసాన్ని చూరగొన్నది. అంతే కాకుండా పార్టీ శ్రేణుల్లో సిద్ధాంత రాజకీయ కృషి చేపట్టి, పార్టీ సిద్ధాంత, రాజకీయ స్థాయిని పెంచాలనే పార్టీ లక్ష్యాన్ని నెరవేర్చేందుకు ఆమె పడిన తపన, చేసిన కృషి అత్యున్నతమైనదనే చెప్పుకోవాలి.

**మిలిటరీపరంగా:**

మనం నిర్వహిస్తున్నది వర్గ యుద్ధం గనుక కేవలం ఆర్గనైజేషన్, ప్రచారం, బోధనా రంగాలకే పరిమితమైతే వుద్యమానికి నేతృత్వం వహించలేమని భావించి కా.మహిత మిలిటరీ కార్యకలాపాలలో కూడా శ్రద్ధ వహించింది. శతృవు చేసిన అనేక మిలిటరీ దాడుల నుండి తృటిలో తప్పుకుంది. 1997 డిసెంబర్ నెలలో జరిగిన మెదక్, వరంగల్ జిల్లాల సరిహద్దులో సాల్వాపూర్ గ్రామం వద్ద జరిగిన ఎన్‌కౌంటర్ నుండి సురక్షితంగా తప్పుకుంది. శ్రీకాకుళం జిల్లాలో డోర్బి పాకెట్‌లో శతృవు దళం సమాచారం తెలిసి వచ్చి డేరాపై దాడి చేసినప్పుడు శతృవుపై కాల్పులు చేస్తూ అందరూ క్షేమంగా తప్పుకునే విధంగా సమన్వయం చేసింది. 2005 ఫిబ్రవరిలో జరిగిన పుజారిగూడ క్యాంప్ నుండి చాకచక్యంగా తప్పుకుంది. 2006లో ఈస్ట్‌లో చుట్టూ అనేక బ్యాచ్‌లు చుట్టుముట్టినప్పుడు తిండి దొరక్కపోయినా, జావ తాగుకుంటూ రెండు రోజులు బ్యాచీల మధ్య తప్పుకుంది.

**విప్లవ రచయిత్రి:**

కా.మహిత ఒకవైపు విప్లవోద్యమ నిర్మాణంలో ఊపిరిసల్పకుండా కృషి చేస్తూనే మరోవైపు పార్టీ సిద్ధాంత, రాజకీయాలను ప్రచారం చేయడంలో భాగంగా రచనలు కూడా చేపట్టింది. ముఖ్యంగా మహిళా మార్గంలో అంజన పేరుతో వ్యాసాలు రాసింది. వాటిల్లో ఓల్గా రాసిన రాజకీయ కథలపై విమర్శనాత్మక వ్యాసం ప్రధానమైనది. ఏ.ఓ.బిలో తీసిన 'విప్లవి' సంపాదక మండలిలో పని చే**(తరువాయి భాగం 22 వ పేజీలో)**

అమరుల చరిత్ర

# కార్మికవర్గ అగ్రగామి కా॥ గంటి ప్రసాదం అమర్ రహే !

కామ్రేడ్ గంటి ప్రసాదాన్ని రాజ్యం హత్య చేసింది. రాజ్యం తన పాసిస్టు పాలనను ఉధృతం చేయడంలో భాగంగా ప్రసాదాన్ని హత్య చేసింది. దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వర్గాల రాజ్యం దాని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న సామ్రాజ్యవాద అనుకూల నయా వుదారవాద విధానాలను వ్యతిరేకిస్తున్న ప్రజానీకాన్ని సంఘటిత పరుస్తున్నందుకే ప్రసాదాన్ని రాజ్యం హత్యచేసింది. మరీ ముఖ్యంగా దోపిడి పాలక వర్గాలు మావోయిస్టు ఉద్యమాన్ని అణచివేసి తమకు 'కంచుకోటగా' మలుచుకున్నామని చెప్పుకుంటున్న ఆంధ్ర ప్రదేశ్‌లో కా॥ గంటి విప్లవకృషి చేపట్టి వారిలో అభద్రతను సృష్టించినం దుకే రాజ్యం ఆయనను హత్య చేసింది. సామ్రాజ్య వాదులు వారి తాబేదా రులు అయిన దళారి నిరంకుశ బూర్జువ, భూ స్వామ్య వర్గాలు నీచమైన వారి లాభాల వేటలో ప్రజలపై దోపిడి, పీడ



నలు కొనసాగించేందుకు అనివార్యంగా ఫాసిజాన్ని ఒక రాజకీయ ఆయుధంగా చేపడ్తాయని ప్రసాదం హత్యతో మరోసారి రుజువయ్యింది. ఈ రాజకీయ నేపథ్యంలోనే 2013 జూలై 4న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన నరహంతక ఎస్.ఐ.బి పోలీసు మూకలు వారు సృష్టించిన విప్లవ ప్రతిఘాతుకులు కా॥ గంటి ప్రసాదాన్ని అతిదారుణంగా, అమానవీయంగా తూపాకితో కాల్చి, కత్తులతో నరికి చంపారు.

కామ్రేడ్ ప్రసాదం బలిజపేట మండలం చాకరపల్లెలో ఒక మధ్యతరగతి కుటుంబంలో 1949లో పుట్టాడు. బొబ్బిలి పట్టణంలో తన తల్లి పుట్టింట చదువుకున్నాడు. తొలి యవ్వనంలో వుండగానే ఆయనపై 1960లలో జరిగిన నక్సల్‌బరి, శ్రీకాకుళ విప్లవోద్యమాల ప్రభావం పడింది. 1970లో డిగ్రీ చదువు పూర్తిచేసుకున్నారు. బొబ్బిలి పట్టణం చక్కెర, జనపనార మిల్లుల, వ్యాపార కార్యకలాపాలుగల, వేలాది కార్మికులతో కూడిన పారిశ్రామిక కేంద్రంగా వుండేది. ఆ నేపథ్యంలో 1972 నాటికి ప్రసాదం కార్మికవర్గ కార్యకర్తగా మారి మొట్టమొదటి కళాసీ సంఘాన్ని స్థాపించారు. కార్మిక సంఘాల రాజకీయాలలోకి ప్రసాదం ప్రవేశిస్తున్న సమయంలోనే శ్రీకాకుళ విప్లవోద్యమం ఎదుర్కొన్న భారీ నష్టాలతర్వాత నక్సలైట్ శక్తుల పునర్నిర్మాణ ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఆ ప్రయత్నాలలో భాగంగా 1970లో ఆవిర్భవించిన విప్లవ రచయితల సంఘం, 1972లో పుట్టిన జననాట్య మండలి నక్సల్‌బరి రాజకీయాల నిప్పు చల్లారిపోకుండా కాపాడాయి. సహజంగానే గంటి ఈ రెండు సంస్థలలో క్రియాశీలకంగా పాల్గొన్నాడు. అయితే 1972 జూలై 28న కామ్రేడ్ చారుమజుందార్ అమరత్వం తరువాత పార్టీ కేంద్ర కమిటి మొత్తంగా లేకుండా పోయింది. తిరిగి 1974లో సి.ఒ.సి ఏర్పడడంతో ఎ.పిలో కా॥ అప్పల సూరి నేతృత్వంలో కా॥ ప్రసాదం తన కార్యకలాపాలు కొనసాగించాడు. ఈ కాలంలో కార్మిక సంఘాలలో, విరసంలో, జననాట్య మండలిలో ప్రసాదం తన కృషిని కొనసాగించాడు. ముఖ్యంగా కార్మిక రంగంలో పనిచేస్తున్నప్పుడు మిల్లు యజమానులు, వారి గూండాలు, పోలీసులు చేసిన దాడులను కార్మిక వర్గం అండదండలతో ధీటుగా ఎదుర్కొన్నాడు. ఈ క్రమంలోనే ఎమర్జెన్సీ కాలంలో అజ్ఞాతంలోకి వెళ్ళాడు. 1977లో అరెస్టయి జైలు పాలయ్యాడు. కా॥ ప్రసాదం జైలు నుండి విడుదలైయ్యే నాటికి అప్పల సూరి పార్టీ నుండి విడిపోవటంతో ప్రసాదం కూడా అప్పలసూరిని అనుసరించాడు. ఆ తరువాత 1982లో పి.యు (పార్టీ యూనిటి)లో చేరి 1998 దాక తన కార్యకలాపాలు కొనసాగించాడు. 1996 నాటికి కామ్రేడ్ ప్రసాదంకు అప్పలసూరితో రాజకీయ పరంగా కొన్ని విబేధాలు ఏర్పడి అంతర్గత పోరాటాన్ని కొనసాగించాడు. ఆ తరువాత అప్పలసూరికి ఏర్పడ్డ పరిమితులు, ఇతరేతర కారణాలవల్ల అప్పలసూరి స్థానంలో ప్రసాదాన్ని సి.సి.ఎమ్‌గా పి.యు పార్టీ తీసుకున్నది. ఈ కాలంలోనే ప్రసాదం బొబ్బిలిలో గొప్ప ప్రజాదరణ కలిగిన కార్మిక సంఘ నాయకుడిగా ఎదిగారు. ఆ సమయంలో ఆయన హోటల్స్, సినిమా థియేటర్లు, చక్కెర, జనపనార మిల్లులు, కళాసీలు వంటి విభిన్న కార్మిక రంగాలకు చెందిన సుమారు 30 సంఘాలను కలిపి ఒక సమన్వయ సమితిని స్థాపించాడు. 1998లో జాతీయ స్థాయిలో పి.యు, పీపుల్స్ వార్ విలీనం కావడంతో ప్రసాదం పీపుల్స్ వార్‌లో చేరి మరొకసారి అజ్ఞాతంలోకి వచ్చాడు.

అప్పటికే ప్రసాదం తమ్ముడు కా॥ రాజన్న పీపుల్స్ వార్ పార్టీలో రీజనల్ కమిటి సభ్యుడిగా పనిచేస్తున్నాడు. అయితే రెండు పార్టీలు విలీనమైన 1998 ఆగస్టు మాసంలోనే కా॥ రాజన్న ఒడిశాలోని రాయగడ జిల్లా కోపర్‌డంగ్ గ్రామం వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో అమరుడైనాడు. ఈ వార్త విన్న ప్రసాదం అందరి లాగానే రాజన్న మరణాన్ని పార్టీకి, పీడిత ప్రజలకు జరిగిన నష్టంగా భావించి ఆ అమరుడికి జోహార్లు తెలియ చేసాడే గాని తోడబుట్టినవాడి మరణంగా బాధపడలేదు. కా॥ప్రసాదం ఉద్యమ ప్రయోజనాలనే తన సర్వస్వంగా భావించేవాడు. వ్యక్తివాదాన్ని ఏ మాత్రం దరిచేరనిచ్చేవాడు కాదు. విలీనానికి ముందు ఆయన పి.యు. పార్టీలో సి.సి స్థాయిలో పనిచేస్తున్నప్పటికీ, నూతనంగా ఏర్పడ్డ పీపుల్స్ వార్ పార్టీలో రాష్ట్ర స్థాయిలో పనిచేసేందుకు సిద్ధపడ్డాడు. ఎందుకంటే అప్పటికే పీపుల్స్ వార్ పార్టీ నాయకత్వంలో ఉన్నత స్థాయికి చేరిన వర్గ పోరాటానికి సి.సి స్థాయిలో నేతృత్వం వహించడానికి తన పాత అనుభవం సరిపోదని కా॥ గంటి గుర్తించాడు. ఇదే విషయాన్ని పార్టీ నాయకత్వం ఆయనతో చర్చించంగా ఆ ప్రతిపాదనను వినయంగా అంగీకరించాడు. అంతే కాకుండా అప్పటికే తన గుండెకు

జరిగిన బైపాస్ సర్జరిని దృష్టిలో వుంచుకొని రాష్ట్ర కమిటిలో కాకుండా ఏదైన లీగల్‌గా వుండి చేసే పని అప్పచెప్పాలని పార్టీని కోరాడు. కాని పార్టీ లోని తోటి సహచరులంతా రాష్ట్ర కమిటిలో వుండాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పడంతో ప్రసాదం పార్టీ సహచరుల ప్రతిపాదనను మనస్పూర్తిగా ఆమోదించాడు. మొదట్లో అటవీ ప్రాంతంలో తిరిగేందుకు తన ఆరోగ్యం సహకరించదేమోననే సంశయం ఉన్నప్పటికీ, సహజంగా ఆయనలో వున్న చురుకుదనం, స్పోర్టివ్‌నెస్ వల్ల తోటి కామ్రేడ్స్ ప్రోత్సాహంతో మొదటి రౌండులోనే సులువుగా తన సంశయాన్ని అధిగమించాడు. కా॥ ప్రసాదం ఎ.పి రాష్ట్ర కమిటి సభ్యుడిగా పార్టీ అప్పజెప్పిన ప్రచురణల బాధ్యతలను, ప్రధానంగా రాష్ట్ర కమిటి అధికార పత్రిక క్రాంతి బాధ్యతను తీసుకున్నాడు. ఈ క్రమంలోనే 2001లో జరిగిన అఖిలభారత ప్రత్యేక కాన్ఫరెన్స్‌కు ఎ.పి నుండి డెలిగేట్‌గా హాజరు కావడమే కాకుండా అధ్యక్ష వర్గంలోకి ఎన్నికై సిద్ధాంత రాజకీయ చర్చలలో చురుకుగా పాల్గొన్నాడు. 2003లో ఎ.పి ప్రజాసంఘాలను గైడ్ చేసేందుకు ఏర్పడిన సబ్‌కమిటిలోకి ఎంపికైనాడు. 2005 మేలో అరెస్టు అయ్యేవరకు ప్రధానంగా 'క్రాంతి' పత్రికతో పాటు ప్రజాసంఘాల బాధ్యతలను నిర్వహించాడు.

2004లో కొత్తగా అధికారంలోకి వచ్చిన రాజశేఖర రెడ్డి ప్రభుత్వం ప్రజల, ప్రజాస్వామిక వాదుల వత్తిడితో పార్టీతో చర్చలకు సిద్ధపడింది. 2004 అక్టోబర్‌లో మొదటి రౌండు చర్చలు కాగానే పార్టీకి ప్రజలలో పెరుగుతున్న బలాన్ని చూసి ఆందోళనపడ్డ ప్రభుత్వం కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి పార్టీపై తీవ్రమైన దమనకాండ ప్రారంభించింది. ఈ చర్చల కాలంలో కేంద్రకమిటి మార్గదర్శకత్వంలో జరిగిన రాజకీయ కృషిలో ప్రసాదం ప్రధాన పాత్రనే పోషించాడు. చర్చల అనంతరం తిరిగి తన బాధ్యతలను నిర్వహించే క్రమంలో మహారాష్ట్రలో నలుగురు ప్రజాసంఘ సభ్యులతో పాటు అరెస్టు అయ్యాడు. ఆ సందర్భంలో పోలీసులు వారిపై దాడిచేసి కళ్ళకు గంతలు కట్టి, పెడరెక్కలు విరిచి కట్టి మూడు రోజులపాటు అక్రమ నిర్బంధంలో చిత్రహింసలు పెట్టి వేధించారు. వారిమీద ఔరంగాబాద్ కుట్రకేసు కూడా బనాయించి నిజామాబాద్ జైల్లో బంధించారు. ఆయన జైల్లో వున్నప్పుడే ఆయన మీద పోలీస్ స్టేషన్లపై దాడి, పోలీసు అధికారుల మీద హత్యాయత్నం వంటి అనేక కేసులలో నేరారోపణలు మోపారు. కాని ఔరంగాబాద్ కుట్రకేసుతో సహ ఇతర అన్ని కేసులలోను ఆయన నిర్దోషి అని తేలడంతో న్యాయస్థానాలు ఆ కేసులను కొట్టి వేసాయి.

2006 చివరిలో ఆయన బెయిల్ మీద విడుదలయ్యారు. తర్వాత అమరుల బంధు మిత్రుల సంఘంలో చేరి గౌరవాధ్యక్షుడయ్యాడు. ఎక్కడ బూటకపు ఎన్‌కౌంటర్ జరిగినా వెంటనే అక్కడికి వెళ్ళి ఆ ఎన్‌కౌంటర్‌కి సంబంధించిన అన్ని విషయాలు తెలుసుకొని, పోలీసులు నిరాయుధంగా పట్టుకొని ఎలా కాల్చిచంపుతున్నారో మొదలగు నిజాలను వెళ్ళడించేవాడు. అమరుల కుటుంబాలకు ఆశ్వాసన అందించి మృతదేహాలకు గౌరవ ప్రదమైన అంత్యక్రియలు జరిపించే వాడు. అమరుల స్మారక సభలు, సమావేశాలు నిర్వహించేవాడు. దాంతో ప్రసాదం, ఆ సంఘంలోని ఆయన సహచరులు పోలీసుల కంట్లో నలుసుగా మారారు. మరోవైపు ఎ.పిలోని విప్లవ ప్రజాసంఘాల నాయకులు తమ కార్యచరణలో ఎదురయ్యే సమస్యల పరిష్కారం కోసం ఆయన వైపే చూసేవారు. ఇదంతా పోలీసులకు కన్నెర్ర అయ్యింది. ఆయనను మరిన్ని కేసులలో ఇరికించి ప్రజాఉద్యమాలలో లేకుండా చేయడానికి, తన సమయమంతా కోర్టుల చుట్టు తిరగడంలోనే వృధా కావడానికి పోలీసులు కుట్రలు పన్నారు.

2010 అక్టోబర్ 13న పార్టీని కలవడానికి వెళ్ళుతున్న కొద్దిమంది కామ్రేడ్స్‌ను పోలీసులు అరెస్టు చేసారు. వీరిని ప్రసాదమే లోపలికి పంపిస్తున్నాడనే ఆరోపణతో చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం కింద మరోసారి నిర్భందించారు. ఆయన జైలులో ఉన్నప్పుడు మల్కనగిరి కలెక్టర్ వినీల్ కృష్ణను బందీగా పట్టుకున్నప్పుడు ప్రభుత్వంతో చర్చలకు కామ్రేడ్ ప్రసాదును ప్రతినిధిగా పంపాలనే ప్రతిపాదన వచ్చింది. ఆ డిమాండ్లలో ప్రసాదంను విడుదల చేయడంతో పాటు వందలాది మంది ఆదివాసీలను విడుదల చేయాలనేవి ముఖ్యమైనవి. ఆ సమయంలో ఆదివాసీ ఖైదీలు విడుదల కాకుండా తాను విడుదల కానని నిక్కచ్చిగా చెబుతూ వారు విడుదలైన తరువాతే బెయిల్‌పై బయటకు వచ్చాడు. ఆ తరువాత అమరుల బంధుమిత్రుల కమిటిలో కొనసాగుతూనే ఆర్.డి.ఎఫ్, సి.ఆర్.పి.పిలోను పనిచేసాడు. హైదరాబాద్‌లో 2012 ఏప్రిల్‌లో ఆర్.డి.ఎఫ్ ప్రథమ మహాసభలు జరిగినప్పుడు దానికి ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యాడు. అలాగే సి.ఆర్.పి.పిలో క్రియాశీలకంగా పనిచేస్తూ రాష్ట్రంలోని జైళ్ళలో వున్న రాజకీయ ఖైదీలను కలుస్తూ వారి అవసరాలు తీర్చేవాడు.

ప్రసాదం మంచి రచయిత, సాంస్కృతిక కార్యకర్త. నిజానికి ఆయన సామాజిక జీవితం తొలిరోజుల్లో ఆయన కవితా రచన చేసాడు. తరువాత సైద్ధాంతిక, విశ్లేషణాత్మక చర్చా రచనలలోకి మళ్ళాడు. దాంతోపాటు స్వంత పేరుతో, కలం పేరుతో చేసిన రచనలు బయట పత్రికలలో అచ్చయ్యాయి.

తన జీవితంలో చివరి మూడు రోజులు చూస్తే ఆయన ఎటువంటి జీవితం గడిపారో అర్థంమవుతుంది. జూలై 2న హైదరాబాద్ లోని రైల్వే కార్మికుల సమావేశంలో పాల్గొని కార్మికులకు యాజమాన్యానికి జరగబోయే చర్చలలో వ్యవహరించాల్సిన దానికి అవసరమైన సలహాలు, సూచనలు అందిచాడు. ఆ సమావేశామనంతరం బస్సులో గుంటూరు వెళ్ళి సీనియర్ రచయిత ఆలూరి భుజంగరావు సంస్మరణ సభలో పాల్గొన్నాడు. మరుసటి రోజు నెల్లూరు వెళ్ళి కూటాలమర్రి బూటకపు ఎన్‌కౌంటర్ అమరుల సంస్మరణ సభలో ప్రసంగించాల్సి వుంది. అయితే జూలై 4 విరసం ఆవిర్భావ దినం కూడా కావడంతో ఆ సదస్సులో ఆలూరి భుజంగరావు గురించి మాట్లాడాడు. తరువాత కుటాలమర్రి అమరులలో ఒకరి సోదరి క్యాన్సర్ వ్యాధితో భాదపడుతూ వున్నదని తెలిసి ఆమెను పరామర్శించడానికి భోజన విరామ సమయంలో ఆసుపత్రికి వెళ్ళాడు. ఆసుపత్రినుండి వస్తుండగా హంతకులు అతిసమీపం నుండి ఆయన శరీరంలోకి మూడు తూటాలు కాల్చారు. అయినప్పటికి చావును తప్పించు కుంటాడనే అనుమానంతో కొబ్బరి బోండాల కత్తితో మెడపై, చాతిపై దారుణంగా నరికారు. వెంటనే ఆయన సహచరులు ఆయన్ని ఆసుపత్రికి తరలించగా వైద్యులు రెండు శస్త్రచికిత్సలు చేసి తూటాలను తొలగించారు. ఆపరేషన్

**(తరువాయి భాగం 41 వ పేజిలో)**

అమరుల చరిత్ర

# పాలమూరు మట్టిబిడ్డగా పుట్టి, మన్యం ఆదివాసీ ప్రజల గుండెలలో చిరస్థాయిగా నిలిచిపోయిన కార్మిక వర్గ నాయకుడు, విప్లవ సాంస్కృతిక రంగ యోధుడు కా.మాధవ్‌కు విప్లవ జోహార్లు!!

కా. మాధవ్ అసలు పేరు గొల్లా.రాములు. దక్షిణ తెలంగాణాలో మహబూబ్‌నగర్ (పాలమూరు) జిల్లా గోపాల్‌పురం గ్రామంలో వ్యవసాయ పేద రైతు కుటుంబంలో పుట్టాడు. దేశంలో గరీబ్ జిల్లాల్లో అదొకటి. ఆ జిల్లాలో పుష్కలంగా వనరులున్నప్పటికీ, ప్రజలకు మాత్రం జీవనోపాది లేదు. అందుకనే ప్రజలు వలసలు వెలుతుంటారు.

కా. మాధవ్ వనపర్తి టౌన్‌లో ఇంటర్మీడియట్ వరకు చదివాడు. ఆ సమయంలోనే ఆర్.ఎస్.యులో చేరి, అలా పార్టీ పరిచయాల్లోకి వచ్చాడు. అప్పటి నుండి తుది శ్వాస విడిచే వరకు 17 సంవత్సరాలు పాటు పీడిత ప్రజల పక్షానా అలుపెరగకుండా పోరాడాడు. చదువుకునే రోజుల్లో నుండే చాలా చురుకుగా, తెలివిగా వుండేవాడు. ఎప్పుడూ నవ్వుతూ, అందర్ని నవ్విస్తూ వుండే స్వభావం గలవాడు.

విద్యార్థి రంగ ంలో పని చేస్తు న్నప్పటి నుండే కళలు పట్ల ఆసక్తి చూ పడం, వాయి ద్యాలు మీద పట్టు వుండ డం, బాగా పాటలు పాడడం గమనించిన పార్టీ తనని 1997 లో మొట్ట మొదటిగా ఏర్పడిన దక్షిణ తెలంగాణా జె. ఎన్. ఎం టీంలో పెట్టింది. కా. భాస్కర్ (కృష్ణా నదిలో పుట్టి మునిగి అమరుడైనాడు) నాయకత్వంలో ముగ్గురు సభ్యులతో అది ఏర్పడింది. కళాపరంగా చాలా సామర్థ్యం వున్న టీం అది. హైదరాబాద్‌లో ఇంజినీరింగ్ చదివి, రాజకీయంగా చాలా పరిణితి చెందిన కా. భాస్కర్ నాయకత్వంలో ఆ టీం కొనసాగింది.



అయితే 1997లోనే ప్రపంచ బ్యాంకు దిశానిర్దేశంతో చంద్రబాబు విప్లవోద్యమంపై ఎల్.ఐ.సి వ్యూహంలో భాగంగా బహుముఖ దాడిని ప్రారంభించాడు. ముఖ్యంగా దక్షిణ తెలంగాణ విప్లవోద్యమంపై ఈ నిర్బంధం విరుచుకుపడింది. ఇటువంటి పరిస్థితులో సైతం ఈ టీం అనేక జాగ్రత్తలు తీసుకొంటూ గ్రామీణ ప్రాంతంలో సాంస్కృతిక ప్రదర్శనలు ఇస్తూ విప్లవ రాజకీయాలను ప్రచారం చేసింది. అంతే కాకుండా విప్లవ సాహిత్యం (పాటలు) సృష్టించడం, స్థానిక దళాలకు, గ్రామీణ యువతకు సాంస్కృతిక కార్యక్రమాల్లో తర్ఫీదు నివ్వడం, స్థానిక దళాలలో విప్లవ చైతన్యం పెంచే విధంగా వారి వద్ద ప్రదర్శనలు ఇవ్వడం-వంటి కర్తవ్యాలు చేపట్టింది. ఈ కర్తవ్యాలన్నింటిలో కా. మాధవ్ చురుగ్గా వుండేవాడు. 1999లో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర కమిటి దిద్దుబాటు క్యాంపెయిన్ చేపట్టింది. ఇదే సంవత్సరంలో ఈ క్యాంపెయిన్‌తో పాటు ఎన్నికల బహిష్కరణ, ఎత్తుగడల ప్రతిదాడి కాంపెయన్‌లను రాష్ట్ర వ్యాప్తంగా ఏ.పి రాష్ట్ర కమిటీ నిర్వహించింది. వీటిని విజయవంతం చేసేందుకు రాష్ట్ర స్థాయి జె.ఎన్.ఎమ్ టీంతో పాటు దక్షిణ తెలంగాణ జె.ఎన్.ఎమ్ టీమ్ కూడా కలిసి సాంస్కృతిక రూపాలు (పాటలు, స్ట్రీట్ ప్లేలు) రూపొందించారు. ఇందులో 'చంద్ర బాబు సంస్కరణలపైన', దిద్దుబాటుపైన రూపొందించిన స్ట్రీట్ ప్లేలు ముఖ్యమైనవి. చంద్రబాబు సంస్కరణలపై రూపొందించిన స్ట్రీట్ ప్లేను వీడియో చిత్రంగా రూపొందించారు. ఈ మొత్తం కార్యక్రమాలలో కా. మాధవ్ చురుకైన పాత్ర నిర్వహించడమే కాకుండా, సాంస్కృతిక రంగంలో తన సామర్థ్యాన్ని పెంచుకొన్నాడు. కామ్రేడ్ మాధవ్‌లో కళాపరమైన శక్తి సామర్థ్యాలే కాకుండా మిలిటెన్సీ కూడ వుండేది. పోలీసు బలగాలు వచ్చినప్పుడు ధైర్యంగా ప్రతిఘటనలో పాల్గొనేవాడు. మధవ్‌లో చోటు చేసుకున్న ఈ అభివృద్ధిని పార్టీ గమనించి, ఏ.ఓ.బిలో సాంస్కృతిక రంగం అవసరాలు తీర్చేందుకు ఆయనను అక్కడికి బదిలీ చేసింది.

2000 జూన్‌లో ఏ.ఓ.బికి వచ్చి, జె.ఎన్.ఎం కమాండర్‌గా నియమితుడయ్యాడు. అదే సమయంలో జె.ఎన్.ఎంలో పని చేస్తున్న కా. విజయ (2007లో ఆమిదేలు గ్రామంలో పోలీసులు పట్టుకొని, పెట్టిన తీవ్ర చిత్రహింసల్లో అమరురాలైంది)ను వివాహం చేసుకున్నాడు.

కా. మాధవ్ ఏ.ఓ.బి విప్లవోద్యమ అభివృద్ధికి కళారంగంలో గొప్ప కృషి చేసాడు. ముఖ్యంగా 'ప్రజల నుండి నేర్చుకోండి' అనే కా. మావో సూక్తిని లోతుగా వంటబట్టించుకొని ఇక్కడి ఆదివాసీ ప్రజల జీవితాల నుండి, బోలెడన్ని విషయాలను వినయంగా నేర్చుకున్నాడు. ముఖ్యంగా 'ప్రజల భాష, సంస్కృతులపై పట్టు సంపాదించకుండా ఏ కళాకారుడు కూడ గొప్ప సాహిత్యాన్నీ కళారూపాలను సృష్టించలేడు' అనే పార్టీ మార్గదర్శక సూత్రాన్ని మదిలో నింపుకొని ప్రజల భాషా సంస్కృతులపై పట్టు సంపాదించేందుకు అహర్నిశలు కృషి చేసాడు. అందుకే మాధవ్ వివిధ తెగలకు చెందిన భాషా సంస్కృతులపై పట్టు సంపాదించటమే కాకుండా, పాటల రూపంలో మంచి విప్లవ సాహిత్యాన్ని సృష్టించాడు. ముఖ్యంగా కువ్వి, ఒడియా భాషలలో అనేక పాటలు రాసాడు. తాను ప్రజల జీవన స్థితిగతులను ఆకళింపు చేసుకోవడం వలన ప్రతి పాటను వాళ్ళ గుండెకు హత్తుకునేలా రాసాడు. థింసా వంటి ప్రజా కళారూపాలలో తాను కూడ ప్రజలతో పాల్గొంటూ, వారి

వాయిద్యాలు నేర్చుకొంటూ ప్రజలకు చేరువయ్యాడు. మొత్తంగా ఏ.ఓ.బి విప్లవ సాంస్కృతికోద్యమ పురోగమనంలో మాధవ్ ఒక ముఖ్యమైన భూమిక పోషించాడు. శాంతి చర్చల కాలంలోనూ, ఆ తదుపరి రూపొందించిన వీడియో, ఆడియో కాసెట్స్ అన్నింటిలోనూ మాధవ్‌ది ప్రముఖ పాత్ర అనే చెప్పాలి.

2004లో తనని డి.సిలోకి ప్రమోట్ చేస్తూ, ఎస్.కె.ఎల్‌కి బదిలీ చేశారు. అక్కడ కూడా అనేక ప్రదర్శనలు ఇస్తూ తన ఆట, పాట ద్వారా ప్రజల్ని వుత్సాహపరుస్తూ విప్లవ సాంస్కృతికోద్యమాన్ని అభివృద్ధి చేయడంలో తీవ్రమైన కృషి చేసాడు. 2005లో ఉద్యమ అవసరాల రీత్యా పార్టీ మాధవ్‌కు విశాఖ జిల్లాలో ఆర్గనైజేషన్ బాధ్యతలను అప్పచెప్పింది. ఆర్గనైజేషన్‌లో కూడ అనుభవం సంపాదించాడు. అక్కడ ప్రజలతో కూడా కలిసిపోయేవాడు. ప్రజల సమస్యలు తెలుసుకొని అవి పరిష్కరించే విధంగా కమిటీలో చర్చించేవాడు. 2005-2008 వరకు ఈస్టు డివిజన్ వుద్యమంలో భాగం అయ్యాడు. విశాఖ డివిజన్ పి.ఎల్‌కి డిప్యూటీ కమాండర్‌గా, కొంత కాలం కమాండర్‌గా కూడా వుంటూ పి.ఎల్‌ని నడిపిస్తూ ఇటు జె.ఎన్.ఎమ్, అటు ఆర్గనైజేషన్ రెండు బాధ్యతలు చూసేవాడు.

2005లో తను నిర్వహిస్తున్న జె.ఎన్.ఎమ్ క్యాంపుపై దాడి జరిగినప్పుడు శత్రువుపై కాల్పులు జరిపి దళాన్ని రిట్రీట్ చేయించాడు. ఆ దాడిలో అమరులైన ఇద్దరు కామ్రేడ్స్ శవాలను ప్రజలు తేవడానికి భయపడినప్పుడు తను ఒక్కడే సివిల్లో ప్రజల్లో వుండి శవాలను తీసుకు వచ్చి విప్లవ సాంప్రదాయంతో అంతిమ సంస్కారాలు జరిపించాడు. 2006లో దర్లిపుట్ (అరకులోయ) దగ్గర బొగ్గు తీసుకెల్తున్న రైల్వే బోగీని పేల్చివేసి 6 వాకీ సెట్లు సీజ్ చేయడంలో నాయకత్వం వహించాడు. 2007లో ఆమిడేలు ఎన్‌కౌంటర్‌కు కారకుడైన వుంచురూబ శ్రీనును ఖతం చేయడంలో నాయకత్వం వహించాడు. తన నాయకత్వంలో కొన్ని కరువు దాడులు కూడా నిర్వహించారు. 2008లో విశాఖ జిల్లా, రూమ గ్రామంలో శత్రువు చేసిన దాడిలో ప్రతిఘటిస్తూ తప్పించుకున్నాడు. 2008లో సరికిబంద (అట్టగూడ క్యాంపు దగ్గర) ఒడియా తెగకి చెందిన భూస్వామి ఇంటిపై కరువు దాడి చేసి గొడ్లు, మేకలు, ధాన్యం ప్రజలకు పంపిణీ చేశాడు. రామారావుపాలెంలో భూస్వామి రామారావు ఇంటిపై దాడి చేసి, ప్రజలకు అక్కడున్న సామాన్లు పంచారు. ప్రజా వ్యతిరేకిగా వున్న సానాని, రామారావుని కూడా ఖతం చేయడంలో తను నాయకత్వం వహించాడు. అక్కడ వున్న ఎస్.ఆర్ కంపెనీకి సంబంధించిన సోలార్ ప్లేట్‌లు కూడా ప్రజలకి పంచాడు. వేలంజువ్విలో హోంగార్డ్ ఇంటిపై దాడి చేయించి, వాడి ఇల్లు కూలగొట్టిన సంఘటనలో కూడా తను నాయకత్వం వహించాడు. విశాఖ ఏరియాలో బాక్సైట్ వెలికితీతకు వ్యతిరేకంగా జరిగిన వుద్యమంలో కూడా ప్రజల్ని సంఘటితం చేసి, కదిలించాడు. మిలిటరీపరంగా కూడా చురుకుగా వుండడంతో పార్టీ తనని 2008లో ముగ్గురు టీంతో ఏర్పాటు చేసిన ఏక్షన్ టీంకి కమాండర్‌గా బదిలీ చేసింది.

2008లో మద్దిగరువు ఏరియాలో ఇన్‌ఫార్మర్ల ఏరివేత కార్యక్రమం తీసుకున్నాడు. ఏరియాలో ప్రజా ద్రోహులు వుంటే నాకు నిద్రపట్టదు అని అనేవాడు. ఏరియాలో కుమార్ పేరుతో తిరుగుతూ అక్కడ ప్రజల గుండెల్లో కూడా నిలిచిపోయాడు. ప్రతీ గ్రామాన్నీ వర్గ విశ్లేషణ చేస్తూ పెద్దాల్ ఎవరు, పెత్తందార్లు ఎవరు తెలుసుకున్నాడు. కోరుకొండలో కూడా తిరుగుతూ అక్కడ ప్రజల్ని కూడా రాజకీయాలు మేళవించిన ఆటపాటలతో ప్రభావితం చేశాడు. 2008లో చిత్రకొండ పాకెట్‌లో తారు రోడ్లు వేయించొద్దు అని మనం ప్రచారం చేస్తున్నప్పటికి, పెద్ద రోడ్లు వేస్తూ, డబ్బులు తింటూ ప్రజల్ని మోసం చేస్తున్న రోడ్డు కాంట్రాక్టర్ని ఖతం చేయడంలో ముందున్నాడు. 2008లో ప్రజా వ్యతిరేకి, బాక్సైట్ వెలికితీతకి కారకుడుగా వున్న విశాఖ జిల్లా హుకుంపేటకు చెందిన జెడ్.పి.టి.సి వైస్ ప్రెసిడెంట్ రవి శంకర్‌ని ఖతం చేయడంలో ముందున్నాడు. అదే సమయంలో అరాచకుడు, ప్రజా వ్యతిరేకి అయిన హుకుంపేట ఎం.పి.పి చిట్టిబాబును ఖతం చేయడంలో తను నాయకత్వం వహించాడు. 2009లో జైపూర్ నుండి చిత్రకొండకి బ్యాంకు నుండి కోటి రూపాయలు తీసుకువస్తున్న ప్రభుత్వ వాహనంపై దాడి చేసి అక్కడ వున్న ఇద్దరి ఎస్కార్ట్స్‌తో విషయం చెప్పి డబల్ బేరల్, కోటి రూపాయలు స్వాధీనం చేసుకోవడంలో తను ముఖ్య పాత్ర వహించాడు. 2011 జనవరిలో జన్నిగూడ ఆంబుష్‌కు సమాచార సేకరణకు కృషి చేస్తూ, ఆ దాడి విజయవంతం అయ్యేలా కృషి చేశాడు.

2009లో విద్యార్థి రంగంలోకి బదిలి అయి ఒనకడిల్లీ, లమతాపుట్ పాకెట్స్‌లో వున్న విద్యార్థుల్ని ఆర్గనైజ్ చేశాడు. అక్కడ టీచర్లు బడులకు గైరుహాజరవుతుండటంతో కా॥మాధవ్ వారందరిని సమావేశ పరిచి పిల్లలకు సక్రమంగా విద్యను బోధించాలని అర్థం చేయించడమే కాకుండా, మధ్య తరగతి వర్గంగా ఉపాధ్యాయులు సామాజిక మార్పులో తమ వంతు కర్తవ్యాన్ని నిర్వహించాలని వారికి బోధించాడు. 2011 వరకు ఆర్.ఎస్.యు బాధ్యతలలో కొనసాగుతూనే అనేక పాటలు ఒడియా, కువ్వీలో రాసాడు.

2011లో మళ్ళా తనని ఆర్గనైజేషన్ పనిలోకి మారుస్తూ గుమ్మా ఏరియాకి బదిలీ చేశారు. అక్కడ ఏ.సి.ఎస్‌గా కటాఫ్, గుమ్మా రెండు దళాల్ని డీల్ చేసాడు. అక్కడ కూడా ప్రజల సమస్యలు పరిష్కరించడంలో కృషి చేశాడు. కటాఫ్ ఏరియాలో విస్తాపన సమస్య పరిష్కారం అయ్యే విధంగా కృషి చేశాడు. కటాఫ్ ఏరియాలో కూడా, ప్రతీ గ్రామాన్ని, ప్రతీ ఇంటిని కలిసి, ఆ ఇంట్లో సొంత వ్యక్తిలా కలిసిపోయేవాడు. ఇక్కడ కూడా నిర్మాణాలు పెట్టి ప్రజలు తమ సమస్యలు పరిష్కారానికి పోరాడేలా ప్రోత్సహించాడు. ముఖ్యంగా విశాఖ డివిజన్‌లోనూ మరియూ కటాఫ్ ఏరియాలో విప్లవోద్యమంలో అశువులు బాసిన అమరుల జ్ఞాపకాలు ప్రజల హృదయాల్లో నిలిచిపోయే విధంగా వదులు సంఖ్యలో స్థూపాలు నిర్మింపచేయడంలో కా.మాధవ్ ప్రముఖ పాత్ర పోషించాడు.

ఇలా కా.మాధవ్ 17 సంవత్సరాల విప్లవ జీవితాన్ని ప్రజల కోసం అంకితం చేసాడు. ఏ.ఓ.బిలో తను పని చేసిన ప్రాంతంలో కా.మాధవ్ అంటే తెలియని వారు వుండరు. తాను ఏ ఏరియాలో పని చేసినా అక్కడ ప్రజల మనసులల్లో నాటుకుపోయేవాడు. తాను ఏ రంగంలో పని చేస్తుంటే ఆ రంగం పనిలో పూర్తిగా నిమగ్నమై పని చేసేవాడు.

**(తరువాయి భాగం 40 వ పేజీలో)**

**అమరుల చరిత్ర**

# చిన్నటేకుగూడ వర్గ పోరాటం నుండి ఉద్భవించిన వీర గెరిల్లా కామ్రేడ్ రాంబత్తి

కా.రాంబత్తి మల్కనగిరి జిల్లా బొడ్డుగట్ట పంచాయితీ కలిమెల బ్లాక్ చిన్న టేకుగూడ గ్రామంలో పుట్టింది. రాంబత్తికి తల్లిదండ్రులు పెట్టిన పేరు ఇద్మే. టేకుగూడ అంటేనే శత్రువుకు కంటిమీద కునుకు లేకుండా చేసి, ఎంతో మంది ఆదివాసి రైతాంగాన్ని వుద్యమకారులుగా తీర్చిదిద్దిన పోరాటాల పురిటిగడ్డ. సహజంగానే అలాంటి గ్రామంలో పుట్టి పెరిగిన రాంబత్తి, జనతన్ సర్కార్ చెప్పినట్లు చిన్న వయస్సులోనే బాలల సంఘంలో చేరింది.

2007 నుండి మిలీషియాలో కొనసాగుతూ, పార్టీ సంఘం నిర్ణయించిన అనేక దాడుల్లో పాల్గొంది. అనేక కరువు దాడుల్లో పాల్గొంది. ఇన్‌ఫార్మర్స్‌ని ఖతం చేయడంలో పాల్గొంది.

కా.రాంబత్తి పార్టీ పిలుపునందుకొని 2008లో పూర్తికాలం కార్యకర్తగా పని చేయడానికి సిద్ధపడింది. కా.రాంబత్తి 16 ఏళ్ళకే పార్టీలోకి వచ్చి, చాలా చురుకుగా, వుత్సాహంగా వుండేది. రాంబత్తిలో వుండే చురుకుదనాన్ని, మిలిటెన్సీని చూసి పార్టీ తనని ఏక్షన్ టీంలో పెట్టింది. ఏక్షన్ టీంలో కొంత కాలం పని చేసిన తర్వాత, వుద్యమ అవసరాల రీత్యా 2008 చివరిలో సి.ఆర్.సి కంపెనీ-1లోకి బదిలీ అయింది. ఈ విషయంలో ఎలాంటి శషభిషలు లేకుండా, పార్టీ చెప్పిన నిర్ణయాన్ని అమలు చేసింది.

2008 నవంబర్‌లో మల్కనగిరి జిల్లా రాజులకొండ వద్ద జరిగిన ఎదురు కాల్పుల్లో శత్రువును వీరోచితంగా పోరాడుతూ తరిమికొట్టింది. 2010లో కంపెనీ -1లో కొనసాగుతూ అక్కడ పార్టీ నిర్ణయించిన అనేక దాడుల్లో పాల్గొంది. కోరాపుట్‌లో 2010 మధ్య పెరిగిన శత్రు నిర్బంధాన్ని కంపెనీలో వుంటూ ధీటుగా ఎదుర్కొంటూ ప్రజలకు అండగా నిలిచింది. కమాండర్ ఏ పని చెప్పిన చేయను, లేదు, కాదు అనకుండా ప్రతీ పనిని నవ్వుతూ స్వీకరించేది.

2010లో విశాఖ జిల్లాలో జరిగిన చెరువూరి ఆంబుష్‌లో కూడా పాల్గొంది. 2010 జనవరిలో జరిగిన కిల్లంకోట ఎన్‌కౌంటర్లో శత్రువుతో తలపడి తప్పించుకుంది. 2010 మేలో జరిగిన ఆర్.వి.నగర్ ఆంబుష్‌లో కూడా పాల్గొంది. 2011లో ఈస్ట్‌లో కంపెనీ-1లో పని చేస్తూ అనేక దాడుల్లో పాల్గొంది. 2012లో కోరాపుట్‌లో శత్రువు సమాచారం తెలిసి ఆంబుష్ కూర్చుండగా, శత్రువు కౌంటర్ ఆంబుష్ చేపట్టినప్పుడు హోరాహోరీగా పోరాడుతూ తప్పించుకుంది. కోరాపుట్‌లో తెల్లవారు జామున 4 గంటలకి రంగినగూడాలో జరిగిన ఎన్‌కౌంటర్లో కూడా శత్రువుతో కొట్లాడి చాకచక్యంగా తప్పించుకుంది. 2012లో మంగళాపురంలో ఫైరింగ్ చేస్తూ రిట్రీట్ అయింది.

కా.రాంబత్తి కంపెనీలో డాక్టర్‌గా వుంటూ కామ్రేడ్స్‌కి, ప్రజలకు సేవలు అందించింది. సహజంగానే చురుకుగా వుండే రాంబత్తి తన డాక్టర్ పని పూర్తి చేసుకొని, సమిష్టి పనుల్లో కూడా పాల్గొనేది. 2012లో తన తోటి కామ్రేడ్‌ను ఇష్టపడి సహచరుడుగా ఎన్నుకుంది. ఆ సమయంలో కూడా పితృస్వామ్యంతో కొట్లాడింది.

అమరురాలయ్యే నాటికి సెక్షన్ డిప్యూటిగా వుంది. తాను పని చేసింది కొద్ది కాలమే అయినా, ప్రజల భాషలు కువ్వి, తెలుగులను నేర్చుకొన్నది. వున్న సమయంలోనే చదువు నేర్చుకుంది.

2013 జూన్ 23న గూడెం కొత్తవీధి మండలం పోతరాజు గుమ్మాలు వద్ద శత్రువు సమాచారం తెలిసి, కమాండర్ ఆదేశంపై చెకింగ్ టీంతో వెళ్ళింది. ఈ టీంలో రాంబత్తి, ముందు నడుస్తూ శత్రువును గమనించి, శత్రువుతో తలపడింది. కానీ శత్రువు విచ్చలవిడిగా జరిపిన ఫైరింగ్‌లో రాంబత్తి కాలికి తీవ్రమైన గాయం అయింది. కాలి ఎముక ఇరిగి నడవలేని స్థితిలో "నేను రాలేను, నేను ప్రాణాలతో శత్రువుకి దొరకకూడదు, ఒక తూట కొట్టి వెళ్ళు" అని తోటి కామ్రేడ్స్‌ని కోరింది. ఇది గమనించిన శత్రు బలగాలు మన కామ్రేడ్స్‌ను చుట్టుముట్టి కాల్పులు తీవ్రతరం చేసాయి. ఈ పరిస్థితిలో మన కామ్రేడ్స్ రాంబత్తిని రక్షించుకోలేక, కళ్ళల్లో నీళ్ళు నింపుకొని ఆమె ఇచ్చిన ఇన్‌సాస్ రైఫిల్‌ని తీసుకొని రిట్రీట్ అయ్యారు. తరువాత శత్రువు కా.రాంబత్తిని పట్టుకొని తీవ్రమైన చిత్రహింసలకు గురి చేసి పాశవికంగా ఆమెను హత్య చేసాడు. ఇంతటి చిత్రహింసలను సైతం కా.రాంబత్తి దృఢంగా ఎదుర్కొని పార్టీ ప్రతిష్టను సమున్నతంగా నిలిపింది. ప్రజల ప్రయోజనాల కోసమే తన జీవితమంటూ చాటి చెప్పింది.

---

**(29వ పేజి తరువాయి)**

ఈ పరిస్థితులన్నీ, శత్రువుకున్న ఇబ్బందులను, అనుకూలతలను బలహీనతలను తెలియజేస్తున్నాయి. కనుక మనం పోరాడేటప్పుడు శత్రువుకున్న బలాన్నేకాక, బలహీనతలను కూడా మనం దృష్టిలో వుంచుకోవాలి. అయితే మన ప్రాంతాలలో శత్రువును ఓడించాలంటే మనం భయం, భీతి లేకుండా సాయుధమై రక్తపాతంతో కూడిన తెగింపు పోరాటం చేయడమే నిర్ణయాత్మకమవుతుంది. చరిత్రలో కూడా "లొంగుబాటు కంటే మరణం మేలు" అనే నినాదం ప్రజల పోరాట దృఢసంకల్పాన్ని పెంచి విజయ సాధన అంశంగా మార్చింది.

కనుక ఈ రోజు మనం కట్ ఆఫ్ ఏరియాలో ఎంత చిన్న శక్తిగా వున్నప్పటికీ కార్మిక వర్గ సిద్ధాంతాన్ని, రాజకీయాలను మన సొంత కార్యాచరణగా మలుచుకుంటే శత్రువు మీద పై చేయి సాధించ గలుగుతాము. శత్రువు తలపెట్టిన లొంగుబాటు పథకాన్నితిప్పికొడ్తూ ప్రజా యుద్ధాన్ని అభివృద్ధి చేసే దిశగా పురోగమించగలుగుతాము.

**గుమ్మా ఏరియా కమిటి,**

**సి.పి.ఐ (మావోయిస్టు).**

**'సామాజిక ఆర్థికపరిశోధన లక్ష్యం ఏమిటంటే, వర్గ బలగాల గురించి సరైన అంచనాకు రావడం, ఆ తదుపరి పోరాటానికి సరైన ఎత్తుగడలు రూపొందించుకోవడమేను'**

**-కా॥ మావో...**

అమరుల చరిత్ర

# కార్మిక వర్గ అంతర్జాతీయతను ఎత్తిపట్టిన ఛత్తీస్‌ఘడ్ పోరు బిడ్డ కా॥ ఊరాల్ అమర్‌రహే !



ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో సుకుమా జిల్లా దక్షిణ్ బస్తర్ డివిజన్‌లోని జేగురుగొండ ఏరియా గోందోడు గ్రామంలో 20 సం॥ క్రితం కా॥ఊరాల్ తమ తల్లితండ్రులకు నాల్గవ సంతానంగా జన్మించాడు. తండ్రి అనారోగ్యంతో చనిపోవడంవల్ల చిన్ననాటినుండి పశువులు మేపుకుంటూ తన తల్లికి చేదోడు, వాదోడుగా వుండేవాడు. తన గ్రామంలోను చుట్టుపక్కల ఏరియాలో జరుగుతున్న ప్రజాపోరాటాలను, ప్రజారాజ్యధికార నిర్మాణాల్లో ప్రజలు సంఘటితపడుతూ అనేక త్యాగాలతో నూతన వరవడిని సృష్టిస్తూ భవిష్యత్తుకు బాటలువేస్తున్న విప్లవ కార్యాచరణ ప్రభావం సహజంగానే తనపై పడింది. విప్లవకర వాతావరణంలో పెరగడంతో ఆ భావాలను పుణికిపుచ్చుకుని పశువులను కాస్తూనే పాటలు పాడడం, డ్యాన్సు చేయడం నేర్చుకున్నాడు. తన ఈ అభిరుచిని దృష్టిలో పెట్టుకుని స్థానిక పార్టీ గ్రామస్థాయిలో వున్న సి.ఎన్.ఎమ్. యూనిట్‌లో అతన్ని సభ్యుడిగా చేర్చుకుంది. అలా తన విప్లవ కార్యాచరణ మొదలై తన గ్రామం, చుట్టుపక్కల గ్రామాల్లో విప్లవ రాజకీయాలను ప్రచారం చేయడంలో కృషి చేసాడు. తనలో వున్న చురుకుదనాన్ని దృష్టిలో పెట్టుకుని పార్టీ మిలీషియా నిర్మాణంలో సభ్యుడిగా చేర్చుకుంది. సల్వాజుడుం అభియాన్‌కు వ్యతిరేకంగా ప్రజలను కూడగట్టి జుడుంను ఎదిరించడంలో తన వంతు పాత్ర పోషించాడు. 2009లో పూర్తికాలం కార్యకర్తగా పనిచేయడానికి సిద్ధపడ్డాడు. దానితో పార్టీ 2010లో ఎఓబిలో ఏర్పాటు చేసిన సి.ఆర్.సి మూడవ కంపెనీలో సభ్యుడిగా వెళ్ళాలని చేసిన నిర్ణయాన్ని సంతోషంగా స్వీకరించాడు. కంపెనీలో గార్డ్ బాధ్యతలను స్వీకరించి నాయకత్వంను కంటికి రెప్పలా కాపాడుకునేందుకు కృషి చేసాడు.

కోరాపుట్ జిల్లా నారాయణపట్నా బ్లాక్‌లో ప్రజలు పెద్దఎత్తున భూస్వామ్య, సారావ్యతిరేక పోరాటాల్లో కదులుతూ వేలాది ఎకరాల భూములను స్వాధీనం చేసుకోవడంతో హడలి పోయిన దోపిడి వర్గాలు పెద్దఎత్తున పోలీసు, శాంతిసంఘం గూండాలతో దాడులకు పూనుకున్నారు. ఈ సమయంలో కా॥ ఊరాల్ ప్రజలలో వుంటూ వారిసహకారంతో శాంతిసంఘం గూండాలను మట్టుపెట్టి ప్రజలకు పార్టీ, సంఘంపై విశ్వాసం పెరిగేలా కృషిచేసాడు.ప్రజల స్థానిక భాషలైన కువ్వి, ఒడియాను నేర్చుకోవడంతో పాటు తను నేర్చుకున్న పార్టీ రాజకీయాలను ప్రజలకు వారి భాషలో అర్థంచేయించేవాడు. పార్టీ అవసరాలరీత్యా నియమగిరి, బాసదార, గుమ్‌సర్ డివిజన్లలోని పోలీసు ఇన్‌ఫార్మర్స్‌ను, వేదాంత కంపెనీ దళారుల, గూండాలను శిక్షించడంలో క్రియాశీలకంగా పాల్గొన్నాడు. ప్రజలను సంఘటితం చేసే పనిలోకూడా తన వంతు కృషిని కొనసాగించాడు. పార్టీ తనకు ఏ పని అప్పజెప్పినా స్వీకరించడంతో పాటు దానికి సంబందించిన వన్నీ పట్టుదలతో నేర్చుకునేవాడు. కోరాపుట్‌తో పాటు ఇతర ప్రాంతాలలో తిరిగేటప్పుడు అక్కడి టెర్రెయిన్, దారులు, ప్రజలపై పట్టు సంపాదించి కంపెనీలో ఆధారపడే కామ్రేడ్స్‌లో తనూ ఒకడిగా అభివృద్ధి అయ్యాడు. సమిష్టి పనుల్లోనూ, బరువులు మోసేదగ్గర అందరికి ఆదర్శంగా వుండేవాడు. మిలటరీ ప్రాక్టీస్‌ను నిరంతరం కొనసాగిస్తూ తనకు తెలియని విషయాలు నాయకత్వంను అడిగి తెలుసుకునేవాడు. తనతోపాటు ఉన్న కొద్దిమంది కామ్రేడ్స్ ఇక్కడి ఉద్యమంలో తగినంత మమేకం కాకపోవడం, కష్టాలకు సిద్ధపడక తిరిగి డి.కె కు తిరిగి వెళ్ళిపోవాలని నిర్ణయించుకున్నప్పుడు వారి తప్పుడు అవగాహనను విమ్మర్శిస్తూ త్యాగాలకు సిద్ధపడ్డవారే చివరివరకు కమ్యూనిస్టులుగా వుంటారని, అనేక ప్రాంతాల్లో మన ఉద్యమం విస్తరించి అభివృద్ధి కావడం ద్వారానే డి.కె ఉద్యమం నిలబడుతుందనే విశ్వాసంతో తన విప్లవ కార్యాచరణను కొనసాగించాడు. తన బాధ్యతలలో నిమగ్నమై వున్న క్రమంలోనే 2013 నవంబర్ 1వ తేదిన కోరాపుట్ జిల్లా పొట్టంగి బ్లాక్‌లోని దిగువపణికి గ్రామ పరిసరాల్లో కంపెనీ మకాం వున్నట్లు ప్రజాద్రోహి ఇచ్చిన స్పష్టమైన సమాచారంతో వందలాది కోబ్రా, ఎస్.ఒ.జి బలగాలు మకాంను చుట్టుముట్టి దాడిచేసారు. కా॥ ఊరాల్ ఆ సమయంలో సెంట్రీ డ్యూటిలో వుండి నాయకత్వం, తోటి కామ్రేడ్స్‌ను రక్షించుకోవడం కోసం శత్రువుతో తీవ్రంగా పోరాడుతూ తన విలువైన ప్రాణాలను ఈ నేలతల్లి విముక్తికోసం దారపోసాడు. తను పుట్టిపెరిగిన ప్రాంతన్నే కాకుండా తన దేశాన్నీ, ప్రపంచాన్నీ విముక్తి చేయడం ద్వారానే పీడిత ప్రజల నిజమైన విముక్తి సాధ్యపడుతుందని నమ్మి నిజమైన కార్మికవర్గ అంతర్జాతీయతను పునికిపుచ్చుకున్న కా॥ ఊరాల్ మనందరికీ ఆదర్శ పాత్రుడు.తన ఆదర్శ జీవితాన్ని గ్రామ గ్రామాన ప్రచారంచేస్తూ వందల, వేల యువతీయువకులను పి.ఎల్.జి.ఎలోకి సమీకృతులను చేయడమే కా॥ ఊరాల్ కు మనమిచ్చే నిజమైన నివాళి.

కా॥ ఊరాల్ అమర్‌రహే !

కా॥ ఊరాల్ ఆశయాలను కొనసాగిద్దాం !!

**అమరుల చరిత్ర**

# కోరాపుట్ ముద్దుబిడ్డ కా॥ సుశీలకు విప్లవ జోహార్లు

కా॥ సుశీల ఒడిశాలోని కోరాపుట్ జిల్లాలో బందుగాం పంచాయితీలోని జముక గ్రామంలో 20 సం॥ క్రితం తల్లి సెలచు, తండ్రి బుగ్గిలకు నాల్గవ సంతానంగా పుట్టింది. తల్లితండ్రులు తనకు పెట్టిన పేరు కాంద్రీ. గ్రామ ంలో తమది మునసబు కుటుంబం అయినప్పటికి తను చిన్ననాటి నుండి కష్టపడే తత్వం కలిగి ఉండడంతో పాటు ప్రజల కష్టాల పట్ల ఆవేదన చెందేది. 2004 సం॥ నుండి ఈ ప్రాంతంలోపార్టీ నాయకత్వంలో సంఘ కార్యక్రమాలు మొదలైనాయి. తమ చుట్టు పక్కల గ్రామాలతో పాటు పక్కబ్లాక్ అయిన నారాయణపట్నాలో పెద్దఎత్తున పార్టీ నాయకత్వంలో జరుగుతున్న భూపోరాటాల ప్రభావం కా॥సుశీలపై పడడంతో పాటు వాటికి ఆమె అకర్శితురాలైంది. 14సం॥ వయస్సులోనే సంఘంలోచేరి భూపోరాటాలు, సారావ్యతిరేక పోరాటాలలో భాగమైంది. తమ గ్రామంలో సంఘనిర్మాణం ఏర్పాటుచేసి, తాను దానికి అధ్యక్షురాలుగా ఎన్నికైంది. అంతేకాకుండా చుట్టుపక్కల గ్రామాల్లో సంఘ నిర్మాణాలు ఏర్పాటుచేయడంకోసం ప్రచారం చేసేది. వీటితోపాటు మహిళలు ఎదురుకొంటున్న బలవంతపు పెళ్ళిళ్ళు, బాల్య వివాహాలు వంటి సమస్యలను తోటి మహిళలతో చర్చించి వాటికి వ్యతిరేకంగా పోరాడాలనీ పిలుపునిచ్చేది. తన తల్లితండ్రులు ఆమెకు తన మేనమామ కొడుకుతో పెళ్ళిచేయాలని ప్రయత్నించినప్పుడు దానిని తీవ్రంగా వ్యతిరేకించడంతో పాటు వారికి నచ్చజెప్పటం కోసం ప్రయత్నం చేసింది. తల్లి ఆమెకు మద్దత్తు ఇచ్చినప్పటికి తండ్రిమాత్రం తన పరువుపోతుందని తీవ్రంగా వత్తిడిచేసాడు. అయినా కా॥ సుశీల వాటికి లొంగకుండా పార్టీ, సంఘం అండతో దృఢంగా నిలబడింది.



పార్టీ ఆమె పట్టుదలను చూసి ఆర్.పి.సిలో సాంస్కృతిక రంగ బాధ్యతలు అప్పజెప్పినప్పుడు వాటిని సంతోషంగా సీకరించడంతో పాటు ఆ రంగాన్ని అభివృద్ధి చేయడం కోసం కృషి చేసింది. కువ్వి తెగలో ఉన్న సహజమైన 'థింసా' నృత్యాన్ని అభివృద్ధి చేసి పాటలను దానికి జోడించి విప్లవ సంస్కృతిని ప్రచారం చేసేది. శతృ నిర్బంధం తీవ్రతరం కావడంతో 2013 సెప్టెంబర్‌లో దళ సభ్యురాలిగా గెరిల్లా జీవితం ప్రారంభించింది. ప్రతిపని లోను పురుషులతో పోటీపడి చేసేది. సమిష్టి పనుల్లో, బరువులు మోయడంలో ఆదర్శంగా ఉండేది. దళంలోకి వచ్చిన తక్కువ సమయంలోనే పుస్తకాలను చదివేంతగా అభివృద్ధి చెందింది.

ఈ దోపిడి వ్యవస్థను సమూలంగా కూల్చివేయటం ద్వారానే మహిళలకు నిజమైన స్వేచ్ఛ లభిస్తుందని అందుకోసం మహిళలందరు ప్రజాయుద్ధంలో భాగం కావాలని మహిళలకు నిరంతరం భోదించేది. తను ఒక మంచి గెరిల్లాగా అభివృద్ధి అవుతున్న క్రమంలోనే 2013 సెప్టెంబర్ నెలలో స్నానం చేస్తుండగా బండరాళ్ళపై నుండి జారిపడి ప్రమాదవశాత్తు మరణించింది. ఆమె అమరత్వం పార్టీకి తీరని నష్టం. కా॥ సుశీల అమరత్వాన్ని ఎత్తిపడుతూ తన ఆశయ సాధన కోసం కృషిచేద్దాం. కా॥ సుశీల అమర్‌రహే !

❍

**(37వ పేజి తరువాయి)**

తను ఏ రంగంలో వున్నా చివరి వరకు జె.ఎన్.ఎమ్ అభివృద్ధికి కృషి చేయాలనే దాంతో పాటలు రాస్తూ, పాడుతూ అందర్ని ప్రోత్సహించేవాడు.చివరి వరకు సాంస్కృతోద్యమానికి తోడ్పడుతూనే వున్నాడు. పార్టీతో వున్నా, ప్రజలతో వున్నా తన సొంత ఇంట్లో వుంటూ, కుటుంబ బాధ్యతలు చూసుకునే విధంగా వుండేవాడు. ఈ 17 ఏళ్ళలో ఊగిసలాటకు గురైన అనేక మంది కామ్రేడ్స్‌ను నిలబెట్టడంలో తన పాత్ర కూడా వుంది. ఏ రోజూ ఎలాంటి ఊగిసలాట లేకుండా శతృవు పట్ల తీవ్ర వర్గ కసి ప్రదర్శించేవాడు. ఎప్పుడూ నవ్వుతూ, అందర్ని కడుపునిండా నవ్విస్తూ వుండేవాడు.

అయితే కా॥మాధవ్ విప్లవోద్యమ జీవితంలో పాజిటివ్ అంశాలు ప్రధానమైనప్పటికీ, తనలో కొనసాగుతున్న బూర్జువా భావజాలంపై గట్టి పోరాటం చేపట్టలేకపోయాడు. ఫలితంగా తన విప్లవ జీవితం కొన్ని ఒడిదుడుకులతో సాగింది. చివరికి 2013 ఆగష్టులో వ్యక్తిగత సమస్య వల్ల ఊగిసలాటకు గురై, బయటకి వెళ్ళి, 20 రోజులు తర్వాత శతృ చేతికి చిక్కి, తీవ్ర చిత్రహింసలకు గురై ఆగష్టు 21న అమరుడైనాడు. శతృవు చేతిలో పడినప్పుడు ఊగిసలాట వున్నప్పటికి, శతృవుకి మాత్రం ప్రయోజనం చేకూర్చకూడదనే విషయంలో మాత్రం దృఢంగా నిలబడ్డాడు. తను అమితంగా ప్రేమించిన పార్టీ, ప్రజల పక్షాన్నే నేను వున్నానని రుజువు చేసుకున్నాడు. పూర్తిగా దిగజారకుండా బహుశా ఆ టైంలో వాళ్ళ అమ్మ చెప్పే మాట, "పార్టీనీ, ప్రజలను వదలకు బిడ్డా" అన్న మాటలు గుర్తు వచ్చుంటాయేమో! ఏదైనా తనకి చాలా సమాచారం తెలిసినప్పటికీ శ్రామిక వర్గ పక్షపాతిగా ప్రజలకి హాని చేయకూడదు, పార్టీకి హాని చేయకూడదు అనే బలమైన ఆకాంక్షే తనని చివరి నిముషంలో నిలబడే విధంగా తోడ్పడింది. ఈ విధంగా, అమరుడై ప్రజల హృదయాలలో నిలిచిపోయాడు. ❍

అమరుల చరిత్ర

# కా॥ బెన్నూకి విప్లవ జోహార్లు!!

కా.బెన్నూకి 40 సంవత్సరాలు. 5వ తరగతి వరకు చదువుకున్నాడు. కుబ్వి తెగలో పుట్టిన పేద ఆదివాసి రైతు. కా.బెన్నూ 2007లో పార్టీకి పరిచయం అయ్యాడు. ఆనాటికి కటాఫ్ ఏరియా ఈస్ట్ డివిజన్‌లో భాగంగా వుండేది. ఆసమయంలో పార్టీ అక్కడ చేపడుతున్న పోరాటాలు చూసి బెన్నూ పార్టీవైపు ఆకర్షితుడైయ్యాడు. గ్రామంలో అనేక సమస్యల పట్ల స్పందించేవాడు. అలా క్రమంగా 2008లో రైతు కూలి సంఘంలో చేరాడు. ఆ తదుపరి పార్టీ సెల్‌లోకి వచ్చాడు. 2008లో పార్టీ నిర్మాణంలో పనిచేస్తూ, అనేక కార్యక్రమాలు చేపట్టాడు. ముఖ్యంగా వెదురు కూలి పెంపుదల కోసం జరిగిన పోరాటంలో చురుగ్గా పాల్గొంటూ మేటీలని నిలదీయడంలో ధైర్యం చూపాడు.

గ్రామంలో వున్న పెత్తందార్లకి వ్యతిరేకంగా కూడా పోరాడేవాడు. చుట్టూ వున్న గ్రామాల్లో ఏ చిన్న సమస్య వచ్చిన వెంటనే స్పందిస్తూ పార్టీకి తెలియజేసేవాడు. గాజులమామిడి పెత్తందారికి వ్యతిరేకంగా పోరాడి, భూములు స్వాధీనపరుచుకున్నాడు.

2008లో పార్టీ నిర్మించిన విచ్చిన్నాంచల్ కమిటి నిర్మాణంలో వున్నాడు. ఈ కమిటీలో వుంటూ కటాఫ్ ఏరియాలో ప్రధాన సమస్య అయిన విస్తాపన సమస్య పరిష్కారం కోసం తీవ్రంగా కృషి చేసాడు.

బలిమెలలో 35 మంది పోలీసులను చంపిన ఘటనకు కా॥ వేను పూర్తి మద్దతు తెలియజేస్తూ రెక్కీ, సన్నాహ కార్యక్రమంలో ముఖ్య పాత్ర వహించాడు.

2009లో కటాఫ్ ఏరియా మల్కనగిరి డివిజన్‌లో భాగమైన తర్వాత, ఇక్కడ పార్టీ నిర్వహించిన అనేక కర్యక్రమాల్లో కూడా పాల్గొన్నాడు. 2009లో విస్తాపన సమస్య మీద మనం తీసుకున్న కార్యక్రమంలో ప్రజలందర్ని కూడగట్టి చిత్రకొండలో కలెక్టర్ ఆఫీసు ముందు ధర్నాకి కదిలించాడు. అక్కడ తమ సమస్యలు పరిష్కారానికి 20,000 మందితో 10 రోజులు ర్యాలీ చేసారు. ప్రజలందరూ అక్కడే వుండి రోడ్డు మీదనే వంటలు చేసుకున్నారు. ప్రజల సంఘటిత శక్తిని చూసి దిగి వచ్చిన ప్రభుత్వం కొత్త మోటారు బోట్లను, లాంచ్‌లను మంజూరు చేసింది. కరెంటు, విద్యా, వైద్యం వంటి సమస్యల పరిష్కారానికి హామి ఇచ్చింది. ఈ పోరాటం కా॥వేణుకు మంచి నాయకుడుగా గుర్తింపు తెచ్చింది. 2009లో పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు జూలై 28 అమరుల సంస్మరణ వారోత్సవాలకి, అనేక చోట్ల స్థూపాల నిర్మాణంలో భాగం పంచుకున్నాడు.

తన సొంత బావ పెద్ద వల వేసి చేపలు పట్టూ, చిన్న వలలు వున్న ప్రజలకు ఆటంకంగా వుండటంతో, పార్టీ ముందు సమస్యను పెట్టి, సొంత బావకి వ్యతిరేకంగా పోరాడి వలను తీయించి తాను రక్త సంబంధం కన్నా వర్గ సంబంధానికే ప్రాధాన్యతనిస్తానని నిరూపించుకున్నాడు.

వర్గ శతృవుల్ని నిర్మూలించడంలో, వివిధ వర్గాల సమస్యల్ని పరిష్కరించటంలో బెన్నూ ముందుండే మాస్ నాయకుడు. వేలంపాక ఏరియాలో బెన్నూ పేరు చెబితేనే ప్రజలు చాలా సంతోషపడేవారు.

అలా పార్టీ ఏ పని చెప్పినా కరెక్ట్‌గా అమలు చేయడంలో ముందుండేవాడు. ఆ ప్యాకెట్‌లో మన ఆర్.పి.సి లేకపోయినా దాదాపు 'ప్రజల రాజ్యాన్ని' నడిచేలా పనిచేసాడు వేణు. 2008 నుండి నేటిదాక ఆర్.సి.ఎస్ మెంబర్‌గా, సెల్ సెక్రటరీగా ఎదుగుతూ వర్గ కసితో పట్టుదలతో ధైర్యంగా పని చేసాడు.

కా.బెన్నూని ఇన్‌ఫార్మర్ ఇచ్చిన సమాచారంతో పక్కా ప్లానింగ్‌తో, ఇంటిని చుట్టుముట్టి, ఒక మిలీషియా కామ్రేడ్‌ని, బెన్నూని అరెస్టు చేసారు. మిలీషియా కామ్రేడ్‌ని జైళ్ళో పెట్టి, బెన్నూని ఇంటి వద్దనే తీవ్ర చిత్రహింసలు పెట్టి, కొట్టి కొట్టి చంపారు. కొనవూపిరితో వున్నప్పుడు హాస్పటల్‌కి తీసుకువెళ్ళుతున్నప్పుడు అమరుడయ్యాడు.

చివరి వరకు ప్రజల కోసం పని చేసి, అంతిమంగా కూడా శతృవుకి ఎలాంటి సమాచారం చెప్పకుండా శతృవు పెట్టిన చిత్రహింసలు తట్టుకొని అమరుడై మనందరికి ఆదర్శంగా నిలిచిన కా.బెన్నూకి నివాళులు అర్పిద్దాం. ❍

---

**(35వ పేజి తరువాయి)**

జరుగుతున్నంత సేపు స్పృహలో ఉండి వైద్యులతో మాట్లాడుతూ "ఆ హంతకులు నన్ను వ్యక్తిగా చంపవచ్చు కాని నా స్పూర్తిని చంపలేరు" అని అన్నాడు. అంటే ఆ హంతకులు వారివెనుకవున్న ప్రభుత్వం విఫలమైనట్లే. ఇలా 2013 జూలై 4న ఆయన ఆసుపత్రిలో కన్నుమూసారు.

ప్రజా కార్యాచరణతో నిరంతరకృషి, విప్లవ రాజకీయాల పట్ల అంకుంఠిత నిబద్ధత వల్ల పాలక వర్గాలు అతి కిరాతకంగా నల్లదండు ముఠాల చేత హత్యచేయించింది. ఈ పద్ధతిలోనే అనేక మంది సంఘ కార్యకర్తలను గతంలో మట్టుబెట్టింది. ఇలాంటి హత్యలు చేయడం ప్రభుత్వానికి మొదటిదీకాదు, ఇది చివరిదీకాదు. ఈసారి మరింత విచిత్రంగా ఆంధ్రప్రదేశ్ పోలీసు అధికారుల సంఘం తమపాత్రను నిరాకరిస్తూ ఒక ప్రకటన ఇచ్చింది కాని ఆ ప్రకటన నిస్సందేహమైన బెదిరింపుతో ముగిసింది.

కా॥ గంటి ప్రసాదం మానవ సమాజ చరిత్ర పురోగమనానికి వర్గపోరాటం మాత్రమే చోదక శక్తిగా వుంటుందనే శాస్త్రీయమైన మార్క్సిస్టు సిద్ధాంతాన్ని సంపూర్ణంగా విశ్వసించి దాన్ని అమలు పరిచిన కార్మికవర్గ యోధుడు. ఈ క్రమంలోనే తన జీవితం సర్వస్వం పీడిత ప్రజలకు అంకితం చేసి మనకు గొప్ప వారసత్వాన్ని అందించాడు. " నన్ను బ్రతికించండి, నాకు బ్రతకాలని ఉంది, విప్లవం కోసం బ్రతకాలని వుంది, బహుశా నేను చనిపోతానేమో, కాని అది ఒకానొక వ్యక్తి మరణం మాత్రమే, నా ఆశయం మిగిలే వుంటుంది." అని ఆయన మృత్యుశయ్యమీద పలికిన అత్యంత విలువైన మాటల్లో కూడా ఆయన వారసత్వాన్ని మిగిల్చారు. ఆ మాటలు మిగిలే వుంటాయి. ఈ హత్యలో నిస్సందేహంగా కనబడుతున్న హంతక రాజ్యపు హస్తం ఆ వారసత్వాన్ని ఎంతమాత్రం చెరిపివేయజాలదు. ❍

# శీలకోట అమరులకు అరుణారుణ జోహార్లు.

భారత పాలక వర్గాలు 2009 లో సెప్టెంబర్‌లో మన పార్టీపైన, విప్లవోద్యమంపైన, పీడిత ప్రజలపైన ప్రారంభించిన ఆపరేషన్ గ్రీన్‌హంట్ సైనిక బహుముఖ దాడి 2 వ దశకు చేరింది. గడిచిన సంవత్సర కాలంలో సంఘటితపడి మరింత తీవ్రతరం అయింది. ఈ దాడి అభివృద్ధి, అణచివేత అనే ద్విముఖ వ్యూహంగా ప్రభుత్వం ప్రచారం చేస్తున్న యల్.ఐ.సి లో భాగంగా కొనసాగుతున్న బహుముఖదాడే. సంస్కరణలు, సివిక్ యాక్షన్ కార్యక్రమాలతో ప్రారంభమైన మానసిక యుద్ధం (దుష్ప్రచారం) నేడు అత్యంత కౄరమైన, దుర్మార్గమైన అమానవీయ హంతక పద్ధతులలో సాయుధ దాడిగా కొనసాగుతున్నది. గ్రామాలపై, ప్రజలపై నిరంతరం దాడులు చేస్తూ ప్రజల ఆస్తుల ధ్వంసం, అక్రమ అరెస్టులు, మాయంచేయడం, జైలు నిర్బంధాలు, చిత్రహింసలు, లాకప్‌హత్యలు, బూటకపు ఎన్‌కౌంటర్లు, మహిళలపై అత్యచారాలు చేస్తూ ప్రజలను లొంగదీసుకోవడానికి ప్రయత్నిస్తున్నది. ఈ దాడి నుండి ప్రజలకు, ప్రజానిర్మాణాలకు రక్షణ కల్పించడంలో భాగంగా మిలిషియా సాయుధమై ప్రతిఘటిస్తున్నది. అందులో భాగంగానే 2013 సెప్టెంబర్‌లో కలిమెల ఏరియాలోని ఎద్దుగొండ, మర్రిగట, కన్నగూడ గ్రామాలకు చెందిన మిలిషియా స్థానిక శత్రువులను కంట్రోలు చేయడంతోపాటు దాడిని తిప్పికొట్టే విధంగా ప్రజలలో రాజకీయ ప్రచారం చేస్తూ పొడియా ఏరియాకు వెళ్ళింది. సెప్టెంబర్ 13 న శీలకోట గ్రామం వద్ద మకాం వేసింది. గ్రామంలోని ఇద్దరు విప్లవ ద్రోహులు నేరుగా ఈ సమాచారాన్ని యస్.పి కి అందించారు. వందలాది బలగాలతో రాత్రికి రాత్రే మకాంను అన్ని వైపులనుండి చుట్టుముట్టిన పోలీసులు ఉదయం 5.30 గం॥ల సమయంలో అతిసమీపం నుండి టెంట్‌లో నిద్రిస్తున్న 14 మంది మిలిషియా కామ్రేడ్స్‌పైకి ఆటోమేటిక్ ఆయుధాలతో విచ్చలవిడిగా కాల్పులు జరిపి 13 మందిని హత్య చేసి వారివద్ద ఎకె – 47, 9 యమ్.యమ్ పిస్టల్స్, లాంటి ఆయుధాలు పెట్టి నిజమైన ఎన్‌కౌంటర్‌గా చిత్రీకరించి ప్రచారం చేసారు. వాస్తవాలు బయటకు రాకుండా చేయడానికి ఆదరాబాదరాగా శవాలను గుడ్డల్లో చుట్టి మూటలు కట్టి జిల్లా కేంద్రానికి తరలించి శవాలను కుటుంబ సభ్యులకు కూడా ఇవ్వకుండా పూడ్చిపెట్టారు. ప్రజలు వాస్తవాలను బయట పెట్టడంతో పోలీసు ఉన్నతాధికారులు నోరు మెదపలేదు. ఈ సంఘటనలో అమరులైన కామ్రేడ్స్‌కు ప్రజలు, ప్రజానిర్మాణాలు, పార్టీ, పి.యల్.జి.ఎ వినమ్రంగా తలవంచి జోహార్లు అర్పించారు. వారి ఆశయాలను ముందుకు తీసుకుపోతామని పిడికిళ్ళు బిగించి శపథం చేసారు.

## కా॥ గంగి

పోరాటాలకు పురిటిగడ్డ అయిన పెద్ద టేకుగూడలో ఆదివాసీ కోయ కుటుంబంలో జన్మించింది. ఈమె తల్లి కామ్రేడ్ కుమారి 2006 లో కాలని ఎన్‌కౌంటర్‌లో అమరురాలైంది. అప్పటికి గంగి వయస్సు 5 సం॥లు. తల్లి ప్రేరణతో పార్టీని అంటిపెట్టుకొని వుండేది. 2012 లో బాలల సంఘంలో చేరి స్థానిక దళాల తిండి, ఇతర అవసరాలు తీర్చడం చేసేది. తరువాత మిలిషియాలోకి రిక్రూట్ అయి ఆర్.పి.సి జన మిలిషియాలో పని చేసింది. చిన్న వయస్సు అని వారించినా వినకుండా పార్టీలోకి భర్తీ కావాలనే తన కోరికను వ్యక్తం చేసేది. ఆరోజు జరిగిన ఎన్‌కౌంటర్ ప్రదేశంనుండి తప్పించుకొని గంగి గ్రామానికి చేరుకుంది. కొన్ని గంటల తరువాత పోలీసులు ఆమెను పట్టుకొని కిరాతకంగా బాయ్‌నెట్‌తో పొడిచి చంపారు. అమరురాలు అయ్యేనాటికి కా॥ గంగి వయస్సు 10 సంవత్సరాలు.

## కా॥ గంగా మడకం



కా॥ గంగా మడకం మర్రిగట గ్రామంలోని కోయ ఆదివాసీ పెద్దాల్ కుటుంబానికి చెందిన వాడు. వయస్సు 19 సం॥లు. తల్లి బీమె మడకం, తండ్రి వాగ మడకం. 2011లో జన మిలిషియాలో భర్తీ అయి కమాండర్ బాధ్యతలు నిర్వర్తించాడు. భర్తీ అయ్యే నాటికి ఒక కొడుకు కూడా ఉన్నాడు. కలిమెలలోని పంచాయితీ ఎన్నికల క్యాంపెయిన్‌లో, పోత్కాల్ ఆంబూష్‌లో ఎ.కె. ఇన్‌సాస్ తెచ్చిన ఘటనలో పాల్గొన్నాడు. ప్రజాపోరాటాలలో, మిలిషియా దాడులలో చురుగ్గా ప్రజలను కదిలించేవాడు.

## కా॥ రామ మడకమి



కా॥ రామ మడకమి ఎద్దుగొండ గ్రామానికి చెందిన ఆదివాసీ కామ్రేడ్. తండ్రి మూకాల్. ఇతని వయస్సు 18 సంవత్సరాలు, వివాహమై పిల్లలు కూడా ఉన్నారు. మోటు, కలిమెల ప్రాంతంలో జరిగిన ప్రచార కార్యక్రమాలలో, శత్రు నిర్బంధ వ్యతిరేక కార్యక్రమాలలో, యమ్.వి 21లోని బెంగాలీ షావుకారి ఆస్తుల పై జరిగిన దాడిలో, పొట్టేరు ఇన్‌ఫార్మర్ పై జరిగిన దాడిలో, అతన్ని శిక్షించడంలో పాల్గొన్నాడు. పొల్లూరు రాంబాబుపై జరిగిన దాడిలో ప్రజలను కదిలించడంలో అతని పాత్ర చెప్పదగినది.

## కా॥ పొదియా మడ్కం

కా॥పొదియా మల్కనగిరి జిల్లా కలిమెల బ్లాక్ బొడిగట పంచాయితీలోని మరిగట నివాసి. ఇతని వయస్సు 18 సం॥లు. నిరుపేద కోయ ఆదివాసీ కుటుంబంలో తల్లి దేవె మడకమె, తండ్రి నంద మడకమెలకు జన్మించిన ముగ్గురు సంతానంలో ఇతను చివరివాడు. పెద్దవారికి పెళ్ళిళ్ళు కావడం వలన కుటుంబం అన్ని వనులకు ఇతనిపైనే ఆధారపడేది. కా॥పొదియా 2007 నుండి 2013 వరకు మిలిషియాలో పని చేసాడు. తరువాత ఇంటి దగ్గర ఉంటూనే ఆర్.పి.సి మిలిషియా బాధ్యతలు నిర్వహించాడు. దళం గ్రామానికి వచ్చినప్పుడు తన సొంత పనులు వదులుకొని దళం రక్షణ బాధ్యతలలో పాల్గొనేవాడు. పార్టీ ఏ పని చెప్పినా వెనుకముందు ఆలోచించకుండా చేసేవాడు. శతృసమాచారంను దళాలకు అందించేవాడు. కలిమెలలో జరిగిన టిసిఓసి క్యాంపెయిన్‌లో పాల్గొన్నాడు. పార్టీ ఇచ్చే బంద్ పిలుపును సఫలం చేయడానికి రోడ్లు తవ్వడం, చెట్లు నరకడం వంటివి చేసేవాడు. కలిమెల ప్రధాన రహదారిపై బిగ్‌గన్ పేల్చిన సంఘటనలో ఇన్‌సాస్, ఎకె,లను స్వాధీనం చేసుకున్న పోతకల్ ఘటనలో, ఎకెను స్వాధీనం చేసుకున్న కన్నగూడ ఆపర్చునిటి ఆంబుష్‌లో, దామన్‌జోడి ఆయుధాగార దాడిలో, ఇన్‌ఫార్మర్‌లను శిక్షించే ఘటనలలో, కరువు దాడులలో, పశువులను కషాయి దుకాణాలకు తరలించే దళారులపై దాడులలో తన వంతు పాత్ర పోషించాడు.



ఆర్.పి.సి లో ధాన్యంమిల్లు యొక్క బాధ్యత అతనిదే. ప్రజలను పోరాటాలలో కదిలించడంలో, మిలిషియా పోలీసులపై చేసిన దాడులలో ముందుండేవాడు. అతని అమరత్వం మర్రిగట ఆర్.పి.సికి తీరని నష్టం.

## కా॥ ఉంగాల్ మడకమి



కా॥ ఉంగాల్ మడకమి కలిమెల బ్లాక్ గంపకొండ పంచాయితీ కన్నగూడ నివాసి. కోయ ఆదివాసీ కుటుంబంలో జన్మించాడు. అతని తల్లి మడకమి సింగే, తండ్రి చిన్నతనంలోనే చనిపోయాడు. ఆ కుంటుంబంలో అతను ఒక్కడే సంతానం. కా॥ఉంగ కు వివాహమై ఒక కూతురు ఉంది. భార్య అనారోగ్యంతో చనిపోయింది. 2011 నుండి మిలిషియాలో పని చేస్తూ కలిమెల ప్రాంతంలో జరిగిన అనేక ప్రతిఘటనా కార్యక్రమాలలో పాల్గొన్నాడు. గంపకొండ పాఠశాల బిల్డింగ్ పేల్చివేత, పార్టీ బందు పిలుపులను విజయవంతం చేయడంలో చురుగ్గా పాల్గొన్నాడు.

## కా॥ రామ కోవాసి



రామ కోవాసి మర్రిగట గ్రామంలో తల్లి ఓమె కోవాసి, తండ్రి మూక కోవాసిలకు జన్మించాడు. వయస్సు 18 సంవత్సరాలు, గ్రామ మిలిషియాలో బాధ్యతలు నిర్వర్తిస్తూ కలిమెల ప్రాంతంలోని విప్లవ రాజకీయ ప్రచార క్యాంపెయిన్‌లలో పాల్గొన్నాడు.

## కా॥ ఊర మడకమి



ఊర మడకమి ఎద్దుగొండ నివాసి. 18 సంవత్సరాల వయస్సు. జన మిలీషియాలో డిప్యూటి కమాండర్‌గా పనిచేసాడు. కరువు దాడులలో, ఇన్‌ఫార్మర్లను శిక్షించడంలో, రాజకీయ ప్రచార కార్యక్రమలలో చురుగ్గా పాల్గొనేవాడు.

## కా॥ ఉంగ మడకమి



కా॥ ఉంగ మడకమి ఎద్దుగొండ నివాసి. వయస్స 21సం॥లు. 2012 నుండి మిలిషియాలో పని చేస్తున్నాడు. వివాహమై ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఆప్రాంతంలో జరిగిన కరువు దాడులలో, ఇన్‌ఫార్మర్‌ల ఇండ్లపై జరిగిన దాడులలో, రాజకీయ ప్రచారాలలో చురుగ్గా పాల్గొనేవాడు.

## కా॥ ఇర్మ పొడియామి



కా॥ఇర్మ పొడి యామి మల్కనగిరి జిల్లా కలిమెల బ్లాక్ బొడిగట పంచాయితీ మగ్రిగట గ్రామ నివాసి. వయస్సు 18 సం॥రాలు. ఆదివాసీ కుటుంబంలో తల్లి జోగి పొడియామి, తండ్రి గంగ పొడియామిలకు జన్మించాడు. 2008 నుండి మిలిషియాలో పనిచేస్తూ శతృ సమాచారాన్ని పార్టీకి చేరవేసేవాడు. 2011లో జరిగిన టి.సి.ఓ.సి. లో ఎమ్.వి 32 గ్రామ సమీపంలో జరిగిన ఫైరింగ్‌లో, కన్నగూడ ఆవర్చునిటీ అంబుష్ లో ఎ.కె తెచ్చిన ఘటనలో పాల్గొన్నాడు. జనతన సర్కార్ పాఠశాలలో టీచర్‌గా పనిచేసేవాడు. ఒక సంవత్సర కాలం పాటు దళంలో పనిచేసి (2011 - 2012) తిరిగి ఇంటికి వెళ్ళిన తరువాత కూడా మిలీషియా లో పని చేసాడు. పార్టీ అవసరాల రీత్యా మిలిషీయాతో పొడియా ఏరియాకు వెళ్ళాడు. శీలకోట ఎన్‌కౌంటర్‌లో అమరుడయ్యేనాటికి మిలిషీయా కమాండ్ లో సభ్యుడిగా కొనసాగాడు.

## కా॥ రామ మడకమి (రైన్)



కా॥ రామ మడకం (రైన్) మగ్రిగట గ్రామం లో నిరుపేద ఆదివాసీ కుటుంబంలో తల్లి బీమె మడకం, తండ్రి బీర మడకం లకు జన్మించాడు. వయస్సు 20 సంవత్సరాలు. రైను 2007లో మిలిషియా లో చేరి తరువాత దళంలో భర్తీ అయ్యాడు. దళంలో మూడు సంవత్సరాల కాలం పాటు పని చేసి ఇంటికి వెళ్ళిపోయాడు. ఇంటి దగ్గర వుంటూ మిలిషియా లో పని చేసేవాడు. మగ్రివాడ యస్. పి. ఓ.పై యాక్షన్ చేసిన ఘటనలో, పొడియా ఏరియాలోని ఒక యస్.పి.ఓ.ను చంపి ఒకడిని గాయ పర్చిన ఘటనలో తెల్లరాయి దగ్గర మైన్‌ప్రూఫ్ వాహనాన్న పేల్చి 17 మంది పోలీసుల ను చంపి 6ఎ.కె.లు తెచ్చిన ఆంబుష్ లో, శీలావతి గంజాయి దాడిలో, కరువు దాడులలో పాల్గొన్నాడు.

## కా॥ బీమ మడకమి



కా॥ బీమ మడకమి ఎద్దుగొండ నివాసి. వయసు్స 25 సంవత్సరాలు, 2012 లో మిలిషియాలో పని చేసాడు. వివాహమై ఒక కొడుకు, ఒక కూతురు ఉన్నారు. యమ్.వి 21లోని బెంగాలీ షావు కారి ఆస్తులపై, పొట్టేరు ఇన్‌ఫార్మర్ ఇంటిపై, పశువుల దళారులపై, పొల్లూరు ఇన్‌ఫార్మర్ రాంబాబు ఇంటిపై జరిగిన దాడులలో పాల్గొన్నాడు. ప్రజలను కదిలించి రాజకీయ కార్యక్రమాలు, బంద్ పిలుపులు విజయవంతం చేయడంలో కృషి చేసేవాడు.

## కా॥ దేవ సోడి

కా॥ దేవ సోడి కలిమెల బ్లాక్ నలగొండ పంచాయితీలోని ఎద్దుగొండ నివాసి. వయస్సు 15 సం॥లు. చిన్నవయస్సులో బాలలసంఘంలో పని చేసాడు. 2010లో మిలిషియాలో భర్తీ అయ్యాడు. దళానికి ఆహారాన్ని సేకరించడం, రక్షణ బాధ్యతలు, పార్టీ ఏ పని చెప్పినా బాధ్యత తో చేసేవాడు. కొంత కాలం జి.యన్.యస్ లో కూడా పని చేసాడు. ప్రభుత్వ నిర్బంద క్యాంపెయిన్‌లకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తూ పని చేసేవాడు.

## కా॥ కోస మడకమి



కా॥ కోస మడకమి కన్నగూడ గ్రామవాసి. వయస్సు 18 సం॥లు. తండ్రి మూక మడకమి, తల్లి చిన్నతనంలోనే చని పోయింది. వివాహమై ఒక కొడుకు వున్నాడు. 2009లో ఆర్.పి.సిలోని జి.యన్.యస్‌లో బాధ్యతలు నిర్వర్తించాడు. పని చేసిన కాలంలో ఆట, పాట, నాటికల ద్వారా ప్రజల్ని చైతన్యపర్చడానికి కృషి చేసే వాడు. కొద్ది రోజులు దళంలో పని చేసాడు. ప్రజా వ్యతిరేకి బుడ్సిమటేర్ పెద్దాల్‌ను శిక్షించటంలో, ఈ శీలకోట అమరులతో పాటు కోస పాత్ర కూడా ఉంది. అమరుడయ్యేనాటికి ఆర్.పి.సి లో సాంస్కృతిక రంగంలో పూర్తికాలం కార్యకర్తగా ఉన్నాడు.

## అమరుల చరిత్ర

# కా॥ రామ కొవాసి అమర్ రహే

మల్కనగిరి జిల్లా కలిమెల బ్లాక్‌లోని మోటు తహసీలు పరిధిలోని మెట్టగూడ గ్రామంలోని కోయ ఆదివాసి తెగలో 40 సం॥ క్రితం జన్మించిన రామకొవాసి గత 3 దశాబ్దాలుగా ఆ ప్రాంత పార్టీ నాయకత్వంలో జరుగుతున్న వర్గపోరాటంలో రాటుదేలాడు. గ్రామ విప్లవ రైతు కూలీ సంఘంలో చేరి దాని నాయకత్వంలోనే అడవి మీద హక్కు ఆదివాసీలది, పీడిత ప్రజలదేనని నినాదంలో ఫారెస్టు డిపార్ట్‌మెంటు మెడలు వంచి అడవి భూములను భూమి లేని నిరుపేదలకు పంపిణి చేసాడు. ఈ ప్రాంతంలో కరుడుగట్టిన గ్రామ పెత్తందారుల ఆధిపత్యానికి వ్యతిరేకంగా పోరాడి సంఘ నాయకత్వంలో ప్రజల అధికార స్థాపనకు కృషి చేసాడు. అడవి ఉత్పత్తులకు గిట్టుబాటు ధరల పెంపుదల పోరాటాలకు నాయకత్వం అందిచాడు. ఏరియాలో జరిగిన కరువు దాడులు, స్థానిక శత్రువులను శిక్షించే కార్యక్రమాలలో చురుకుగా పాల్గొన్నాడు. పోలీసు నిర్భంధాన్ని దిక్కరించి వాడి కళ్ళు గప్పి ప్రజలమధ్య వుంటూనే సంఘ కార్యకలాపాలను నిర్వహించాడు. డివిజన్ ఉద్యమంపై నిర్భంధం తీవ్రతరం కావడం, పార్టీ పొందిన నష్టాలు, దిగజారడాలు, స్వీయాత్మక శక్తులు తగ్గిపోవడంతో 2010 లో ఆ ప్రాంతంలో పని చేస్తున్న మోటు దళం ను వెనక్కి తీసుకోవడం జరిగింది. ఆపరేషన్ గ్రీన్‌హంట్‌లో భాగంగా ఈ ప్రాంతంలో అనేక పోలీసు క్యాంపులు ఏర్పాటు చేసి గ్రామాలపై నిత్యం దాడులు, అక్రమ అరెస్టులు కొనసాగించి ప్రజలను లొంగదీసుకునే కార్యక్రమం ఆ ప్రాంతంలో నిత్యకృత్యమైంది. ఈ క్రమంలోనే రామకొవాసిని అరెస్టు చేయడానికి, లొంగదీసుకోవడానికి శత్రువు అనేక ప్రయత్నాలు చేసాడు. కాని స్థానిక పెత్తందారులు, ప్రజావ్యతిరేకుల బెదిరింపులను, ఒత్తిడిలను దిక్కరించి తాను నమ్మిన సిద్ధాంతం, ప్రజల విముక్తి లక్ష్యసాధనను అంటిఎట్టుకొని ప్రజల పక్షమే నిలబడ్డాడు. లొంగుబాటు కన్న మరణమే మేలని నమ్మాడు. అదే ప్రజలకు బోధించాడు, ఆచరించాడు. 2013 ఆగస్టు నెలలో ఒక రోజు రాత్రి పోలీసులు దొంగచాటుగా ఇంటిని చుట్టుముట్టి భార్యపిల్లల సమక్షంలోనే అరెస్టు చేసి బలవంతంగా లాక్కుపోయారు. లొంగిపోతే వదిలిపెడతామని ప్రలోభపెట్టారు. నమ్మిన ప్రజలకు ద్రోహం చేయనని ఎదురు తిరిగాడు. తనని తీవ్రమైన చిత్రహింసలకు గురి చేసినప్పటికి పార్టీ, సంఘం రహస్యలు కాపాడాడు. ప్రాణాపాయస్థితిలో ఉన్న ఆయనపై తప్పుడు కేసులు బనాయించి మల్కనగిరి సబ్‌జైలులో నిర్భంధించారు. జైలు అధికారులు ఆయనకు వైద్యం చేయించడంలో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించడంతో మృత్యువుతో పోరాడి సెప్టెంబర్ 24 న జైలులోనే అమరుడయ్యాడనే వార్త పత్రికల ద్వారా ప్రజలకు వారి కుటుంబ సభ్యులకు తెలిసింది. తాను నమ్మిన ఆశయం కోసం కష్టాలు, నష్టాలు, ఉద్యమ ఆటు పోటులలో, చివరకు ప్రాణం ఇవ్వాల్సిన పరిస్థితులు ముందుకు వచ్చినా ప్రజల కోసమే జీవించి మరణించి శాశ్వతంగా ప్రజల మధ్య జీవించి అమరుడైన కా॥ రామకొవాసి త్యాగం ఉన్నతమైనది, మహోన్నతమైనదని ఎలుగెత్తి చాటుదాం. అసంపూర్తిగా మిలిగిపోయిన తన ఆశయాన్ని సఫలం చేద్దామని మరోమారు ప్రతినబూనుదాం.

## అర్ధసైనిక బలగాల కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయిన సాధారణ ప్రజలు గంగాధర్ కిర్సాని, సొన్యోలకు శ్రద్ధాంజలి ఘటిద్దాం.

అక్టోబర్ 2013లో కోరాపుట్ జిల్లా లమ్తాపుట్ గ్రామానికి సమీపం బ్లాక్‌లోని లిటిపుట్ గ్రామస్తులు వారి సాంప్రదాయక వేటలో భాగంగా రాత్రి పీతలు పట్టడానికి వెళ్ళారు. లమ్తాపుట్‌లోని బి.యస్.యఫ్ క్యాంపు పోలీసులు కూంబింగ్ నిర్వహిస్తూ రోడ్డుపక్క కాల్వలో లైట్లువేసి పీతలు పడుతున్న ప్రజలపై ఎలాంటి హెచ్చరికలు లేకుండా విచ్చలవిడిగా కాల్పులు జరుపగా గంగాధర్ కిర్సాని అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ఈ విషయం తెల్సుకున్న చుట్టు పక్కల గ్రామాలకు చెందిన వందలాది మంది ప్రజలు సంఘటన స్థలానికి చేరుకొని పోలీసులు పారిపోతూ వదిలి వెళ్ళిన ఎకె-47 మాగ్జన్‌ను స్వాధీనం చేసుకొని, శవాన్ని తీసుకొని ప్రదర్శనగా వెళ్ళి లమ్తాపుట్‌లోని బి.యస్.యఫ్ క్యాంపును చుట్టుముట్టారు. చేతికి దొరికిన రాళ్ళు, కర్రలతో పోలీసులపై తిరగబడ్డారు. సంఘటనకు కారకులైన పోలీసులను శిక్షించాలని, క్యాంపు ఎత్తివేయాలని, చనిపోయిన గంగాధర్ కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేసారు. న్యాయవిచారణ జరిపిస్తామని ప్రకటించి ప్రభుత్వం చేతులు దులుపుకుంది.

జనవరి 12 న మల్కనగిరి జిల్లా కుడుములగుమ్మ బ్లాక్‌లోని రాళ్ళగడ్డ పంచాయితీలోని ఈతలపాడు గ్రామానికి చెందిన ఆదివాసీలు తమ సాంప్రదాయక వేటకు రాత్రి అడవికి వెళ్ళారు. ఆ ప్రాంతంలో కొత్తగా బొడిపడలో వందలాది బి.యస్.ఎఫ్ బలగాలతో ఏర్పాటు చేసిన క్యాంపు పోలీసులు ప్రతి దినం ఏదో ఒక గ్రామంపై దాడి, అక్రమ అరెస్టులను కొనసాగిస్తూ ప్రజలను వేటాడుతున్నారు. అందులో భాగంగా కూంబింగ్ పేరుతో వచ్చిన బి.యస్.యఫ్ బలగాలకు గ్రామస్తులు ఎదురు పడ్డారు. వారిపై ఎలాంటి హెచ్చరికలు చేయకుండానే విచ్చలవిడిగా కాల్పులు జరపగా సొన్యో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. నక్సలైట్ల క్యాంపుపై దాడి చేయగా అనేకమంది గాయపడటంతో పాటు ఒక గుర్తు తెలియని నక్సలైట్ చనిపోయాడని ప్రకటించి శవాన్ని చిత్రకొండకు తరలించాడు. చివరకు శవాన్ని కుటుంబ సభ్యులకు కూడా ఇవ్వకుండా పూడ్చి పెట్టారు. ❍

> 'వాస్తవ పరిస్థితిని గురించిన పరిశోధన లేకపోతే, అప్పుడు వర్గ బలగాలగురించి భావవాద అంచనా, పనిలో భావవాద మార్గదర్శకత్వమూ విధిగా చోటుచేసుకుంటాయి. ఇవి అవకాశవాదానికిగానీ, దుందుడుకు తత్వానికి (పుట్చీజం) గానీ దారితీస్తాయి'.
>
> – కా॥ మావో...

# పోరాట వార్తలు

## శ్రీకాకుళం-కోరాపుట్ డివిజన్

### ప్రజా కోర్టులో భూస్వామి ఏజెంట్లయిన బొందు, దాసో లకు మరణ శిక్ష! ప్రతిఘటనా శక్తిని పెంచుకుంటూ భూ ఆక్రమణకై కదులుతున్న కుంబారిపుట్ రైతాంగం!!

కోరాపుట్ జిల్లా బందుగాం బ్లాక్ కుంబారిపుట్ పంచాయితీలోని ఇదే గ్రామానికి చెందిన బొందు, దాసో అనే ఇద్దరు కువ్వి తెగకు చెందిన వ్యక్తులే అయినప్పటికి గ్రామంలో పెత్తందార్లుగా వుంటూ భూస్వామి దలాయి బలరాంతో సన్నిహిత సంబంధాలు కొనసాగించేవారు. ఈ ప్రాంతంలో మన సంఘం బలంగా పనిచేస్తున్న క్రమంలో ప్రజలు పెద్దఎత్తున కదిలి భూస్వామి భూములను ఆక్రమించుకుని సాగుచేసారు. ఆసమయంలో వీరిద్దరు భూస్వామికి వ్యతిరేకంగా కలసివచ్చి గ్రామంలో సంఘనాయకులగా చలామణి అయ్యారు. ప్రభుత్వం మన పార్టీపైన, సంఘంపైన తీవ్రమైన నిర్బంధాన్ని అమలు చేయడంతో తిరిగి వీరు భూస్వామికి అనుకూలంగా మారి ప్రజలు సాగుచేస్తున్న భూములను భూస్వాములకు అప్పజెప్పాలని బెదిరించడం, నిర్బంధాన్ని సాకుగాచూపి ఆ గ్రామ, చుట్టుపక్కల గ్రామాల ప్రజలను సరెండర్ చేయించారు. సరెండర్ కాని కొద్దిమంది సంఘనాయకత్వంపై దాడులు చేసి హత్య చేయాలని ప్రయత్నించడం, ఇళ్లపై దాడులు చేసి ఆస్థులను స్వాధీనం చేసుకోవడం, ధ్వంసంచేయడం వంటివి చేసారు. పై దాడులకు భూస్వామి దలాయి బలరాం ముఖ్యుడు కావడంతో గతంలో పి.ఎల్.జి.ఎ యాక్షన్‌టీం వాడిని ఖతంచేసింది. అయినప్పటికి పోలీసుల అండదండలతో వీరిద్దరు నిరంతరం ప్రజలపై దాడులు చేయడం, గ్రామంలో పోలీసు క్యాంపు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరడం వంటివి చేస్తూవచ్చారు. వారి పద్దతులు మార్చుకోవాలని అనేక సార్లు హెచ్చరించినప్పటికి ఎటువంటి ఫలితం లేకపోవడంతో డిసెంబర్ 2013లో ప్రజాకోర్టు నిర్వహించి మరణశిక్ష విధించడమైనది.

ఇదే సమయంలో పార్టీని అణచివేయడంలో భాగంగా పెద్దఎత్తున రోడ్డు నిర్మాణ కార్యక్రమాలు చేపడుతున్న ప్రభుత్వం బందుగాం-రాయగడ మధ్యలో డబుల్‌లైన్ రోడ్డు నిర్మాణం కూడా చేపట్టింది. ఈ రోడ్డు నిర్మాణం కొరకు ఎ.ఆర్.ఎస్.ఎస్ అనే సంస్థ కాంట్రాక్టు తీసుకొని చురుగ్గా పనులు చేపట్టింది. డబుల్‌లైన్ రోడ్డు వలన ఏమాత్రం ప్రయోజనం లేకపోగా పెద్దఎత్తున తమ భూములు నష్టపోవడాన్ని ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించారు. అయితే ప్రభుత్వం దీన్ని పరిగణలోకి తీసుకోలేదు. దాంతో ప్రజలు, మిలీషియా, పి.ఎల్.జి.ఎ కదిలి 5 వాహనాలను దగ్ధంచేసారు. పై రెండు సంఘటనలు ఒకే రోజు జరగడంతో భూపోరాటానికి వ్యతిరేకంగా ఉన్న కొద్దిమంది వ్యక్తులు గ్రామం విడిచి పారిపోయారు. ఈ సంఘటనలు ప్రజల్లో మంచి ప్రభావాన్నీ వేయడంతో మరల ప్రజలు ఉత్సాహంగా భూస్వామి భూములు దున్నడానికి సిద్ధపడటంతో పాటు గ్రామంలో పోలీసు క్యాంపు ఏర్పాటుకు జరుగుతున్న ప్రయత్నాలను సంఘటిత శక్తితో అడ్డుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు.

### కుంబారిపుట్ పంచాయితీ లోని దిగువ జామగూడ గ్రామానికి చెందిన ప్రజావ్యతిరేకి సికను ఖతం, మరో ఇద్దరికి దేహశుద్ధి చేసిన ప్రజలు, పి.ఎల్.జి.ఎ

సికను మొదటనుండి గ్రామంలో పెత్తందారీగా ఉండటంతో పాటు మనకు వ్యతిరేకంగా రివిజనిస్టు కానూసన్యాల్ గ్రూపుతో సంబంధాలు కొనసాగించేవాడు. మన నాయకత్వంలో ఈ ప్రాంతంలో జరిగిన భూపోరాటాల్లో వీడి భూమిని కూడా స్థానిక ప్రజలు ఆక్రమించుకుని, సాగుచేసుకున్నారు. ఆసమయంలోనే స్థానిక ఆర్గనైజర్‌ను పోలీసులు పట్టుకుని అరెస్టు చేయడంతో మరల వీడు ప్రజలు ఆక్రమించి సాగుచేస్తున్న భూములను స్వాధీనం చేసుకున్నాడు. అంతేకాకుండా పోలీసులతో కలిసి కూంబింగ్స్‌లో పాల్గొని ప్రజల, సంఘనాయకుల ఇళ్లపై దాడులు చేయించడం, ఆస్థులను ధ్వంసంచేయడం, గ్రామంలో పోలీసు క్యాంపు పెట్టాలని ప్రజలను భయపెట్టి ఊరేగింపులు తీయించడం, ముఖ్య సంఘనాయకత్వాన్ని హత్య చేయడంకోసం రాత్రిపూట రహస్యంగా మాటులువేయడం వంటి అణచివేత పద్దతులను పోలీసుల అండతో కొనసాగించేవాడు. వీడి పద్దతులు మార్చుకోవాలని హెచ్చరిస్తూ గతంలో దేహశుద్ధి చేసారు. అయినప్పటికి ఎటువంటి మార్పు రాకపోవడంతో నవంబర్ 2013లో ప్రజాకోర్టు నిర్వహించి ఖతం చేసారు. ఈ సందర్భంలోనే వీడికి సహకరిస్తున్న మరో ఇద్దరికి కూడా దేహశుద్ధి చేసి హెచ్చరించి వదిలిపెట్టారు. ఈ ఘటన జరిగిన రెండవ రోజే ఎగువ జాముగూడ, కోసంపాడు గ్రామాల ప్రజలు ఏకమై సికను భూమిలో వేసిన పంటను స్వాధీనం చేసుకుని సమిష్టిగా పంచుకున్నారు. ❍

## ఈస్టు డివిజన్

### మన్యంలో విజయవంతమైన అమరవీరుల వారోత్సవాలు

నక్సల్‌బరి నేత కా.చారు మజుందార్ వర్ధంతి రోజైన జూలై 28 నుండి ఆగస్టు 3 వరకు అమరవీరుల వారోత్సవాలు ఈ సంవత్సరం మన్యం ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. మన్యంలో గత కొన్ని సంవత్సరాల నుండి ఈ వారోత్సవాలు జరుపుకునే విప్లవ సాంప్రదాయం అక్కడి ప్రజానీకానికి వుంది. ముఖ్యంగా గాలికొండ, కోరుకొండ ఏరియా కమిటీల పరిధిలోగల అన్ని గ్రామాలలో స్థూపాల నిర్మాణం జరిగి వుండటంతో వారోత్సవాలు సందర్భంగా మన్యం ప్రజలంతా గొప్ప విప్లవ స్ఫూర్తితో ఈ వారోత్సవాలను జరుపుకొన్నారు.

ఈస్ట్ డివిజన్‌లోని రెండు ఏ.సిల పరిధిలోగల ఏరియా ఏ.వి.ఆర్.సి.ఎస్‌ల ఆధ్వర్యంలో ప్రచార బృందాలు నెల రోజుల ముందు నుండే విస్తృత ప్రచారం చేశాయి. ఈ ప్రచార బృందాలు గ్రామ గ్రామానికి వెళ్ళి ఈ సంవత్సరం జోన్ వ్యాప్తంగా అమరులైన వారి వివరాలు, విప్లవంలో వారి కృషి, గొప్పదనాన్ని ప్రజలకు వివరించారు. బ్యానర్స్, పోస్టర్స్ ద్వారా కూడా మిలీషియా, ప్రచార బృందాలు సంయుక్తంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహించాయి.

ఈ సంవత్సరం ఇదే కాలంలో ప్రభుత్వం గాలికొండ ఏ.సి పరిధిలో తీవ్రమైన నిర్బంధాన్ని ప్రయోగించింది. 'ఆపరేషన్ క్లియరెన్స్' పేరుతో కొయ్యూరు, గూడెం కొత్తవీధి మండలాల్లో గ్రేహౌండ్స్, ఏ.పి.ఎస్.పి, సి.ఆర్.పి.ఎఫ్, కోబ్రా దళాలు వేల సంఖ్యలో మోహరించి కొన్ని వారాలపాటు ప్రజల్ని ఎటూ కదలనీయకుండా చేశారు. మొత్తంగా ఈ రెండు మండలాల్లో ముఖ్యంగా మన వుద్యమ ప్రాంతంలో మొత్తం 36 క్రూరాతిక్రూరమైన పోలీసు బ్యాచీలను ఈ ఆపరేషన్‌లో వుపయోగించారు. అయినప్పటికి గాలికొండ ఏరియాలో అమరవీరుల సంస్మరణ వారం ప్రధానంగా ఎ.వి.ఆర్.సి.ఎస్, మిలీషియా ఆధ్వర్యంలో నిర్వహించబడింది. అందులో భాగంగా ప్రధాన కూడళ్లయిన గూడెం, కొయ్యూరు, పెదవలస, లకారుపేట, సప్పర్లలలో పోస్టర్లు, బ్యానర్లు వేసి విస్తృతంగా ప్రచారం చేసారు. జూలై 28, 29 తేదీల్లో ఎర్రగడ్డ పాకెట్ పెదపాడులో, అన్నవరం పాకెట్ పిట్టలపాడు గ్రామంలో ఎ.వి.ఆర్.సి.ఎస్ ఆధ్వర్యంలో సంస్మరణ సభలు నిర్వహించారు. గతంలో ఈ ప్రాంతంలో పనిచేసి అమరులైన విప్లవ యోధులను, కమాండర్లను, కా॥రాంబత్తిని స్మరించుకున్నారు. వందలాది మంది ప్రజలు పాల్గొని ఈ సభలను విజయవంతం చేసారు.

కోరుకొండ ఏ.సి పరిధిలో జరిగిన సంస్మరణ సభలలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. వారోత్సవాలకు పది రోజుల ముందు నుండే ఏరియాలో సంస్మరణ సభలకు అవసరమైన సన్నాహాలు చేసుకొన్నారు. గ్రామ సంఘాల (ఏ.వి.ఆర్.సి.ఎస్) నాయకత్వంలో పని విభజన చేసుకొని ఏ గ్రామానికా గ్రామం స్థూపాల మరమత్తులు చేయడం, రంగులు వేయడం, డెకరేషన్ చేయడం (స్థూపాల చుట్టూత పూల మొక్కలు నాటడం), జెండాలు, బ్యానర్లు తయారు చేయడం, విప్లవ పాటలు నేర్చుకోవడం తదితర కార్యక్రమాలలో యువతీ యువకులు వుత్సాహంగా పాల్గొన్నారు. అలా మొత్తంగా ఏరియాలో స్థూపం లేని గ్రామం లేదంటే అతిశయోక్తి కాదు.

వారోత్సవాలు సందర్భంగా ఏరియా ఏ.వి.ఆర్.సి.ఎస్ నాయకత్వంలో మిలీషియా బ్యాచీలు జి.మాడుగుల మండలంలో బొయితిలి పంచాయితీలో సూరిమెట్ట, పులుసుమామిడి, రాపల్లి కాలనీ, వాకపల్లి జంక్షన్, నుర్మతీ సమీపంలో తోకగరువు తదితర రోడ్డు కూడళ్ల ప్రాంతాలలోగల అమరవీరుల స్థూపాలపై ఎర్రజెండాలు ఎగురవేసి, బ్యానర్లు కట్టి అమరవీరులకు నివాళులర్పించారు. లోపటి ప్రాంతాలైన మన పాకెట్ కమిటీల ప్రాంతాలలోనైతే జెండాలు ఎగురవేసి ఈ మధ్యకాలంలో అమరులైన కా.మహిత, గంటి ప్రసాదం, రాంబత్తి, రాజేంద్ర తదితర కామ్రేడ్స్‌కు జోహార్లు తెలుపుతూ నినాదాలు చేశారు. ప్యాకెట్ స్థాయి బహిరంగ సభలు జరుపుకొని ఘనంగా అమరవీరులకు అంజలి ఘటించారు.

డిసెంబర్ 17, 2010న చెరువూరు వద్ద దొంగ ఎదురు కాల్పులల్లో నేలకొరిగిన అమరవీరులకు వారు అమరులైన స్థలంలోనే కాఫీ పోరాట ప్రజలు 22 అడుగుల భారీ స్థూపాన్ని నిర్మించారు. ఈ భారీ బహిరంగ సభకు పెద్ద మొత్తంలో (800 పైగా) పంచాయితీ ప్రజలు పాల్గొన్నారు. అప్పటికే ప్రజల చొరవను దెబ్బ తీసేందుకు "ఏరియాలోకి పోలీసులు కూంబింగ్‌కు వస్తారనే" పుకార్లు శతృవు పుట్టించాడు. ఈ సంవత్సరం జూలై 28 ఆదివారం కావడంతో (స్థానికంగా ప్రజలు అమ్మకాలు, కొనుగోళ్ళు చేసే అతి ముఖ్యమైన సంతరోజు) శతృ కుట్ర పన్నాగాలను చిత్తు చేస్తూ జూలై 27నే ప్రజలు బహిరంగ సభ జరుపుకొన్నారు. సభలో విప్లవగీతాలు, అమరవీరుల గీతాలు ఆలపించి అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించారు. 25కు పైగా రాసిన బ్యానర్లు, అనేక ప్లకార్డులతో భారీ ఊరేగింపు కూడా తీశారు. "అమర వీరుల త్యాగాలు వృధాకావు", "అమరవీరులు మృత్యుంజయులు", "నెత్తుటి బాకీని నెత్తుటితోనే తీరుస్తాం", "అమరవీరుల ఆశయ సాధనకు తుదికంటూ పోరాడుదాం" అనే నినాదాలతో ఆ ప్రాంతమంతా మారుమోగింది. పెద్ద స్టేజీకట్టి ఎర్రజెండాలతో అలంకరించారు. మైక్ సెట్‌ను కూడా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రజలు విలేఖరులను పిలిచి తమ రాజకీయ లక్ష్యాలను వివరించారు.

ఈ సభలో లువ్వాసింగ్, జాజిపాలెం, గిల్లిలబంధ, వేలంజువ్వి తదితర గ్రామాల అమరవీరుల కుటుంబాలకు సహాయం (బియ్యం, పప్పు, నూనె, బట్టలు, తదితరాలు) అందించారు. మొత్తంగా జిల్లా పోలీసు, అధికార యంత్రాంగం మావోయిస్టు కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలనే లక్ష్యంతో పరిపరి విధాలుగా ప్రయత్నించినప్పటికీ, ఎస్.ఐ.బి గూండాల కళ్లుకప్పుతూ ఇంత పెద్ద భారీ బహిరంగ సభ జరపడం డివిజన్ వ్యాప్తంగా అమరవీరుల వారోత్సవాలు విజయవంతం కావడం అనేది రాజ్యానికి, రాజ్య యంత్రాంగానికి చెంపపెట్టు అయ్యింది.

## పంచాయితీ ఎన్నికల బహిష్కరణా క్యాంపెయిన్‌ను విజయవంతం చేసిన మన్యం ప్రజానీకం

ఈసారి మన్యంలో పంచాయితీ ఎన్నికలను ఒక సవాలుగా తీసుకొన్న, రాష్ట్ర ప్రభుత్వం మావోయిస్టు పార్టీ ప్రభావ ప్రాంతమంతటిలోను మొదటి విడతలోనే ఎన్నికలు నిర్వహించాలనీ రాష్ట్రంలో అధిక సాయుధ ఖాకీ బలగాన్నంతా మన్యంపై కేంద్రీకరింప చేసింది. ఈసారి ఎలాగైనా ఎన్నికల బహిష్కరణ కార్యక్రమాన్ని వమ్ముచేయాలనే తలంపుతో పాలక వర్గ పార్టీలు, ప్రభుత్వాధికారులు, పోలీసులు గట్టి పట్టుదలతో ఎన్నికల రంగంలోకి దిగారు. పార్టీ డివిజన్ కమిటీ కూడా బాయ్కాట్‌కు అనుకూల పాలక పార్టీల నాయకులను ఏరియాలనుండి తరిమి కొట్టాలనీ, పంచాయితీ ఎన్నికలను బహిష్కరించాలనీ పిలుపునివ్వడంతో కిరణ్ కుమార్ రెడ్డి ప్రభుత్వం కూడా గత ప్రజా ప్రతిఘటనల అనుభవాలను దృష్టిలో పెట్టుకొని "ఆపరేషన్ క్లియరెన్స్" పేరుతో వేలాది పాశవిక సాయుధ బలగాలతో (గ్రేహౌండ్స్, ఏ.పి.ఎస్.పి, సి.ఆర్.పి.ఎఫ్, కోబ్రా లాంటి) మన్యం మొత్తాన్ని నింపి వేసింది. ఈ కిరాయి సాయుధ బలగమంతా ఈ ఆపరేషన్ కాలంలో చెకింగ్‌ల పేరుతో, కూంబింగ్‌ల పేరుతో అక్రమ అరెస్టులు, అత్యాచారాలు చేస్తూ, గ్రామాలపై దాడులు చేస్తూ లూఠీలకు పాల్పడ్డాయి.

అయినప్పటికీ ప్రజలు, పార్టీ పిలుపునందుకొని బాక్సైట్‌కు అనుకూల, అవినీతి రాజకీయ నాయకుల ఇళ్లపై దాడులు చేశారు. గూడెం మండలం దేవరాపల్లి పంచాయితీ గ్రామానికి చెందిన మచ్చెల మత్స్యరాజు (భూస్వామి, పెత్తందారీ, మాజీ జడ్.పి.టి.సి సభ్యుడు, మంత్రి బాలరాజు అనుచరులలో ముఖ్యుడు), మంగలాపాలెం గ్రామానికి చెందిన గడుతూరి బాబురావుకు (మాజీ సర్పంచ్, మండల కో.ఆపరేటివ్ సొసైటీ ప్రెసిడెంట్) చెందిన ఇళ్లపై దాడులు చేశారు. ఏకధాటిగా కురుస్తున్న భారీ వర్షాలను సైతం లెక్కచేయకుండా 300–400 మంది ప్రజలు వారిని కట్టుబట్టలతో ఏరియా బహిష్కరణ చేసి పంచాయితీ ఎన్నికల పట్ల, బాక్సైట్ త్రవ్వకాల పట్ల తమ నిరసనను లోకానికి తెలియజేశారు.

పార్టీ ఇచ్చిన బహిష్కరణ పిలుపు స్ఫూర్తితో డివిజన్‌లో ఎక్కడికక్కడ ఏ.వి.ఆర్.సి.ఎస్ కార్యకర్తలు, మిలీషియా సభ్యులు అనేక రాజకీయ, మిలిటెన్సీ కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్యంగా రెండు ఏరియా ఏ.వి.ఆర్.సి.ఎస్ నాయకత్వాల చొరవతో పాకెట్స్ వారీగా ముందు నుండే స్థానిక ఎన్నికలపై ప్రచార క్యాంపెయిన్ బృందాల ద్వారా, బహిరంగ సభల, పోస్టర్స్, బ్యానర్స్ ద్వారా విస్తృత ప్రచారం చేశారు. నామినేషన్‌ల రోజున ప్రభుత్వాధికారులను ప్రజల ముందు నిలబెట్టి జామిగూడ, గిన్నెలకోట, బొయితిలి, కిల్లంకోట తదితర పంచాయితీలలో నామినేషన్ పత్రాలను మిలీషియా కామ్రేడ్స్ ధ్వంసం చేశారు. మన్యంలోని మన ప్రభావ ప్రాంతమైన ముంచంగిపుట్ మండలం బూసుపుట్; జి.మాడుగుల మండలం సుర్మతి, భీరం, కిల్లంకోట, బొయితిలి; పెదబయలు మండలం జామిగూడ, గిన్నెలకోట, బొంగరం, లింగేటి, ఇంజెరి; జి.కె.వీధి మండలం గాలికొండ, గుమ్మిరేవుల, జెర్రెల, మొండిగడ్డ, వంచుల; చింతపల్లి మండలం లోతుగడ్డ, తమ్మంగుల, బలపం, కుడుము సార పంచాయితీలలో ప్రజలు ఈ పంచాయితీ ఎన్నికలను నిర్వద్వందంగా బహిష్కరించారు. మొత్తం 13 పంచాయితీల, 214 వార్డు స్థానాలకు ఎన్నికల బహిష్కరణ జరిగింది. కొన్ని చోట్ల ముఖ్యంగా బాక్సైట్ ప్రభావిత ప్రధాన పంచాయితీల ప్రజలైతే తాము ఎందుకోసం ఎన్నికలను బహిష్కరిస్తున్నామో కూడా పత్రాలు రాసి ఎన్నికల అధికారులకు ఇచ్చారు. ప్రభుత్వం వేలాది కోట్ల రూపాయిలు ఖర్చుపెట్టి వేలాది మంది సాయుధ బలగాలను మన్యం అంతా మోహరించినా, అన్ని ప్రభుత్వశాఖల అధికారుల ద్వారా ఎన్నికల నిర్వహణకు విస్తృత ఏర్పాట్లు, ప్రచారం చేసినా.... ప్రజలు పార్టీ ఇచ్చిన పిలుపునందుకొని ఎన్నికల బహిష్కరణ కార్యక్రమాన్ని చేపట్టడంతో ఖంగుతిన్న దోపిడి పాలక వర్గం రీపోలింగ్ సమయంలో మరిన్ని కుటిల ఎత్తుగడలను అవలంభించింది. “ఓటు వేయని వారికి ఏజెన్సీలో చోటు లేదంటూ” రేషన్ బియ్యం, కిరోసిన్, వృద్ధాప్య ఫించన్లు బంద్ చేస్తామని పిల్లలకు స్కూల్లో చదువు చెప్పమనీ, హాస్పటల్ సౌకర్యం కల్పించమనీ, ఓట్లు బహిష్కరించిన ప్రాంతాలన్నింటినీ, “ఎర్రప్రాంతాలుగా” ప్రకటించి నిర్బంధాన్ని తెస్తామని ప్రభుత్వ అనుకూల ప్రజా వ్యతిరేకులు ప్రత్యక్ష బెదిరింపులకు దిగారు. మరికొన్ని చోట్ల దళారీ నాయకులు ఏకగ్రీవ ఎన్నికకు పార్టీ ఆమోదించిందనీ అబద్ధపు ప్రచారం చేపట్టి ప్రజలలో గందరగోళం సృష్టించారు. అయినా ప్రజలు పట్టుసడలకుండా వుండటంతో చివరికి ఓట్లు తంతు ఏమీ జరగకుండానే కొంత మంది బలవంతపు, దౌర్జన్యపూరిత ఏకగ్రీవ ఎన్నిక అయ్యారు. అదీ, 3,4 పంచాయితీలలో మాత్రమే. ఇలాంటి వారే ప్రజల ఆగ్రహానికి గురవుతున్నారు.

ఈ సారి బాక్సైట్ సమస్య కేంద్రంగా ఎన్నికల బహిష్కరణ జరిగినప్పటికీ ఈ క్యాంపెయిన్ సందర్భంగా దోపిడీ పాలక వర్గాలను సాయుధంగా కూలదోసి ప్రజల రాజ్యాధికారాన్ని నిర్మించేందుకు ప్రజా యుద్ధాన్ని తీవ్రతరం చేయాలనే ప్రచారాన్ని ప్రజలలోకి విస్తృతంగా తీసుకెళ్ళగలిగాము. ప్రజలకు రాజకీయ లక్ష్యాన్ని అర్థం చేయించి కొంతమేరకు సంఘటిత పరిచాము.

## విప్లవ ప్రతీఘాతుక శత్రు దుష్ప్రచారాన్ని ఖండించిన విప్లవ ప్రజానీకం

మన్యంలో పురోగమిస్తున్న విప్లవోద్యమాన్ని నిర్మించేందుకు ప్రభుత్వం ఎల్.ఐ.సి వ్యూహంలో భాగంగా దుష్ప్రచారదాడిని తీవ్రతరం చేస్తున్నది. అందులో భాగంగా ఎస్.ఐ నుండి ఎస్.పి.ల వరకు విప్లవోద్యమంపై విషం కక్కుతున్నారు. ముఖ్యంగా విప్లవ వ్యతిరేకులపై మనం చర్యలు చేపట్టినప్పుడు స్కూలు పిల్లల్ని, ఉపాధ్యాయుల్ని, ఉద్యోగస్తుల్ని సమీకరించి ర్యాలీలు, మానవహారాలు, కొవ్వొత్తుల ప్రదర్శనలు చేయించి, మావోయిస్టుల చర్యలను ప్రజలు వ్యతిరేకిస్తున్నట్లు చిత్రీకరించి, మీడియా ద్వారా విస్తృతంగా దుష్ప్రచారం చేపడుతున్నారు.

పోలీసుల అబద్ధపు ప్రచారాన్ని ఖండిస్తూ, వాస్తవాలను బయటి ప్రపంచానికి తెలియజెప్పేందుకు స్థానిక ఎ.వి.ఆర్.సి.ఎస్ నాయకత్వంలో ఎర్రగడ్డ, మండపల్లి, పి.కె.గూడెం ప్రజలతో బహిరంగ సభను ఏర్పాటుచేసారు. ఈ సభకు 23 గ్రామాలనుండి సుమారు 400మంది ప్రజలు వచ్చారు. స్థానిక ప్రింట్ మీడియాకు చెందిన రిపోర్టర్‌ను కూడా ఈ సభకు ఆహ్వానించారు. ఎ.వి.ఆర్.సి.ఎస్ నాయకత్వం ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ స్థానిక పెత్తాందార్లు, ప్రజావ్యతిరేకులు, పోలీసు ఇన్‌ఫార్మర్లపై గతకొద్ది కాలంలో పార్టీ, పి.ఎల్.జి.ఎ, ప్రజలు చేపట్టిన చర్యలను పేర్కొన్నారు. అనంతరం ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు, ఆయా పెత్తందార్ల, ప్రజావ్యతిరేకుల మూలంగా తాము ఎదుర్కొన్న సమస్యలను వివరించారు. పార్టీ, పి.ఎల్.జి.ఎ అండతో చీడీగొంది భాస్కరరావు వంటి భూస్వాములపై పోరాటం సాగించి వాడ్ని గ్రామంనుండి తరిమికొట్టిన క్రమాన్ని వివరించారు. అలాగే కుంకుంపూడి సన్యాసరావు, సాగులు నాగేశ్వరరావు, పనసలబంద చిన్నారావు మొదలైన ప్రజావ్యతిరేకులపై ఎందుకు చర్యలు తీసుకోవాల్సి వచ్చిందో సభకు, ప్రజలందరికి వివరించారు. దోపిడి పీడకులపై ప్రజలు సాగిస్తున్న వర్గ పోరాటాన్ని వక్రీకరిస్తూ, వాస్తవాలను మరుగునపరుస్తూ పోలీసు యంత్రాంగం దుష్ప్రచారం చేస్తున్నదనీ, ఆ వాస్తవాలను నమ్మవద్దనీ, న్యాయమైన ప్రజాయుద్ధానికి పీడిత ప్రజలందరు మద్దతు పలకాలని, పోలీసుల మాయమాటలు నమ్మిగాని, పోలీసుల వత్తిడితో గాని, ఆయా వ్యతిరేక ర్యాలీలో, మానవహారాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు పాల్గొనవద్దని విజ్ఞప్తిచేసారు. న్యాయమైన ప్రజాయుద్ధంలో అంతిమ విజయం ప్రజలదేనని నినదించారు.

## ప్రజావ్యతిరేకులను శిక్షించి కాఫీ ప్లాంటేషన్ ఆక్రమణ కొరకు కదులుతున్న పెదవలస రైతాంగాం

మర్రిపాకల, కుంకుంపూడి, తోకచెలక, లంకపాకల మొదలైన ఎస్టేట్ల కాఫీతోటలను ప్రజలు ఆక్రమించుకున్నారు. ఆ ప్రభావం బొంతువలస, పెదవలస ఎస్టేట్లపై కూడా పడి కొన్ని గ్రామాల ప్రజలు "తాము కాఫీ తోటలను ఆక్రమించుకునేందుకు సిద్ధమనీ, తమకు పార్టీ నాయకత్వం కావాలనీ" మనకు కబుర్లు చేయడం మన సంఘనాయకత్వాన్ని కలవడం, వచ్చి తోటలను పంపిణీ చేయాల్సిందిగా కోరడం జరిగింది. అదేసమయంలో పెదవలసలో ఎ.పి.ఎఫ్.డి.సి తన కార్యకలాపాలను తీవ్రతరం చేసింది. ముఖ్యంగా ఫీల్డ్‌మెన్‌లు అత్యుత్సాహంతో ప్రజలను తమ సొంత తోటల్లో సైతం కాఫీ పండ్లను ఏరుకోనివ్వకుండా అడ్డుపడడం ప్రారంభించారు. ఇక్కడ ఎ.పి.ఎఫ్.డి.సికి తోడుగా ఫారెస్టు రేంజిని ఏర్పాటు చేస్తున్నారు. వీటన్నిటికీ దన్నుగా, ప్రజాపోరాటాలను అణచివేయడానికి శరవేగంతో పోలీసు అవుట్‌పోస్టును నిర్మిస్తున్నారు. కొన్ని ప్రజావ్యతిరేక శక్తులు ఆ క్యాంపు నిర్మాణానికి శతవిధాల సహకరిస్తున్నాయి. అందులో గ్రామపెద్ద కంకిపాటి సోమలింగం వాడి తమ్ముడు కంకిపాటి గాంధీ, గిరిజన పరపతి సంఘం అధ్యక్షుడు రిమల ఆనందరావులు ముఖ్యులు. వీరిలో రిమల ఆనందరావు కాంగ్రెస్ నాయకుడిగా ఉంటూ, అవినీతికి పాల్పడుతూ, విప్లవోద్యమ వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టాడు.

ఈ పరిస్థితిలో ప్రజాశతృవులను శిక్షించి కాఫీపోరాటాన్ని నిర్మించేందుకు మన ప్రధాన, ద్వితీయ బలగాలతోపాటు మిలీషియా సమైక్యంగా దాడులు నిర్వహించాయి. ఈ దాడి సందర్భంగా ఆనందరావు తప్పించుకుని పారిపోయాడు. ఎ.పి.ఎఫ్.డి.సి ఫీల్డ్‌మెన్‌లు, ఫారెస్టురేంజర్ దొరకకపోవటంతో ప్రజలతో మాట్లాడి ఫీల్డ్‌మెన్‌ల మోటారుసైకిళ్లను తగులబెట్టారు. గ్రామపెద్ద సోమలింగంను పట్టుకొని దేహశుద్ధి చేసారు.

ఈ చర్యలన్నీ ప్రజలను ఎంతగానో ఉత్సాహపరిచాయి. ప్రజలు కాఫీ ప్లాంటేషన్ ఆక్రమణ పోరాటానికి సిద్ధమవుతున్నారు.

## ఎ.పి.ఎఫ్.డి.సి ఫీల్డ్‌మన్‌లను, రేంజర్‌లను ప్రతిఘటిస్తున్న విప్లవ ప్రజానీకం.

నవంబర్ 7న సిరిబాల కాఫీ ఎస్టేట్ ఫీల్డ్‌మెన్ రాజరావు మురగడపల్లి గ్రామానికి 15మందితో వచ్చి దాడి చేసాడు. ఆరుబయట కాఫీ పండ్లు ఆరబెడుతున్న ఒక యువకున్ని పట్టుకుని "నీకు కాఫీ తోట ఉందా ?" అని ప్రశ్నించగా తనకు లేదని చెప్పాడు. కింద పడ్డ పండ్లను తన తల్లి ఏరుకుని తెచ్చిందనీ, వాటిని ఆరబెడుతున్నాని చెప్పినా వినకుండా, కిందపడినవైనా అవి ఎ.పి.ఎఫ్.డి.సి కే చెందుతాయనీ,వాటిని తెచ్చుకున్నందుకు 10,000 రూ. జరిమాన కట్టాలని బెదిరించి, ఆ పండ్లన్నీ ఆ యువకుడిచేత మూటకట్టించి, ఆ మూటలు ఎత్తుకుని తమ వెంట రావాలనీ, వాటిని ఎ.పి.ఎఫ్.డి.సి గొడౌన్‌కు అప్పజెప్పాలనీ ఆ యువకున్నీ, అతని భార్యనీ ఆదేశించారు. మూట ఎత్తుకునేందుకు నిరాకరించిన ఆమెను ఫీల్డ్‌మెన్ రాజరావు దుర్భాషలాడుతూ, అసభ్యకరంగా ప్రవర్తించడం మొదలు పెట్టాడు. ఇదంతా గమనిస్తున్న గ్రామ ప్రజలు ఒక్క సారిగా చేతికందిన కర్రలు, రాళ్ళతో ప్రతిఘటించగా అధికారులు, ఫీల్డ్‌మెన్‌లు పరుగు లంఘించుకున్నారు. రాజరావు మాత్రం దొరికిపోయాడు. వాడిని తీవ్రంగా కొట్టి ప్రజలతో మర్యాదగా నడచుకోవాలనీ, గ్రామాలపై దాడులు మానుకోవాలనీ, లేకుంటే తీవ్ర పరిణామాలు తప్పవనీ హెచ్చరించి విడిచి పెట్టారు. ఇటువంటి ఘటనే కాకరపాడు గ్రామంలో కూడా జరిగింది. చాపుగడ్డ రేంజర్ పదిమంది ఫీల్డ్‌మెన్‌లు, ఇతర ఉద్యోగులతో కలసి కాకరపాడు గ్రామంపై దాడికి వెళ్ళారు. ప్రభుత్వ తోటలో పండ్లు దొంగలించారని దుర్భాషలాడుతూ యువకులను కొట్టడం మొదలు పెట్టారు. దీంతో ఆ యువకులు ఫీల్డ్‌మెన్‌లు, అధికారులతో బాహాబాహీ తలపడ్డారు. ఈ ఘర్షణలో అధికారులకు తీవ్ర గాయలయ్యాయి. రేంజర్‌కు తల పగిలి, రెండు కుట్లు పడ్డాయి. ఇలా అనేక చోట్ల తమను వేధిస్తున్న ఎ.పి.ఎఫ్.డి.సి అధికారులను, రేంజర్‌లను, ఫీల్డ్‌మెన్‌లనూ ప్రజలు ప్రతిఘటిస్తున్నారు. వీరు ఇప్పటికే కాఫీ ప్లాంటేషన్‌లను ఆక్రమించుకొన్న బలపం, ప్రజలను ఆదర్శంగా చేసుకొని ఇక్కడ కాఫీ ప్లాంటేషన్‌లను ఆక్రమించుకొనేందుకు సిద్ధమవుతున్నారు.

## షావుకార్ల దోపిడీని, జి.సి.సి డిపో సేల్స్‌మన్‌ల అక్రమాలను నిలదీసిన గంగవరం, పలకజీడి, పుట్టకోట పాకెట్ల విప్లవ ప్రజానీకం

ఈ ప్రాంత ప్రజలు ప్రధానంగా మినుములు, వులవలు, చిట్టిబొబ్బర్లు, పత్తిని పండించి విక్రయిస్తుంటారు. ఇతర ఆహారపంటలను కూడా పండిస్తుంటారు. ఎర్రకొండ, పలకజీడి, జంగల్‌తోట షావుకార్లకు వీటిని విక్రయిస్తుంటారు. బయటి మార్కెట్‌లో అపరాల విలువ ఎంతో ఇక్కడి ఆదివాసీ ప్రజలకు తెలియదు. ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకున్న ఈ షావుకార్లు చాలా చౌక, అన్యాయమైన ధరలకు ఈ అపరాలను కొనుగోలుచేసి అధిక ధరలకు అమ్ముకుంటూ లక్షలు అర్జిస్తున్నారు. పంటకాలంలో రైతులకు ధనరూపంలో, విత్తనాలరూపంలో అప్పులు ఇచ్చి అధికవడ్డీలు వసూలు చేయడంతో పాటు తాము నిర్ణయించిన ధరలకు, తమకే విక్రయించాల్సిందిగా రైతులపై ఒత్తిడి తేస్తున్నారు. చాలా కాలం తర్వాత మన దళం పంట సమయంలో ఆ ప్రాంతానికి వెళ్ళడంతో ప్రజలు తమ సమస్యలను ఏకరువు పెట్టారు. ఈ మూడు పాకెట్ల ప్రజలకు రేషన్ డిపోలు పలకజీడిలో వున్నాయి. ఆ డిపోల సేల్స్‌మన్‌లు ప్రజలకు అవసరంలేని సామాన్లను సైతం కొనుగోలు చేయాల్సిందిగా ఒత్తిడి చేస్తున్నారు. కనీసం 150 రూ ఇతర సామాన్లు కొంటే తప్ప బియ్యం కూడా ఇవ్వమని బెదిరిస్తున్నారు. చాలా చౌక ధరల సరుకులు స్టాక్‌లేవని బుకాయిస్తున్నారు. వీరి దోపిడీకి జి.సి.సి సంస్థ కూడా సాధికారికత కల్పిస్తున్నది. ఈ పరిస్థితిలో స్థానిక ఎ.సి, ఎల్.జి.ఎస్‌లు మూడు పాకెట్ల ప్రజల (21 గ్రామాల నుండి 300 మంది)ను సమావేశపరిచి పలకజీడి, ఎర్రగొండ, జంగల్‌తోట షావుకార్లను, జి.సి.సి డిపోసేల్స్‌మాన్‌లను పిలిపించారు. పి.ఎల్.జి.ఎ సమక్షంలో ప్రజలు నిలదీయడంతో షావుకార్లు, సేల్స్‌మన్‌లు లొంగిరాక తప్పలేదు. ప్రజలు గిట్టుబాటు ధరలపై విస్తృతంగా చర్చించారు. ఇరుపక్షాలకు ఆమోదయోగ్యమైన ధర

నిర్ణయమయ్యాక తూనికలు – కొలతలపై చర్చించారు. అపరాలను కుంచాలతో కొలిచే కంటే బల్లకాటాలపై తూకం వేయడం సరైనదిగా వుంటుందని, కాటాలపై మాత్రమే విక్రయిస్తామని చెప్పడంతో షావుకార్లు అందుకు అంగీకరించారు. డిపో సేల్స్‌మన్‌లు వారంలో ఐదు రోజులు డిపో తెరిచి వుంచాలని, ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే, రైతులకు అవసరమయిన సామాన్లు మాత్రమే విక్రయించాలని, ఇతర సామాన్లు కొనమని ఒత్తిడి చేయరాదనీ, బ్లాక్‌లో అధిక ధరలకు విక్రయించరాదనీ, కార్డుదారులందరికి అవసరమయిన సరుకులు విక్రయించాలనీ షరతులు విధించడంతో వీటన్నింటిని అంగీకరిస్తూ తాము ఇంతకాలం అనుసరించిన అక్రమ విక్రయాలకు, దురుసు ప్రవర్తనకు తమను క్షమించాలనీ, ఈ షరతులు ఉల్లంఘించిన ఎడల ప్రజలు ఏ శిక్ష విధించినా తమకు ఆమోదమేనని కాళ్ల బేరానికి వచ్చారు. దాంతో ప్రజలు షావుకార్లను సేల్స్‌మన్‌లను ఇక నుండి అక్రమ విక్రయాలు మానుకొని సక్రమంగా డిపోను నిర్వహించాలని లేకుంటే శిక్ష తప్పదని హెచ్చరించి వారిని విడిచి పెట్టారు. దోపిడీ ఏరూపంలో ఉన్నప్పటికి పార్టీ పి.ఎల్.జి.ఎ అండతో ప్రజలే తమ సమస్యలను పరిష్కరించుకోగలరని, దోపిడి పీడనల నుండి బయట పడగలరని ఈ సమావేశంతో ప్రజలు మరోసారి నిరూపించారు. పార్టీ పి.ఎల్.జి.ఎ అండతో గిట్టుబాటు ధరను సాధించినందుకు, షావుకార్ల దోపిడీని నియంత్రించినందుకు, డిపోసేల్స్‌మన్ అక్రమ విక్రయాలను నియంత్రించినందుకు ప్రజలు ఎంతగానో సంతోషించారు.

## రంగురాళ్ల తవ్వకాలను నియంత్రించిన ఎ.వి.ఆర్.సి.ఎస్, మిలీషియా కామ్రేడ్స్

ఏజెన్సీలో జనుమూరు, చాపురాతిపాలెం, పంకాడ, అంతాడ క్వారీలలో రంగురాళ్ల తవ్వకాలు ప్రభుత్వ అధికారుల ప్రోత్సాహంతో, పోలీసుల అండదండలతో జోరుగా సాగుతున్నాయి. గతంలో గాలికొండ ఏరియాలోని కుంకుంపూడి, పెద్దపాడు, వడమామిడి, కిండంగి క్వారీలలో తవ్వకాలు జరగగా మన పార్టీ, ఎ.వి.ఆర్.సి.ఎస్, మిలీషియా గనులకు వ్యతిరేకంగా జరిపిన ప్రచారంతో పాటు దళారులకు, షావుకార్లకు హెచ్చరికలు, దేహశుద్ధులు చేసిన ఫలింతగా అవి మూతబడ్డాయి. పాతవి మూతబడిన మరల ఎక్కడో ఒకచోట అడపదడపా ఈ తవ్వకాలు జరుగుతూనే వున్నాయి. అలాగే ఈ సంవత్సరం పోతారం వద్ద తవ్వకాలు మొదలయ్యాయి. రంగురాళ్ల షావుకార్లు, షావుకార్ల ముసుగులో పోలీసు ఏజెంట్లు, హోంగార్డ్‌లు రహస్యంగా రాకపోకలు సాగిస్తున్నారు. తవ్వకాలు జరుపుతున్న వారికి కూడా ఇవి ప్రాణాంతకంగా తయారయ్యాయి. మట్టి పెల్లలు విరిగిపడి ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఇద్దరు మృతిచెందారు. వీటిని నియంత్రించేందుకు అన్నవరం పాకెట్ ఎ.వి.ఆర్.సి.ఎస్, మిలీషియా నాలుగుసార్లు, కన్నవరం పాకెట్ ఎ.వి.ఆర్.సి.ఎస్, మిలీషియా మూడుసార్లు క్వారివద్ద మీటింగులు పెట్టి, తవ్వకాలు జరుపుతున్న వారిని మందలించి, బలవంతంగా పంపించివేయడం జరిగినా, రహస్యంగా తవ్వకాలు (రాత్రిపూట) కొనసాగుతూనే వున్నాయి. దీంతో మన ప్రజాసంఘాలు, మిలీషియా రంగురాళ్ల తవ్వకాలను నియంత్రించే కార్యక్రమాన్ని మరింత వుధృతం చేసాయి. ప్రచారాన్ని తీవ్రతరం చేయడంతో పాటు లోపలికి వస్తున్న షావుకార్లను రెండు సార్లు హెచ్చరించి పంపించారు. మరోసారి రంగురాళ్ల కొనుగోల్లు చేస్తున్న ఆరుగురు షావుకార్లను నిర్బంధించి వారి వద్దనుండి రంగురాళ్లను, 6 సెల్‌ఫోన్‌లు, 48,000 రూ నగదును స్వాధీనపరుచుకొని ప్రజల మధ్య పెట్టి నిలదీసారు. జొన్నలు, అపరాలు కొనాలని రంగురాళ్ళు కొనడం మానేయాలని స్వల్పంగా దేహశుద్ధి చేసి హెచ్చరించి పంపించారు. ఫలితంగా షావుకార్లు ఏరియాలోకి వచ్చి రంగురాళ్లు కొనడం, రంగురాళ్ల తవ్వకాలు ఒక మేరకు తగ్గుముఖం పట్టాయి.

## అవినీతిపరుడు, పోలీస్ ఏజెంట్, ప్రజా వ్యతిరేకి అయిన ఎమ్.పి.టి.సి చిట్టిబాబును కట్టుబట్టలతో తరిమేసిన కాఫీ వుద్యమ ప్రజలు

ఈస్టు డివిజన్‌లోని కోరుకొండ ఏరియా కమిటి పరిధిలోగల విశాఖ జిల్లా చింతపల్లి మండలం బలపం ప్రాంత ప్రజలు 2010లో ఏ.పి.ఎఫ్.డి.సికి వ్యతిరేకంగా వుద్యమించి వందలాది ఎకరాల కాఫీ ఎస్టేట్‌ను స్వాధీన పర్చుకొన్నారు. ప్రభుత్వం తిరిగి ప్రజల దగ్గర నుండి కాఫీ తోటల్ని, స్వాధీనం చేసుకోవాలనే ప్రయత్నంలో భాగంగా నిర్బంధం ప్రయోగించినా బలపం పంచాయితీ ప్రజలందరూ ఐక్యంగా వుంటూ ఎప్పటికప్పుడు సాయుధంగానే శతృవుతో తలపడేందుకు సిద్ధపడుతున్నారు. వందలాది మందిని అరెస్టు చేసేందుకు ప్రతి రోజూ నోటీసులు పంపుతున్నా పోలీసుల ఒత్తిళ్ళకు తలొగ్గకుండా మరింతగా ప్రజలు కాఫీ వుద్యమాన్ని ముందుకు తీసుకెళుతున్నారు.

ఈ క్రమంలోనే స్థానిక ఎం.పి.టి.సి చిట్టిబాబు ఎస్.ఐ.బి వాళ్ళతో చేతులు కలిపి కాఫీ వుద్యమానికి ఆటంకమవుతుండటంతో పంచాయితీ ప్రజలంతా ప్రజాకోర్టు నిర్వహించి సీరియస్‌గా హెచ్చరించడం జరిగింది. అయినా చిట్టిబాబు మారకపోగా మరింతగా తన పలుకుబడిని వుపయోగించుకుంటూ అందర్నీ బెదిరిస్తూ వుండేవాడు. ప్రజల పేరుతో వచ్చే వివిధ ప్రభుత్వ పథకాల నిధులను కాజేసేవాడు. అవినీతి సొమ్ముతో నర్సీపట్నంలో బిల్డింగ్స్ కట్టుకొని స్థిరపడటానికి తగిన ఏర్పాట్లు చేసుకొన్నాడు. ఈ క్రమంలోనే ఎస్.ఐ.బి పోలీసులతో మిలాఖతైన చిట్టిబాబు 24 మంది గ్రామస్తులను బలవంతంగా సరెండర్ చేయించాడు. శతృవు కూడా వీడి సహాయంతో ఏరియాలో బూటకపు సద్భావన యాత్రలు, జనమైత్రీ కార్యక్రమాలు నిర్వహించాడు. ఎస్.పి, ఓ.ఎస్.డి, సి.ఐ, ఎస్.ఐ.బి అధికారులు వచ్చి కోరుకొండలో సద్భావన యాత్ర నిర్వహించడంలో వీడి పాత్ర చాలానే వుంది. మన స్థానిక పార్టీ తన సంస్థాగత పనుల్లో భాగంగా ఏరియా ప్రజలను తొందరగా కలవలేకపోవడం అదునుగా చూసిన చిట్టిబాబు మరింత దూకుడుగా పసుపు, గంజాయి కొనుగోలు పేరుతో గ్రామాల్లో తిరుగుతూ రహస్యంగా సరెండర్లు చేయించేందుకు ప్రయత్నించాడు. అలా గొడుగు మామిడి గ్రామస్తులను 5గుర్ని జిల్లా ఎస్.పి ముందు సరెండర్ చేయించాడు. అయితే సరెండర్ చేయించినట్లుగా ఎక్కడ కూడా తన పేరు బయటకు పొక్కకుండా తగిన జాగ్రత్తలు తీసుకొన్నాడు. మరిన్ని గ్రామాల ప్రజలను సరెండర్ కావాలనీ లేదంటే లువ్వాసింగి వారికిలాగే మిమ్మల్ని కూడా చంపుతారని బెదిరించడం కూడా చేశాడు. దీంతో పార్టీ, స్థానిక సంఘాలు పరిస్థితిని గుర్తించి 12-6-2013 ప్రజాకోర్టు నిర్వహించగా ఎం.పి.టి.సి చిట్టిబాబును

కట్టుబట్టలతో మండల బహిష్కరణ చేయాలని, వీడికి సహకరించిన బలపం గ్రామస్తులు పెద్దబ్బాయి, అప్పన్న, రమణ, చిరంజీవిలకు దేహశుద్ధి చేయాలని ప్రజలు తీర్పును ఇవ్వడం జరిగింది. ఈ తీర్పు అమలు కోసం బలపం పంచాయితీలోని 33 గ్రామాల ప్రతినిధులు, ప్రజలు 500 మంది వరకు హాజరయ్యి ప్రజా కోర్టు నుండి ఊరేగింపుగా కదిలి చిట్టిబాబు ఇంటి మీద దాడి చేసి 2 లక్షల రూపాయిల విలువగల ఇంటి సామాగ్రిని, పంట దాన్యాలను స్వాధీనం చేసుకొన్నారు. వీడికి సహకరించిన వారు అందుబాటులో లేకపోవడంతో దేహశుద్ధి కార్యక్రమం వాయిదా వేయడం జరిగింది. తప్పించుకున్న ప్రజా వ్యతిరేకులను స్థానిక వుద్యమ నాయకత్వం ముందు లొంగిపోవల్సిందిగా హెచ్చరించడంతో 10 రోజుల తర్వాత ప్రజల ముందు వారు లొంగిపోయారు. వారందర్నీ తీవ్రంగా హెచ్చరించి వదిలివేయడం జరిగింది. ఎం.పి.టి.సి చిట్టిబాబు భూముల్ని ఆ గ్రామంలోనే భూమిలేని 8 కుటుంబాల వాళ్ళకు పంచివ్వడం జరిగింది.

ఎడతెరిపిలేని వర్షంలో సైతం వందలాది మంది ప్రజలు ప్రజాకోర్టులో భాగస్వాములయ్యారు. సరెండర్ల ద్వారా ప్రజల ఐక్యతను దెబ్బతీయాలనుకునే శతృ కుటిల నీతిని ప్రజల్లో బహిర్గత పర్చారు. నిర్బంధం ద్వారా కాఫీ వుద్యమాన్ని ఆపలేరని, పోలీసులు ఎంత నిర్బంధం తెచ్చినా కాఫీ వుద్యమాన్ని ముందుకు తీసుకుపోతామని శపథం చేశారు.

## ఎస్.ఐ.బి వాళ్ళతో చేతులు కలిపి ప్రజా వుద్యమాన్ని నీరుగార్చ చూసిన రాళ్ళగడ్డ గ్రామ వి.ఆర్.పి, మేట్, గ్రామ పెద్దలకు బుద్ధిచెప్పిన ప్రజాకోర్టు

2010 నుండి రాష్ట్ర ప్రభుత్వం ఈస్టు డివిజన్ కోరుకొండ ఏరియా పరిధిలోగల కాఫీ వుద్యమాన్ని నిర్ధాక్షిణ్యంగా, పాశవికంగా అణిచివేయాలని తీవ్రప్రయత్నాలు చేస్తుంది. పోలీసులు తమ కర్కశ దాడులతో ప్రజలందర్నీ నిర్బంధానికి గురి చేస్తున్నారు. అయినా ప్రజలు వెనుదీయకుండా నిర్బంధంలో రాటుదేలుతూ రోజురోజుకు మరింతగా ఐక్యం అవుతూ కాఫీ వుద్యమాన్ని కొనసాగిస్తూ వున్నారు. ముఖ్యంగా రాళ్ళగడ్డ గ్రామం కాఫీ వుద్యమంలో కీలక పాత్ర పోషించినందున శతృవు టార్గెట్‌గా ఎంచుకొని 2011 ఫిబ్రవరి 11న ఏ.పి.ఎఫ్.డి.సి వాళ్ళతో కలిసి గ్రామం మీద దాడి చేసి 195 కే.జీల కాఫీ గింజల్ని స్వాధీనం చేసుకొని, 24 మంది గ్రామ యువకులను బలవంతంగా ఎత్తుకెళ్ళి బూటకపు సరెండర్స్ చేపించుకొన్నారు. అయినా ఆ గ్రామం భయపడకుండా కాఫీ పోరాటంలో ముందుకు కదిలింది. పార్టీ, ప్రజల అండతో మరింత దృఢంగా నిలబడింది.

2012 ఫిబ్రవరి 14న మరోసారి 100 మంది గ్రేహౌండ్స్ బలగాలు గ్రామంపై దాడి చేశాయి. అయితే ఈసారి గ్రామస్తులందరు తమ సాంప్రదాయక ఆయుధాలతో తిరగబడటంతో పోలీసులకు గ్రామస్తులకు మధ్య మూడు గంటల పాటు ముఖాముఖి ఘర్షణ జరిగింది. పొగబాంబులు వేసినా, ఎయిర్ ఫైర్ చేసినా గ్రామస్తులు భయపడలేదు. ఈ ఘర్షణలో 8 మంది పోలీసులు, 5గురు గ్రామస్తులు గాయపడ్డారు. 2కి.మీ. దూరం పోలీసుల్ని ప్రజలు తరిమి తరిమి కొట్టారు.

అవకాశం కోసం చూస్తున్న పోలీసులు ప్రజల మధ్య చీలిక తెచ్చి దాడి చేయాలనీ పథకం రూపొందించారు. గ్రామంలో కొంత పలుకుబడి కలిగిన వ్యక్తులను ఎంచుకొని శతృవు మచ్చిక చేసుకోనారంభించాడు. ముఖ్యంగా గ్రామంలో మేట్‌లుగా, వి.ఆర్.పిలుగా, గ్రామ పెద్దాలుగా వుంటున్న ప్రేమ్‌సింగ్, శోభన్, నూకరాజుల సహకారంతో వాళ్ళందించే సమాచారంతో పోలీసులు రోజూ ఆ గ్రామానికి రాకపోకలు సాగించేవారు. నిరంతరం ఎస్.ఐ.బి వాళ్ళు సంబంధాలను కొనసాగిస్తూ ప్రజల మీద ఒత్తిడి తెస్తుండే వాళ్ళు అలా గ్రామంలోని కొంత మంది చుట్టుప్రక్కల నాలుగు గ్రామాల ముఖ్యులు 75 మందిని సరెండర్ చేపించారు. దీంతో శతృవు మరింత దూకుడుగా సహపంక్తి భోజనాలు, సద్భావన యాత్రలు చేస్తూ ... ఏరియాలో కాఫీ వుద్యమకారులు లొంగిపోతే కేసులు కొట్టి వేస్తామనీ లేనిచో తగిన చర్యలు తీసుకొంటామని బహిరంగ బెదిరింపులు మొదలు పెట్టారు. రోజూ గ్రామానికి పోలీసులు వస్తుండటంతో చుట్టు ప్రక్కల గ్రామస్తులు ఈ గ్రామం మీద అనుమానాలను వ్యక్తం చేస్తూ పార్టీ దృష్టికి తెచ్చారు. పోలీసులతో సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తున్న వాళ్ళందర్నీ ప్రజాకోర్టులో పెట్టి లొంగుబాట్లపై విచారణ జరిపించాలని నిర్ణయానికొచ్చారు.

9-6-2013న ప్రజాకోర్టు నిర్వహించగా ప్రజలందరి ముందు తప్పులను ఒప్పుకోవడంతో సరెండర్లు అయిన వాళ్ళందరూ బయట ప్రాంతాలకు, సంతలకు కొన్నాళ్ళపాటు వెళ్ళరాదని ఆంక్షలు విధించారు. ఒకవేళ వెళితే తగిన చర్యలు వుంటాయని కూడా ప్రజాకోర్టులో ప్రజలు హెచ్చరించడం జరిగింది. ముఖ్యంగా కార్ల, ప్రేమ్‌సింగ్, నూకరాజు, శోభన్‌లను సీరియస్‌గా హెచ్చరించారు.

ఈ ప్రజాకోర్టు ద్వారా ప్రజలందరూ ఐక్యంగా వుంటే శతృవు మనల్ని ఏమీ చేయలేడని ఎవరికివారిగా వుంటే మాత్రం శతృవు మన మీద దాడి చేస్తాడని గుర్తించడం జరిగింది. ఈ ప్రజా కోర్టుకు నాలుగు గ్రామాల ప్రజలు 250 మంది పాల్గొన్నారు. ఈ ఘటన ఏరియాలో మంచి ప్రభావాన్ని వేసింది.

## పెత్తందారీ, మత పెద్ద, ప్రజా వ్యతిరేకి గెమ్మలి తీల్సుకు సరైన బుద్ధి చెప్పిన ప్రజా కోర్టు.

కోరుకొండ ఏరియా కమిటి పరిధిలోగల పెదబయలు మండలం ఇంజెరి పంచాయితీ కోంద్రు గ్రామం గత కొన్ని సంవత్సరాల నుండి ప్రజా వుద్యమంలో ముందు పీఠిన నిలుస్తూ వస్తుంది. గ్రామంలో విప్లవ సంస్కరణలు, విప్లవ భూ సంస్కరణలు అమలు జరుపుకొని పేదవారికి భూములను కూడా దక్కించుకొన్నారు. అయితే గ్రామంలో మన బలం పెరుగుతున్న కొలదీ గ్రామ పెత్తందారులు గ్రామంలో ప్రజల మధ్య ఐక్యతను దెబ్బతీయడం, గొడవలు పెట్టడం, భూములు లాక్కోవడం, పుకార్లు పుట్టించి ప్రజల్ని గందరగోళ పర్చడం, చుట్టు ప్రక్కల గ్రామాల గొడ్లు, మేకలు ఈ గ్రామ పొలిమేరల్లోకి వస్తే దొంగతనంగా చంపి తినేయటం, లేదా కత్తులతో మేకల చెవులకు గుర్తులు పెట్టి మావి అని చెప్పడం చేస్తూ వుండేవారు.

ముఖ్యంగా గ్రామంలో గెమ్మలి తీల్సు గ్రామ పెద్దగా, క్రిష్టియన్ మత పెద్దగా వుంటూ అక్రమ వడ్డీలతో ప్రజల భూములను ఆక్రమించుకొని 5-10 రూపాయిలు కూలి ఇచ్చి ప్రజలను

విపరీతంగా శ్రమ దోపిడీకి గురి చేసేవాడు. వీడికి తోడు సంజీవరావు, బాలబ్బి, సన్యాసిరావులు పెత్తందారులుగా, మత ప్రచారకులుగా వుంటూ ప్రజలను విపరీతంగా దోపిడీ చేసేవారు. వీళ్ళకున్న పలుకుబడితో వివిధ ప్రభుత్వ సంస్కరణలన్నీ వీళ్ళకే వచ్చేలా చేసేవారు. సంజీవరావు, బాలబ్బిల చెల్లెలైన సాధన (మన పార్టీలో ఏ.సి.ఎమ్‌గా పని చేసి ఈ మధ్యన ఇంటికెళ్ళి లొంగిపోయింది) పేరును వుపయోగించుకొని అందర్నీ బెదిరించేవారు. ఆమె ఇంటికొచ్చిన తర్వాత శత్రువు దగ్గరకు తీసుకెళ్ళి లొంగబెట్టించారు. ఆమె లొంగుబాటుకై రహస్యంగా చుట్టాల పేరుతో గ్రామంలోకి వచ్చిన ఇద్దరు హోంగార్డులపై మన మిలీషియా దాడికి పూనుకోగా, ఈ పెత్తందారులు వారిని అడ్డుకొని బెదిరించారు. దీంట్లో సంజీవరావు పాత్ర ప్రధానంగా వుంది. తీల్సు విషయంలో పార్టీ గతంలో 2 సార్లు ప్రజాకోర్టులో కూడా పెట్టి హెచ్చరించింది. అయినా తన పద్ధతుల్ని మార్చుకోకపోగా మరింతగా ప్రజా వ్యతిరేకిగా తయారయ్యాడు. దాంతో స్థానిక పార్టీ, సంఘ కమిటీలు 24-6-2013న ప్రజా కోర్టు నిర్వహించి ప్రజల ముందు పెట్టడం జరిగింది.

ప్రజా కోర్టుకి కోంద్రు ప్యాకెట్ గ్రామాల ప్రజలు 200 మంది హాజరయ్యారు. పాకెట్ రైతుకూలి సంఘం ఆధ్వర్యంలో జరిగిన పంచాయితీలో పెత్తందార్లనుండి భూములను లాక్కొని సొంతదారులకు భూములను పంచివ్వడం జరిగింది. తీల్సున కట్టుబట్టలతో గ్రామ బహిష్కరణ చేస్తూ తన ఆస్తులను ప్రజలు స్వాధీనం చేసుకొన్నారు. సంజీవరావు దొంగిలించిన గొడ్లకు బదులుగా తన గొడ్లను ప్రజలకు పంచివ్వడం జరిగింది. మిగతా వారిని హెచ్చరించి వదిలివేయడం జరిగింది.

ప్రజా కోర్టు ద్వారా జరిగిన ఈ చర్య ఏరియాలో మంచి ప్రభావం వేసింది. ప్రజా వ్యతిరేకులకు, పెత్తందారులకు బుద్ధి చెప్పినట్టు అయ్యింది. ఒక హెచ్చరికగా కూడా అయ్యింది.

## ఎస్.పి.ఓ, ప్రజా వ్యతిరేకి, రేపిస్టు గాసీ ఇంటిపై ప్రజల దాడి

ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లా గుమ్మా బ్లాక్ రాళ్ళగడ్డ పంచాయితీ (కోరుకొండ ఏరియా కమిటి పరిధి) బిడియా గూడ గ్రామంకు చెందిన కొర్రా గాసీ మన పార్టీ గ్రామ, ప్యాకెట్ స్థాయి సంఘాలలో చాలా చురుగ్గా పని చేశాడు. ప్యాకెట్ స్థాయి ఆర్.పి.సి అధ్యక్షునిగా కూడా పని చేశాడు. ప్రజల్లో గుర్తింపు పొందిన నాయకుడిగా ఎదిగాడు. అయితే ప్రజల్లో తనకు లభించిన గుర్తింపును బూర్జువ దృక్పథంతో అర్థం చేసుకోవడం వలన తప్పుడు ధోరణులు పుట్టి పెరిగాయి. ముఖ్యంగా ప్రజల్లో తనకున్న పలుకుబడిని వుపయోగించుకొని షావుకార్లను బెదిరించి డబ్బులు అడిగి తీసుకోవడం, ఎస్సార్ కంపెనీ దగ్గర మన పేరు చెప్పుకొని డబ్బులు అడగటం తదితర తప్పుడు పద్ధతులకు పాల్పడటంతో ఏరియా కమిటీ గాసీ దృష్టికి తన బలహీనతలను తీసుకెళ్ళింది. పద్ధతులను మార్చుకోవాలని హెచ్చరిక చేసింది. అయినా తను మారకపోగా అవే పద్ధతులను అనుసరిస్తుండటంతో పార్టీ సభ్యత్వాన్ని రద్దు చేయడం జరిగింది. సంఘాల నుండి ప్రక్కన పెట్టడం జరిగింది. ఇలా 2009లో మరింతగా ప్రజా వ్యతిరేక పద్ధతులకు పాల్పడ్డాడు. ప్రజల్ని కొట్టడం, బెదిరించడం చేస్తుండటంతో ప్రజలందరూ పార్టీ దృష్టికి తేవడంతో పట్టుకొని ప్రజా కోర్టులో పెట్టాలని నిర్ణయం జరిగింది. దీంతో వాడు దొరకగ పోగా అప్పటి నుండి రహస్యంగా వుంటుండేవాడు. 2012లో ఆటుగూడకు బి.ఎస్.ఎఫ్ క్యాంపు, రావడం అదీ తన గ్రామానికి 5కి.మీ. దూరంలోనే వుండటంతో వీడు మరింతగా ప్రజలను బెదిరించడం, పోలీసులతో కలిసి గ్రామాల ప్రజల మీద దాడులు చేస్తూ కొట్టడం, అరెస్టులు చేయించడం, దాడుల సందర్భంగా ప్రజల సాంప్రదాయక ఆయుధాలైన విల్లంబులు, కత్తులు, గొడ్డళ్ళు, బర్మార్లు తీసుకొనిపోవడం చేసేవాడు. వీడికి తోడు వీడి అన్నతమ్ములైన కలియ, సాయిబోలు కలవడంతో ఏరియా ప్రజలందరూ మరింతగా భయాందోళనలకు గురైనారు. పోలీసులతో గ్రామాల మీద దాడులు చేసి ఇప్పటివరకు 38 బర్మార్లను తీసుకొని పోలీసులకు అప్పగించారు. వీళ్ళ భయానికి నాలుగు కుటుంబాలు గ్రామం వదిలి వెళ్ళిపోయాయి. వాళ్ళ గొడ్లు, కోళ్లు, పెంకులు, భూమిని వీళ్ళు స్వాధీనం చేసుకొన్నారు. వీళ్ళిద్దరూ మహిళల్ని అత్యాచారం కూడా చేశారు. సంతలకు వెళ్ళినప్పుడు లేదా గ్రామాల్లో నిద్రిస్తున్నప్పుడు పోలీసులతో కలిసి దాడులు చేస్తూ 48 మంది అరెస్టులకు కారకులయ్యారు. వీరి కుటుంబాల ఆగడాలను ఇక ఎంత మాత్రం సహించలేని ప్రజలు సంఘాలతో చర్చించి ప్రజాకోర్టు నిర్వహించాలని అనుకోవడం జరిగింది. ప్రజాకోర్టు ఏర్పాట్లలల్లో భాగంగా ప్రజలను సమీకరిస్తున్న క్రమంలో గాసీ అన్నయ్య సాయిబో దళం వున్న గ్రామానికి వచ్చి అనుమానస్పదంగా తిరుగుతున్నాడని ప్రజలు దళంకు చెప్పడంతో దళం పట్టుకునే ప్రయత్నం చేయగా తప్పించుకొని పారిపోయాడు. వాడిపై 2 రౌండ్లు ఫైరింగ్ కూడా చేయడం జరిగింది. దాంతో మనం చర్య తీసుకుంటామనే విషయం బహిర్గతమై వారు పరారి అయ్యారు. వెంటనే ప్రజలను మనం సమీకరించి, ప్రజాకోర్టు నిర్వహించి, ప్రజాకోర్టు నిర్ణయం మేరకు మూడు కుటుంబాలను కట్టుబట్టలతో గ్రామ బహిష్కరణ చేయడం జరిగింది. ప్రజలు గాసీకి చెందిన 8 గొడ్లు, 10 కోళ్ళు, 2 లక్షలు విలువైన సామాగ్రి, 1000రూ॥ నగదు స్వాధీనం చేసుకొని వారు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలు చొరవగా ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ చర్య ఏరియా వ్యాప్తంగా చాలా మంచి ప్రభావం వేసింది. ఈ చర్య స్థానిక శత్రువులకు వ్యతిరేకంగా ప్రజలు నిర్ణయం తీసుకొని, నిర్వహించిన చర్యగా అభివర్ణించవచ్చు.

## అవినీతిపరుడు, పెత్తందారీ, ప్రజా వ్యతిరేకి గిన్నెలకోట సర్పంచ్ రామన్న పడాల్‌కు ప్రజా కోర్టులో బుద్ధి చెప్పిన ప్రజలు

కోరుకొండ ఏరియా కమిటి పరిధిలోగల విశాఖ జిల్లా పెదబయలు మండలం గిన్నెలకోట పంచాయితీ గ్రామానికి చెందిన సర్పంచ్ రామన్న పడాల్ గత 8 సంవత్సరాల నుండి సర్పంచ్‌గా పని చేస్తున్నాడు. సర్పంచ్ అయిన తర్వాత పెద్ద మొత్తంలో అవినీతికి పాల్పడుతూ తనకు మద్దతుగా ఒక సెక్షన్‌ను తయారు చేసుకొని ఆధిపత్యాన్ని కొనసాగిస్తూ ప్రజా వ్యతిరేకిగా తయారయ్యాడు.

వివిధ ప్రభుత్వ పథకాల అమలులో అవినీతికి పాల్పడుతూ లక్షలాది రూపాయలు కాజేయడం, నరేగా పనికి సంబంధించి ప్రజల శ్రమకు తగిన కూలీ ఇవ్వకపోవడం, ఇందిరమ్మ ఇళ్లు వస్తాయనీ, ఇళ్ళకు రేకులు, పెంకులు వస్తాయని పంచాయితీ ప్రజలందరీ

దగ్గర నుండి డబ్బులు వసూలు చేయడం, వివిధ నిర్మాణాలకు కాంట్రాక్టర్‌గా కూడా వుంటూ ప్రజల శ్రమశక్తిని దోచుకోవడం చేసేవాడు. వీడు అక్రమంగా సంపాదించిన డబ్బుతో పాడేరు, పెదబయలు తదితర పట్టణాలల్లో బిల్డింగ్‌లు కూడా నిర్మించుకున్నాడు. ఒక ట్రాక్టర్, రెండు బైక్‌లు, లక్షలాది రూపాయిల బ్యాంక్ బ్యాలెన్స్ అక్రమంగా సంపాదించాడు.

ప్రజలు ప్రభుత్వ పథకాల నుండి లబ్ధిమాట ఏమోగానీ శ్రమించిన దానికి తగిన కూలీ అయినా సరే ఇవ్వాలని సర్పంచ్ ఇల్లు చుట్టూ తిరిగి తిరిగి విసుగెత్తి పోయారు. సర్పంచ్‌ను పలుమార్లు పట్టుకొని నిలదీసే ప్రయత్నాలు కూడా చేశారు. అయినా వాడు తప్పించుకొని తిరుగుతున్నాడు.

ఈ మధ్య కాలంలో ఈ ప్యాకెట్ ప్రజలందరూ దళం ముందు రామన్న పడాల్ సమస్యను పెట్టి చర్చించి ప్లాన్ చేసుకోవడం జరిగింది. పంచాయితీ ప్రజలందరితో 26-6-2013న ప్రజా కోర్టు జరిగింది. ఈ ప్రజాకోర్టులో సర్పంచ్‌ను ముద్దాయిగా నిలబెట్టి వివరాలతో సహా ప్రజలు నిలదీయడంతో సర్పంచ్ దిక్కుతోచని స్థితిలో తన తప్పుల్ని ఒప్పుకోక తప్పలేదు. ముఖ్యంగా మహిళలు ఆవేశంగా మాట్లాడుతూ రామన్న పడాల్ అవినీతిని ఎండగట్టారు. ప్రజలకు రావాల్సిన 2 లక్షల రూపాయిల నగదు, 1704 రేకులు 10 రోజుల్లోగా చెల్లించాల్సిందిగా తీర్పును ఇవ్వడం జరిగింది.

ఈ తీర్పును సజావుగా, సక్రమంగా అమలు జరపడం కోసం ఒక న్యాయ కమిటి కూడా ఏర్పడింది. ఈ సందర్భంగా స్థానిక సంఘ నాయకత్వం మాట్లాడుతూ బూర్జువా రాజకీయ పార్టీలన్నీ అవినీతిమయం అయ్యాయని రాబోయే స్థానిక ఎన్నికల్లో వీరిని ఎండగట్టాలనీ, నిలదీయాలనీ, ఓట్లను బహిష్కరించాలనీ పిలుపునివ్వడం జరిగింది.

మొత్తం ఈ ప్రజాకోర్టు ఏరియాలో మంచి ప్రభావం వేసింది. అవినీతిపరులకు ఇది ఒక హెచ్చరిక అయ్యింది. ప్రజలందరూ ఐక్యంగా వుంటే ఏదైనా సాధించుకోగలమనే విశ్వాసం ప్రజల్లో ఏర్పడింది.

## ఎస్.పి.ఓ తెల్లన్నను ఏరియా నుండి బహిష్కరించిన ప్రజలు

కోరుకొండ ఏరియా కమిటి పరిధిలోగల మల్కన్‌గిరి జిల్లా, గుమ్మా బ్లాక్, రాళ్ళగడ్డ పంచాయితీ, ఇసుక బంధ గ్రామానికి చెందిన తెల్లన్న మన సంఘాల్లో పని చేస్తుండేవాడు. అయితే త్రాగుబోతు కావడంతో పాటు క్రమశిక్షణారాహిత్యంగా ఉండటంతో సంఘం నుండి తప్పించడం జరిగింది. అయినా అతని ఆగడాలు ఆగలేదు. భార్య ఉండగానే మరో చిన్న అమ్మాయిని పెళ్లి చేసుకోమని వెంటబడుతూ వేదించడం చేసాడు. ఈ విషయం కూడా పార్టీ దృష్టికి రావడంతో ప్రజా కోర్టు నిర్వహించి ప్రజా కోర్టులో సీరియస్‌గా హెచ్చరించడం జరిగింది. దీంతో తెల్లన్న సంఘాల మీద, పార్టీ మీద తీవ్ర వ్యతిరేకతను పెంచుకొని పోలీసుల చెంత చేరాడు. మిలీషియా, సంఘ కామ్రేడ్స్‌ను పట్టించడం చేస్తూ వుండేవాడు.

స్థానిక ఏరియా కమిటి సభ్యురాలు కా.భాగ్యను దగ్గరుండి పోలీసులకు పట్టించాడు. భాగ్య అనారోగ్య రీత్యా గ్రామ షెల్టర్‌లో వుండగా భాగ్యతో పాటు ఆశ్రయ మిచ్చిన గ్రామ పెద్ద బంగారయ్యను కూడా పట్టించాడు. గ్రామాలపై దాడులకు పోలీసులతో కలిసివస్తూ ప్రజలను విపరీతంగా కొడుతూ వుండేవాడు. పై విషయాలన్నీ చర్చించి జూలై 2, 2013న ప్రజా కోర్టు నిర్వహించి తెల్లన్న ఇంటిని కూడా జప్తు చేసుకోవడం జరిగింది. ఈ ప్రజాకోర్టు ద్వారా ప్రజా వ్యతిరేకులుగా, పోలీసులతో సంబంధాలు నెరుపుతున్న వారికి ఈ చర్య ఒక హెచ్చరికగా అయ్యింది.

## పార్టీ పేరుతో డబ్బులు గుంజుకునే అరాచక ముఠా ఆటకట్టించిన ప్రజా కోర్టు

కోరుకొండ ఏరియా కమిటి పరిధిలో గల విశాఖ జిల్లా జి.మాడుగుల మండలం నుర్మతి పంచాయితీ వాకపల్లి గ్రామం. ఈ పేరు వినగానే 2007లో గ్రేహౌండ్స్ మూకలు 11 మంది ఆదివాసీ మహిళల మీద అత్యాచారం చేసిన ఘటనే గుర్తుకొస్తుంది. న్యాయం కోసం ఆ మహిళలు చేసిన పోరాటానికి ఫలితం ఏమిటనేది రాష్ట్ర ప్రజలందరికీ తెలిసిన విషయమే. పోలీసుల మీద న్యాయ పోరాటానికి దిగిన ఆ గ్రామంపై ఎలాగైనా ప్రతీకారం తీర్చుకోవాలనుకుని అప్పటి నుండి రాజ్యం తీవ్ర ప్రయత్నాలు చేస్తూ వచ్చింది.

ఈ క్రమంలోనే వాకపల్లి గ్రామస్తులైన దాసు, రామారావు, సూర్యంలను శత్రువు లొంగదీసుకొని వీరిని అరాచక ముఠాగా తయారు చేశాడు. వీళ్ళ నేతృత్వంలో కొంత మందిని వెంటేసుకొని మన పేరుతో ఒక గ్రామంలో 7 బర్మార్లు అడిగి, షావుకార్ల నుండి కిట్లు, బూట్లు, బట్టలు వసూలు చేశారు. మన పేరుతో చిన్న చిన్న సెటిల్‌మెంట్లు (భూతగాదాలు, ప్రజల మధ్య వైరుధ్యాలు) చేసేవారు. పరిష్కారం పేరుతో కోళ్లు, మేకలు, గొడ్లు కోసుకొనితినేవాళ్లు. గత రెండు సంవత్సరాలుగా ఇలాంటి పనులకు పాల్పడుతుంటే గతంలో ఒకేసారి ప్రజాకోర్టులో పెట్టి హెచ్చరించినా మార్చుకోకపోగా మరలా అలానే వ్యవహరించడంతో వీరికి ప్రజాకోర్టులో పెట్టి దేహశుద్ధి చేయాలని పార్టీ ఏ.వి.ఆర్.సి.ఎస్ నిర్ణయించింది. ఈ నిర్ణయంలో భాగంగానే 20.6.2013న 40 మంది మిలీషియా కామ్రేడ్స్ ఈ ప్రజాకోర్టును నిర్వహించారు. ప్రజాకోర్టులో ఇద్దరికి మాత్రమే దేహశుద్ధి చేశారు. రామారావు యాక్సిడెంట్‌లో గాయపడటంతో తన మీద శిక్షను అమలు చేయలేదు. మిగతా ఇద్దరు తప్పుల్ని ఒప్పుకోవడంతో కొన్ని కండీషన్స్ పెట్టి వదిలి వేయడం జరిగింది. ఈ చర్య ఏరియాలో మంచి ప్రభావం వేసింది. ఏరియాలోని అరాచక గ్రూపులకు ఇది ఒక హెచ్చరికగా నిలిచింది.

## జిల్లా పి.సి.సి సభ్యుడు వంతల సుబ్బారావు ఇంటిపై ప్రజలు, ప్రజా మిలీషియాల దాడి

కోరుకొండ ఏరియా కమిటి పరిధిలోగల విశాఖ జిల్లా, చింతపల్లి మండలం చీకటి మామిడి గ్రామస్తుడైన వంతల సుబ్బారావు చింతపల్లి వ్యవసాయ కమిటి మాజీ చైర్మెన్‌గా ప్రస్తుతం జిల్లా పి.సి.సి సభ్యుడిగా కాంగ్రెస్ పార్టీ కార్యకలాపాలను చురుకుగా నడిపిస్తున్నాడు.

విశాఖ జిల్లాలో బాక్సైట్ తవ్వకాలపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్రంగా ప్రయత్నం చేస్తున్నాయి. ప్రజలు గత కొన్ని సంవత్సరాలుగా తీవ్రమైన పోరాటం చేస్తున్నా పట్టించుకోకుండా త్రవ్వకాలకే

పూనుకొంటున్నది. రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పసుపులేటి బాలరాజుకు కుడి భుజంలా వుంటూ ధన బలంతో గ్రామీణ ప్రాంత యువకులను పునరావాస కమిటి పేరుతో బాక్సైట్‌కు అనుకూలంగా తయారు చేస్తూనే, రాజకీయ పలుకుబడితో తీవ్ర అవినీతికి పాల్పడటంతో ప్రజలు వీడి పట్ల తీవ్ర వ్యతిరేకతను వ్యక్తం చేస్తున్నారు.

2010లో మన్యంలో బాక్సైట్ గనులకు అనుకూలంగా వున్న బూర్జువా పార్టీల ప్రతినిధులను రాజినామా చేయాలనీ మన పార్టీ ఇచ్చిన పిలుపున బేఖాతరు చేసిన దాంట్లో వీడు ముఖ్యుడు. పార్టీ వార్త పత్రికల ద్వారా, పోస్టర్ల ద్వారా బహిరంగంగానే తనను హెచ్చరించినా ఏమాత్రం పట్టించుకోలేదు. బాక్సైట్‌కు అనుకూలంగా వుంటున్నందున సుబ్బారావుపై చర్య తీసుకోవాలని ఏరియాలోని ప్రజలందరూ నిర్ణయానికి రావడం జరిగింది.

జూలై 2013 పంచాయితీ ఎన్నికల సందర్భంగా రాజకీయాలకు దూరంగా వుండాలంటూ హెచ్చరించినా ఖాతర్ చేయకపోగా మరింత దూకుడుగా ప్రజా వ్యతిరేక పద్ధతులకు పాల్పడ్డాడు. దీంతో ప్రజలు (100 మంది), మిలీషియా కదిలి 7.7.2013న రాత్రి 9 గంటలకు దాడి చేయగా తృటిలో సుబ్బారావు తప్పించుకొన్నాడు. ప్రజలు, మిలీషియా వాడి ఇంటిని ధ్వంసం చేసి ఆస్తినంతటినీ స్వాధీనం చేసుకొన్నారు.

ఈ ఘటన చింతపల్లికి కూతవేటు దూరంలో జరగడం, అదీ ఎన్నికల వాతావరణంలో జరగడం మూలంగా ఏరియాలో ప్రజా వ్యతిరేకుల గుండెల్లో రైళ్ళు పరిగెత్తినట్లు కాగా ప్రజల్లో వుత్సాహాన్ని కలిగించింది.

## ప్రజా కోర్టుల్లో పదవులకు రాజీనామాలు చేసిన గిన్నెలకోట, కిల్లంకోట, జామ్‌గూడ, బూస్‌పుట్ సర్పంచ్‌లు, వార్డ్ మెంబర్లు:

ఈస్టు డివిజన్ కోరుకొండ ఏరియా కమిటి పరిధిలోగల విశాఖ జిల్లాలో 2013 జూలై నెలలో జరిగిన స్థానిక పంచాయితీ ఎన్నికలను బహిష్కరించాలని పార్టీ, ప్రజాసంఘాలు ఇచ్చిన పిలుపును కొందరు దళారీలు పెడచెవిన పెట్టి ప్రజలను ఎన్నికల వైపు మళ్ళించేందుకు ప్రయత్నించారు. చివరికి మొక్కుబడిగా ఎన్నికలు జరిపించి ప్రజానాయకులైనారు. వీరిని ఏరియా ఏ.వి.ఆర్.సి.ఎస్ ప్రజా కోర్టులలో నిలదీయడం జరిగింది. ప్రజలను బెదిరించిన దళారీలను దేహశుద్ధి కూడా చేయడం జరిగింది. వీరంతా తమ తప్పులను ప్రజల ముందు ఒప్పుకొంటూ సర్పంచ్, వార్డ్ మెంబర్ పదవులకు ప్రజా కోర్టులో రాజీనామాలు చేశారు.

పెదబయలు మండలం గిన్నెలకోట సర్పంచ్ చామగడ్డ గ్రామస్తుడు లకే చిన్నారావు 20.10.2013న జరిగిన ప్రజా కోర్టులో పదవికి రాజీనామా చేశాడు. తనను బలవంతంగా మాయ మాటలతో రాజకీయాల రొంపిలోకి దింపి, సత్యారావు (మెట్టగూడ), గణపతి (చామగడ్డ), అప్పన్నదొర (బొంగ్ జాంగ్)లని ప్రజల ముందు చిన్నారావు ఒప్పుకోవడంతో ప్రజలు వీరందరికీ దేహశుద్ధి చేశారు. ఈ ప్రజాకోర్టుకు మొత్తం 500 మంది ప్రజలు హాజరయ్యారు.

పెదబయలు మండలం జామ్‌గూడ పంచాయితీ మాజీ, నూతన సర్పంచ్‌ల విషయంలో 29.10.2013న ప్రజాకోర్టు జరిగింది. నూతన సర్పంచ్ సుబ్బారావు ప్రజాకోర్టుకు హాజరు కాలేదు. మాజీ సర్పంచ్ తవుడు పడాల్‌ను రాజకీయాలకు దూరంగా వుండాలని గతం నుండి పార్టీ, ప్రజలు హెచ్చరిస్తున్నా లెక్కచేయకపోగా నూతన సర్పంచ్ ఎన్నికల దందాలో ప్రధాన పాత్ర పోషించడంతో ప్రజలు వీడికి దేహశుద్ధి చేశారు. ఈ ప్రజా కోర్టుకు 700 మంది హాజరయ్యారు.

పై మూడు ప్రజా కోర్టుల వుత్సాహంతో స్థానిక మిలీషియా చొరవగా ముంచంగిపుట్ మండలం బూసుపుట్ సర్పంచ్ కిముడు ముత్యాలమ్మను ప్రజలు నిలదీయడంతో తను కూడా తప్పులను ఒప్పుకొంటూ పదవికి రాజీనామా చేసింది.

పై ప్రజా కోర్టుల ద్వారా ఏరియాలోని రాజకీయ నాయకులను, దళారులను ఏరియా ఏ.వి.ఆర్.సి.ఎస్ నిలదీయడంతో విప్లవ ప్రజానీకంపై రాజకీయంగా మంచి ప్రభావం వేసింది.

## పెత్తందారీ, ప్రజావ్యతిరేకి అయిన కుంకుంపూడి కొర్ర సన్యాసిరావు ఇంటిపై దాడి

గ్రామ పెత్తందారి అయిన కొర్ర సన్యాసిరావు మొదటి నుండి ఫారెస్టు, ఎ.పి.ఎఫ్.డి.సి రేంజర్లకు సహకరిస్తూ ప్రజలకు వ్యతిరేకంగా వ్యవహరించేవాడు. పార్టీ, పి.ఎల్.జి.ఎ అండతో ఫారెస్టు డిపార్ట్‌మెంటును ప్రజలు తరిమి కొట్టిన కాలంలో వీడు స్తబ్దుగా వుండి పోలీసులతో సంబంధాలను కొనసాగించాడు. గ్రామంలో ప్రజల విప్లవ కార్యక్రమాలను హేళన చేయడం, ఆదివాసీ విప్లవ రైతుకూలి సంఘం నిర్వహించే ప్రజాసభలను వ్యతిరేకించడం, బహిష్కరించడం చేసేవాడు. ప్రజలు ఎ.పి.ఎఫ్.డి.సిని ఎదిరించి కాఫీ తోటల్లో పండ్లు సేకరించినప్పుడు పోలీసులకు, ఎ.పి.ఎఫ్.డి.సికి ఉప్పందించి వారిపై దాడులు చేయించి పట్టించాడు. ఫలితంగా అనేక మంది గ్రామ ప్రజలు అరెస్టులకు గురయ్యారు. కాఫీ కూలిరేట్ల పోరాటంలో ముందున్న సాగులు గ్రామానికి చెందిన "సాణా"ను పట్టించగా పోలీసుల చిత్రహింసల మూలంగా ఆ కా॥ అమరుడయ్యాడు.

వీడి కొడుకు జి.సి.సి డిపో సేల్స్‌మన్. వీడు తీములుబందకు రేషన్ బియ్యం కొరకు వెళ్లిన అనేక మంది విప్లవ ప్రజానీకం, మిలీషియా అరెస్టులకు కారణమయ్యాడు. విప్లవ కార్యక్రమాలకు తాను వ్యతిరేకమని గ్రామంలో బహిరంగంగా మాట్లాడే వాడు. వీడి విషయంలో స్థానిక ఎ.వి.ఆర్.సి.ఎస్, మిలీషియా, ఎల్.జి.ఎస్‌లు అనేకసార్లు గ్రామంలో నిలదీయడం, హెచ్చరించడం, దేహశుద్ధులు చేసారు. అయినప్పటికి వీడు ఏ మాత్రం మారక పోగా ఆ సమావేశానికి వచ్చిన ప్రజల, మిలీషియా పట్ల కక్షపూరితంగా వ్యవహరించడంతో ఆగ్రహించిన ప్రజలు వీడ్ని గ్రామంనుండి తరిమివేయడమే సరైనదిగా పార్టీ ముందు

ప్రతిపాదించడంతో, ఎ.సి ఆమోదంతో స్థానిక ఎ.వి.ఆర్.సి.ఎస్, మిలీషియా ఎర్రగడ్డ, పి.కె.గూడెం పాకెట్లనుండి 13గ్రామాల ప్రజలను సమీకరించి కుంకుంపూడిలో సమావేశం నిర్వహించి, వాడికి దేహశుద్ధి చేసి గ్రామం వదిలిపోవాల్సిందిగా హెచ్చరించి వదిలిపెట్టారు. అనంతరం ప్రజల శ్రమను దోచుకొని కూడ బెట్టుకున్న వాడి ఆస్తులను, ధాన్యం, అపరాలను ప్రజలు స్వాధీన పరుచుకున్నారు. ఈ సంఘటన అక్టోబర్ 2013లో జరిగింది.

## ఇన్‌ఫార్మర్ 'బూరి' ఖతం

మల్కన్‌గిరి జిల్లా కుడుముల గుమ్మ బ్లాక్ రాళ్ళగడ్డ పంచాయితీ మరియు ఈస్టు డివిజన్ కోరుకొండ ఏరియా కమిటీ పరిధిలోగల డాబగూడ గ్రామానికి చెందిన బూరి గత కొన్ని సంవత్సరాలుగా గ్రామంలోని సంఘంలో చురుకైన పాత్ర వహిస్తూ స్థానిక దళానికి అన్ని విధాలా సహకరిస్తుండేవాడు. డివిజన్‌లోని రెండు ప్రధాన ఏరియాలను కలిపేటువంటి ప్రాధాన్యత కలిగిన రూట్‌లో (బెల్ట్) ఈ గ్రామం వుండటం, అదీ నది (లోతుగడ్డ) ఒడ్డున వుండటంతో స్థానిక దళాలు ఈ గ్రామంపై నమ్మకంగా ఆధారపడేవి. పార్టీ నమ్మకాలను వమ్ము చేయకుండా గ్రామస్తులు కూడా చాలా సంవత్సరాల నుండి సహకరిస్తూ గ్రామంలో సంఘాలు పెట్టుకొన్నారు. పార్టీ ఇచ్చిన చైతన్యంతో గ్రామంలో విప్లవ భూసంస్కరణలు చేపట్టి గ్రామంలోని అన్ని కుటుంబాలకు సమానంగా భూమి పంపిణీ చేసుకొన్నారు. తద్వారా ఆ గ్రామం స్థానిక వుద్యమంలో మంచి పాత్రనే పోషించింది.

బొడపడ క్యాంపులో స్థానిక పోలీసులు పోయి బి.ఎస్.ఎఫ్ జవానులు వచ్చిన తర్వాత ప్రజలందర్నీ బలవంతంగా (బెదిరించి, భయపెట్టి) ఎత్తుకెళ్ళి సరెండర్లు చూపిస్తున్నారు. లొంగనివారిని అరెస్టులు చూపెడుతున్నారు. ముఖ్యంగా బి.ఎస్.ఎఫ్ జవానులు వచ్చిన తర్వాత ఆదివాసీల బ్రతుకులు దినదిన గండంగా మారాయి. ప్రతీ వారం సంతలకు పోలీసులు వచ్చి భయపెట్టడం మూలంగా ప్రజల నిత్యావసర సరుకులైన ఉప్పు, మిరపకాయలు లాంటివి కూడా కొనుక్కోలేని పరిస్థితి ఏర్పడింది. రేషన్ బియ్యం మావోయిస్టులకు ఇస్తున్నారనే సాకుతో ఒక్కొక్కసారి రెండు, మూడు నెలలు కూడా ప్రజలకు రేషన్ బియ్యం ఇవ్వకుండా బి.ఎస్.ఎఫ్ పోలీసులు బంద్ పెడుతున్నారు. చివరికి రేషన్ దుకాణాలన్నీ పోలీసు క్యాంపుల దగ్గరకు మార్చడం ద్వారా బలవంతంగా రేషన్ కార్డులన్నీ లాక్కొని అవసరమైన వ్యక్తులు రావాలని ఆంక్షలు విధిస్తూ, బియ్యంకు వచ్చిన వారిని అరెస్టు చేస్తూ ఆదివాసీలపై మరింత ఒత్తిడిని పెంచి బలవంతపు సరెండర్లు చేయించుకుంటున్నారు. కొంతమంది రహస్యంగా లొంగిపోయారు.

అలా రహస్యంగా డబ్బుకు ఆశపడి లొంగిపోయిన వారిలో బూరి ఒకడు. ఇతను బి.ఎస్.ఎఫ్ పోలీసుల ఇన్‌ఫార్మర్‌గా వుంటూ (రహస్య హోమ్ గార్డ్‌గా) ఏరియాలోని కమిటీ మెంబర్ల, సంఘ కార్యకర్తల వివరాలను చెప్పడం, కొంతమందిని బెదిరించడం, అరెస్టులు చేపించడం, గ్రామాలపై దాడులకు పోలీసులతో కలిసి వచ్చి (బహిరంగంగానే) గ్రామస్తులను కొట్టడం, బర్మార్ తుపాకులను పట్టిస్తుండటం వంటి విప్లవ ప్రతిఘాతుక చర్యలకు పాల్పడుతుండేవాడు. సంఘనాయకత్వానికి, పార్టీ సానుభూతిపరులకు సరెండర్ వుత్తరాలు పంపుతుండేవాడు. మనం గ్రామ పరిసరాల్లో పెట్టిన కొన్ని దుస్తులు, సాహిత్యం లాంటివి తీసుకెళ్ళి శతృవుకు ఇచ్చేశాడు. మన డేరాల్లో డంపులు వున్నాయేమోనని వెతుకుతుండేవాడు. మన సమాచారం తెలిసి మన ప్రయాణ రూట్‌లో పోలీసులను ఆంబుష్ కూర్చోబెట్టించాడు. తమ గ్రామస్తులు "ఇది మంచిపని కాదు, సరైన పద్ధతి కాదు. పార్టీకి తెలిస్తే ఒప్పుకోదు" అని ఎంత చెప్పినా... అర్థం చేసుకోకపోగా గ్రామస్తులను కూడా పోలీసుల ద్వారా కొట్టించాడు. "నన్ను పార్టీ ఏం చేస్తాదిరా? నాకు పోలీసుల మద్దతు వుంది!" అంటూ పగలు రహస్యంగా గ్రామంలో వుంటూ రాత్రుళ్లు మాత్రం బి.ఎస్.ఎఫ్ క్యాంపుకు అందుబాటులో వున్న కర్లమాడ గ్రామంలో తోటి హోమ్‌గార్డులతో కలిసి పడుకునే వాడు. స్థానిక దళం రెండు నెలలకాలం అందుబాటులో లేకపోవడంతో బూరి అరాచకత్వానికి హద్దులు లేకుండా పోయాయి.

బూరికి సంబందించిన పై విషయాలన్నీ చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజల ద్వారా తెలుసుకున్న స్థానిక దళం వెంటనే అతడిని పట్టుకొని ఇంటరాగేషన్ చేసింది. తన తప్పులన్నీ ఒప్పుకోవడంతో మరణశిక్ష విధించి గ్రామస్తులను పిలిచి శవాన్ని అప్పగించడం జరిగింది. గ్రామస్తులు కూడా "తగినశిక్ష పడిందనీ" శిక్షకు మద్ధతు తెలిపారు. స్థానికంగా ఇతరత్రా కార్యక్రమాలకు డిస్టర్బ్ కాకుండా వుండేందుకు పై ఘటనను ఒక వారం రోజులు పాటు శతృవుకు తెలియకుండా దళం జాగ్రత్తలు తీసుకొంది. మన దళం కార్యక్రమాల్లో భాగంగా చుట్టు ప్రక్కల గ్రామాల్లో ప్రచారం చేసినప్పుడు ప్రజలందరూ సంతోషం వ్యక్తం చేశారు. అంతేకాకుండా మరికొంత మంది ప్రజావ్యతిరేకులు, ఇన్‌ఫార్మర్ల వివరాలు చెబుతూ... మరిన్ని చర్యలు అవసరమని ప్రజలు అభిప్రాయపడ్డారు. మొత్తంగా ఈ చర్య స్థానికంగా ప్రజల్లో ధైర్యాన్ని, వుత్సాహాన్ని నింపింది. ఏరియాలో మంచి ప్రభావం వేసింది.

## ఎస్.పి.ఒ, ఇన్‌ఫార్మర్లు అయిన కొర్రా లక్ష్మి సత్తిబాబులు పి.ఎల్.జి.ఎ చేతిలో ఖతం

ఈస్టు డివిజన్ కోరుకొండ ఏరియాకమిటి పరిధిలోగల కుడుములగుమ్మ బ్లాక్, బొడపడ పంచాయితీ బైలుగుమ్మ గ్రామానికి చెందిన కొర్రా లక్ష్మి (ఎస్.పి.ఒ, ఆశాకార్యకర్త) గత కొంత కాలంగా పోలీసు ఇన్‌ఫార్మర్‌గా పనిచేస్తూ, చిత్రకొండ పోలీసులతో నిరంతరాయ సంబంధాల్లో ఉంటూ రాళ్ళగడ్డ, పప్పరమెట్ల, బొడపడ, జోడాం పంచాయితీల ప్రజలపై, సంఘ నాయకత్వం పై నిరంతరం పోలీసు దాడులు చేయిస్తుండేది. ఆశాకార్యకర్త పేరుతో చిత్రకొండ క్యాంపుకు వెళుతూ రోజుల తరబడి వుంటూ మన సమాచారాన్ని ఇస్తూ బయట తిరిగే ప్రజలను పట్టించేది. పోలీసు ఆఫీసర్లతో అక్రమ సంబంధాలు పెట్టుకుంటూ సుఖంగా డబ్బులు సంపాదించడం నేర్చిన లక్ష్మి తన భర్త రాజుని కూడ ఈ రొంపిలోకి లాగింది. ఈ విషయం తెలిసిన స్థానిక మిలీషియా, పి.ఎల్.జి.ఎ రాజుని పట్టుకొని దేహశుద్ధి చేయగా తన తప్పుల్ని ఒప్పుకొని మంచిగా బతుకుతానని చెప్పడంతో క్షమించి వదిలివేయడం జరిగింది. అయితే భర్త దేహశుద్ధిని సవాలుగా తీసుకున్న లక్ష్మి తన భర్త రాజుతో కలిసి పూర్తిస్థాయి (బహిరంగంగా) ఎస్.పి.ఒ లుగా చిత్ర కొండ, ఆటుగూడ బి.ఎస్.ఎఫ్ క్యాంపులలో పనిచేస్తూ పార్టీ సమాచారాన్ని నిరంతరం పోలీసులకు

చేరవేయడం, రహస్యంగా ఇన్‌ఫార్మర్ నెట్‌వర్కను తయారుచేయడం, సంఘ నాయకత్వ ఇళ్ళపై దాడులు చేయడం, బలవంతపు, బూటకపు సరెండర్లు చేయించడం చేసేవారు.

నవంబర్ 2013లో ఏలంపాకలు గ్రామంపై బి.ఎస్.ఎఫ్ వాళ్ళతో కలిసి దాడిచేసి సంఘ నాయకుడైన కా॥ బెన్నును అతికిరాతకంగా చిత్రహింసలు పెడుతూ హత్యచేయించింది. స్థానిక ఎ.సి.ఎమ్ బిశాంత్‌ను కూడా పట్టించింది. ఇలా లక్ష్మి, రాజు ఇద్దరు కూడా పోలీసులతో కలసి పదుల సంఖ్యలో గ్రామాల మీద దాడులు చేస్తూ, నెలల తరబడి మంచాన పడేలా ప్రజలను విపరీతంగా కొట్టడంతో ఏరియా ప్రజలంతా తీవ్ర భయాందోళనలకు గురయినారు. శత్రువు కూడా వీళ్ళ ప్రజావ్యతిరేక కార్యకలాపాలను చూసి క్యాంపుకు అందుబాటులో నిరంతరం ఉండేలా చూసుకుంటూ వారికి తగిన రక్షణ ఏర్పాట్లు కూడా చేసాడు.

ఇదే గ్రామానికి చెందిన సత్తిబాబు (గతంలో దళంలో పనిచేసాడు.) ఆటుగూడ క్యాంపు వచ్చిన తరువాత డబ్బుకు ఆశపడి మన సమాచారం బి.ఎస్.ఎఫ్ జవానులకు చెప్పేవాడు. ముఖ్యంగా ఇతను డాక్టర్ కవర్‌లో ఉంటూ మన సంఘ నాయకత్వ సమాచారాన్ని సేకరిస్తూ దాడులు చేయించేవాడు. మావోయిస్టులతో సంబంధాలున్నాయనే పేరుతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలను భయపెడుతూ, బెదిరిస్తూ అరెస్టులు చేయించేవాడు.

వీరి ఆగడాలకు అంతుపొంతు లేకుండా పోవడంతో ప్రజలు అనేక మార్లు పార్టీ దృష్టికి విషయాన్ని తీసుకొచ్చారు. దీంతో 19-11-2013 న పి.ఎల్.జి.ఎ దళం వీరిపై దాడిచేసి లక్ష్మి, సత్తిబాబులను ఖతం చేయగా, మన రాకను ముందే పసిగట్టిన రాజు అతిసమీపంలో ఉన్న బి.ఎస్.ఎఫ్ క్యాంపుకు పారిపోయాడు.

పై ఘటన శత్రువు ఊహించని విధంగా క్యాంపుకు అతి సమీపంలో జరగడంతో తీవ్రంగా గందరగోళపడి రాత్రంతా ఫైరింగ్ చేస్తూ, షెల్స్ వేస్తూ నిద్రలేకుండా గడిపాడు. ఈ ఘటన ఏరియాలో మంచి ప్రభావం వేసింది. స్థానిక శత్రువులకు, ఎస్.పి.ఒ.లకు, ఇన్‌ఫార్మర్లకు ఇది ఒక హెచ్చరికగా నిలిచింది.

## అరాచకులు, హోంగార్డులైన రాంబాబు, రామ్మోహన్‌లు కాఫీ పోరాట ప్రజానీకం చేతిలో ఖతం

ఈస్టు డివిజన్ కోరుకొండ ఏరియా కమిటి పరిధిలో గల చింతపల్లి మండలం బలపం పంచాయితీ పరిధిలోని వేలంజువ్వి గ్రామానికి చెందిన కిల్లో రాంబాబు 2003లో స్థానిక దళంలో చేరి ఒక సంవత్సర కాలం పాటు పనిచేసి శత్రువు ముందు సరెండర్ అయ్యాడు. శత్రువు తనకు హోంగార్డ్ ఉద్యోగం ఇచ్చి మనమీదకు, ప్రజల మీదకు ఉసిగొల్పాడు. అప్పటి నుండి రాంబాబు అన్నవరం, చింతపల్లి, జి.మాడుగుల, నర్సీపట్నం, కోటవురట్ల, విశాఖ పట్టణం తదితర స్టేషన్స్‌లో హోంగార్డ్‌గా పనిచేస్తూ ఉద్దేశ్యపూర్వకంగానే శత్రువుతో చేతులు కలిపి అనేక నష్టాలు చేసాడు.

ముఖ్యంగా ఏరియాలో కూంబింగ్స్‌లో పాల్గొంటూ ప్రజలను, సంఘ నాయకత్వాన్ని విపరీతంగా కొట్టడం, అక్రమ అరెస్టులు చేయించడం, పి.ఎల్.జి.ఎ మీద జరిగే దాడుల్లో యాక్టివ్‌గా పాల్గోవడం చేస్తుండేవాడు. ఎస్.ఐ.బి గూండాలతో కలిసి మండల కేంద్రాలకు వెళుతున్న స్థానిక ఆదివాసీ ప్రజలను, యువతను మావోయిస్టుల పేరుతో అక్రమ నిర్బంధాలకు గురిచేయడం బలవంతంగా, భయపెట్టి అనుకూలంగా మార్చుకోవడం, మారకపోతే విపరీతంగా చిత్రహింసలు పెట్టడం చేసేవాడు. రాంబాబు వల్ల జరుగుతున్న నష్టాలను దృష్టిలో పెట్టుకొని పార్టీ, ప్రజలు తన, తన కుటుంబసభ్యుల ఆగడాలను మానుకోమని నచ్చచెప్పినా, హెచ్చరించినా వినకపోగా మరింత బరితెగించి ప్రజావ్యతిరేకిగా తయారయ్యాడు. పోలీసులతో వుంటూ అరాచకుడుగా, గూండాగా తయారయిన రాంబాబు పోలీసుల పేరుతో, మావోయిస్టుల పేరుతో రహస్యంగా షావుకార్ల,కాంట్రాక్టర్ల వద్ద నుండి డబ్బులు వసూలు చేయడం ప్రారంభించాడు. చివరికి తుపాకీని దొంగలించి కొంతమంది పోలీసు గూండాలతో కలిసి కోటవురట్ల ప్రాంతంలో ఒక వ్యక్తిని హత్య కూడా చేసాడు. దాంతో హోంగార్డ్ ఉద్యోగం నుండి సస్పెండయ్యాడు. అయినప్పటికీ ఎస్.ఐ.బి వాళ్ళ అండతో కాఫీ పోరాట ప్రజలను బెదిరించడం, గంజాయి వ్యాపారస్తులనుండి, రైతులనుండి బలవంతంగా డబ్బులు వసూలు చేస్తుండేవాడు.

అలా 8-11-2013న దళం, కాఫీ పోరాట కమిటీల సమాచార సేకరణలో భాగంగా కిల్లో రాంబాబు, బోనంగిపల్లి గ్రామానికి చెందిన వేణు (మాజీ మావోయిస్టు, హోంగార్డ్), రామ్మోహన్ (హోంగార్డ్) ముగ్గురు కలిసి మోటారు సైకిల్ మీద వచ్చి పోలీసు ఆఫీసర్లుగా నాటకమాడుతూ ఒకరిని విపరీతంగా దేహశుద్ధి చేసి వేలంజువ్వి, కోరుకొండ గ్రామాల్లో గంజాయి డబ్బులు వసూలు చేస్తున్న క్రమంలో స్థానిక మిలీషియా చొరవగా సంఘటితపడి పట్టుకోవడానికి ప్రయత్నించగా వేణు తప్పించుకున్నాడు. రాంబాబు, రామ్మోహన్‌లు దొరకగా బహిరంగంగానే వారిని కట్టివేసి చుట్టుపక్కల గ్రామస్తులందరూ ప్రశ్నించారు. ప్రజల ఆవేశాన్ని చూస్తున్న ఈ ముఠా తమ తప్పుల్ని ఒప్పుకోగా ప్రజలు వారికి మరణశిక్ష విధించారు.

గత పది సంవత్సరాల నుండి పంచాయితీ ప్రజలను శత్రువుతో కలిసి అనేక చిత్రహింసలకు గురిచేసినందున రాంబాబు, రామ్మోహన్ లకు శిక్షను ఖరారు చేయడంలో, అమలు చేయడంలో ప్రజలు పెద్దమొత్తంలో వర్గకసితో పాల్గొన్నారు. ఈ ఘటన ఏరియా వ్యాప్తంగా మంచి ప్రభావం వేసింది. జిల్లా ఎస్.పి, ఓ.ఎస్.డిల డైరక్షన్‌లో పనిచేస్తున్న ఈ పోలీసు గూండాల గ్యాంగ్‌పై చర్యతో జిల్లా పోలీసులకు గట్టి దెబ్బే తగిలింది. కాఫీ పోరాటానికి వ్యతిరేకంగా రాజ్యంతో చేతులు కలిపేవారికి ఈ చర్య ఒక హెచ్చరిక అయ్యింది.

## ఇన్‌ఫార్మర్ వంతల రాజు ఖతం

వీడిది బోనంగిపల్లి గ్రామం. తండ్రి వంతల నాగేశ్వరరావు 2003 నుండి ఇన్‌ఫార్మర్‌గా పనిచేసి పలుమార్లు దళం సమాచారం పోలీసులకు చేరవేయగా అనేక సార్లు తృటిలో ఎన్‌కౌంటర్లు తప్పాయి. వాడే ఇన్‌ఫార్మర్ అని తేలడంతో 2007 సం॥లో వాడ్ని ఖతం చేయడం జరిగింది. వాడు చనిపోవడంతో 3లక్షలు ఎక్స్‌గ్రేషియా కొడుక్కి ఇచ్చారు. ఆ ఎక్స్‌గ్రేషియా డబ్బులు తీసుకునేందుకు వెళ్ళినపుడు నాగేశ్వరరావు కొడుకయిన వంతల రాజును

ఇన్‌ఫార్మర్‌గా మలుచుకున్నారు. అప్పటినుండి వీడు మన సమాచారం సెల్‌ఫోన్ ద్వారా, సంతలకు వెళ్ళి నేరుగా కూడా అందించేవాడు. సమాచారం పంపడం తనకు వీలుకాదనుకున్నపుడు భార్య అయిన వంతల కుమారిని పంపి కూడా సమాచారం చేరవేసేవాడు. ఆవిధంగా భార్య, భర్తలిద్దరికీ పోలీసులతో సంబంధాలు ఏర్పడ్డాయి. ఆ పాకెట్‌లో మన కదలికలు చాలా కాలంగా లేక పోవడంతో మనం ఎక్కువగా తిరుగుతున్న పాకెట్స్‌కు బంధువుల పేరుతో, రంగురాళ్ళ పేరుతో వచ్చి సమాచారం సేకరిస్తున్నాడు. అలా వచ్చి సెప్టెంబర్ 6న మన పి.ఎల్.జి.ఎకు చిక్కాడు. 6వ తేది రాత్రి నుండి 7,8వ తేది ఉదయం వరకూ ఇంటరాగేషన్ పూర్తిచేసి, విషయాలు వెళ్ళడించడంతో ఇన్‌ఫార్మర్‌గా కొనసాగుతున్నాడని రూఢి కావడంతో ఖతం చేయడమైంది.

## ప్రజావ్యతిరేకి, పోలీస్ ఇన్‌ఫార్మర్, వి.ఎస్.ఎస్ అధ్యక్షుడు పనసలబంద గెమ్మెలి చిన్నారావు ఖతం

వీడు గ్రామ మునసబు. యువకుల్ని కొట్టడం, మహిళల్ని లైంగికంగా వేధించడంతో పాటు గ్రామంలో ఉన్న కొద్దిపాటి పొలాలను వీడే ఆక్రమించుకున్నాడు. వి.ఎస్.ఎస్‌లో వాలంటీర్‌గా చేరి, ఆ ప్రాంతంలో ప్రజల పోడు భూముల్లో టేకు, వెదురు, జామాయిల్ ప్లాంటేషన్‌లు వేయించడంలో చురుకైన పాత్ర పోషించాడు. అనతికాలంలోనే వి.ఎస్.ఎస్ అధ్యక్షుడయ్యాడు. ఫారెస్టు, పోలీసుల అండతో, ప్రజలు ఎ.పి.ఎఫ్.డి.సి నుండి స్వాధీన పరుచుకున్న కాఫీ తోటలను వీడు ఆక్రమించుకున్నాడు. ప్రభుత్వ భూటకపు సంస్కరణల్లో భాగంగా ఆ గ్రామానికి సబ్సిడీతో ఇచ్చిన జీపును వీడు సొంతానికి వాడుకొని లబ్ధి పొందుతున్నాడు. ఆ జీపులో పోలీసులను చేరవేస్తు వారితో సత్సంబంధాలను కలిగి ఉండేవాడు. వీడ్ని అనేక సార్లు హెచ్చరించినప్పటికి ఏ మార్పులేదు. దేహశుద్ధి చేసినప్పటికి పద్ధతి మార్చుకోక పోవడంతో పాటు ప్రజాకంఠకుడిగా మారడంతో ప్రజలు వీడి పీడ విరగడ చేయాలనీ ఎ.సిని అనేక సార్లు కోరారు. కాఫీ తోటల స్వాధీన పోరాటానికి, ప్రజలకు వ్యతిరేకంగా, పోలీసు ఇన్‌ఫార్మర్‌గా వ్యవహరిస్తున్నందున వీడ్ని పై కమిటి ఆమోదంతో పి.ఎల్.జి.ఎ డిసెంబర్ 5-2013న ఖతం చేసింది.

## ప్రజాకోర్టులో హోంగార్డ్‌కు క్షమాబిక్ష

కోరుకొండ ఏరియా పరిధిలోగల జి.మాడుగుల మండలం బొయితిలి పంచాయితీ అదే గ్రామానికి చెందిన దుక్కిరి ఈశ్వర్రావు 2008 నుండి నర్సీపట్నం రూరల్ పోలీస్ స్టేషన్‌లో హోంగార్డ్‌గా పనిచేస్తున్నాడు. వుద్యోగం విడవాలని గతం నుండి తనకు, తన కుటుంబ సభ్యులకు పార్టీ ఎన్నిసార్లు చెప్పినా వినలేదు. అయితే హోంగార్డ్ వుద్యోగం విడిచిపెట్టినట్టుగా విడిచిపెట్టి అనుమానస్పదంగా ఇతర ప్రాంతాల్లో తిరుగుతూ అప్పుడప్పుడు కుటుంబాన్ని కలవడానికి వస్తుండేవాడు. దాంతో ప్రజలందరూ సీరియస్‌గా అనుమానపడటంతో స్థానిక మిలీషియా, ప్రజలు, ఏ.వి.ఆర్.సి.ఎస్ (ఏరియాబాడి) నిర్ణయం మేరకు గ్రామానికొచ్చిన ఈశ్వర్రావును ప్రజలు పట్టుకొని 28.11.2013న ప్రజాకోర్టులో పెట్టారు. ఈ ప్రజాకోర్టుకు 400 మంది ప్రజలు హాజరయ్యారు. పూర్తి వివరాలతో తన తప్పులను ఒప్పుకుంటూ మరలా ఎప్పుడూ ప్రజా వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గోనని ప్రజలకు హామీ ఇవ్వడంతో ప్రజలు క్షమించి ఈశ్వర్రావును వదిలేశారు. ఈ ఘటన ఏరియాలో మంచి ప్రభావం వేసింది. ❍

---

**స్వీయాత్మకత, ఒంటెద్దు పోకడలు, మూసపద్ధతి పార్టీ రచనా విధనాలను వ్యతిరేకించేప్పుడు మనం రెండు ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకోవాలి. మొదటిది "భవిష్యత్తు పొరపాట్లను నివారించడానికి పాత పొరపాట్లనుండి నేర్చుకొండి". ఎవరి సున్నిత భావాలను లెక్కచేయకుండా పాతపొరపాట్లను భహిర్గతం చేయాలి. గతంలో జరిగిన చెడునీ శాస్త్రీయ ధోరణిలో విశ్లేషించి విమర్శించాలి, దాని వల్ల భవిష్యత్తు కార్యక్రమం ఎంతో జాగ్రత్తగానూ, మరింత బాగుగానూ నిర్వహించగల్గుతాం. భవిష్యత్తు పొరపాట్లను నివారించడానికి పాత పొరపాట్లనుండి నేర్చుకొండి. అంటే అర్థం ఇదే.**

**- కా॥ మావో...**

## పార్టీ పిలుపు

**దేశంలో జరగనున్న 16వ లోక్‌సభ ఎన్నికలనూ, ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల 'శాసనసభ' ఎన్నికలనూ, ఆంధ్రప్రదేశ్‌లో జరపతలపెట్టిన స్థానిక ఎన్నికలనూ బహిష్కరించండి!**

**వ్యవసాయ విప్లవ గెరిల్లా పోరాటాన్ని తీవ్రతరం చేస్తూ, ప్రత్యామ్నాయ ప్రజాధికార సంస్థలను (విప్లవ ప్రజాకమిటీలు) నిర్మించండి, సంఘటిత పరచండి, విస్తరించండి!**